ISSN 2278-3423

Anveshi
RESEARCH CENTRE FOR WOMEN'S STUDIES

# సమకాలీన రాజకీయాలపై బ్రాడ్‌షీట్

# వ్యవసాయ సంబంధాలపై సుదీర్ఘ చర్చ

*సంచిక : 13** *తెలుగు & ఇంగ్లీష్* *మార్చి 2018* *విరాళం : 25 రూ.*

<u>విషయసూచిక</u>


- సంపాదకీయం
- భారతదేశ వ్యవసాయ రంగంలో పరిణామ క్రమం : మన దగ్గరనున్న సమాచారం ఏం చెప్తుంది? *అమిత్ బసోలే, దీపాంకర్ బసు*
- తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ గ్రామాల్లో సమకాలీన వ్యవసాయ పరిస్థితులు *ఆర్.వి.రమణ మూర్తి*
- భూమా? శ్రమా? గ్రామీణ భారత దేశంలో దళితుల చారిత్రక సంఘర్షణ *ఎస్.ఎ. విద్యాసాగర్*
- రైతాంగ సమస్య అప్పుడూ-ఇప్పుడూ *హెన్రీ బెర్న్‌స్టీన్*
- పెట్టుబడి, పెట్టుబడేతర విలువ: *కల్యాణ్ సన్యాల్*
- ప్రపంచీకరణ-వ్యవసాయక సమస్య *అక్రమ్ లోధీ, క్రిస్టొబెల్ కే*
- పెత్తందారీ భూస్వామ్య వ్యవస్థ నుండి పెట్టుబడిదారీ వ్యవసాయిక వ్యవస్థకు పరివర్తన *టి.జె. బైర్స్*
- భారతీయ వ్యవసాయం, అర్ధ భూస్వామ్యమా? లేక పెట్టుబడిదారీ వ్యవసాయమా? *ప్రఫుల్ బిద్వయ్*
- భూస్వామ్య వ్యవస్థ నుంచి పెట్టుబడిదారీ వ్యవస్థకు జరిగిన పరిణామంలో వర్గ పోరాటం కీలక చోదక శక్తేనా? *ఎస్ ఆర్ ఎప్‌స్టీన్*
- వ్యవసాయ సమస్య *కార్ల్ కౌట్స్కీ*
- ఫ్రాన్స్, జర్మనీలలో రైతు సమస్య *ఫ్రెడరిక్ ఎంగెల్స్*
- భూమి జాతీయకరణ *కార్ల్ మార్క్స్*
- పెట్టుబడిదారీ కౌలురైతుల ఆవిర్భావం *కార్ల్ మార్క్స్*
- ఆదిమ పోగుబడి వెనక దాగిన రహస్యం *కార్ల్ మార్క్స్*




***ప్రత్యేక సంపాదకులు :*** *ఆర్.వి. రమణమూర్తి, ఎస్.ఎ. విద్యాసాగర్, గడియారం భార్గవ*

***సంపాదకులు:*** *ఎ. సునీత, ఆర్. శ్రీవత్సన్, ఎమ్.ఎ.మోయిద్*

***అడ్వయిజరీ బోర్డ్:*** *షీలా ప్రసాద్, అయేషా ఫరూకీ, రమా మెల్కోటే, కె.సజయ, పి.మాధవి, బి.శ్యామసుందరి, సూజీ థారు, వీణా శతృఘ్న, డి.వసంత, కె.లలిత, ఎన్.వసుధ, గోగు శ్యామల, ఉమ భృగుబండ, వి.ఉష.*

***ప్రొడక్షన్:*** *ఏశాల శ్రీనివాస్, తాడేపల్లి శ్రీలక్ష్మి*

***ప్రచురణ సంస్థ : అన్వేషి రిసెర్చ్ సెంటర్ ఫర్ ఉమెన్స్ స్టడీస్,*** 2-2-18/49, దుర్గాబాయి దేశ్‌ముఖ్ కాలనీ, అంబర్‌పేట్, హైదరాబాదు-13.

వ్యాసాలలోని సమాచారం, దృక్పథాలు, అభిప్రాయాలు, వ్యాసకర్తలవి, ప్రత్యేక సంపాదకులవి

* సంచిక సంఖ్యలో కొంత అయోమయం నెలకొనడం వల్ల ఇప్పటి నుండి వరుస సంచిక సంఖ్య మాత్రమే ఇస్తున్నాం

# సంపాదకీయం

## వ్యవసాయ సమస్య: ఒక పరిచయం

రైతాంగ ఉత్పత్తి విధానం పెట్టుబడిదారీ విధానంగా పరిణమించటాన్ని వ్యవసాయ సమస్యగా వర్ణిస్తారు. పెట్టుబడిదారి విధాన చారిత్రక పరిణామ క్రమంలో వ్యవసాయ సమస్యకు ప్రధానమైన స్థానం ఉంది. ప్రఖ్యాత జర్మన్ మార్క్సిస్టు కార్ల్ కౌట్స్కీ మొదటిసారిగా దీనిని తన పుస్తకానికి శీర్షికగా వాడుతూ, వ్యవసాయంలో పెట్టుబడిదారి విధానమంటే రైతాంగ ఉత్పత్తి విధానం మారుతూ పారిశ్రామిక పెట్టుబడిదారి విధానంగా అభివృద్ధి చెందడమని చెప్పాడు. ఇది మార్క్సిస్ట్ పార్టీలకూ, వారి రాజకీయ పోరాట పంథాలకూ చాలా ముఖ్యమైన విషయం. అంతేకాక బూర్జువా విధాన కర్తలకు, పరిశోధకులకూ కూడా ఉపయుక్తకరమైంది. మార్క్స్ ప్రకారమే వ్యవసాయంలో పెట్టుబడి సంబంధాలు పెరిగి, మార్కెట్ వ్యవస్థ రూపొందించుకున్నప్పుడు, చిన్నరైతులు క్రమేణా కుదేలయి, ఉనికిని కోల్పోయి, పారిశ్రామిక కార్మికులుగా పరివర్తన చెందుతారు. వ్యవసాయంలో మిగులు పోగుబడి చేసే రైతులే పారిశ్రామిక రంగానికి ఆహార వస్తువులు, ఆహారేతర వ్యవసాయ ఉత్పత్తులు చవకగా సరఫరా చేసి పారిశ్రామిక రంగంలో ఉత్పత్తి ఖర్చును తగ్గిస్తూ, అక్కడి శ్రమ దోపిడిదారుల మిగులు (లాభాల) పోగుబడికి పరోక్షంగా సహకరిస్తారు. పారిశ్రామిక వస్తువులకు వినియోగదారులైతారు. ఇది వ్యవసాయ సమస్యకు లేదా వ్యవసాయ పరిణామానికున్న రెండవ పార్శ్వం. శ్రామికులను సంఘటితం చేయాల్సిన కమ్యూనిస్టులకు ఇది అత్యంత కీలకమైన విషయం. పెట్టుబడిదారి విధానానికి పరిణామం జరిగిన పక్షాన, శ్రామికులను గుర్తించి పెట్టుబడి, శ్రమల మధ్య ఉన్న చిన్న రైతులను కూడా, పారిశ్రామిక కార్మికులతో కలుపుకొని రాజకీయ వ్యూహాన్ని చేపట్టాలని లెనిన్ సూత్రీకరణ చేశాడు. పెట్టుబడిదారి సంబంధాలు అసంపూర్ణంగా ఉండి, ఫ్యూడల్ భూస్వామ్య శక్తులు ప్రధాన శక్తులుగా ఉన్న పక్షాన చిన్నా, మధ్య రైతులందరినీ ఏకం చేసి, రైతాంగ తిరుగుబాటు చేయమని మావో చెప్పాడు. కాబట్టి రైతాంగ రాజకీయ ఆర్థిక పరిస్థితులు, పెట్టుబడి సంబంధాలు ఎక్కడున్నాయన్న విశ్లేషణ ప్రధానమవుతుందని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. దీనికి చారిత్రక ఆధారాల అనుగుణంగా చేసే పరిశోధనలు చాలా ముఖ్యం.

వారితోపాటు, ఈ విశ్లేషణ పెట్టుబడిదారి పరిణామం అనే ప్రక్రియ ద్వారా 'అభివృద్ధి'ని సాధిస్తామనే రాజ్యాలకూ, పెట్టుబడిదారులకూ కూడా అంతే ముఖ్యం. ప్రాశ్చాత్య దేశాల్లో జరిగిన పెట్టుబడిదారి పరిణామం వారు ప్రపంచాన్ని వలసవాద-సామ్రాజ్యవాద పరిస్థితుల్లో ఏలుతున్నప్పుడు జరిగింది. అది బ్రిటన్ కావచ్చు లేదా ఫ్రాన్స్, జర్మనీ, రష్యా, అమెరికా, జపాన్‌లు కావచ్చు. కానీ వలసానంతర స్వతంత్ర రాజ్యాలైన భారత్‌లాంటి ఎన్నో దేశాలకు ప్రపంచ ద్రవ్య పెట్టుబడి అందుబాటులో లేకపోవటం, యధేచ్ఛగా ఎగుమతులు పెంచుకోవడానికి అపరిమితమైన అంతర్జాతీయ బజార్లు లేని పరిస్థితుల్లో పెట్టుబడి సమీకరణలో దేశీయ వ్యవసాయం చాలా కీలకపాత్రే పోషిస్తుంది. అది మిగులు పోగుబడి చేసి పారిశ్రామిక అభివృద్ధికి పెట్టుబడిని తరలిస్తుంది. చౌకగా ఆ రంగానికి డిమాండ్‌ను అందిస్తుంది. ఎగుమతుల ద్వారా విదేశీ మారకం ఆర్జిస్తూ, దాన్ని పారిశ్రామిక అవసరాలకు సరఫరా చేస్తూ, దేశంలో పెట్టుబడిదారి అభివృద్ధికి వెన్నెముకగా నిలుస్తుంది. ప్రకృతి వైపరిత్యాలవల్ల జరిగే నష్టం కాక, వ్యవసాయ రంగంలో సాపేక్ష ధరలు తగ్గటం వల్ల లాభాలు పడిపోయి, మిగులు పోగుబడి కూడా తగ్గుతుంది. వ్యవసాయ రంగానికి రకరకాల రాయితీలు కల్పిస్తూ, మార్కెట్ల ఉత్పత్తి క్షీణించకుండా, మద్దతు ధరలు, కొనుగోలు, స్టోరేజి, రవాణా సదుపాయాలు కల్పించడం, బ్యాంక్ ద్వారా తక్కువ వడ్డీలకు రుణాలు అందజేయడం ఇక్కడి పారిశ్రామిక రంగానికి లేదా ఈ నమూనా అభివృద్ధికి సహకరించే రాజ్యం బాధ్యతగా పరిణమిస్తుంది. ఇదేదో రైతుల మీద ఉన్న ప్రేమ కాదు. రైతే రాజు, దేశానికి వెన్నెముక, జైకిసాన్ లాంటి ప్రజారంజక నినాదాలు ఇవ్వడం వెనుక ఉన్న రాజకీయ ఆర్థిక నేపథ్యం అర్థం చేసుకోకపోతే, సమకాలీన వ్యవసాయానికి ప్రభుత్వమిస్తున్న సహకారాన్ని అర్థం చేసుకోలేము. పైన వివరించిన మార్గం కాక, పెట్టుబడి అంతర్జాయతీయకరణ చెందిన ప్రస్తుత పరిస్థితిలో దానికి వ్యవసాయ రంగంపై ఆధారపడాల్సిన అవసరం తగ్గింది. ఉన్న సౌకర్యాల్లోనే చచ్చి చెడి ఉత్పత్తి చేసే రైతులు ఎలాగూ ఉండనే ఉన్నారు. ఈ పరిస్థితుల్లో రైతులు నష్టాలకు గురైనా, వారు ఆత్మహత్యలు చేసుకున్నా పట్టించుకునే నాధుడు లేకపోవడం మనం నిత్యం చూస్తున్నాం. దీన్ని మొత్తంగా జరుగుతున్న పెట్టుబడి పరిణామంలో భాగంగానే అర్థం చేసుకోవడం అవసరమని ఈ సంకలన కర్తల అభిప్రాయం.

**సంకలనం ఆవశ్యకత:**

వ్యవసాయ సమస్యపై, పెట్టుబడిదారీ విధాన పరిణామంపై తెలుగులో అందుబాటులో ఉన్న సాహిత్యం పరిమితం. చాలామంది మార్క్సిస్ట్ ఔత్సాహికుల్లో కూడా ఈ అంశంపై మార్క్స్ ఎంగెల్స్, కౌట్స్కీ లెనిన్ చేసిన రచనల గురించి పరిచయం తక్కువ. కాపిటల్ రాసే చివరికి నాటికి మార్క్స్‌లోనే ఎంతో మార్పు వచ్చిందని పరిశీలకుల భావన. తన కాపిటల్, పెట్టుబడిదారి విధానంపై ఆఖరి వాక్యమని కూడా మార్క్స్ చెప్పలేదు. ఫ్రెంచ్ అనువాదంలో ఆయన పెక్కు మార్పులు కూడా చేశాడు. కాబట్టి మార్క్సిస్టు చర్చను సైద్ధాంతికంగా, ఆచరణాత్మకంగా కొనసాగించాల్సిన బాధ్యత మార్క్సిస్టు అవగాహనా పరులమీదే ఉండింది. సమకాలీన పరిస్థితులకు అన్వయించుకుంటూ సాగుతున్న వర్తమాన పెట్టుబడి విధానాన్ని అర్థం చేసుకోవడం ఎంతో అవసరం. దానికవసరమైన సాహిత్యాన్ని అందుబాటులోకి తేవటమే సంకలన ఉద్దేశం. మన దేశంలో 50 యేళ్ల కింద 1970ల్లో 'ఉత్పత్తి విధానం' (mode of production) పై జరిగిన చర్చ కూడా ఇప్పటి వరకు తెలుగు అనువాదానికి నోచుకోలేదు.

పెట్టుబడి పరిణామ క్రమాన్ని అర్థం చేసుకోకపోతే ప్రజాకర్షక (Populist discourse) సంవాదంలో కొట్టుకపోయే ప్రమాదం ఉంది. ఇక బూర్జువా ఆర్థిక శాస్త్రం ఎలాగూ రైతులను ధరలకు మాత్రమే స్పందించే హేతుబద్ధ జీవులుగా, మార్కెట్ అవకాశాలను అందిపుచ్చుకునే లబ్ధిదారులుగా వర్ణిస్తుంది. వారు సంక్షోభానికి తావులేని అభివృద్ధి జీవులనే పగటి కలను నిరంతరం అమ్ముతుంది. బూర్జువా ప్రభుత్వాలు కూడా ఈ మంత్రమే చదువుతూ, సంక్షోభపూరితమైన వ్యవసాయ రంగం గురించి స్వల్పకాలిక పథకాలతో చేతులు దులుపుకొని మార్కెట్ మాయాజాలానికే రైతును వదలివేస్తాయి. ఇక బాధితులు మార్కెట్ వ్యవస్థనే నిందించాలో, విఫలించిన ప్రభుత్వ పథకాలను నిందించాలో తెలియక గందరగోళానికి గురౌతారు. కాని యదార్థాన్ని అన్వేషించే బుద్ధిజీవులకు సైద్ధాంతికమైన, అనుభవపూర్వకమైన విశ్లేషణ చెయ్యక తప్పదు, చేదు నిజాలు చెప్పకా తప్పదు.

ఈ సంకలనంలో ఎంపిక చేసిన 13 వ్యాసాలూ, పెట్టుబడిదారి పరిణామ క్రమంలో రైతాంగంలో వచ్చే మార్పులు, చిరురైతుల సంక్షోభం, దాని వ్యవస్థీకృత స్వభావం, మారిన కాలమాన పరిస్థితులను అంతర్జాతీయంగానూ, భారతదేశంలోను ప్రతిబింబించే చారిత్రక, రాజకీయ-ఆర్థిక పరిశోధనా వ్యాసాలు. వీటి ఇంగ్లీషు మూలాలను సరళంగా, క్లుప్తంగా మూల్యాంశాలు జారిపోకుండా సంక్షిప్తం చేసి మీ ముందుకు తీసుకువస్తున్నాం.

**మార్క్స్‌తో ప్రారంభం:**

పెట్టుబడి సంబంధాలకు వ్యవసాయం ఎలా మారుతుందన్నది ఇప్పటికి బహుశ 150 యేళ్ళ చర్చ. మార్క్స్ తన కేపిటల్ మూడవ సంపుటిలో (ఎంగెల్స్ కూర్పు) దీని గురించి ఒక రెండు వ్యాసాలు పొందుపరచాడు. అందులో మొదటి వ్యాసం 'ఆదిమ పోగుబడి వెనక దాగిన రహస్యం'. తిరగబడుతున్న కౌలు రైతులకు పాఠం చెప్పడానికి సమిష్టి భూములను, చర్చి భూములను అన్యాక్రాంతం చెయ్యటం; తమ భూ కమతాలను పెద్ద భూఖండాలుగా మలచుకుని, వాటికి కంచెలు కట్టి చిన్న స్వేచ్ఛా రైతులకు దారి లేకుండా చేయయటం; అలాగే వారి భూములను చౌకగా బలవంతంగా కొనుక్కుని భూమి రూపంలో పెట్టుబడిని సమకూర్చుకున్న వైనాన్ని తన 'ఆదిమ పోగుబడి వెనకదాగి ఉన్న రహస్యం' వ్యాసంలో వర్ణిస్తాడు. దీనిలో పెట్టుబడిదారి సమాజానికి పునాదైన పెట్టుబడి సృష్టిని; దాన్ని వృద్ధికోసం విస్తాపన చెంది ఏ ఆస్తిలేని "స్వేచ్ఛా" కార్మికుల సృష్టి గురించి చెప్పి మార్క్స్ ఈ సమాజానికి వెనుక ఉన్న రహస్యాన్ని బహిరంగం చేస్తాడు. అలాగే రెండవ వ్యాసం

"పెట్టుబడిదారీ రైతు పుట్టుక"లో భూస్వాములు ఆక్రమించుకున్న భూఖండాలను, వ్యవసాయ సాధనాలు, పశుబలం కలిగిన మధ్య రైతు వర్గానికి దీర్ఘకాలిక కౌలు ఒప్పందంపై లీజుకివ్వడం; కౌలు రైతులు దాని తర్వాత ఆ పనిలో శ్రామికులని పెట్టుకుని లాభాలు గడిస్తూ, మొదటి పెట్టుబడిదారీ రైతులుగా ఆవిర్భవించిన విధాన్ని మార్క్స్ వర్ణిస్తాడు. ఇవి చర్చా ప్రారంభానికి ముఖ్యమైన మొదటి వాసాలు. ఈ రెండు వ్యాసాలకు రాజీవ్ వెలిచేటి తెలుగు సేత అందించారు. మార్క్స్ చిన్న రైతులు అంతమయ్యి అత్యధికులు కార్మికులుగా, కొద్దిమంది పెట్టుబడిదారులుగా అవుతారని సూత్రీకరించాడు.

**చిన్న రైతులు మాయమవుతారా?**

కానీ మార్క్స్ మరణానంతరం, మరో మూడు దశాబ్దాలయినా చిల్లర సరుకు ఉత్పత్తి చేసే రైతులు ఫ్రాన్స్‌లో కానీ, జర్మనీలో కానీ అంతమవలేదు. వారి సంఖ్య కూడా గణనీయంగానే ఉండింది. నిరంతరం అప్పుల్లో ఉంటూ, కుటుంబ శ్రమని స్వయానా అత్యంత హీనంగా, బానిస తరహాలో వాడుకుంటూ, తమ అవసరాలను రోజు రోజుకూ కుదించుకుంటూ బతికే చిన్న రైతుల గురించి కౌట్స్కీ సునిశితంగా పరిశీలించాడు. పెద్ద కమతాలు నిస్సందేహంగా అధిక సామర్థ్యం కలిగి ఉండి, సాంకేతికంగా, నిర్మాణాత్మకంగా మెరుగైన నిర్వహణా వ్యూహాలతో ముందుకెళతాయని, కానీ వీరికి కావల్సిన శ్రామికుల్ని గ్రామాల్లో మిగుల్చుకోవడానికి చిన్న కమతాలను స్వాధీనం చేసుకోకుండా బతకనిస్తాయనీ కౌట్స్కీ గమనించాడు. కానీ నిస్సందేహంగా చిన్న కమతాల రైతులు, పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంలో తమ శ్రమను అమ్ముకొనే పరోక్ష కూలీలుగా ఉంటూ, ప్రత్యక్ష దోపిడి గురయ్యే వర్గమని చెప్తాడు. ఈ సంక్షోభపూరితమైన చిరు వ్యవసాయ కమతాల రైతులను సహకార సంఘాల ద్వారా మాత్రమే రక్షించగలమని కౌట్స్కీ సూచిస్తాడు. ఈ వ్యాసం ఈనాటి భారతదేశ పరిస్థితులకు అద్దం పడుతుంది. 1899లో కౌట్స్కీ రాసిన **'అగ్రేరియన్ క్వశ్చన్'** మొదటి వాల్యూమ్ నుండి ఈ వ్యాసం సంగ్రహించబడింది. వ్యాసానికి తెలుగు సేత అందించారు జగన్నాధ స్వామి. లెనిన్ కౌట్స్కీ పుస్తకాన్ని మార్క్స్ కాపిటల్ వా. III తరువాత పెట్టుబడిదారీ విధాన పరిణామం గురించి ప్రామాణికమైన అధ్యయనంగా పరిగణించాడు. 'రష్యాలో పెట్టుబడిదారీ విధాన పరిణామక్రమం' మీద రాసిన పుస్తకంలో కౌట్స్కీ రచనని ఉపయోగించుకోలేక పోయానని (ఎందుకంటే అది కూడా 1899లోనే వచ్చింది కాబట్టి) అన్నాడు. రెండు దశాబ్దాల క్రితం వరకు కనుమరుగైపోయిన ఈ పుస్తకం 1988లో ఇంగ్లీషులో అనువాదం వల్ల మళ్ళీ వెలుగులోకి వచ్చింది.

అలాగే ఎంగెల్స్ 1894లో "ఫ్రాన్స్, జర్మనీల్లో రైతాంగ ప్రశ్న" పేరు మీద రాసిన సుదీర్ఘ వ్యాసం కౌట్స్కీ పుస్తకానికి కొన్ని నెలల ముందే వచ్చింది. ఇది ఫ్రాన్స్‌లో సోషల్ డెమొక్రాటిక్ పార్టీ నాండెస్ డిక్లరేషన్ ద్వారా చిన్న రైతుల సమస్యల గురించి రూపొందించిన కార్యాచరణని సున్నితంగా విమర్శిస్తూ రాసిన వ్యాసం దీనివల్ల రైతులందరినీ ఒకే గాటన కట్టి బూర్జువా రైతు ప్రయోజనాలను కాపాడే పార్టీగా మారుతారని, చిన్న రైతులని పెట్టి బూర్జువా పగటి కలలు అమ్మే పథకాలతో కాపాడలేమని, వారిని సహకార సంఘాలుగా సంఘటితం చేసే బాధ్యత సోషల్ డెమొక్రాట్ల మీదే ఉందని ఎంగెల్స్ అంటారు. పెరిగే వర్గ భేదాన్ని అర్థం చేయించి, కార్మిక వర్గ రాజకీయ దృక్పథాన్ని స్పష్టం చేస్తూ, రైతు-కూలీ ఐక్య సంఘటనలకు మార్గదర్శిని ఈ వ్యాసం. దీనికి తెలుగు సేత అందించారు రాజేశంగారు. భూమి జాతీయకరణపై మార్క్స్ రాసిన వ్యాసం బహుశ ఈ సమస్యకు అంతిమ పరిష్కారం అనుకోవచ్చు. పెట్టుబడిదారీ విధానంలో ఉత్పత్తిని సమాజీకరించటంలో ప్రత్యేక పాత్ర పోషించే వ్యక్తిగతమైన ఆస్థిహక్కు నిష్ఫలత్వాన్ని గురించి మార్క్స్ బలంగా వాదించాడు. భూమిపై వ్యక్తిగత ఆస్థికున్న ద్వంద్వ స్వభావం నుండే రైతాంగ సంక్షోభ మూలాలను చూడాలని చెపుతూ, దాని పరిష్కారం సామూహిక యాజమాన్యంలో, ఉత్పత్తి ఫలాల పంపిణీని సామాజికరించటంలోను ఉందని మార్క్స్ చెప్తాడు.

**పెట్టుబడిదారీ విధాన పరిణామం ఎలా జరుగుతుంది?**

భూస్వామ్య విధానం నుండి పెట్టుబడిదారీ విధానానికి జరిగే పరిణామ ప్రక్రియ మీద కూడా ముఖ్యమైన సూత్రీకరణలు మనకి ఈ సాహిత్యంలో లభిస్తాయి. ముఖ్యంగా ఈ పరిణామ ప్రక్రియ అసంపూర్ణంగా ఉన్న భారత దేశం వంటి వలసానంతర దేశాల నేపథ్యంలో ఈ చర్చ జరిగింది. దీనికి 1940లో బ్రిటిష్ చరిత్ర ఆధారంగా, మార్క్సిస్టు చరిత్రకారుడైన మారిస్ డాబ్ చేసిన ఒక ప్రతిపాదన ప్రారంభంగా చెప్పుకోవచ్చు. ఇంగ్లండ్‌లో 14వ శతాబ్దంలో అర్ధబానిసలైన (serf) కౌలు రైతులు చేసిన హింసాయుత ప్రతిఘటన, భూస్వామానికి వ్యతిరేకంగా జరిగిన వర్గపోరాటమని, దాని వల్లే అది దెబ్బతిందని ప్రతిపాదించాడు. అటువంటి పోరాటం జరగకపోయినా, లేక ఆ వర్గ పోరాటం అసంపూర్ణమయినా పెట్టుబడిదారీ పూర్వ సంబంధాలు (అర్థ భూస్వామ్య సంబంధాలు) మిగిలే ఉంటాయని డాబ్ వాదనకు ఒక ఉప సిద్ధాంతం ప్రాచుర్యంలోకి ఒచ్చింది. అమెరికన్ మార్క్సిస్టు పాల్ స్వీజీ దీన్ని విమర్శిస్తూ సుదూర వ్యాపారం, ద్రవ్యవాదకం, పెరిగిన వర్తకం వల్ల భూస్వామ్య వర్గం సామాజికంగా బలహీనపడిందని; ప్రపంచ దేశాల్లోని అసమాన అభివృద్ధి సంబంధాలను ప్రపంచ పెట్టుబడి లెవల్ చేస్తుందని ప్రతిపాదించాడు. అంటే పెట్టుబడిదారీ విధానానికి పరిణామాన్ని కేవలం 'వర్గ పోరాటం' కేంద్రంగానే ఆలోచించాల్సిన అవసరం లేదని, మార్పు పలు విధాలుగా రావచ్చని స్వీజీ వాదన. బ్రిటిష్ మార్క్సిస్టు చరిత్రకారుడైన ఎస్.ఆర్.ఎప్‌స్టీన్ దీనికి అదనంగా బూర్జువా వర్గాన్ని బలంగా, భూస్వామ్య వర్గాన్ని బలహీనం చేయడంలో రాజ్యం, సాంకేతిక జ్ఞానం పోషించే గతితార్కిక పాత్రను బలమైన నిదర్శనాలతో చూపుతాడు. ఈ వ్యాసం భారతదేశంలో గత అరవై యేళ్ళలో పెట్టుబడిదారీ విధానాన్ని ప్రోత్సహించటంలో రాజ్యం పోషించిన పాత్రను, విధానాల వల్ల జరిగిన మార్పును అర్థం చేసుకోవడానికి బాగా ఉపయోగపడతుంది. దీని తెలుగు సేత అందించారు సి. అనంతు.

**భారత వ్యవసాయ ఉత్పత్తి విధానంపై చర్చ:పెట్టుబడిదారీ రైతుకోసం వెతుకులాట**

1940ల నుండి ఇంగ్లండులో జరిగిన భూస్వామ్యానంతర పరిణామాల గురించిన తరువాతి చర్చ 1960ల్లో ఇతర వర్ధమాన దేశాల్లో జరిగిన, జరుగుతున్న పరిణామాలపై కమ్యూనిస్టులు అవలంబించాల్సిన వ్యూహాలపై దృష్టి పెట్టింది. 1970లలో భారతదేశ వ్యవసాయంలో ఉత్పత్తి విధానమేమిటని ఎంతో మంది మేధావులు పాల్గొన్న చర్చ ఎకనామిక్ ఎండ్ పొలిటికల్ వీక్లీలో తీవ్రంగా నడిచింది. రెండు డజన్ల మంది ఆర్థిక రాజకీయవేత్తలు, ఉద్యమకారులు, ప్లానింగ్ కమిషన్ మెంబర్లు, యూనివర్శిటి అధ్యాపకులూ నడిపిన ఈ ఆసక్తికరమైన సుదీర్ఘ చర్చ ఈ పరిణామాన్ని అధ్యయనం చేయటానికి వైధానిక సూత్రాలను అందించింది. చర్చ కేంద్రాంశాలు: భారత దేశంలో మిగులు-పోగుబడి స్వభావం ఏమిటి? అది క్యాపిటలిస్ట్ స్వభావం కలిగి ఉందా? అర్థ-భూస్వామ్య స్వభావం కలిగి ఉందా? లేక భూస్వామ్య స్వభావమా? మన దేశంలో అసలు యూరపు తరహా ఫ్యూడలిజం చరిత్రాత్మకంగా ఉండిందా? మారుతున్న లేక మారని ఆ సంబంధాలను రైతు యొక్క వ్యవసాభ్యాస స్థాయిలో చూడాలా, వ్యవస్థ స్థాయిలో చూడాలా? ప్రపంచ పెట్టుబడి దారితనం అనే అఖండ స్థాయిలో నుండి చూడాలా? చూసి, ఎలా నిర్ధారించాలి? ఈ మధ్య కాలంలో ప్రఫుల్ బిద్వయ్ భారత వామపక్ష ఉద్యమం మీద రాసిన 'ది ఫీనిక్స్ మూమెంట్' (2015) పుస్తకంలో ఈ ఉత్పత్తి విధాన చర్చ గురించి అపెండిక్స్ రూపంలో రాసిన వ్యాసాన్ని సంక్షిప్తీకరించి మీ ముందుచుతున్నాం. దీనికి గడియారం భార్గవ తెలుగు సేత అందించారు. ఇది పాఠకుల జ్ఞాపకాలను, అనుభవాలను పునరాలోచింప చేస్తుందని అనుకుంటున్నాం.

**పెట్టుబడిదారీ పరిణామం ప్రమాణికంగానే జరగాలా?**

అలాగే 'జర్నల్ ఆఫ్ పెజంట్ స్టడీస్' అనే పరిశోధక పత్రికకు నలభైయేళ్ళు సంపాదకీయం నిర్వర్తించిన టి.జి.బైర్స్ తన అపారమైన పరిశోధనా అనుభవంలోంచి పెట్టుబడిదారీ విధాన పరిణామ క్రమానికి ఒక ఏకీకృత నమూనా ఉంటుందనే మూసధోరణిని తిరస్కరిస్తూ, ఒక ఆరు పెట్టుబడిదారీ దేశాల్లో జరిగిన పరిణామ క్రమాన్ని తన రచనలో విపులంగా రాశాడు. కనీసం ఒక ఇరవైకి పైగా వ్యాసాలు ఆయన ఈ అంశం మీద ప్రచురించాడు. ఆంగ్లేయ అనుభవాన్ని 'క్రింది నుండి జరిగిన' పెట్టుబడి పరిణామమని; ఫ్రాన్స్‌లో జరిగినది 'విలంబిత పరిణామమని', జర్మనీలో జరిగింది 'ఎగువ నుండి జరిగిన పరిణామంగానూ, వీటికి భిన్నంగా రాజ్యం ప్రమేయంతో జరిగిన జపాన్ నమూనా, రష్యా-అమెరికాల మధ్య నెలకొన్న కోల్డ్‌వార్ నేపథ్యంలో అమెరికన్ల ప్రమేయంతో, భూసంస్కరణలను అమలు చేసిన కొరియా, తైవాన్ల నమూనాలను బైర్స్ వివరించాడు. ఇది పెట్టుబడిదారీ పరిణామం గురించి చాలా మందిలో ఉన్న మూస ఆలోచనా ధోరణిని సవాలు చేస్తుంది. దీనికి సరోజిని ప్రేమ్‌చంద్ తెలుగు సేత అందించారు.

ఇక వర్తమాన పరిస్థితులకి వస్తే, భారతదేశంలో 1991లో అమలయిన ఆర్థిక సంస్కరణల తర్వాత ప్రపంచీకరణ నేపథ్యంలో మొదలైన రైతాంగ సంక్షోభం విపత్కరంగా పరిణమించటం మనం చూస్తున్నాము. ఇబ్బడి ముబ్బడిగా పెరిగిన పెట్టుబడి ఖర్చులు, గిట్టుబాటుగాని ధరలు, పంటల నష్టాలు, పెరిగిన అప్పులూ, ఆత్మహత్యల గురించి పత్రికల్లో ప్రస్తావన జరుగుతోంది. ఎలక్షన్లంటే రుణమాఫీ లేకుండా ఓట్లడిగే పరిస్థితి రాజకీయ పార్టీలకు లేదు. ప్రభుత్వ ఉదాసీనతను కొందరు విమర్శిస్తే, మరికొందరు దళారీ మార్కెట్ వ్యవస్థని విమర్శించారు. కొంతమంది పర్యావరణ ఉద్యమకారులు నీటి వినియోగం పెంచే పంటల మీద కేంద్రీకృతమయిన వ్యవసాయాన్ని ప్రశ్నిస్తే, మరికొందరు బోరుబావులను, అడుగంటిన భూగర్భ జలాలనూ, లోపభూయిష్టమయిన జన్యు మార్పిడి విత్తనాలకూ

కారణాలుగా భావించి రైతాంగ సంక్షోభాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించారు. ఇవన్నీ కాదనలేని పాక్షిక సత్యాలే. కానీ పెట్టుబడిదారీ విధానం వేగంగా విస్తరిస్తున్న తరుణంలో, రైతుల ఉత్పత్తి అంతర్జాతీయ ఉత్పత్తి చక్రంలో భాగమయి, విదేశీ పెట్టుబడికి ద్వారాలు తెరచి ప్రయివేటు పెట్టుబడి పోగుబడికి మార్గం వేసిన గ్లోబలైజేషన్ నేపథ్యంలో వ్యవసాయ సమస్యను పునఃసమీక్షించుకోవాల్సిన అవసరం ఉంది. ఈ విషయంపై అవగాహన కోసం ఇటీవల మా దృష్టిలో వచ్చిన మూడు ముఖ్యమైన రచనల సంక్షేపాలను మీ ముందుచుతున్నాం.

**ఇరవయ్యవ శతాబ్దపు పెట్టుబడిదారీ విధానం:వ్యవసాయ ప్రశ్న**

అందులో మొదటిది 2004లో హెన్రీ బెర్న్‌స్టీన్ సంపాదకీయం చేసిన "వ్యవసాయ సమస్య: అప్పుడు-ఇప్పుడు." టి.జె. బైర్స్ సూత్రీకరణల ఆధారంగా బెర్న్‌స్టీన్ ఇంతవరకూ మన అవగాహనలో వచ్చిన వ్యవసాయ సమస్యను మూడు ప్రశ్నలుగా ప్రతిపాదించాడు. మొదటి వ్యవసాయ ప్రశ్న శ్రామిక రాజకీయాలకి సంబంధించింది. పెట్టుబడిదారీ సంబంధాల్లోకి వ్యవసాయం మారిపోయిన సందర్భంలో వ్యాకోచిత లాభార్జన (expanded reproduction) లేని చిన్న రైతులను సరుకు అల్ప ఉత్పత్తిదారులుగా శ్రామికులతో సమానంగా గుర్తించాలని, దాని కోసం అవలంబించాల్సిన కార్యక్రమాన్ని చర్చిస్తుందీ ఈ ప్రశ్న. ఇక రెండవ ప్రశ్న ఉత్పత్తి అభివృద్ధికి సంబంధించింది. ఇది సోవియట్ యూనియన్‌లోనూ 1930లోనూ మన దేశంలో 1960లోనూ ఎదురైన ప్రశ్న. ఇది వ్యవసాయంలో మిగులు ఉత్పత్తి సాధించి దాన్ని ఆధునిక రంగాలకు ఎలా తరలించాలన్న ప్రశ్న. పారిశ్రామిక – సేవా రంగాలనేవి ఆధునిక సమాజాలకు ఇరుసు. దీనికి వ్యవసాయ రంగం నుండి మిగులు శ్రామికులను రప్పించడం; వారికోసం వ్యవసాయంలో రైతులు అవసరాలకు మించి మిగులు ఆహారం పండించటం; ఆ ఆహారాన్ని ఆధునిక రంగానికి తక్కువ ధరలకు సప్లై చేసి జీతాలు-కూలి రేట్లను నియంత్రించి ఆ రంగాల్లో అభివృద్ధి సాధించడం కీలకం. ఇందుకు ఫ్యూడల్ భూస్వామ్య శక్తులను బలహీనం చేయడం, కౌలును నియంత్రించడం, వ్యవసాయ ఉత్పత్తిని తీవ్రతరం చేయడం అవసరం. ఇందుకు బూర్జువా వ్యవస్థకు అనుగుణంగా వ్యవసాయ రంగాన్ని సమూలంగా మార్చడానికి గల పరిణామ ఆవశ్యకతను విశ్లేషిస్తుంది ఈ ప్రశ్న.

మూడవ ప్రశ్న పెట్టుబడి అంతర్జాతీయకరణ చేయబడి, ఆధునిక రంగాలతోపాటు, ప్రపంచ వ్యవసాయ రంగాలను అనుసంధానం గావిస్తూ, అందులో పెద్దా చిన్నా తారతమ్యం లేకుండా రైతులందరూ అంతర్జాతీయ స్థాయిలో ఉత్పత్తి గొలుసుతో భాగం కావడం. దాని పర్యవసానంగా వచ్చిన కొత్త నియంత్రణా విధానాలు. గ్లోబల్ అక్యూములేషన్ లేదా అంతర్జాతీయ మిగులు పోగుబడిలో భాగంగా సర్వదేశాల రైతుల ఉత్పత్తిని కొత్త ఉత్పత్తి విభజన విధానంలో భాగస్వామ్యం చెయ్యడం. ఈ మూడవప్రశ్న నేపథ్యంలో, బెర్న్‌స్టీన్ సాంప్రదాయంగా వచ్చే రెండవ వ్యవసాయ ప్రశ్న నిరర్థకమయి పోయిందంటాడు, దానికి అనుగుణంగా మొదటి ప్రశ్నను పునర్నిర్వచించుకోవాలని సూచిస్తాడు. ఈ వ్యాసం ఇటీవల ఒచ్చిన వాటిల్లో చాలా ముఖ్యమైనది. ఈ వ్యాసానికి తెలుగు సేత అందించారు సురేష్ గారు.

**ప్రపంచీకరణ తరువాత వ్యవసాయ సమస్య:**

బెర్న్‌స్టీన్ దృక్పథాన్ని సమర్థిస్తూ, మరికొంత విశదీకరిస్తూ వచ్చిన మరొక సమీక్ష పాకిస్థానీ-కెనడియన్ ద్వయం అక్రమ్‌లోధి-క్రిస్టోబెల్‌కే రాసింది. అదే అంశం తిరిగి చెప్పినట్టు అన్పించినా, వీరి సమీక్షా వ్యాసం వ్యవసాయ సమస్యను మరికొంత విస్తృం చేసిందని మా అభిప్రాయం. పారిశ్రామిక పెట్టుబడిదారీ అభివృద్ధిలో వ్యవసాయ రంగం కోల్పోతున్న సహాయక పాత్ర, పాత పరిమితులను అధిగమించిన ఆధునిక పెట్టుబడి రంగం, చిన్న రైతులను వ్యవస్థలోకి కరిగించి విలీనం చేసుకునే ప్రక్రియ లేకపోవడాన్ని వీరు విశ్లేషించారు. విదేశీ ద్రవ్య వ్యవస్థకు మార్గం సుగమం అయిన తర్వాత, దేశీయ పెట్టుబడి, దేశీయ శ్రమ వ్యవస్థని  రూపాంతరం చెందించే బాధ్యత నుండి వైదొలిగిందంటారు. దరిమిలా, మిగులు మనుషులు, మార్క్స్ చెప్పిన నిరుద్యోగ సైనిక శిబిరంలో బతుకు పోరాటం సాగిస్తున్నారని వ్యాఖ్యానిస్తారు. వారి జీవితాలను, పర్యావరణ పరిస్థితులనూ, స్త్రీపురుష సంబంధాలను తనదైన శైలిలో విచ్ఛిన్నం చేసే ఒక మందమైన ప్రక్రియగా వ్యవసాయ ప్రశ్నను మరొక మూడు కోణాల్లో ఆవిష్కరిస్తారు. ఈ వ్యాసానికి డా.బి.వెంకటేశ్వర్ రావు తెలుగుసేత అందించారు.

**భారతీయ వ్యవసాయం తగినంత పెట్టుబడిదారీ విధానానికి పరిణితి చెందిందా?**

భారతదేశంలో 1970లో ఉత్పత్తి విధానంపై జరిగిన మహా చర్చ తర్వాత, ఒక రెండున్నర దశాబ్దాల స్తబ్దత తర్వాత క్షేత్రస్థాయిలో జరుగుతున్న మార్పుల మీద దేశీయ పరిశోధకులేకాక చాలా మంది విదేశీ పరిశోధకులు పనిచేశారు. వివిధ రాష్ట్రాల్లో అరవయి యేళ్ళుగా జరిగిన మార్పులను లోతుగానే పరిశోధించారు. కానీ దేశం స్థాయిలో అఖండమైన సమాచారాన్ని వాడి విశ్లేషించిన వ్యాసాల్లో ఆసక్తికరమైనది అమెరికాలోని అమ్‌హెర్స్ట్ విశ్వవిద్యాలయానికి చెందిన అమిత్ బసోలే, దీపాంకర్ బసులది వీరి వ్యాసం 2011లో ఎకనామిక్ ఎండ్ పొలిటికల్ వీక్లీలో ప్రచురితమైంది.

వీరు జాతీయ సాంపిల్ సర్వే గణాంకాల ఆధారంగా భారతదేశంలో గత 50 యేళ్ళలో వ్యవసాయంలో జరిగిన మార్పులను విశ్లేషించారు. ముఖ్యంగా మార్క్సిస్టు చట్రంలో మిగులు దోపిడికి వ్యవసాయంలో ప్రధాన మార్గం  ఏమిటని వారు విచారించారు. వారి పరిశీలనల ప్రకారం భూకమతాల సగటు పరిమాణం రోజు రోజుకీ చిన్నదవడం మినహాయిస్తే, వ్యవసాయంలో మిగతా అన్ని లక్షణాలు పెట్టుబడిదారీ విధానం స్వభావాన్ని సూచిస్తున్నాయని అంటారు. అవి వ్యవసాయంలో పెరుగుతున్న పెట్టుబడి, వ్యవస్థీకృత రుణం, స్థిరమైన కౌలు, వేతన శ్రమ, పెరిగిన సరుకు ఉత్పత్తి, మరియు ఇతర అంశాలు. దీని తెలుగు సేత మాధవి అందిచారు. ఈ అంశంపైనే ఏడు తెలుగు గ్రామాల్లో రైతు కుటుంబాలను ఇంటర్వ్యూ చేసిన పరిశోధన ఆధారంగా రాసిన మరొక వ్యాసం "తెలంగాణ-ఆంధ్ర రాష్ట్రాల్లో సమకాలీన వ్యవసాయం పరిస్థితులు". దీని రచయిత అర్.వి. రమణమూర్తి. కమతాల సైజుల ఆధారంగా రైతాంగంలోని ఐదు వర్గాల రైతు కుటుంబాల్లో ఉత్పత్తి, భూమి, కౌలు, రుణం, ఖర్చు, ఆదాయం. ప్రభుత్వ సంక్షేమం, వ్యవసాయేతర ఆదాయం, కౌలు రేట్లు, యాంత్రీకరణ, తరుగుతున్న, ఉపాధి పనిదినాల మీద క్షేత్రస్థాయి సమాచారాన్ని ఈ పరిశోధన అందిస్తుంది. నలభైయేళ్ళ క్రితం కన్నా, గత దశాబ్ద కాలంలో జరిగిన మార్పు చాలా ఎక్కువ అనీ, సుస్పష్టంగా అది పెట్టుబడి సంబంధాలని సూచిస్తుందని రచయిత అభిప్రాయపడ్డారు. గత రెండు దశాబ్దాలుగా తెలుగు రాష్ట్రాలల్లో పెట్టుబడి సంబంధాలు వాటి ప్రభావం కేవలం కొన్ని వర్గాల మీద కాకుండా అత్యంత క్రింద ఉన్న దళిత కులాల మీద కూడా ప్రభావం చూపాయి. ఈ కోణాన్ని చూపించడానికి ఎస్.ఎ. విద్యాసాగర్ రాసిన 'పల్లెను మింగిన పెట్టుబడి" పుస్తకం నుండి దళితులు-భూమి అనే అంశం మీద రాయబడిన అధ్యాయాలయాన్ని పొందు పరచడం జరిగింది. పుస్తకంలో రైతాంగ పరిస్థితుల్లో మొత్తంగా వచ్చిన మార్పులను వివరిస్తూ, విద్యాసాగర్ గారు దళితుల పరిస్థితిపై ముఖ్యమైన పరిశీలనలు ఇందులో చేశారు. శ్రీకాకుళం జిల్లాలోని గ్రామాల్లో దళితుల పరిస్థితుల్లో జరిగిన మార్పులను ఆధారంగా మూడు ప్రధానమైన విషయాలు రచయిత చెప్పారు. మొదటిది చారిత్రాత్మకంగా దళితులను భూయాజమాన్యానికి ఈ సమాజం దూరంగా ఉంచడం. రెండవది స్వాతంత్రానంతరం భారత ప్రభుత్వ భూపంపిణీ కార్యక్రమం అమలు చేయడంలో ఘోరంగా విఫలం చెందడమే కాక, ఇచ్చిన నాసిరకం భూములను కూడా పనిముట్లు లేక సాగు చేసుకోలేని పరిస్థితి, ఇచ్చిన భూమి ఎన్నో కారణాల చేత నిలబెట్టుకోలేని పరిస్థితిని చెప్పడం జరిగింది. మూడవ విషయం గత రెండు దశాబ్దాలుగా జరిగిన పెట్టుబడిదారీ అభివృద్ధిలోనే దళితులకు గ్రామీణ అణచివేత, పీడనలకు దూరంగా పట్టణాలలో వలస కార్మికులుగా వెళ్ళే అవకాశం వెసులబాటు మొదటిసారిగా దళితులకు వచ్చిందని రచయిత అభిప్రాయపడ్డారు. దీని ప్రభావం వారి ఆదాయం మీద, గ్రామీణ కూలీ రేట్ల మీదే కాక వ్యవసాయ సంబంధాలల్లో జరిగిన మార్పుల మీద కూడా పడింది. 'జీతగాడు' కంబారీ వృత్తులాంటి అర్థబానిస స్థాయి నుండి స్వేచ్ఛా కార్మికులుగా జరిగిన పరిణామం దళితుల పరిస్థితిలో  జరిగిన కీలకమార్పుగా భావించాలి. ఇది పెట్టుబడిదారీ విధానం తెచ్చిన మార్పుగా గుర్తించడం చాలా ముఖ్యమైన విషయం.

**వలసానంతర పెట్టుబడి: రాజకీయాలు**

చివరిగా తనదైన పంథాలో ఒక నెహ్రూవియన్ అభివృద్ధి-రాజ్యం ఆధునిక స్పృహతో ఒక పారిశ్రామిక పెట్టుబడి అభివృద్ధిని నిర్మించిన క్రమాన్ని; దాని పరిమితుల్ని, విజయాల్ని విశ్లేషిస్తూ, వలసానంతర పెట్టుబడి విధాన నిర్మాణ ప్రక్రియలోని క్లిష్టమైన వాస్తవాన్ని చూపినవారు కీ.శీ.కల్యాన్ సన్యాల్. వారు 2007లో రాసిన "రిథింకింగ్ కాపిటలిస్ట్ డెవలప్‌మెంట్: ప్రిమిటివ్ అక్యుములేషన్, గవర్నమెంటాలిటీ పోస్ట్ కలోనియల్ కెపిటలిజం' పుస్తకం ఆధారంగా ఆర్. శ్రీవత్సన్ చేసిన సంగ్రహాన్ని ఇక్కడ చివరి వ్యాసంగా పొందుపరుస్తున్నాము.  సాంప్రదాయ రంగాలన్నింటిలో విస్తాపనకు, స్థానభ్రంశానికి గురైన వారందరూ పెట్టుబడి కాని ఒక అనధికార రంగంలో పొట్ట కూటి కోసం పెటి ఉత్పత్తిలో ఉంటారని, వీరికి రాజ్యం ఏ హక్కులు లేని సంక్షేమం అనే ఇరుసులో ఉదారవాద ప్రజాస్వామ్యం ద్వారా జరుగుబాటును అందించి, మొత్తంగా మిగులు పునరుత్పత్తిని, దాని రాజకీయ సాధికారతని ఎలా పునరుత్పత్తిని చేస్తుందో సన్యాల్ వివరిస్తారు. ఉత్పత్తి సంబంధాలకూ, పాలకవర్గ రాజకీయాలకు ఉన్న లంకెను

ప్రజలను సమీకరించే శక్తులు అర్థం చేసుకోవాలని ఈ వ్యాసం సూచిస్తుంది. వ్యవసాయ సమస్యను కూడా ఈ కోణంలో చూసి అర్థం చేసుకుంటే కొత్త కోణం స్ఫురిస్తుందని మేం భావిస్తున్నాం. ఈ వ్యాసం డా. మాధవి తెలుగు సేత చేసారు.

ముగింపు:

మొదటగా అర్థం చేసుకోవాల్సింది ఏమిటంటే పారిశ్రామిక, సేవారంగాల్లో మిగులు పోగుబడిని పెంచటానికి వ్యవసాయంలో పెట్టుబడి పరిణామం జరుగుతుందని, ఈ రెండు రంగాల మధ్య ఉన్న అసమాన వినిమయ సంబంధాలు వ్యవసాయ సంక్షోభానికి మూలమన్నది రెండవ ప్రధాన అంశం. మూడవది పరిణామం ఎంతమేరకు జరుగుతుందనేది చారిత్రక అంశాలపై ఆధారపడుతుంది. దీర్ఘకాలిక పరిష్కారం భూమిని, ఆస్తినంతా జాతీయీకరణ చెయ్యడం వ్యక్తిగత ఆస్తిని సామాజిక ఆస్తిగా మార్చడం. పెట్టుబడిదారీ వ్యవస్థలో పరిష్కారాలన్నీ మొత్తంగా చూసిన తర్వాత, వ్యవసాయ సమస్య చాలా జటిలమైనదని, వ్యవస్థలో కాంప్లెక్స్‌గా కలిసిన విషయం అని అర్థం అవుతుంది. తాత్కాలికం, పాక్షికం.

రైతుల సంక్షోభంలో రెండు కోణాలున్నాయి. మార్కెట్ ధర, ఉత్పత్తి విలువకు సమానమైనప్పటికీ, చిన్నరైతులు వ్యవస్థీకృత బలహీనతల వల్ల వారు చేసిన శ్రమ ఫలితం (Necessary Labour) కూడా పొందలేక పోవడం. అదనపు విలువలు పూర్తిగా అన్యాక్రాంతం అవడం. సహకార సంఘాలుగా రైతులను ఆర్గనైజ్ చేస్తే, ఈ సమస్యకు పరిష్కారం లభించవచ్చు. రెండవ కోణం మార్కెట్ ధర పంట ఉత్పత్తి విలువ కంటే కిందికి పడి, అదనపు విలువ ధ్వంసం కావడం. ఈ రెండవ సమస్యను సహకార సంస్థలు కూడా నివారించలేవు. అప్పుడు భూమి జాతీయకరణ జరిగి ఉత్పత్తి దారులకు జాతీయ ఉత్పత్తిలో వాటా ఇవ్వడం అంతిమ పరిష్కారం. ఇది ఎంత ఊహాత్మకమైనది అయినా, దీనిపై సైద్ధాంతిక అవగాహన ఉండడం అవసరం.

ఈ సంకలనం వ్యవసాయ సమస్య పట్ల మన అవగాహనని పెంచుతుందని ఆశిస్తున్నాం. వ్యవసాయ సమస్యపై ఇప్పుడు చేసే ఈ చర్చ బహుశ తెలుగునాట ఒక దశాబ్దకాలంపైన ఆలస్యమైందేమో. బాహ్య పరిణామాలకీ, అవగాహనలకీ వ్యత్యాసం తీరాల్సిన అవసరం ఎంత ఉందని సంపాదకుల భావన. చివరిగా, ఈ సంచికలో ఉన్న వ్యాసాల మీద సంపాదకులకు కానీ, ఎవరికైనా గానీ ఏకీభావం పూర్తిగా ఉండాల్సిన అవసరం లేదు. కానీ ఒక పున:సమీక్షణకు ఒక చర్చకూ ఈ వ్యాసాలు సహకరించవచ్చన్నది మా ఆశ.


**ఆర్.వి. రమణమూర్తి, ఎస్.ఎ.విద్యాసాగర్, గడియారం భార్గవ**


రమణమూర్తి హైదరాబాదు విశ్వవిద్యాలయంలో స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్‌లో అధ్యాపకులు.

ఎస్.ఎ. విద్యాసాగర్ సెంటర్ ఫర్ ఇండిపెండెంట్ రిసెర్చర్స్‌తో పని చేస్తారు.

గడియారం భార్గవ న్యూ సోషలిస్ట్ ఇనిషియేటివ్‌తో పనిచేస్తారు.

ఈమెయిల్స్:
rvramana66@gmail.com
vidyasagarsriadibhatla@gmail.com
bharguma@gmail.com



# భారతదేశ వ్యవసాయ రంగంలో పరిణామ క్రమం: మన దగ్గరనున్న సమాచారం ఏం చెప్తుంది?

***(అమిత్ బసోలే, దీపాంకర్ బసు)***

**ఈ వ్యాసంలో అమిత్ బసోలే, దీపాంకర్ బసు (బసోలే&బసు) భారతదేశ ఆర్థిక వ్యవస్థలో శ్రమ దోపిడి స్వభావం; మిగులు దోపిడి జరుగుతున్న తీరుని అర్థం చేసుకునే ప్రయత్నం చేశారు. శ్రమ దోపిడి, మిగులు దోపిడి (appropriation) రెండూ, నేరుగా, ప్రత్యక్షంగా జరిగే భూస్వామ్య విధానం నుంచి, శ్రామిక వేతన వ్యవస్థ ద్వారా కనపడని పద్ధతిలో జరిగే పెట్టుబడిదారీ విధానానికి భారత ఆర్థిక వ్యవస్థ పరివర్తన చెందుతున్న తరుణంలో, దోపిడి స్వభావాన్ని విశ్లేషించటం, దాని రాజకీయ, సామాజిక పర్యవసానాల్ని అర్థం చేసుకోవటానికి చాలా అవసరం. ఈ విశ్లేషణ అచ్చంగా సిద్ధాంతపరంగా చెయ్యటమే కాక భారత దేశ చారిత్రక అనుభవంలోని వాస్తవ నిదర్శనాల ఆధారంగా కూడా చేయవలసి ఉందని బసోలే-బసూలు వాదిస్తారు. దీనికోసం భారతదేశ వ్యవసాయ వ్యవస్థలోని కొన్ని కీలక లక్షణాలను పరీక్షించి ఒక నిర్ధారణకు వస్తారు. వ్యవసాయ రంగం, అసంఘటిత రంగం మీద దృష్టి కేంద్రీకరించడం అత్యంత అవసరమని వీరి అభిప్రాయం. సంఘటిత రంగంలో పెట్టుబడిదారీ ఉత్పత్తి సంబంధాలు నెలకొన్నాయనే అంశం మీద అందరు పరిశోధకులు ఏకాభిప్రాయంలో ఉన్నారు కాబట్టి, ఇటువంటి వాస్తవ నిదర్శనాలతో కూడిన చారిత్రక అనుభవం మీద ఆధారపడిన విశ్లేషణ, భారత దేశంలోని పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధి స్వభావాన్ని అంచనా వేయటానికి ముఖ్యమని వీరంటారు.**

**ఈ అంచనా వారెలా చేస్తారు? జాతీయ స్థాయిలో, రాష్ట్ర స్థాయిలో వ్యవసాయ రంగ నిర్మాణం, ఉపాధి, కౌలుదారీ వ్యవస్థ, రుణ సౌకర్యం, వ్యవసాయ రంగ కార్మికుల ఆదాయ వనరులకు సంబంధించి, వివిధ జాతీయ శాంపిల్ సర్వేల ద్వారా సేకరించిన సమాచారం ఆధారంగా రచయితలు తమ విశ్లేషణ చేసారు. ప్రతి సంవత్సరం జాతీయ స్థాయిలో, రాష్ట్ర స్థాయిలో ఈ సమాచారాన్ని సేకరిస్తారు. అలాగే జాతీయ స్థాయిలో వర్గాల నిర్మాణాన్ని పరిశీలించటానికి ఈ కింది అంశాలను లోతుగా పరిశీలించారు: భూకమతాల సైజు, రాష్ట్ర స్థాయిలో భూయాజమాన్య తీరు, కౌలు విధానాల్లో వైవిధ్యత, భూయజమాని-కౌలు రైతుల సంబంధాలు, భూమిలేని వారి సంఖ్య, గ్రామీణ ప్రాంతాల్లో ఆదాయ మార్గాలు, మిగులు పోగుబడి, ఆధిపత్య స్వభావం.ఈ సమాచార విశ్లేషణ ఆధారంగా భారతదేశ వ్యవసాయ రంగంలో పెట్టుబడిదారీ విధానం ఏ రకంగా పరివర్తన చెందుతూ వచ్చిందో, క్రింద వివరంగా తెలుసుకుందాం. - సంపాదకులు**

**1. భారత ఆర్థిక వ్యవస్థలో తరుగుతున్న వ్యవసాయరంగ వాటా:**

ఏ ఆధునిక పెట్టుబడిదారి ఆర్థిక వ్యవస్థ అయినా సరే, ఆర్థిక శాస్త్రవేత్తల అంచనాలో, 'వ్యవస్థీకృత 'పరివర్తన'కి గురవ్వాలి. అంటే జాతీయ ఆదాయంలో (ఎ) వ్యవసాయ రంగ ఆదాయ శాతం (బి) వ్యవసాయ రంగంపై ఆధారపడ్డ కార్మికుల శాతం రెండూ తగ్గుతాయి. భారత దేశంలో మొదటిది జరిగిపోయి రెండవ దాన్లో పెద్ద ఖాళీని ఏర్పరచింది. 1950లో స్థూల జాతీయ ఆదాయంలో 56 శాతం ఉన్న వ్యవసాయ ఆదాయం, 2011 నాటికి 14 శాతానికి తగ్గిపోయి, వ్యవసాయేతర ఆదాయం త్వరితగతిన పెరుగుతూ వచ్చింది. దీని ఫలితంగా వ్యవసాయం మొత్తంగా ఆర్థిక రంగంలో తన శక్తిని కోల్పోయింది. కానీ ఇదే సమయంలో, వ్యవసాయ రంగంలోని శ్రామికుల సంఖ్య, 68 శాతం నుంచి 49 శాతానికి మాత్రమే తగ్గింది. ఇప్పటికీ వ్యవసాయ రంగంపైన ఉపాధి కోసం ఆధారపడే వారి సంఖ్య ఇంత ఎక్కువగా ఉండటానికి కారణం, ఇతర రంగాలలో అవకాశాలు లేకపోవటమే తప్ప ఇంకేమీ కాదని, బసోలే&బసు అంటారు.

**గత ఐదు దశాబ్దాల కాలంలో, జాతీయ స్థూల ఆదాయంలో వ్యవసాయరంగ వాటా క్రమంగా తగ్గిపోతూ వస్తోంది. కానీ వ్యవసాయంపైన ఆధారపడి జీవించే వారి సంఖ్య తగ్గలేదు. దీని వలన, ఎక్కువ సంఖ్యలో గ్రామీణ కార్మికులు, తక్కువ ఉత్పాదకత, తక్కువ ఆదాయం ఉన్న పనికి పరిమితం అవుతున్నారు.**

**2. సన్నకారు, చిన్నకారు రైతు కుటుంబాల సంఖ్యలో పెరుగుదల:**

వ్యవసాయ రంగంలో ఉన్న వారి పరిస్థితి ఎలా మారుతోంది? సాధారణంగా పెట్టుబడిదారీ వ్యవస్థలోకి పరివర్తన చెందుతున్నప్పుడు, ఖచ్చితంగా చెప్పలేక పోయినా, సగటు భూకమతాల పరిమాణం పెరిగే అవకాశం ఉంది. దీనికి విరుద్ధంగా భారతదేశ వ్యవసాయంలో 1961లో 2.01 ఎకరాలున్న సగటు స్వంత భూకమతాల పరిమాణం, 2003 నాటికి 0.81కి తగ్గింది. ఇదే రకమైన తగ్గుదల సాగుబడిలో ఉన్న కమతాల విషయంలో కూడా గమనించవచ్చు.

తరువాత, వ్యవసాయం రంగ నిర్మాణంలో వచ్చిన మార్పులను కమతాల పరిమాణం ఆధారంగా రచయితలు చూస్తారు. NSSO (జాతీయ శాంపిల్ సర్వే) వ్యవసాయ భూకమతాల పరిమాణాన్ని 5 తరగతులుగా విభజించింది. అవి 1 హెక్టారు కంటే చిన్న కమతం సన్నకారు, 1-2 హెక్టార్ల మధ్య పరిమాణం చిన్నకారు, 2-4 హెక్టార్లు సెమీ మధ్య తరహా, 4-10 హెక్టార్లు మధ్య తరహా, 10 హెక్టార్ల కంటే ఎక్కువ పరిమాణం పెద్ద తరహా కమతాలు.

1961లో 75 శాతంగా ఉన్న చిన్న, సన్నకారు రైతుల సంఖ్య 2003 నాటికి 90 శాతం వరకు పెరిగింది. చిన్న, సన్నకారు రైతుల పెరుగుదలతో పాటు పెద్ద, మధ్య తరహా, సెమీ మధ్య తరహా వర్గాలు మూడింటిలోనూ సమానమైన తరుగుదలను గమనించవచ్చు. గ్రామీణ భారత దేశంలో పెద్ద, మధ్య తరహా కమతాలున్న రైతు కుటుంబాలు 1961లో 12 శాతం ఉండి ఇప్పుడు 3.6 శాతానికి తగ్గాయి. చిన్న కమతాలున్న రైతు కుటుంబాలు 1961 నుండి 2003 మధ్య కాలంలో 9 శాతం నుండి 11 శాతం వరకు పెరిగి స్థిరంగా కొనసాగుతున్నాయి.

వ్యవసాయ భూముల సగటు పరిమాణం, యాజమాన్యం ఆధారంగా చూసినా, సాగుబడి ఆధారంగా చూసినా, గత ఐదు దశాబ్దాల కాలంలో క్రమంగా తగ్గడం గమనించవచ్చు. 2002-2003 నాటికి యాజమాన్య సగటు పరిమాణం 0.73 హెక్టార్లు.

**పోగుబడి భూమి రూపంలో జరగట్లేదని అర్థమవుతోంది. కాని భూమి విలువ పెరగడం చూస్తాం.**

**3. పెరుగుతున్న సన్నకారు, చిన్నకారు రైతుల భూమి:**

ఈ తరగతికి చెందిన భూయాజమానుల సంఖ్యే కాక, వారు సాగు చేస్తున్న భూపరిమాణంలో కూడా పెరుగుదల కనపడింది. చిన్న, సన్నకారు రైతుల యాజమాన్యంలో ఉండే భూమి వాటా క్రమంగా 1961లో 8 శాతం నుండి 2003 నాటికి 23 శాతానికి పెరిగింది. పెద్ద తరహా రైతు కుటుంబాల యాజమాన్యంలో ఉండే భూమి వాటా 1961 కి 31 శాతం ఉండగా, 2003 నాటికి 23 శాతానికి తగ్గింది. ఈ రెంటికీ మధ్య, సెమీ మధ్య తరహా రైతు కుటుంబాల యాజమాన్యంలో ఉండే భూమి, 1971 నాటికి 21 శాతం చేరుకుని దాదాపుగా అక్కడే స్థిరపడిపోయింది.

**సెమీ మధ్యమ స్థాయి రైతు కుటుంబాల యాజమాన్యంలో ఉండే భూమి వాటా గత కొన్ని దశాబ్దాలలో 64 శాతం నుండి 34 శాతంకు క్రమంగా తగ్గిపోవడం, గ్రామీణ ప్రాంతాల్లో తగ్గిపోతున్న వారి ఆర్థిక, సామాజిక రాజకీయ ఆధిపత్యాన్ని సూచిస్తుంది. 31 శాతం నుండి 80 శాతం వరకు ఉన్న చిన్న, సన్నకారు మధ్య తరహా రైతు కుటుంబాల వాటా ఆధిపత్యం లేని రైతుకుటుంబాల వ్యాప్తిని సూచిస్తుంది.**

**4. భూయాజమాన్యంలో కొనసాగుతున్న అసమానతలు:**

అయితే భూమి యాజమాన్యంలో అసమానతలు తగ్గాయని చెప్పలేము. యాజమాన్యంలో అసమానతను కొలిచే గినీ

కోఎఫీషియంట్ 1961-62లో 0.73 నుండి 2003 నాటికి కొద్దిగా మాత్రమే పెరిగి అంటే 0.74కు చేరింది (GOI 2006). 2003 నాటికి పెద్ద తరహా భూమి సగటు పరిమాణం, సన్నకారు సగటు భూ పరిమాణం కంటే 67 రెట్లు, మధ్య తరహా సగటు భూ పరిమాణం కంటే 27 రెట్లు ఎక్కువ పెరగడం దీనికి ప్రధాన ఉదాహరణ. పెద్ద రైతుల కమతాల సైజు తగ్గేటప్పుడు చిన్న రైతుల కమతాల సైజుకూడా తగ్గటం వల్ల అసమానతలు పెరిగాయి.

అయితే భూమి యాజమాన్యంలో అసమానత మాత్రమే ఆధిపత్య ఉత్పత్తి సంబంధాలను, మిగులు వెలికితీత పద్ధతులను గానీ అర్థం చేసుకోవటానికి సరిపోదు. ఉత్పత్తి భూస్వామ్య పద్ధతిలో ఉన్నా, పెట్టుబడిదారీ పద్ధతిలో ఉన్నా భూపంపిణీ అసమానంగానే ఉంటుంది. ఒక వర్గానికి ఉన్న ఆధిపత్య శక్తి ఆ వర్గానికి వుండే భూపరిమాణంపై, యాజమాన్యపు హక్కులపై అన్నిసార్లు ఆధారపడకపోయినా భూమి ఉన్న వర్గానికి పశువులు, యంత్రాలు, పరికరాలు కూడా ఉండే అవకాశం ఉండటం వలన ఆ వర్గానికి ఉండే ఆధిపత్యాన్ని అంచనా వేయవచ్చు. కాబట్టి, భూమి పరిమాణం ఇతమిద్ధంగా వర్గాధిపత్యాన్ని ప్రతిబింబించే అవకాశం ఉంది.

**భూమిపై యాజమాన్యం, ఐదు దశాబ్దాల క్రితం ఎంత అసమానంగా ఉందో ఇప్పుడూ అంతే, కాబట్టి వర్గ ఆధిపత్యం కూడా సుమారుగా అలాగే ఉందని అర్థం చేసుకోవాలి.**

**5. ఏ రాష్ట్రాలలో భూ కమతాల పరిమాణం పెద్దదిగా ఉంది? పెద్ద కమతాల సంఖ్య ఎక్కువగా ఉంది?**

భారత దేశంలో వివిధ ప్రాంతాల మధ్య చారిత్రక, భౌగోళిక వ్యత్యాసాల వలన, రాష్ట్రస్థాయిలో పోల్చి చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. విశ్లేషణ సౌకర్యార్థం, బసోలే-బసు రాష్ట్రాలను రెండు సమూహాలుగా విభజిస్తారు. మొదటివి పెద్ద కమతాలున్న పెద్ద రైతుల వాటా ఎక్కువగా ఉన్న రాష్ట్రాలు: ఆంధ్రప్రదేశ్, గుజరాత్, హర్యానా, కర్ణాటక, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, పంజాబ్, రాజస్థాన్. రెండవవి పెద్ద రైతుల వాటా సాపేక్షికంగా తక్కువగా ఉండే: అస్సాం, బీహార్, హిమాచల్ ప్రదేశ్, జమ్ముకాశ్మీర్, కేరళ, ఒరిస్సా, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్.

మొదటి గ్రూపు రాష్ట్రాలలో పెద్ద కమతాలుండడమే కాక, వ్యవసాయం రంగంలో పెట్టుబడిదారీ ఉత్పత్తి సంబంధాలు కొంత అధికంగా చూడవచ్చునని సూక్ష్మ స్థాయి అధ్యయనాలు సూచిస్తున్నాయి. రెండవ గ్రూపు రాష్ట్రాల్లో ఇప్పటికీ ఉత్పత్తి వ్యవస్థ, పెట్టుబడిదారీ పూర్వ పద్ధతిలో కొంత మేరకు కొనసాగుతోంది. పెద్ద కమతాలున్న రైతుల వాటా తగ్గిపోతూ ఉండటం ఇక్కడ కూడా గమనించవచ్చు. జాతీయ, రాష్ట్రీయ, ప్రాంతీయ స్థాయిలలో సంపన్నులైన మధ్య స్థాయి రైతులు, పెట్టుబడిదారీ భూస్వాములతో పోల్చి చూస్తే, పెత్తందారీ భూస్వామ్య పద్ధతిని అవలంబిస్తున్న రైతుల ఆర్థిక స్థితి బలహీనపడటం గమనించవచ్చు. సమకాలీన భారత దేశంలో, వ్యవసాయ రంగంలో సంపన్నులయిన మధ్య స్థాయి రైతులు, అర్ధ భూస్వామ్య యజమానులని ఆధిపత్య స్థానాల నుంచి స్థానభ్రంశం చేసి, వారి స్థానం ఆక్రమించుకున్నారు.

**ఎక్కువగా అభివృద్ధి చెంది, పెద్దవైన (సాగునీటి సౌకర్యం, ఆదాయం విషయంలో) కొన్ని రాష్ట్రాలు, ఆంధ్రప్రదేశ్, గుజరాత్, హర్యానా, కర్ణాటక, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, పంజాబ్, రాజస్థాన్ వంటి వాటిలో, భూ కమతాలు తక్కువగా విభజనకు గురైనాయి. అయితే, అస్సాం, బీహార్, హిమాచల్‌ప్రదేశ్, జమ్ము కాశ్మీర్, కేరళ, ఒరిస్సా, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్‌లో కమతాల విభజన ఎక్కువగా చూడవచ్చు.**

**6. భూమి పైన హక్కు లేని వారు ఎంత మంది?**

భూమిపైన హక్కు లేకపోవటం, పెట్టుబడిదారీ విధానానికి కీలకమైన శ్రామికీకరణ (Proletarianisation) ను సూచిస్తుంది. NSSO సమాచారం ప్రకారం, భూమిపైన హక్కు లేని వారి సంఖ్య గత ఐదు దశాబ్దాల కాలంలో, భారతదేశ వ్యవసాయ రంగంలో సుమారు 11.7 శాతం దగ్గర స్థిరపడిపోయింది: 1961లో 11.7 శాతం నుండి 2003 నాటికి కొంచెం తగ్గి 10 శాతంకి చేరింది. కాస్త భూమి ఉన్నంత మాత్రాన వారు శ్రామికులు కాకపోరు. కాబట్టి, ఈ సంఖ్యకు, 0.2 హెక్టార్ల కంటే తక్కువ భూమి ఉన్న వారిని లెక్కలోకి తీసుకున్నట్లయితే, 44 శాతంకి, 0.4 హెక్టార్లకంటే తక్కువ ఉన్న వారిని కూడ తీసుకున్నట్లైతే 60 శాతం వరకు చేరుతుంది. గ్రామీణ ప్రాంతంలో ఉన్న పేద కుటుంబాలను దృష్టిలోకి తీసుకుంటే, వీళ్ళెలాగూ భూమి లేని వారే. సాగుబడిలో ఉన్న భూమిలో వారికి 6 శాతం భూమిపైన మాత్రమే హక్కు ఉంది. భూమిపై యాజమాన్యపు హక్కు లేని వారి సంఖ్య అత్యధికంగా హిమాచల్‌ప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలలోను, అతి తక్కువగా జమ్మూకాశ్మీర్, కేరళ, పంజాబ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలలోను చూడవచ్చు.

మరొక మాటేమిటంటే వ్యవసాయ రంగంలో పనిచేసే వారిలో, గత దశాబ్ద కాలంలో, సాగుచేసే రైతుల సంఖ్య, మొత్తంగాను, సాపేక్షికంగానూ తగ్గుతూ వస్తోంది. జాతీయ స్థాయిలో సాగుచేసే రైతుల సంఖ్య 1961-81 మధ్య కాలంలో 79 నుంచి 121 మిలియన్లకు పెరిగి, 125 మిలియన్ల దగ్గర 1991-2001 మధ్య కాలంలో స్థిరపడి, 2001-2011 మధ్య కాలంలో వ్యతిరేక దిశలోకి మారి 2011 నాటికి 102 మిలియన్లకు తగ్గింది. దీనర్థం 1991-2011 మధ్య కాలంలో 23 మిలియన్ల సాగుచేసే రైతులు వ్యవసాయ రంగాన్ని వదిలిపెట్టారు. రైతుల సంఖ్యలో తరుగుదల అర్థం వారు వ్యవసాయేతర రంగాలలోకి ఉత్పత్తిదారులుగా కానీ, వివిధ రకాల శ్రామికులుగా గాని తరలిపోయారని. ఇది ఉపాధి పరిణామంలో వస్తున్న పెట్టుబడిదారీ మార్పు.

**0.4 నుండి 0.73 హెక్టార్ల భూమి ఉన్న వారిని కూడా భూమిలేని వారితో కలిపి చూస్తే, మన దేశంలో భూమిలేని వారిసంఖ్య 2002-03లో 60%** వరకూ ఉంటుంది.

**7. కౌలుదారులలో తరుగుదల:**

కౌలు వ్యవస్థ ప్రబలంగా ఉన్నంత కాలం భూమి లేనివారి సంఖ్యలో పెరుగుదల శ్రామికీకరణను సూచించదు. పెట్టుబడిదారీ విధానంలో ఆధిపత్య వర్గాలకు మిగులు శ్రమను దోపిడీ చేయడటానికి రెండు పద్ధతులున్నాయి. ఒకటి, నేరుగా వేతన శ్రామికులను దోపిడి చేయడం, రెండు భూమిపైన వచ్చే అద్దె ద్వారా చేయడం. మొదటి పద్ధతి స్పష్టంగా పెట్టుబడిదారీ సంబంధాలను సూచిస్తుంది. రెండవ పద్ధతి పాక్షిక భూస్వామ్య (Semi-feudal) ఉత్పత్తి సంబంధాలతో కూడా ఉంటుంది. కానీ వాస్తవంలో ఏముంది?

జాతీయ స్థాయిలో NSSO సమాచారం ప్రకారం (వ్యవసాయ రంగ సెన్సస్ కూడ కలిపి చూసుకుంటే), కౌలు రైతు కుటుంబాల వాటా 1971-72లో 25 శాతం నుండి 2003 నాటికి 12 శాతానికి పడి పోయింది. మొత్తం వ్యవసాయ భూమిలో కౌలుకిచ్చే భూమి వాటాకూడా 1971-72లో 12 శాతం నుంచి 2003 నాటికి 7 శాతానికి తగ్గింది. ఇదే పరిణామం సాగుబడిలో ఉన్న భూమి విషయంలో కూడ చూడవచ్చు.

పూర్తిగా కానీ, పాక్షికంగా కానీ కౌలుకిచ్చిన భూమి 1960-61లో 24 శాతం ఉంటే 2002-03 నాటికి 10 శాతానికి దారుణంగా పడిపోయింది. మొత్తం వ్యవసాయ భూమిలో, కౌలుకిచ్చే భూమి 1960-61లో 10.7 శాతం నుండి 2003 నాటికి 6.5 శాతానికి తగ్గింది. కౌలు వ్యవసాయం నుంచి స్వీయ వ్యవసాయం దిశగా జరుగుతున్న మార్పుకి ఇది సూచన. కౌలు వ్యవసాయం చేసే సంఖ్య కమతాల దృష్ట్యా చూస్తే, 1961-2001 మధ్య కాలంలో, పెద్ద కమతాల పరిమాణం, 9.5 శాతం నుండి 13.5 శాతంకు పెరగగా, కమతాల పరిమాణం 8.3 శాతం నుండి 6.1 శాతంకి తగ్గింది. మొత్తం కమతాలలో మిగిలిన అన్ని తరగతులలో కౌలు వ్యవసాయం చేసే కమతాల వాటా తగ్గుతూ వచ్చింది.

ఈ మార్పు వివిధ రాష్ట్రాలలో భిన్నంగా జరుగుతోంది. కౌలు వ్యవసాయం ఆంధ్రప్రదేశ్, గుజరాత్, ఒరిస్సా, కేరళ, హర్యానా, పంజాబ్ రాష్ట్రంలో పెరుగుతుండగా మిగిలిన అన్ని రాష్ట్రాలలో కౌలు కమతాల పరిమాణం చెప్పుకోదగ్గ స్థాయిలో తగ్గుతోంది. కాబట్టి అర్ధ భూస్వామ్య పట్టు తగ్గుతున్న రాష్ట్రాల్లో కౌలు పెరుగుతోంది!

**NSSO సమాచారాన్ని అనుసరించి, మొత్తం కమతాలలో కౌలు వ్యవసాయ కమతాల వాటా, గత ఐదు దశాబ్దాల కాలంలో 24 శాతం నుండి 10 శాతం మేరకు తగ్గింది. కౌలు వ్యవసాయం కింద ఉన్న వ్యవసాయ భూమి పరిమాణం కూడ బాగా తగ్గింది. కౌలు వ్యవసాయ విధానం అవలంబించిన ప్రాంతాలలో, పెట్టుబడిదారీ పూర్వపు సంబంధాలు కొంత మేరకు కొనసాగినా, ఇతర ప్రాంతాలలో నిర్దిష్టమైన అద్దె సూచించే వాణిజ్య స్వభావ ఒప్పందాలు పెరుగుతున్నాయి.**

**8. ప్రస్తుతం అమలులో ఉన్న కౌలు విధానం భూస్వామ్యమా, పెట్టుబడిదారీ విధానమా?**

ఏ రాష్ట్రాలలో అయితే భూస్వామ్య, పెట్టుబడిదారీ పూర్వపు ఉత్పత్తి సంబంధాలకు ఎక్కువగా ప్రబలి ఉన్నాయో, వాటిలో (ఒరిస్సాలో తప్ప), కౌలు విధానం తక్కువగా అమలులో

ఉంది. భూమిలేని నిరుపేదలే కౌలు రైతులు అవుతున్నారు. భారతదేశ వ్యవసాయంలో పెట్టుబడిదారీ విధానం పెరుగుతున్న కొద్దీ తన ఉత్పత్తి వ్యయం తగ్గించటం కోసం లేదా శ్రామికులను నియంత్రించటం కోసం కౌలు విధానాన్ని ఉపయోగించుకుంటున్నట్లు అర్థమవుతోంది.

అంతే కాకుండా, కౌలు స్వభావాన్ని అర్థం చేసుకోవటానికి, కౌలు ఒప్పందాలలో భేదాలను అర్థం చేసుకోవలసి ఉంటుంది. చెల్లించాల్సిన కౌలు నిర్దిష్టంగా నగదు రూపంలోనూ, పంట రూపంలోనూ ఉంటే, పెట్టుబడిదారీ సంబంధాలను సూచిస్తుంది. సరి పాలి కౌలు కొంత మేరకు భూస్వామ్య సంబంధాలను సూచిస్తుంది. NSSO సమాచారం ప్రకారం, మొత్తం సాగుభూమిలో సుమారు 40 శాతం మేరకు సరిపాలు కౌలు పద్ధతిలోనే స్థిరపడిపోగా, 1961–2003 మధ్య కాలంలో అనధికార నగదు లేదా వస్తు రూపంలో కౌలు తీసుకునే ఒప్పందాల ద్వారా వాణిజ్య కౌలు పద్ధతుల కింద సాగయ్యే భూమి 38 శాతం నుండి 50 శాతం మేరకు పెరిగింది.

కౌలు విధానం బాగా వ్యాప్తి చెందిన హర్యానా, పంజాబ్ రాష్ట్రాలలో నిర్దిష్టమైన నగదు ఒప్పందాలే ఎక్కువగా అమలులో ఉన్న పద్ధతి. వీటికంటే పేద రాష్ట్రాలైన అస్సాం, బీహార్, ఒరిస్సా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలలో వస్తు రూపంలో అద్దె చెల్లించే కౌలు విధానం లేదా పంటను పంచుకునే సరిపాలు కౌలు విధానం ఎక్కువగా అమలులో ఉన్నది. ఈ తేడా అర్థం చేసుకోవటం అవసరం. ఎందుకంటే ఈ రెండు రాష్ట్ర సమూహాల మధ్య, కౌలు స్వభావంలో మౌలికంగా తేడాలున్నాయి.

పంజాబ్, హర్యానా వంటి రాష్ట్రాలలో, కౌలు రైతులు భూమి లేనివారో లేక పేద రైతులో కారు. వీళ్ళు తమ స్వంత భూముల పరిమాణం పెంచుకోవటం ద్వారా వ్యవసాయంలో ఎక్కువ పెట్టుబడి పెట్టి, పెద్ద తరహా ఆర్థిక లావాదేవీలు ఇచ్చే లాభాలను పొందాలని ఆశించే సంపన్న మధ్య రైతాంగం. నిర్దిష్టమైన నగదు కౌలు ఒప్పందాలు పెట్టుబడిదారీ పూర్వపు ఉత్పత్తి సంబంధాలను సూచించవు. అవి ఖచ్చితంగా వ్యవసాయ రంగంలో పెట్టుబడిదారీ వ్యవస్థను సూచించేవే. మరోవైపు బీహార్, ఒరిస్సా వంటి రాష్ట్రాలలో కౌలు పద్ధతి ఇంకా పాత రూపాలలోనే ఉంది. కౌలుదారులందరు, భూమిలేని పేద రైతులుగాని, చాలా తక్కువ భూమి ఉన్నవారు గానీ అయి ఉంటారు. ఇక్కడ అవలంబించేది, పెట్టుబడిదారీ వ్యవస్థకు పూర్వం ఉండే అద్దె ఆధారంగా మిగులును కైవసం చేసుకునే భూస్వామ్య విధానం.

**కొన్ని రాష్ట్రాలలో కౌలు విధానం, పెట్టుబడిదారీ విధానంలో భాగం. అక్కడ భూమి ఉన్న రైతులు, పెట్టుబడిని పెంచి పెద్ద స్థాయిలో వ్యవసాయం చేయటం ద్వారా లాభాలను పొందాలని ఆశిస్తారు. కొన్ని రాష్ట్రాలలో భూస్వామ్య పద్ధతిలో మిగులు సాధించుకునే కౌలు విధానం అమలులో ఉంది. ఇది పెట్టుబడిదారీ వ్యవస్థకు పూర్వం ఉన్న పద్ధతి.**

**9. వేతన కార్మికులు, కుటుంబ సభ్యుల శ్రమ: వీటిలో ఏది భూస్వామ్య వ్యవస్థను సూచిస్తుంది? ఏది పెట్టుబడిదారీ వ్యవస్థను సూచిస్తుంది?**

స్వయం ఉపాధి కోవకు చెందిన కార్యకలాపాలలో, వేతన రూపంలో లెక్కకట్టిన కుటుంబ శ్రమని; వర్తక; విత్త సంబంధమైన వ్యాపారాల వల్ల వచ్చే రాబడి–మూడు కలిపి ఆదాయ వనరులుగా పరిగణిస్తారు. ఇవన్నీ పెట్టుబడిదారీ సంబంధాలను ప్రతిబింబించినా వాటి స్వభావంలో ప్రాథమిక తేడాలున్నాయి. వేతనేతర రూపంలో (వస్తు రూపంలో) ఉండే ఆదాయం, చాలా సార్లు దాని మూలాధారమైన పెట్టుబడిదారీ సంబంధాలను మరుగు పరుస్తుంది.

అదే విధంగా వేతన ఆదాయం, స్వేచ్ఛారహిత శ్రమ సంబంధాలను మరుగుపరిచే అవకాశం చాలా ఉంది. జీతగాళ్ళ వ్యవస్థ (సంవత్సర కాలానికి నియమించే వ్యవసాయ కార్మిక వ్యవస్థ), పెట్టుబడిదారీ వ్యవస్థలో ఏర్పాటైన 'స్వేచ్ఛా రహిత' సంబంధాలలోనిదే, అంతకు పూర్వం ఏర్పడింది కాదు. అంతే కాక, ఒకే వ్యక్తి, ఏక కాలంలో రకరకాల ఆర్థిక కార్యకలాపాలలో పాల్గొంటూ ఉంటాడు. సూక్ష్మ స్థాయిలో వేతనం ద్వారా, వేతనేతర వనరుల ద్వారా వచ్చే ఆదాయం మధ్య తేడాను గుర్తించాల్సిన అవసరం ఉంది. ఈ కేవియట్లతో బసోలే–బసు గ్రామీణ ఆదాయ వనరులను అధ్యయనం చేయటానికి పూనుకుంటారు: ఎందుకంటే, జాతీయ స్థాయిలో వేతన, వేతనేతర ఆదాయం మధ్య ఉన్న తేడా, భారత దేశంలో ఉత్పత్తి సంబంధాలను అర్థం చేసుకోవటానికి, ఇప్పటికీ కొన్ని ముఖ్యమైన సంకేతాలను అందించగలదు.

వ్యవసాయ రంగంలో ఉన్న అధిక శాతం చిల్లర వస్తూత్పత్తిదారులు (పెటీ కమాడిటీ ప్రొడ్యూసర్స్) తమ ఆదాయాన్ని వ్యవసాయం నుండే కాక కూలి పని చేయడం ద్వారా కూడా పొందుతారు కాబట్టి, వ్యవసాయ కుటుంబాల ఆదాయ వనరులను జాగ్రత్తగా అధ్యయనం చేయటం అవసరం. దీనిలో ఏ వనరు కుటుంబ ఆదాయానికి ముఖ్యమైంది? వేతనం వల్లే ఎక్కువ ఆదాయం లభిస్తే అది శ్రామికీకరణని సూచిస్తుంది. వ్యవసాయం నుండి వచ్చే ఆదాయంపై కుటుంబం ఎక్కువగా ఆధారపడుతూ ఉంటే పరిస్థితి అస్పష్టంగా ఉంటుంది. అయితే వేతనేతర ఆదాయ వనరులు ఉన్నంత మాత్రాన పెట్టుబడిదారీ పూర్వపు సంబంధాలు ఉన్నాయని అర్థం కాదు.

**చిన్న కమతాలు అసమర్థమైనవి. వీటిపైన ఎక్కువగా ఆధారపడిన కుటుంబాలు రుణగ్రస్తతకు, దారిద్ర్యానికి గురవుతాయి**

**10. ఏది ఎక్కువ: వేతన ఆదాయమా, వ్యవసాయం వలన వచ్చే అదాయమా?**

కమతాల పరిమాణం చిన్నదవటం వలన భారత దేశంలో, వ్యవసాయం నుంచి వచ్చే ఆదాయం తక్కువగా ఉంటుంది. కౌలు రేట్లు ఎక్కువుండటం, రైతులకు అప్పిచ్చే సదుపాయాలు తక్కువగా ఉండటం, గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ పెట్టుబడులు తగ్గిపోతూ ఉండటం, సాగునీటి వసతి తగినంత లేకపోవటం, వ్యవసాయ సాధనాల మార్కెట్‌లో దోపిడి ఇవన్నీ చిన్న రైతుల ఆదాయాన్ని తగ్గిస్తాయి. మన దగ్గర ఉన్న సమాచారం ప్రకారం వ్యవసాయం ద్వారా వచ్చే సగటు లాభం, 2003 నాటికి హెక్టారుకు (కుటుంబ శ్రమను, స్వంత పొలం పైన అద్దెను మినహాయించుకోగా) ఖరీఫ్‌లో రు.6756, రబీలో రు.9290. ఇంత తక్కువ స్థాయిలో ఉన్న వ్యవసాయ ఆదాయం వల్ల గ్రామీణ ప్రాంతంలో నివసించే చాలా కుటుంబాలకు, వ్యవసాయ, వ్యవసాయేతర చిల్లర వస్తూత్పత్తి రంగాలలో కూలి చేసుకుని అనుబంధ ఆదాయం సంపాదించుకోవటం తప్పనిసరయ్యింది.

భూమి సైజును బట్టి గ్రామీణ ఆదాయాన్ని విశ్లేషిస్తే 4 హెక్టార్లకంటే ఎక్కువ సాగు భూమి ఉన్న వారు మాత్రమే తమ సగటు వ్యయం కంటే ఎక్కువ ఆదాయాన్ని సంపాదించగలుగుతున్నారు. 2003 నాటికి గ్రామీణ కుటుంబాలలో 96 శాతం మందికి 4 హెక్టార్ల కంటే తక్కువ భూమి ఉందని గుర్తు తెచ్చుకుంటే వీరందరికీ ఆదాయం వ్యవసాయం, కూలి పని, చిల్లర వస్తూత్పత్తి ఆధారంగా వస్తుందని అర్థం చేసుకోవచ్చు. అంతే కాకుండా, 2003 నాటికి, అధిక శాతం చిన్న రైతు కుటుంబాలకు, అంటే 60 శాతం మందికి, వారి ఆదాయంలో 50 శాతం కంటే ఎక్కువ కూలిపని నుండే వస్తోంది. మూడో విషయం గ్రామీణ ప్రాంతంలో 80 శాతం కుటుంబాలు తమ ఆదాయంలో 20% చిల్లర వస్తూత్పత్తి రంగం నుండే పొందుతున్నారు.

అధిక శాతం గ్రామీణ ప్రజలకి, కూలి పని ద్వారా వచ్చే వేతనమే ముఖ్యమైన ఆదాయ వనరు. అంటే వేతన కూలి వ్యవస్థ ద్వారా మిగులు సంగ్రహించటం ప్రధాన పద్ధతిగా పరిణమించింది. చిల్లర వస్తూత్పత్తి ద్వారా సంపాదించే ఆదాయం 20 శాతాన్ని మించకపోవటం, ఈ వర్గ ప్రజలను వర్తక పెట్టుబడిదార్లు అసమాన మార్పిడి విధానం ద్వారా దోపిడీ చేస్తున్నారనటానికి సూచన.

**గ్రామీణ కుటుంబాల్లో అధిక శాతానికి స్వంత భూమి కొంచెం ఉన్నప్పటికీ, కూలి పని ద్వారా వచ్చే వేతనమే తమ ఆదాయంలో 60% ప్రధాన ఆదాయ వనరు. వీరి ఆదాయంలో 20% మాత్రమే వ్యవసాయం నుండి రావటం వ్యవసాయ మార్కెట్లలోని దోపిడీని సూచిస్తుంది. మిగిలిన 20 శాతం ఆదాయం, చిన్న చిన్న కార్యకలాపాల ద్వారా వస్తుంది.**

**11. అధికార, అనధికార రుణ సౌకర్యాల్లో హెచ్చు తగ్గుల్ని ఎలా అర్థం చేసుకోవాలి?**

వడ్డీ వ్యాపారస్తుల పెట్టుబడి ఆధారంగా నడిచే నియంత్రణ లేని అనధికార రుణ మార్కెట్, మిగులు శ్రమలో అధిక వాటాని దాని ఉత్పత్తిలో ఏ ప్రమేయం లేకపోయినా గానీ స్వంతం చేసుకుంటుంది. అందువలన అది పరాన్నజీవి. అనధికార రుణం, సాధారణంగా వస్తువుల మార్కెట్, శ్రామిక మార్కెట్‌ల మధ్య ఏర్పడే దగ్గరి సంబంధాల ద్వారా పని చేస్తుంది. ఈ మార్కెట్లు అసమాన మార్పిడి ద్వారా మిగులు సంగ్రహించటంలో తోడ్పడతాయి. ఇటువంటి అసంఘటిత రుణాల బారిన పడేది సాధారణంగా చిన్న రైతాంగమే. అనియత రుణాలపైన ఆధారపడే వారి సంఖ్యలో ఏమైనా మార్పు వచ్చిందా అన్నది ఇప్పుడు చూద్దాం.

NSSO సమాచారం ప్రకారం 1961–1981 మధ్య కాలంలో మొత్తం గ్రామీణ రుణాల్లో, వడ్డీ వ్యాపారస్తుల వాటా 70 శాతం నుంచీ 18 శాతానికి తగ్గింది. ఇది చెప్పుకోదగ్గ తగ్గుదలే. అయితే, 1980లలో మళ్ళీ పరిస్థితి

మారి వీరి వాటా 28 శాతానికి పెరిగింది. భూస్వాముల స్థానాన్ని కొత్త రకం వడ్డీ వ్యాపారులు ఆక్రమించారు. గ్రామీణ జనాభాలో వర్తకులు, ఉపాధ్యాయులు, ప్రభుత్వోద్యోగులు, లాయర్లు, సంపన్న రైతులు, వంటి చిల్లర పెట్టుబడిదారీ వర్గం ఈ లాభదాయకమైన వ్యాపారంలో చేరింది. అధికార రుణ వ్యవస్థలు రంగం నుండి తప్పుకోవటం దీనికి ప్రధాన కారణం.

2003 నాటికి పంజాబ్, రాజస్థాన్, అస్సాం, బీహార్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో తప్ప, మిగిలిన వాటిలో అధికార రుణ వ్యవస్థ బలంగానే ఉంది. మరో విషయం ఏమిటంటే, పెట్టుబడిదారీ వ్యవసాయం కొంత మేరకు అభివృద్ధి చెందిన పంజాబ్, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు లాంటి రాష్ట్రాలలో అనధికార రుణ వ్యవస్థ ఎక్కువగా కనబడుతుంది. ఉదాహరణకి పంజాబ్‌లో అనధికార రుణ విపణిలో క్రియాశీలకంగా పనిచేసే వ్యక్తులలో అడ్తిదార్ అని పిలువబడే వర్తక–మధ్యవర్తి సాధారణంగా కమిషన్ కోసం పంటకవసరమైనవి అమ్మటం, ఉత్పత్తి (పంట)ని కొనుగోలు చేయటమే కాకుండ రైతుకు రుణాలు కూడ ఇస్తాడు. ఈ రకంగా అంతస్సంబంధాలు ఉన్న మార్కెట్లు, మిగులు ఉత్పత్తిని ఉత్పత్తిదారు వద్ద నుంచి నేరుగా అసమాన మార్పిడి ద్వారా సంపాదించి పంటకవసరమైన ఉత్పాదకాల ధరలను పెంచి, ఉత్పత్తి ధరను అణచివేయటానికి తోడ్పడతాయి. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే ఒకప్పుడు కొంత మేరకు భూ సంస్కరణలు చేయగలిగిన పశ్చిమ బెంగాల్‌లో కూడ, అనధికారిక గ్రామీణ రుణ మార్కెట్ ఎక్కువగా కనబడుతుంది.

**అధికార రుణ మార్కెట్‌లో చెప్పుకోదగ్గ ప్రగతి కనిపిస్తోంది. ఇది వ్యవసాయ రంగ పెట్టుబడిలో 70 శాతం మేరకు సమకూరుస్తోంది. ఇందులో అత్యధికంగా పెద్ద, మధ్యమ తరగతి రైతులకు చెందుతుండగా, చిన్న రైతులు అనధికార వడ్డీ వ్యాపారస్థులపైన ఆధారపడుతున్నారు.**

### 12. వ్యవసాయ రంగంలో పెట్టుబడి:

భారతదేశ వ్యవసాయ రంగంలో పెట్టుబడిదారీ ఉత్పత్తి సంబంధాలు వృద్ధి చెందాయా, లేదా అనే ప్రశ్నకు సంబంధించి రెండు ముఖ్యమైన అంశాలు: వ్యవసాయ రంగంలో చెప్పుకోదగ్గ స్థాయిలో మూలధనం తిరిగి పెట్టుబడిగా వెళుతోందా; మూలధనం ఈ రంగం నుండి సమకూరుతోందా అన్నవి ఇప్పుడు చూద్దాం. పెట్టుబడి సమకూరట్లేదంటే ఈ ఉత్పత్తి సంబంధాలు ఉత్పత్తి శక్తుల వృద్ధికి నిరోధకంగా ఉన్నాయన్నమాట. జాతీయ స్థాయిలో వ్యవసాయ రంగంలో పెట్టుబడి ఏర్పడ్డానికి సంబంధించిన సమాచారం చూస్తే ఆసక్తికరమైన ధోరణులు గమనించవచ్చు. 1961, 1991ల మధ్య నాలుగు దశాబ్దాల కాలంలో సమకూరిన పెట్టుబడుల స్థూల విలువ అసలు ధరలని బట్టిచూస్తే మూడు రెట్లు పెరిగింది. 1961లో రు.63.000 కోట్ల నుంచి 1999 నాటికి రు.1,90,000 కు పెరిగింది.

1961–99 మధ్య కాలంలో వ్యవసాయ రంగంలో స్థూలంగా మూల ధనం సంవత్సరానికి 3 శాతం చొప్పున పెరిగింది. ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాలతో పోలిస్తే ఇది చెప్పుకోదగ్గ పెరుగుదల. 1960 దశకంలో ఇది 5.05 శాతం చొప్పున, 1970లలో 8.7 శాతం చొప్పున పెరిగి, ఆ తరువాత 1990లలో ఇది క్రమేణా సంవత్సరానికి 0.33 శాతం తగ్గటం మొదలు పెట్టింది. తరువాత 2.8 శాతం చొప్పున పెరిగింది. ఈ తగ్గుదల చాలా వరకు వ్యవసాయ రంగంలో ప్రభుత్వ వ్యయం తగ్గటం వలన జరిగింది. అయితే 1993 తరువాతి కాలంలో ప్రైవేటు రంగ వ్యయం, 16.7 శాతం చొప్పున పెరిగింది (గులాటి, బాత్‌లా 2002). ఈ సమాచారం మనకు రెండు విషయాలను సూచిస్తుంది. 1970,80లలో వ్యవసాయ రంగంలో మూలధన నిర్మాణం, ప్రభుత్వ వ్యయం ద్వారా చెప్పుకోదగ్గ స్థాయిలో పెరిగింది. ఆర్థిక సంస్కరణల అనంతరం తగ్గిన ప్రభుత్వ వ్యయాన్ని, వ్యవసాయ రంగంలో పెరిగిన ప్రైవేటు రంగ వ్యయం పూడ్చటమే కాకుండా అంతకంటే ఎక్కువగానే తోడ్పడింది.

**1970–90లలో, వ్యవసాయ రంగంలో చెప్పుకోదగ్గ మూలధన పెంపు జరిగి, వృద్ధి రేటుని 2.7 శాతానికి పెంచి దీర్ఘకాలికంగా వ్యవసాయ ఉత్పత్తుల పెరుగుదలకు తోడ్పడింది. తొలుత ప్రధానంగా ప్రభుత్వ రంగ వ్యయం జరిగినప్పటికీ 1991 తర్వాత పెట్టుబడి ప్రైవేటు రంగం నుంచి వచ్చింది.**


గత కొద్ది దశాబ్దాల కాలంలో భారతదేశ వ్యవసాయ ఆర్థిక వ్యవస్థలో ఉత్పత్తి సంబంధాలు క్రమేణా, పాక్షిక భూస్వామ్య వ్యవస్థ నుంచి, పెట్టుబడిదారీ వ్యవస్థకు పరిణామం చెందాయి. మిగులు రాబట్టుకోవటం ప్రబలంగా పెట్టుబడిదారీ విధానానికి గీటురాయి అయిన వేతనశ్రమ వ్యవస్థ ద్వారా జరుగుతోంది. ప్రపంచ స్థాయి పెట్టుబడిదారీ – సామ్రాజ్యవాద వ్యవస్థతో అనుసంధానించబడిన హద్దుల్లోని పెట్టుబడిదారీ వ్యవస్థ పెరుగుదల, అత్యధికంగా ఉండే గ్రామీణ ప్రజల ఆదాయం, జీవన ప్రమాణాలు మెరుగుపడటానికి దారితీయలేదు. ఉత్పత్తిదారుల నుండి ప్రధానంగా రెండు పద్ధతులలో మిగులు రాబడుతున్నట్టు కనిపిస్తోంది. 1. వేతన శ్రమ వ్యవస్థ ద్వారా 2. చిల్లర వస్తూత్పత్తిదార్ల నుండి అంతస్సంబంధాలున్న గుత్తాధిపత్య వ్యవస్థలు, మార్కెట్లు అసమాన వినిమయ విలువ ద్వారా, భారత దేశ ఆర్థిక వ్యవస్థ ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థతో సంబంధాలు ఏర్పరుచుకునే సుదీర్ఘ ప్రక్రియలో వర్గ భేదాలు బలహీనపడ్డాయి. ఈ పరిణామం అసంఘటిత వ్యవసాయ, వ్యవసాయేతర రంగాలలో, చిల్లర వస్తూత్పత్తి రంగాన్ని స్థిరీకరిస్తోంది. ఈ వర్గ ప్రాబల్యం శ్రామిక చైతన్య అభివృద్ధిని అడ్డుకుని, విప్లవ రాజకీయాల వృద్ధిని మరింత క్లిష్టతరం చేస్తోంది.

**మూలం:**

అమిత్ బలోసే, దీపాంకర్ బసు రాసిన 'రిలేషన్స్ ఆఫ్ ప్రొడక్షన్ అండ్ మోడ్స్ ఆఫ్ సర్‌ప్లస్ ఎక్స్ట్రాక్షన్ ఇన్ ఇండియా: పార్ట్ 1 అగ్రికల్చర్' ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీ, వా.46, నెం.14, ఏప్రిల్ 2001 చూడండి.


**అనువాదం: పి.మాధవి**

**సంక్షిప్తీకరణ: ఆర్.వి.రమణమూర్తి**



Anveshi
RESEARCH CENTRE FOR WOMEN'S STUDIES
సమకాలీన రాజకీయాలపై బ్రాడ్‌షీట్
నిజాం పరిపాలన, ముస్లింలు
హైదరాబాద్ 'విమోచన' గురించి నిజాలు, కట్టుకథలు
సంచిక : 1(త్రైమాసికం) తెలుగు & ఇంగ్లీష్ నవంబర్ 2010 విరాళం : 10 రూ.
విషయసూచిక
- ఎడిటోరియల్
- చరిత్ర, నిశ్శబ్దాలు ఎమ్.ఎ.మోయిద్
- నా శవ పేటికపై ఉత్సవాలా! ఎం.ఎ.మాజిద్
- హైదరాబాద్‌పై ఒక ముస్లిం దృక్కోణం హసనుద్దీన్ అహ్మద్
- ఆత్మ గౌరవాన్ని దెబ్బకొట్టవద్దు రఫత్‌సీమా, కనీజ్ ఫాతిమా
- అర్థసత్యాలు, అపోహలు దివికుమార్
- నిజాలను నీరు గార్చే ప్రయత్నం శ్రీనివాస్ ఏశాల
- 'ఒకే నిజాం': రెండు స్ఫురణలు ఆర్. శ్రీవత్సన్

H.E.H. Mir Osman Ali Khan
Nizam of Hyderabad

సంపాదకులు: ఎమ్.ఎ.మోయిద్, ఎ. సునీత, ఆర్. శ్రీవత్సన్
కనీజ్ ఫాతిమా, ఎమ్.ఎ.మోయిద్, ఆర్.శ్రీవత్సన్ (ఇంగ్లీష్), ఎ. శ్రీనివాస్, ఎ. సునీత (తెలుగు)
శీలా ప్రసాద్, అయేషా ఫరూకీ, రమ మెల్కోటె, కె. సజయ, పి.మాధవి, బి.శ్యామసుందరి, సూశీ థారు, వీణా శత్రుఘ్న, డి. వసంత, కె.లలిత, ఎన్. వసుధ, గోగు శ్యామల, వి. ఉష
ఏ. శ్రీనివాస్, టి. శ్రీలక్ష్మి
2-2-18/49, దుర్గాబాయి దేశ్‌ముఖ్ కాలనీ, అంబర్‌పేట్, హైదరాబాదు -500013.


Anveshi
RESEARCH CENTRE FOR WOMEN'S STUDIES
సమకాలీన రాజకీయాలపై బ్రాడ్‌షీట్
కులం, జనగణన, ప్రజాస్వామ్యం
భిన్న దృక్పథాలు
సంచిక : 2(త్రైమాసికం) తెలుగు & ఇంగ్లీష్ జూన్ 2011 విరాళం : 10 రూ.
విషయసూచిక
- సంపాదకీయం
- కులం లెక్క తేల్చాల్సిందే దుర్గం సుబ్బారావు
- జనగణనలో కులాల్ని లెక్కిస్తే భారత దేశం కుల సమాజంగా మారిపోతుందా ? కె.సత్యనారాయణ
- బాక్స్ ఐటమ్‌లలోని సమాచారం వివరణలను అందించినవారు కె.వై. రత్నం, తెలుగుఅనువాదం : కె. సజయ
- కుల ప్రాతిపదికపైన జనాభా లెక్కింపు–రాజ్యాంగం రీత్యా అవసరం రవివర్మ కుమార్
- కులం, జనగణన: ముందు చూపుతో ఆలోచిద్దాం! సోనాల్దే దేశాయి
- జనాభా లెక్కలలో కులగణన ఎందుకుండకూడదు? వి.కె.నటరాజ్
- కుల జనగణనను వద్దంటున్న వారి రాజకీయాలు సతీష్ దేశ్‌పాండే, మేరీజాన్

ప్రత్యేక సంపాదకులు : ప్రొ॥జి.కృష్ణారెడ్డి, డా॥కె.వై.రత్నం, ప్రొ॥చెన్న బసవయ్య
సంపాదకులు: ఎ. సునీత, ఆర్. శ్రీవత్సన్, ఎమ్.ఎ.మోయిద్
అడ్వయిజరీ బోర్డ్: శీలా ప్రసాద్, అయేషా ఫరూకీ, రమా మేల్కొటే, కె.సజయ, పి.మాధవి, బి.శ్యామసుందరి, సూశీ థారు, వీణా శత్రుఘ్న, డి.వసంత, కె.లలిత, ఎన్.వసుధ, గోగు శ్యామల, ఉమ భృగుబంద, వి.ఉష.
ప్రొడక్షన్: ఏశాల శ్రీనివాస్, తాడేపల్లి శ్రీలక్ష్మి
ప్రచురణ సంస్థ : అన్వేషి రిసెర్చ్ సెంటర్ ఫర్ ఉమెన్స్ స్టడీస్, 2-2-18/49, దుర్గాబాయి దేశ్‌ముఖ్ కాలనీ, అంబర్‌పేట్, హైదరాబాదు -500013.
వ్యాసాలలోని సమాచారం, దృక్పథాలు, అభిప్రాయాలు, వ్యాసకర్తలవి, ప్రత్యేక సంపాదకులవి
ఫోటో : అనుపమ్ నాథ్ / ఎ.పి., గార్డియన్, యు.కె., 11-2010-జూన్, సౌజన్యంతో.

# తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ గ్రామాల్లో సమకాలీన వ్యవసాయ పరిస్థితులు

■ ఆర్.వి.రమణమూర్తి

2014 దాకా ఒకే రాష్ట్రంగా ఉండి, విడిపోయిన తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల్లోని వ్యవసాయ పరిస్థితులు చెప్పుకోదగ్గ మార్పులకే గురయ్యాయి. దీనిని నిర్ధారిస్తూ క్షేత్రస్థాయి పరిశోధనలు ఇప్పడికి చాలా వచ్చాయి కూడా. ఉదాహరణకు, 1988లో కెరోల్ ఉపాధ్యాయ, 1984లో కె.వి.కృష్ణారావు, 2008లో సి.ఎన్.రావు మరియు డి.నరసింహారెడ్డి, 2009లో రామచంద్రన్ ప్రభృతులు, 2013లో విద్యాసాగర్ ల రచనలు జరిగిన పరిణామంపై నిశితమైన పరిశీలనలు అందించారు. పరిశోధకుల మధ్య మొత్తంగా వ్యవసాయంలో బలపడిన పెట్టుబడిదారి సంబంధాల మీద ఒక అంగీకారం వ్యక్తమయితోందనే చెప్పాలి. కొందరు బహిరంగంగానే చెప్తే, కొంత మంది అంతర్లీనంగా ఈ విషయాన్ని చెపుతున్నారు.

జాతీయ స్థాయిలో వ్యవసాయంపై, రైతాంగ పరిస్థితులపై సమగ్రమైన ప్రభుత్వ సమాచారం లేకపోవడం వల్ల, సూక్షస్థాయి పరిశోధనలు చాలానే అవసరం. ఈ ఉద్దేశ్యంతోనే ఆంధ్ర, తెలంగాణ, రాయలసీమ ప్రాంతాల్లోని ఏడు గ్రామాలలో, ఒక వెయ్యికి పైగా రైతు కుటుంబాల నుండి సమాచారం సేకరించి, విశ్లేషించిన  పరిశోధన ఆధారంగా చేసిన పరిశీలనలను, నిర్ధారణలను ఈ వ్యాసంలో క్లుప్తంగా ప్రస్తావిస్తాను. జాతీయ స్థాయిలో ఎన్ఎస్ఎస్ సమాచారం సహాయంతో, బసోలే-బసు రాసిన వ్యాసంలో, భారతదేశంలోని రైతాంగ వ్యవస్థ, ఉత్పత్తి, కమతాలు, ఋణాలు, కౌలు, పెట్టుబడి, కూలీ సంబంధాల గురించి చేసిన విశ్లేషణ చూశాము. వారు శ్రామికుల దోపిడి ద్వారానే వ్యవసాయంలో మిగులు పోగుబడి ప్రధానంగా జరుగుతోందని, ఇది పెట్టుబడిదారి సంబంధాలకు ప్రతీక అని నిర్ధారించడమూ చూశాము. ఈ వ్యాసంలో ఈ అంశాలకు అదనంగా, రైతులు వ్యవసాయం నుండి సగటున పొందుతున్న ఆదాయం, పని విస్తరణ, ప్రభుత్వం నుండి పొందుతున్న సంక్షేమం కూడా పరిశీలించడం జరిగింది. క్షేత్రస్థాయి పరిశోదన 2013 సంవత్సరంలో జరిగింది. పరిశోధన ద్వారా చేసిన ముఖ్యమైన నిర్ధారణలు ఈ కింద ప్రస్తావిద్దాం.

పరిశోధనలో చూసిన భూయాజమాన్యానికి సంబంధించిన విషయం ఏమిటంటే గ్రామీణ 95 శాతం కుటుంబాలు ఏదో మేరకు భూమి కలిగి ఉన్నాయి. కానీ 40 సెంట్లు కంటే తక్కువ భూమి ఉన్న వారిని కూడా భూమిలేని కూలీలుగా పరిగణిస్తే, ఆచరణాత్మకంగా భూమిలేని వారు 25 శాతంగా ఉన్నారు. భూమి ఉన్న రైతుల్లో, 46 శాతం రెండు లేక ఎకరాలు గానీ తక్కువ గాని ఉన్న వాళ్ళుగా, 20 శాతం 25 నుండి 5 ఎకరాలు ఉన్న చిన్న కారు రైతులుగా, 19 శాతం అర్థ-మధ్య (5-10 ఎకరాలు) రైతులుగా, 13 శాతం మధ్య స్థాయి రైతులుగా (అంటే 10-20 ఎకరాల మధ్య) మరియు 2 శాతం పెద్ద రైతులు (అంటే 20 లేదా ఎక్కువ ఎకరాలు గల)గా గుర్తించాము. వీరిలో కుటుంబ శ్రమను, వేతన శ్రమను నమ్ముకున్న చిన్నసరుకు ఉత్పత్తిదారులు 85 శాతం. వేతన శ్రమను దోపిడి చేస్తూ, లాభం కోసం వ్యవసాయం చేయగల స్పష్టమైన పెట్టుబడి దారి రైతులు 15 శాతం. అయినప్పటికీ, 85 శాతం రైతులు మార్కెట్లకు అతీతంగా బతికే వ్యవస్థలో లేరు. మార్కెట్ల ఆధారంగా వారి శ్రమను పరోక్షంగా అమ్ముకునే పెట్టుబడి సంబంధాల్లోకి (Formal subsumption) వచ్చారని నేను భావిస్తున్నాను దానికి ఆధారం: వీళ్ళు చేసిన ఉత్పత్తిలో మార్కెట్‌కు తరలించిన అత్యధిక భాగం, అలాగే ద్రవ్య వ్యవస్థపై, కొనుగోలు వ్యవస్థపై పూర్తిగా ఆధారపడ్డ వారి ఉత్పత్తి విధానం.

పెట్టుబడిదారి పెద్ద రైతులు, అల్ప సరుకు ఉత్పత్తిదారులైన చిన్న రైతుల మధ్య పెరుగుతున్న వర్గ భేదాన్ని కూడా ఈ పరిశోధన పరిశీలించింది. పెట్టుబడిదారి విధానంలో పెద్ద రైతు, చిన్న రైతు మధ్య పెరిగే వర్గ భేదం (class differenciation) గురించి కౌట్స్కి ప్రస్తావించిన వివరణ స్పష్టంగా ఈ గ్రామాల్లో కనబడుతుంది. కమతాలు పై నుండి ఆస్తి పంపకాల మూలంగా ముక్కలై రోజు రోజుకూ సగటు కమతాల పరిమాణం క్షీణిస్తోంది. క్రింది స్థాయిలో, ఇది వరకు భూమిలేని వారు వారి వేతన ఆదాయం ద్వారా కష్టపడి కూడబెట్టిన సొమ్ముల్తో చిన్న కమతాలను కూడా కొనుక్కుంటున్నారు. దరిమిలా సన్న-చిన్నకారు రైతుల సంఖ్య, శాతం యేటా పెరుగుతూ వస్తోంది. పైనుండి మధ్య, పెద్ద రైతులు క్రమేణా తమ భూమిని మెల్లిగా అమ్ముకుంటూ పట్టణ దారి పడుతున్నారు. ఈ క్రమంలో గ్రామాల్లో వ్యవసాయం సన్న చిన్నకారు రైతుల చేతుల్లో కేంద్రీకృతమవుతోంది. వ్యవసాయంలో ఉన్న ప్రత్యేక ఉత్పత్తి పరిస్థితుల మూలాన సాగుబడి చిన్న తరహా ఉత్పత్తిదారులు చేతికిచ్చి; అందులో ఉన్న నష్టదాయక అంశాలను రైతు మీదికి వదలి, మిగులును వివిధ రూపాల్లో వారి నించి పీల్చే వ్యవస్థగా రూపుదిద్దుకుందని పరిశోధనలో గమనించాము.

కోస్తా గ్రామాల్లో భూమిలేని కూలీల సంఖ్య ఎక్కువ కానీ, తెలంగాణ-రాయలసీమ గ్రామాల్లో చిన్న కమతాలైనా ఎక్కువమంది భూమి కలిగి ఉండడం గమనించిన విషయం. బోరు బావుల ద్వారా ఇది వరకటి వర్షాధార ప్రాంతాల్లో కూడా రెండవ పంట పండించే వెసులుబాటు వచ్చింది. పత్తి, మిరప, జొన్న, కందులు లాంటి మెట్ట పంటల కింద భూమి శాతం పెరిగింది. వ్యవసాయానికి ట్రాక్టర్లు, రోటోవేటర్లు, టిల్లర్లు, స్ప్రేయర్లు, హార్వెస్టర్లు విరివిగా వాడుతున్నారు. బాడుగకు తీసుకునే వెసులుబాటు వల్ల, వేతన ఖర్చుని తగ్గించుకుని, చిన్న రైతులు కూడా ఏదో మేరకు, లాభం స్వల్పమే అయినా కూలీ మీద కాస్త గిట్టుబాటు అయ్యే అవకాశం ఉండడం వల్ల ఈ తరహా వ్యవసాయం చేస్తున్నారు.

ఈ మధ్య కాలంలో కౌలు వ్యవసాయం కూడా ఇబ్బడి ముబ్బడిగా పెరిగింది. కోస్తా గ్రామాల్లో కౌలు వ్యవసాయం 60-80 శాతం దాకా ఉంటే, తెలంగాణ-రాయలసీమ గ్రామాల్లో 15-40 శాతం దాకా ఉంది. ఒక్క గ్రామం మినహాయించి, అన్ని గ్రామాల్లో స్థిరమైన డబ్బు రూపంలో కౌలు ఎక్కువగా ఉంది. వరి సాగులో మాత్రం ధాన్యరూపేణా కౌలు విధానం ఉంది. డబ్బయితే, మెరక పొలంలో 10 నుండి 15 వేల రూపాయలు కౌలు ఉండగా, తరి పొలంలో కౌలు 25 బస్తాలుగా సగటున ఉంది. ఇది మొత్తం ఉత్పత్తిలో 45 శాతంగా ఉంటోంది. పెట్టుబడి ఖర్చుపోతే, కౌలు రైతుకు మిగిలేది చాలా తక్కువ. పశు వులకు గడ్డి, లేదా కాస్త సమయానికి, కాస్త డబ్బు కోసం చిన్న రైతులు కౌలుకు తీసుకుంటున్నారు. కౌలు మార్కెట్లలో సప్లై-డిమాండ్ ఆధారంగానే కౌలు నిర్ధారణ జరుగుతోంది. సన్నకారు కౌలు రైతులు ఎక్కువ సంఖ్యలో ఉండి అందుబాటులో  ఉన్న భూమి తక్కువగా ఉండడటం మూలానే భూస్వామి భూములకి కౌలు రేటు అధికంగా ఉండడం జరుగుతోంది. అంతేకానీ కౌలుదారుని గ్రామానికి కట్టిపడేసే బలవంతపు కౌలు కనిపించడం కద్దు. కాబట్టి ఇది బసోలే-బసు చెప్పినట్లు, పెట్టుబడిదారి కౌలు విధానమే కానీ భూస్వామ్య కౌలుగా చెప్పడం సరికాదని నా అభిప్రాయం. అయితే బసొలే-బసు 2003 నాటికి జాతీయ స్థాయిలో కౌలు వ్యవసాయం ఎక్కువగా ఉందని చెప్పడానికి ఆధారాలు లేవని చెప్పడం చూశాము. నా గణాంకాలు 2013 సంబంధించినవి కాబట్టి పరిస్థితిలో మార్పు అయి వుండవచ్చు. ఎన్ఎస్ఎస్ డేటాలో కౌలు వ్యవసాయం నమోదు కూడా సరిగ్గా అవకపోవడం కావచ్చు.

సన్నకారు చిన్నకారు రైతులు ఉత్పత్తిలో మూడవ వంతు గృహవినియోగానికి ఉంచుకుని రెండు వంతులు మార్కెట్లో అమ్ముకుంటున్నారు. ఇక మధ్య, పెద్ద రైతులు 90 శాతం ఉత్పత్తిని మార్కెట్లో అమ్ముకుంటున్నారు. వాణిజ్య పంటల్లో ఎలాగూ 100 శాతం మార్కెట్ కోసమే ఉత్పత్తి చేయడం జరుగుతుంది. కాబట్టి సాధారణ సరుకు ఉత్పత్తి, గ్రామీణ వ్యవస్థలో ప్రధానమైన పద్ధతిగా ఉండడం గమనించాల్సిన విషయం. రైతులకు డబ్బు అవసరం పెరగడం వల్ల వాణిజ్య

పంటలకు విస్తరించడం, మార్కెట్ మిగులును ఉత్పత్తి చేయడం విస్తృతంగా చూస్తాం. పెట్టుబడులు విరివిగా పెరుగుతున్నాయి. బోరు బావులు, పైపులు, స్ప్రేయర్లు, రీడర్లు లాంటి ఉపకరణాల మీద పెట్టుబడి చాలా పెరిగింది. సగటున ఎకరాకు లక్షన్నర రూపాయలు రైతులు ఖర్చు పెడుతున్నారు. బ్యాంకుల నుండే ఎకరాకు పదిహేనువేల రూపాయలు పంటకు తీసుకుంటున్నారు. ఇది కాక 48 శాతం అప్పు వ్యవసాయ అవసరాలకే వడ్డీ వ్యాపారుల నుంచి కూడా తీసుకుంటున్నారు. చిన్న రైతులు ఎక్కువగా ప్రైవేటు ఋణాల మీద ఆధారపడుతున్నారు. బ్యాంకు ఋణాలు అధిక శాతం పెద్ద–మధ్య రైతులే పొందుతున్నారు. కౌలు రైతులకు బ్యాంక్ ఋణాలు అసలు అందనే అందట్లేదు. రైతుల సామాజిక ఖర్చులు కూడా ఇబ్బడి ముబ్బడిగా పెరిగి పోయాయి. పెళ్ళిళ్ళకు, పండుగలకు, ఆసుపత్రులకు, ప్రైవేటు విద్యకు ఖర్చు పెరిగి అప్పులు చేయడం జరుగుతోంది. దరిమిలా చిన్న రైతుల సగటు అప్పు, పెద్ద రైతుల కంటే ఎక్కువగా ఉంది.

వ్యవసాయం లాభసాటిగా ఉన్నదా అన్న విషయానికొస్తే, 9 పంటలను పరిశీలించగా చేతి ఖర్చుల మీద మాత్రమే లాభం కనబడింది. మొత్తం ఖర్చు తీసుకుంటే (దీర్ఘకాల, స్థిర వ్యయాలు పరిగణనలోకి తీసుకున్న తర్వాత) పసుపు లాంటి పంటని మినహాయిస్తే, ఎనిమిది పంటల్లో ఎకరాకు రూ.500 నుండి రూ.5000 దాకా నష్టమే కనిపించింది. సొంత భూమిలో వ్యవసాయం చేసుకునే మధ్య, పెద్ద రైతులకు మాత్రమే లాభం కనిపించింది. వాణిజ్య పంటలు వేసే రైతుకు సగటున సంవత్సరానికి ఎకరాకి పది వేలు, వరికి పన్నెండు వేలు ఆదాయం కనిపించింది. దీనికన్నా పొలాన్ని కౌలుకిస్తే, ఖచ్చితంగా కాస్త ఎక్కువే వస్తుంది. స్వంతగా చేస్తే పంట నష్టం కావచ్చు. అందుకే భూ యజమానులు కౌలుకు ఇవ్వ జూపుతున్నారు. కౌలు రైతుకు మాత్రం ఎకరాకు రెండు మూడు వేలకు మినహా స్థిరమైన ఆదాయం కష్టమే. అందుకే 5–7 ఎకరాలు కౌలు సైజు పెంచుకుంటున్నారు రైతులు. కానీ దానిలో రిస్క్ కూడా అంతే ఎత్తున పెరిగి, పంట మొత్తం పోతే ఆత్మహత్యే శరణ్యమవుతుంది. దరిమిలా రైతులకు, ముఖ్యంగా చిన్న రైతులకు వ్యవసాయం నుండి వచ్చే ఆదాయం సరిపోక, కూలీపనులకో చిరు వ్యాపారాలకో తరలుతున్నారు. మధ్య పెద్ద రైతులు కూడా సాలీనా మూడు లక్షల సగటు ఆదాయం పొందుతున్నారు. వారి సామాజిక స్థాయి బట్టి ఉద్యోగాల్లోకి, వ్యాపారాల్లోకి వలసపోతున్నారు. వ్యవసాయం మొత్తంగా లాభసాటి తనాన్ని కోల్పోవడం ఒకెత్తయితే, చిన్న రైతులకూ, కౌలు రైతులకూ నష్టాలు అప్పులూ మిగులుతున్నాయి. చిన్నరైతులు కుటుంబం అంతా కలిసి సాలీనా ఓ లక్ష రూపాయలు సంపాయిస్తే, 55 శాతం వ్యవసాయేతర రంగాల్లో కూలీపనులు, ఇతర పనుల సాయంతో సంపాయించుకుంటున్నారు. అల్ప సరుకు ఉత్పత్తిదారుల వ్యవసాయ ఆదాయం వారి స్థూల ఆదాయంలో సగానికి పడిపోయింది. కాబట్టి వారు వ్యవసాయం నుండి పాక్షికంగా కానీ, అవకాశం ఒస్తే పూర్తిగా నిష్క్రమించడానికి రంగం తయారవుతోంది. 2001–11 కాలంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 13 లక్షల రైతులు వ్యవసాయం వదిలి పోయారని అధికార గణాంకాలు తెలియచేస్తున్నాయి. సంఖ్యరీత్యా రైతులు తగ్గడం గత దశాబ్దంలోనే మొదటిసారిగా జరిగింది.

మరొక ఆందోళన కలిగించే అంశం వ్యవసాయంలో తరుగుతున్న పనిదినాలు. ఈ రోజు సగటున ఒక పురుషుడికి సొంత కమతాల్లో 10 నుంచి 20 రోజులు మాత్రమే పనిదొరుకుతుండగా, మహిళా రైతు–కూలీలు 20 నుండి 50 రోజులు పని చేసుకుంటున్నారు. బయట వేతన కూలీగా పురుషుడికి 73 రోజులు, స్త్రీకి 103 రోజులు పని దొరుకుతుంది. మొత్తంగా పురుషులకి 93 రోజులు, స్త్రీలకి 150 రోజులు మాత్రమే వ్యవసాయంలలో సగటున దొరికే పనిదినాలు. అంటే 3 నుండి 5 నెలలు! తప్పనిసరిగా వ్యవసాయేతర రంగంలో ఉపాధి వెతుక్కోవడం అనివార్యం అవుతుంది. గ్రామీణ ప్రాంతాల్లో రైతుకూలీలు వ్యవసాయేతర శ్రామికులుగా పాక్షికంగా పరిణామం చెందుతున్నారన్నది కనిపిస్తున్న వాస్తవం.

పరిశోధనా గ్రామాల్లో కూలీరేటు మామూలుగా 220–250 రూపాయలు పురుషుడికి, 175–225 రూపాయలు స్త్రీకి సగటున ఉంటోంది. సీజన్‌లో పురుషులకి 300–350 రూపాయలుగానూ, 200–300 రూపాయలు **మహిళా** కూలీకి గిట్టుతోంది. కూలీరేటు అనేది దశాబ్ద కాలంలో బాగా పెరిగి, దరిమిలా యాంత్రీకరణ జరుగుతోందని రైతులే చెపుతున్నారు. హార్వెస్టర్లు ఉదాహరణకు కోత పని ఖర్చును 4–6 వేల ఊపాయల దాకా తగ్గించాయి. పనిదినాలు కనీసం 30–40 రోజులు కోల్పోవడమూ జరిగింది. బహుశా ప్రభుత్వం ఈ విపత్తు నుండి కాపాడడానికే అన్నట్టు మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం 2007లో మొదలు పెట్టింది. దీని కింద 45–80 రోజులు సాలీనా ఒక కులుంబానికి ఉపాధి అందుతోంది. ఇది కొంత ఉపశమనంగా ఉందని స్పష్టంగా కనిపించింది. కానీ వ్యవసాయంలో 80 రోజుల నుండి పనిదినాలు తగ్గాయి. భవిష్యత్తులో ఉపాధి హామీ పథకమే పూర్తిగా దిక్కయే అవకాశం ఉంది.

ఆదాయం విషయానికొస్తే, సాలీనా సగటు రైతాంగ కుటుంబం స్థూల ఆదాయం, రూ.1.15 లక్ష భూమి లేని కూలీకి, రూ.1.07 లక్ష సన్నకారు రైతుకు, రూ.1.25 లక్షలు చిన్నకారు రైతుకు, రూ.1.67 చిన్న మధ్య రైతుకు, రూ.2 లక్షలు మధ్య రైతుకు మరియు రూ.3 లక్షలు పెద్దరైతు కుటుంబానికి గిట్టుతోంది. ఇందులో వ్యవసాయం నుండి 55 శాతం, వ్యవసాయేతర పనుల ముడి 45 శాతం వస్తోంది. అధికారిక దారిద్ర్య రేఖ కంటే కింద ఉన్నవారు 10 శాతం ఉన్నట్టు కనిపించినా, అంతర్జాతీయంగా ప్రమాణంగా ఉన్న రోజుకు రెండు డాలర్ల దారిద్ర్య రేఖను పరిగణలోకి తీసుకుంటే 75 శాతం నిరు పేదవారే.

ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఏదో విధంగా 90 శాతం కుటుంబాలను తాకుతున్నాయి. ఒక ఐదు ముఖ్యమైన పథకాలు, అనగా, ఉపాధిహామీ, పెన్షన్లు, రేషన్ బియ్యం, మధ్యాహ్న భోజన పథకం, స్కాలర్‌షిప్పులు, ఆరోగ్య శ్రీ పథకాల ద్వారా సగటున ఒక గ్రామీణ కుటుంబానికి అందే సంక్షేమ ఆదాయం రూ.19 వేలు. ఇది భూమిలేని నిరుపేదలకు రూ. 25 వేలదాకా అందుతోంది. ఇది కార్ల్ పోలానీ చెప్పినట్టు పెట్టుబడిదారి విధానంలో పెరిగే దారిద్ర్యాన్ని తట్టుకోవడం కోసం ఉదారవాద ప్రభుత్వాలు 'ద్వంద్వ చలనం' (Double movement) ద్వారా పేదవారికి ఊరట కల్పించడంగానూ, సన్యాల్–చటర్జీ చెప్పినట్టు 'ప్రభుత్వతత్వం'గా (Governmentality) ఏ దిక్కూలేని 'అపార సమాజానికి' (Political Society) బిస్కట్ ముక్కలు అందిస్తూ రాజకీయ నాయకత్వం 'ప్రజామోదం' పొందే అధికార పునరుత్పత్తి ప్రక్రియగా అర్థం చేసుకోవచ్చు.

**ముగింపు :**

ఈ పరిశోధనలో గ్రామీణ ప్రాంతంలో స్థిరంగా పాతుకున్న సాధారీకరణ చెందిన సరుకు ఉత్పత్తి, వేతన శ్రమ, మార్కెట్ కోసం మిగులు ఉత్పత్తి, పంటల వైవిధ్యత, డబ్బు మార్పిడి, పెట్టుబడి, యాంత్రీకరణ, కౌలు మార్కెట్లు, వ్యవసాయ బజార్లు, పెరిగిన వ్యాపార ధోరణులన్నీ పెట్టుబడి సంబంధాల స్థాపనకే సూచిస్తున్నాయి. మారిన సంబంధాలలో వచ్చిన కష్టాల్ని, పేదరికాన్ని, గూండాయిజాన్ని, ఇతర ధోరణులను పెట్టుబడి పూర్వ అర్థ భూస్వామ్యం అనడం కనిపించే నిజాన్ని బేఖాతర్ చేయడమే. చిన్న కమతాలు, పెరిగే రైతుల అప్పులు, తరిగే లాభాలు, శ్రామికీకరణ విషయాలపై కౌట్స్కీ చెప్పిన విశ్లేషణ ఈ రోజు మనకు సరిగ్గా సరిపోతుంది. అల్ప సరుకు ఉత్పత్తిదారులు పాశ్చాత్య దేశాల్లోనే వలసవాద కాలంలోకూడా పూర్తిగా నశించిపోలేదు. సమకాలీన పెట్టుబడి విధానంలో, వ్యవసాయేతర రంగం సంకేతికంగా అత్యాధునికంగా, యాంత్రీకరణ దిశలో పెరిగిన పరిస్థితుల్లో, వ్యవయసాయంలోని మిగులు శ్రామికులను పూర్తిగా తనలో లీనం చేసుకోదు. దీన్ని కల్యాన్ సన్యాల్, బెర్న్‌స్టీన్, లోధీ–కేలు తమ రచనలలో చాలా బాగా చెప్పారు. నా పరిశోధన బసోలె–బాసు, విద్యాసాగర్‌ల దృక్పథంతో నిర్ధారణలతో పూర్తిగా ఏకీభవిస్తోంది. పెట్టుబడిదారి విధానంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా దోపిడి చేసే వ్యవస్థలో సమస్త ఉత్పత్తిదారులు భాగమయి, ఉత్పత్తి సామాజీకరణ చెందింది. ఈ సంపుటిలో చిన్న రైతులు మార్కెట్ పోటికి దీర్ఘకాలంలో విలువ నిలువజాలరని ఎంగెల్స్ రాసిన వ్యాసం సందేశం కూడా వామపక్షవాదులు సీరియస్‌గా తీసుకోవాలి. శ్రామికీకరణలో భాగంగా పెరుగుతున్న శ్రామికుల వలసలు, భద్రతలేని జీవితాలు, అధ్వాన్నంగా ఉన్న ప్రజా సౌకర్యాలు, విద్య, వైద్య, రవాణా, స్త్రీల రక్షణ, పిల్లల చదువు, ఆహారం, విషయాల ప్రాముఖ్యం గమనించాలి. ఇది శ్రామిక వర్గ పోరాటానికి చాలా ముఖ్యమైన విషయం. పెట్టుబడిదారి వ్యవస్థను కష్టాల్లోంచి రక్షించే వ్యవస్థగా, ఉన్న కష్టాలన్నీ భూస్వామ్య వ్యవస్థ అవశేషాల ఫలితంగా అర్థం చేసుకోవడం చారిత్రక, సైద్ధాంతిక తప్పిదం. కులం, మతం, ప్రాంతం, సాంప్రదాయం, పితృస్వామ్యం లాంటి సామాజిక వ్యవస్థలన్నిటినీ పెట్టుబడిదారి విధానం తన పద్ధతిలో వాడుకుంటుంది. కానీ మిగులు దోపిడి విధానం నుండి మార్క్సిస్టు చూపు బలహీనం కాకూడదు.

**అనువాదం: ఆర్.వి. రమణమూర్తి**

# భూమా? శ్రమా? గ్రామీణ భారత దేశంలో

# దళితుల చారిత్రక సంఘర్షణ

■ ఎస్. ఎ. విద్యాసాగర్

**భారత దేశ చరిత్రలో భూమిపై యాజమాన్య హక్కు ఏ మాత్రం లేకుండా చేయబడిన సమూహం దళితులది. బ్రిటిష్ కాలంలో జరిగిన వ్యవసాయ వ్యాపారీకరణ వల్ల వేతన సంబంధాలలో వారు ప్రవేశించినప్పటికీ, అత్యధికంగా అర్థబానిస వ్యవస్థ అయిన 'పాలేరుతనం', 'జీతగాళ్ళ' వ్యవస్థలో అనేక దశాబ్దాల పాటుమగ్గి, తీవ్ర దోపిడీకి గురికాబడిందీ వారే. స్వాతంత్ర్యం తరువాత జరిగిన జమీందారీ, ఇనాందారీ వ్యవస్థల రద్దు 'దున్నేవారికే భూమి' నినాదంతో జరిగినప్పటికీ, భూమి అగ్ర వర్ణాల నుండి శూద్ర కులాలలో అగ్ర కులాలకి బదిలీ అయింది తప్ప దళితులకి, వెనుకబడిన కులాలకి రాలేదు. 1960లనుండి ప్రభుత్వాలు చేపట్టిన భూ పంపిణీ పథకాలు ఆచరణలో నామ మాత్రంగా మిగిలిపోయాయి. ఒకటో, అరో కుటుంబాలకి వచ్చిన భూమి సాగుకి పనికిరానిది, రాళ్ళూ రప్పలతో కూడి, నీటి సదుపాయం లేనిది; దీన్ని సాగు చేసుకోవటానికి, దళితులు చేసిన ప్రయత్నాలకు దళితేతర కులాలు విజయవంతంగా గండికొట్టాయి. దరిమిలా జరిగిన పెట్టుబడిదారి మార్పుల్లోంచి వచ్చిన అవకాశాలే దళితులకు స్వేచ్ఛారహిత సంబంధాల్లోంచి బయటకు రావడానికి సహకరించాయి. తెలంగాణలో బోరు బావులకింద పెరిగిన వ్యవసాయం వల్లా, రెండు రూపాయల బియ్యం పథకం వల్లా దళితులు బయట పడితే, ఉత్తరాంధ్రలో 1990ల దాకా వారు ఆగవలసి వచ్చిందని విద్యాసాగర్ అభిప్రాయపడ్డారు. 1990ల్లో పెరిగిన భవన నిర్మాణ ఉపాధి వల్ల దళితులు ఉత్తరాంధ్రలో పెద్ద ఎత్తున వలసలు పోయ్యి గ్రామాల్లోని అణచివేత నుండి విముక్తి పొందారన్నది వాదన. ఈ పరిణామాలన్నిటినీ క్షేత్రస్థాయిలో శ్రీకాకుళం జిల్లాలో అధ్యయనం చేసిన ఎస్.ఎ విద్యాసాగర్ రాసిన 'పల్లెను మింగిన పెట్టుబడి' పుస్తకంలో 'దళితులు'పైన అధ్యాయాన్నుండి ఈ వ్యాసం సంగ్రహించబడింది. –సంపాదకులు**

బ్రిటిష్ వలసపాలన కాలంలోనే ఈ దేశంలో దళితుల దుస్థితిపైన వాళ్లపై సాగుతున్న అంటరానితనం, సాంఘిక అణచివేతపైన అనేక ఆందోళనలు సాగాయి. ప్రత్యేకించి అంబేద్కర్ ఈ శ్రేణులపై సాగుతున్న అణచివేతకు వ్యతిరేకంగా పోరాడారు. ఫలితంగానే 1935 భారత చట్టంలో వారిని డిప్రెస్డ్ క్లాసులుగా పిలుస్తూ కొన్ని ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించారు. దీనినే 1950 స్వతంత్ర భారత ప్రభుత్వం కొనసాగించింది. గతంలో డిప్రెస్డ్ క్లాసులుగా పిలువబడిన వారిని షెడ్యూల్డ్ క్యాస్ట్స్ అని పిలవడం ప్రారంభించారు.

భారతీయ జనాభాలో శ్రామికవర్గంగా అనేక కులాలు ఉండవచ్చు. కానీ దళిత జాతులు మొత్తం కూడా శ్రామిక వర్గమే అని చరిత్ర ఋజువు చేసింది. అంబేద్కర్ దళితుల గురించి ఇలా పేర్కొన్నాడు. "అంటరాని మనుషులు భూమిపై ఎటువంటి హక్కునూ కల్గి ఉండరాదు. అతను స్వంతంగా గానీ, లీజు ప్రాతిపదికనగానీ వ్యవసాయం చేస్తూ స్వతంత్ర జీవనం గడపడానికి అనర్హుడు. హిందూ ఉన్నత కులాలు పారవేసిన, కుళ్లిపోయిన ఆహార పదార్థాలమీద ఆధారపడి వాళ్లు జీవనం సాగించాల్సిందే! గ్రామాల్లో చనిపోయిన పశు వులను వాళ్లు తమ మాంసాహారంగా తీసుకోవాల్సిందే! వాళ్లు తమ ఆహారం కోసం జోలె పట్టుకుని తిరిగి బిక్ష మెత్తుకోవాల్సిందే" (ఆధారం:ఎస్సేస్ ఆన్ అన్‌టచబుల్స్ అండ్ అన్‌టచ్‌బులిటి: సోషల్: డా. బి.ఆర్. అంబేద్కర్)

1955లోనే భారతదేశపు భూసంబంధాలను గురించి ఢిల్లీ యూనివర్శిటీలో డేనియల్ థోర్నర్ అయిదు ఉపన్యాసాలను ఇచ్చారు. ఆయన దేశంలో విస్తృతంగా పర్యటనలు చేసారు. సాంప్రదాయకంగా దళితులకు ఆనాటికి కీలకమైన ఉత్పత్తిసాధనం అయిన భూమిపై హక్కు లేకపోవడాన్ని అంబేద్కర్ వివరించారు. వలస పాలన అనంతరం తొలి దశాబ్ది స్థితి గురించి, కుంటో, సెంటో భూమిని స్వంతం చేసుకోవాలన్న దళితుల ఆకాంక్షకు ఉన్న అవరోధాలను డేనియల్ థోర్నర్ ఇలా వివరించారు. "అత్యంత అరుదుగానైనా ఒక చమార్, ఒక మెహర్, ఒక పంచమ ఇలా అంటరాని జాతులకు చెందిన ఏ ఒక్కరైనా తమ కష్టార్జితంతో సూది మొన మోపినంత భూమినైనా కొనుక్కొని దాని ఆధారంగా జీవించాలనుకుంటే 'ఆ లక్ష్యం చేరడం అసాధ్యం' అనిపించే కష్టాలు వాళ్లకు ఎదురౌతున్నాయి." (ఆధారం : ది అగ్రేరియన్ ప్రాస్పెక్ట్ ఇన్ ఇండియా: ఫైవ్ లెక్చర్స్ ఆన్ లాండ్ రిఫార్మ్స్ డెలివర్డ్ ఇన్ 1955 ఎట్ ది ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకానమిక్స్: డెనియల్ థ్రోనర్)

వలస పాలన అనంతర తొలి దశలో జరిగిన భూసంస్కరణలు అని థోర్నర్ పేర్కొన్నది ఆనాటికి దేశంలో అమలు చేసిన జమీందారీ, ఇనాందారీ చట్టాలు రద్దు గురించి అని అర్థం చేసుకోవాలి. వివిధ రాష్ట్రాలలో ఈ రద్దు చట్టాలలో 'దున్నే వానికే భూమి' అనే నిర్వచనం ఎలా భ్రష్టు పట్టించారో ఆయన సుదీర్ఘంగానే వివరించారు. వాస్తవంలో భూమిని దున్నిన విశాల శ్రామిక ప్రజానీకానికి, దళితులలో సింహ భాగంగా ఉన్న శ్రామిక వర్గానికి భూమి మీద ఎటువంటి హక్కూ దాఖలు పడకుండానే, గ్రామీణ ప్రాంతాలలో శూద్ర అగ్రకుల, దనిక రైతాంగం సృష్టికే ఈ జమీందారీ రద్దు చట్టాలు ఉపయోగపడినాయని ఋజువైంది.

ఆచరణలో జమీందారీ రద్దు చట్టం ఒక నయా ధనికవర్గాన్ని గ్రామీణ ప్రాంతాలలో సృష్టిస్తే దీనివలన అశాంతి దేశవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాలలో పెరిగింది. అంబేద్కర్ చెప్పినట్లు "హిందూ ధర్మం నిరంతరం ఆచరణలో ఉండే ప్రాంతాలుగా గ్రామాలను చూడాల్సి ఉంది. హిందూ సామాజిక ఆధిపత్యక్రమం పూర్తిస్థాయిలో అమలు జరిగే ప్రాంతాలుగా గ్రామాలను చూడాల్సి ఉంటుంది". (హూ విల్ స్పిక్ ఫర్ ది విలేజ్? అగ్రేరియన్ చేంజ్ అండ్ మార్జినలైజింగ్ రురాలిటీస్ ఇన్ కాంటెంపరరీ ఇండియా అనే పేరుతో రాసిన వ్యాసంలో : సురింధర్ ఎస్ జోధ్కా ఉల్లేఖించారు)

ఒకవైపున మౌలిక ఉత్పత్తి సాధనం అయిన భూమిపై హక్కును నిరాకరించారు. మరోవైపు సామాజిక అణచివేతను నిర్నిరోధంగా సాగించారు. గ్రామసీమల్లో రేగిన అశాంతి ఫలితంగా 70వ దశకం తొలినాళ్లలో తిరిగి భూసంస్కరణల గురించి మాట్లాడడం ఆరంభమైంది. దీనితో దళితులకు భూమి పంపిణీ అనేది ఒక ప్రచారంగా ఆరంభమైంది.

భూసంస్కరణల గురించి చూసినపుడు భూమి యాజమాన్య ప్రాతిపదికగా కుటుంబాన్ని కాకుండా వ్యక్తిని ప్రాతిపదికగా తీసుకోవడంతో దళితులకు దక్కింది స్వల్పమే అని గణాంకాలే ఋజువు చేస్తున్నాయి. నిర్దిష్టంగా ఈ జిల్లాను పరిశీలించినపుడు ఈ పరిశీలనాకాలం 1970 నుంచి నేటి వరకు అనుకుంటే కొన్ని గ్రామాలను తీసుకున్నా పరిస్థితి అర్థం అవుతుంది.

**దేవాలయాలే కాదు దేవుని భూములు కూడా అంటరానివే:**

దేవాలయాల్లో ప్రవేశం కోసం నేటికీ తీవ్రంగా కొట్లాడుతూ ఏదో మేరకు దేవాలయాల్లోకి దళితులు ప్రవేశించినా, ప్రభుత్వం ఆధీనంలోని దేవాలయ భూముల్లోకి మాత్రం ఈ జిల్లా దళితులు ప్రవేశించలేకపోయారు.

ఈ భూముల మీద హక్కు సంప్రదాయకంగా బ్రాహ్మణ పూజారులకుండేవి. అయితే ఈ భూములను కౌళ్లకు దున్నేది రైతాంగ కులాలయితే, క్షేత్రస్థాయిలో తమ శ్రమను అమ్ముకొనేది దళితులు మాత్రమే. గ్రామాలలో బ్రాహ్మణుల ఆధిపత్యం నిర్మూలించబడిన తర్వాత ఈ భూములు కూడా వాస్తవంగా శూద్రకులాలకే దక్కాయి తప్ప దళితులకు దక్కలేదు.

అనేక ఉదాహరణలున్నప్పటికీ కొన్నిటిని మాత్రం తీసుకొని పరిశీలించినా జిల్లాలో విషయాలు అర్థం అవుతాయి. బొబ్బిలిరాజాకి, శ్రీకాకుళం జిల్లాకు చెందిన అజ్జాడ బ్రాహ్మణులకు మధ్య జరిగిన పందెంలో బ్రాహ్మణులు ఓడిపోయినా భూములను తీసుకోవడానికి బ్రాహ్మణ 'దైవభక్తి' అడ్డువచ్చి, బొబ్బిలిరాజా ఆ భూములను వేణుగోపాలస్వామి వారి దేవస్థానంకి వ్రాసారు. ఈ భూమి 450 ఎకరాలు. బ్రాహ్మణ ఇనాందార్ గ్రామం ఇది. ఈ గ్రామంలో బ్రాహ్మణుల దగ్గర కౌలుదారులుగా ఈ భూమితో సహా మొత్తం భూమికి 20 రైతు కుటుంబాలు మాత్రమే ఉండేవారు. దీనితో భూమిని వాస్తవంగా గ్రామీణ దళితులు, ఇతర కులాల శ్రామిక వర్గమే సాగుచేసేవారు. ఈ దేవాలయ భూములను కూడా దేవాదాయ శాఖ స్వాధీనం

చేసుకున్న తర్వాత కూడా ఈ గ్రామపు కొప్పుల వెలమ కులానికి చెందిన కొద్ది కుటుంబాలకు మాత్రమే ఈ భూములను సాగుచేసే హక్కు కలిగింది. గ్రామంలో దళితులెవ్వరికీ ఈ భూమిలో ఎటువంటి సాగు హక్కు లేకుండా పోయింది. ఈరోజు కొచ్చేసరికి రైతులెవ్వరూ ఈ భూమిపై చెల్లించాల్సిన శిస్తు చెల్లించడం లేదు సరికదా ప్రభుత్వమే ఇవి ఆక్రమణలో ఉన్నాయని ప్రకటించింది. మరోవైపున ఈ భూముల వంశపారంపర్యంగా పంచుకోవడాలు, అమ్మకాలు సాగిపోతుండడమే ఒక కొసమెరుపు.

సుదీర్ఘ పోరాటాలు, వివాదాలు, కేసులు తర్వాత మాత్రం మక్కువ మండలం శీబిల్లి పెద్దవలస, కురుపాం మండలం కిచ్చాడలలో దళితులు, ఆదివాసీలు దేవాలయ భూమి 70 ఎకరాల భూమిని సాధించుకో గలిగారు.

**భూసంస్కరణల అమలు:**

"ప్రస్తుత ఆర్థిక, సామాజిక స్థితిలో దళితుల క్షేమం కోసం ఎన్ని పథకాలు రచించినా, నిర్దిష్ట భూ పంపిణీ, భూసంస్కరణల సత్వర అమలు ద్వారా వచ్చిన మిగులు భూమి పంపిణీ చేపట్టకపోతే ఈ పథకాలేవీ గూడా వాళ్ల అభివృద్ధికి కొరగానివే అవుతాయి (ఆధారం : ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ ప్రసంగం 71-72).

భూసంస్కరణలు లేదా ప్రభుత్వ భూముల పంపిణీ లెక్కలు ఎప్పుడూ అస్తవ్యస్తంగానే ఉన్నాయి. 1971-72 బడ్జెట్ ప్రసంగం ప్రారంభంలో 10 లక్షల ఎకరాల ప్రభుత్వ భూమిని పంచామని ప్రభుత్వం పేర్కొంది. దళిత, ఆదివాసులకు కూడా ఈ భూమి పంపకం జరిగిందని చెప్పారు. మళ్లీ అదే బడ్జెట్ ప్రసంగం పందొమ్మిదవ పేజీ వచ్చేసరికి ఇలా పంచిన భూమి 24 లక్షల ఎకరాలని చెప్పారు. పంచడానికి ఎక్కువ భూమి అందుబాటులో రావడానికి వీలుగా అటవీ భూమిని రిజర్వు పరిధిలోంచి తప్పించామని చెప్పారు. అలా తప్పించిన భూమి 1.28 లక్షల ఎకరాలని అది కూడా పంపిణీ చేస్తామని పేర్కొన్నారు.

భూమిని గురించి 1974-75 ప్రసంగంలో ఆనాటి ప్రభుత్వాధినేతలు జిల్లాలలో బంజరు భూముల లెక్కలు తీసి తక్షణమే వాటి పంపిణీ కోసం చర్యలు చేపడుతున్నామని ప్రకటించారు. 1976-77 ప్రసంగంలో దళిత, పేదల అభివృద్ధికి సమూల చర్యలు చేపట్టాలని భావిస్తూ భూపంపిణీని అందులో మొదటి వరుసలో నిలబెట్టారు. ఇలా భూమి, భూమి పంపిణీ గురించి దాదాపుగా 70వ దశకం అంతటా మాట్లాడారు. 1980వ దశకం వచ్చేసరికి ఇక 'భూమి' భూపంపిణీ అనే మాటలు కూడా బడ్జెట్ ప్రసంగాలలో కనబడకుండా పోయాయి. 1990వ దశకం చివరి సంవత్సరాలలో దళితుల అభ్యున్నతికి విద్యను అందించడం మౌలిక లక్ష్యంగా మారింది. 1971-72లో దళితుల మౌలిక అభివృద్ధికి భూపంపిణీయే కీలకం అని చెప్పిన ప్రభుత్వాలు 2000-01 నాటికి దళితుల మౌలిక అభివృద్ధి విద్యతో ముడిపడి ఉందని చెప్పాయి.

1961లో ల్యాండ్ సీలింగ్ చట్టం వచ్చింది. ఈ చట్టం ప్రకారం ఈ జిల్లాలో మిగులు భూమి 239 హెక్టార్లు మాత్రమే (ఆధారం: శ్రీకాకుళం జిల్లా గజిటీర్ 1979) ఆంధ్రప్రదేశ్‌లో భూసంస్కరణల చట్టం 1973, భారత రాష్ట్రపతి ఆమోదం పొందిన తర్వాత 1-1-1975న ఆచరణలోకి వచ్చింది.

ఈ భూసంస్కరణలు అమలును గురించి 1976-77 బడ్జెట్ ప్రసంగంలో ఇలా పేర్కొన్నారు. "భూసంస్కరణల అమలు కోసం ప్రభుత్వం త్వరితంగా చర్యలు తీసుకుంటోంది. రాష్ట్రవ్యాప్తంగా ఈ చట్టం క్రింద 4.50 లక్షల డిక్లరేషన్‌లు వచ్చాయి. వీటిని విచారించడానికి రాష్ట్రవ్యాప్తంగా 70 ట్రిబ్యునల్స్ ఏర్పాటు చేసాం. ఈ డిక్లరేషన్‌లను తనిఖీ చేయడానికి ప్రత్యేక శిక్షణ పొందిన 311 మంది ప్రత్యేక సహాయ తహాశిల్దార్‌లను నియమించాం. 2.15 లక్షల డిక్లరేషన్‌లను తనిఖీ చేసారు. ట్రిబ్యునల్స్ 84,871 కేసులను పరిష్కరించి, 4000 డిక్లరేషన్‌లలో మిగులు భూమి ఉన్నట్లుగా కనుగొన్నారు. ఇలా తేలిన మిగులు భూమి రాష్ట్రవ్యాప్తంగా 70,329 ఎకరాలు. చట్టం ప్రకారం ఈ భూములను స్వాధీనం చేసుకొని అందులో దళిత, గిరిజనులకు 50 శాతం, మిగిలిన భూమిలో 2/3 భాగం వెనుకబడిన కులాలకు పంపిణీ చేస్తాం. రాష్ట్ర వ్యాప్తంగా కనీసం 10 లక్షల ఎకరాల మిగులు భూమి వస్తుందని అంచనాగా వుంది."

అంటే ఈ సంవత్సరానికి 70,329 ఎకరాలు 'మిగులు' అనుకుంటే అందులో 50 శాతం అంటే 35,164 ఎకరాలు దళితులకూ, గిరిజనులకూ చెందుతుంది. అంటే దళితుల వాటా ఇందులో 50 శాతం లెక్కవేసినా వాళ్లకి దక్కేది 17,532 ఎకరాలన్న మాట. అంటే 1971-72 నాటి ఆర్థిక మంత్రి ప్రకటన ప్రకారం దళితుల మౌలిక సమస్య పరిష్కారం ఎలా జరిగిందో అర్థం అవుతుంది.

భూమి అందుబాటులోకి వచ్చిందే ఈ మాత్రం అనుకుంటే, పంచిన భూమి సహితం పట్టాదార్లకు అందడం లేదని, ఇందులో కూడా అంటే భూమిని నిజ అర్థంలో దఖలు పరచడానికి కూడా ప్రభుత్వం అనేక చర్యలు తీసుకోవలసి వస్తున్నదనీ 1978-79లోనే ప్రభుత్వాలు చెప్పాయి.

నేటి వరకు చూసుకుంటే "రాష్ట్రవ్యాప్తంగా 5,85,670.32 ఎకరాలను పంచారు. 1976-77లోనే 10 లక్షల ఎకరాల మిగులు భూమి వస్తుందని ఆశించిన ప్రభుత్వాల ఆశలు ఫలించలేదు. ఈ భూమిని 4,58,271 మంది లబ్దిదారులకు పంచారు. ఇందులో దళిత లబ్దిదారులు 1,88,086 కాగా వీళ్లకు పంచిన భూమి 2,32,221.25 ఎకరాలు. ఆదివాసీ లబ్దిదారుల సంఖ్య 74,322 కాగా వీళ్లకు పంచిన భూమి 1,19,992.47 ఎకరాలు. వెనుకబడిన మరియు ఇతర కులాల లబ్దిదారుల సంఖ్య 1,95,863 కాగా వీళ్ళకు పంచిన భూమి 2,33,456.60 ఎకరాలు." (ఆధారం : ఎనగ్జర్-1, పేపర్ ఆన్‌ల్యాండ్ రెవిన్యూ అడ్మినిస్ట్రేషన్ - ఏ హిస్టారికల్ అవుట్‌లుక్ : సి.ఉమామహేశ్వరరావు, కమీషనర్ ఎ.ఎం.ఆర్-ఎ.పి.ఎ.ఆర్.డి.)

30-6-2006 నాటికి మొత్తం దేశంలో 68.61 లక్షల ఎకరాలను మిగులుభూమిగా ప్రకటించారు. అందులో 60.15 లక్షల ఎకరాల భూమి స్వాధీనంలోకి తీసుకున్నారు. అందులో 49.17 లక్షల ఎకరాలను పంచారు. ఈ భూమిని 53.98 లక్షల లబ్దిదారులకు పంచారు. అందులో దళితుల శాతం 38.94. ఆదివాసీల శాతం 15.87. ఇంకా 8,56 లక్షల ఎకరాల భూమి వివాదాల్లోనే ఉంది. (ఆధారం : ది రిపోర్టు ఆఫ్ సబ్‌గ్రూప్ ఆన్ ల్యాండ్ రిలేటెడ్ ఇష్యూస్, పేజి నెం.118, ప్రచురణ: ప్లానింగ్ కమిషన్)

పై గణాంకాలను చెప్తూ ఆ నివేదిక ఇలా వ్యాఖ్యానించింది. "భారతీయ వ్యవసాయ భూముల్లోకి భూసంస్కరణల చట్టాల ద్వారా చేరిన చిన్న, సన్న కమతాల సంఖ్య అత్యంత స్వల్పమైనది. అది ఎంత స్వల్పమంటే గేలి చేయదగినంత స్వల్పం"

భూసంస్కరణల్లో అత్యధిక భూమి న్యాయస్థానాలలో భూవివాదాల పేరుతో ఉండిపోయింది. ఈ విభాగంలో ప్రథమస్థానం ఆంధ్రప్రదేశ్‌దే. ఆంధ్రప్రదేశ్‌లో 2.05 లక్షల ఎకరాలు భూమి, న్యాయస్థానాలలో, న్యాయ వివాదాలలో చిక్కుకుంది. (ఆధారం : భూసంస్కరణల విభాగం, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ గణాంకాలు)

ఇదే గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ 20 సూత్రాల అమలులో భాగంగా భూమి పంపిణీ లక్ష్యాలను నిర్దేశించింది. ఇందులో దేశవ్యాప్తంగా 5,98,563 ఎకరాలను, 1993-94 నాటికి పంచాలని నిర్దేశిస్తే 70,887 ఎకరాలు మాత్రం పంపిణీ చేసారు. దేశ లక్ష్యాలలో 12 శాతం మాత్రం సాధించారు. ఇక్కడ కూడా ఆంధ్రప్రదేశ్ తన లక్ష్యాలను చేరుకోవడంలో అత్యంత నాసిరకం ప్రదర్శనే ఇచ్చిందని ఈ నివేదిక తెలియచేస్తోంది. ఆంధ్రాలో ఈ లక్ష్యం 1,22,810 ఎకరాలు కాగా కేవలం 25,139 ఎకరాలనే పంచారు.

మొత్తంగా ఈ భూసంస్కరణల గురించి 2007-2008లో ప్రభుత్వం ఇలా సమీక్షించింది "సమాజంలో ఉన్న అన్ని సామాజిక రుగ్మతలకు శతాబ్దాల తరబడి సాగుతున్న భూయాజమాన్యంలో అసమానతలే మూలకారణంగా ఉన్నాయి. అయితే శాపంలా మారిన ఈ పరిణామాన్ని చక్కదిద్దడానికి దశాబ్దాలుగా తీసుకున్న ఏ చర్యలూ ఈ మూలకారణాన్ని సరిదిద్దలేకపోయాయి" (ఆధారం : ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ ప్రసంగం 2007-08)

భూసంస్కరణ సంగతి ఇలా ఉండగా ప్రభుత్వం బంజరు, పోరంబోకు భూములను పంచాలని నిర్ణయించుకుంది. దీనికే అసైన్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ల్యాండ్స్ అని పేరుపెట్టారు. ఇది 1-11-1969 నుంచి అమలయింది. "నేటివరకు ఈ పథకం కింద రాష్ట్రంలో పంచిన భూమి 48,30,712.21 ఎకరాలు. మొత్తం లబ్దిదారుల సంఖ్య 33,79,699. ఇందులో దళితుల సంఖ్య 7,84,217. వీళ్లకిచ్చిన భూమి 10,15,424.74 ఎకరాలు. ఆదివాసీ లబ్దిదారుల సంఖ్య 9,24,031. వీళ్ళకిచ్చిన భూమి 12,77,100.85 ఎకరాలు. వెనుకబడిన కులాల లబ్దిదారుల సంఖ్య 7,39,208. వీళ్లకిచ్చిన భూమి 9,45,167.28 ఎకరాలు.

శ్రీకాకుళం జిల్లాలో ఈ పథకం కింద పంచిన భూమి 1,27,365.05 ఎకరాలు కాగా మొత్తం లబ్దిదారుల సంఖ్య 1,32,254. ఇందులో దళిత లబ్దిదారుల సంఖ్య 28,488 కాగా వీళ్లకు పంచిన భూమి 26,583.60 ఎకరాలు. ఇక ఆదివాసీ లబ్దిదారులసంఖ్య 43,817. వీళ్లకిచ్చిన భూమి 47,597.25 ఎకరాలు. వెనుకబడిన కులాలకు చెందిన లబ్దిదారుల సంఖ్య 32,861. వీళ్లకు పంచిన భూమి 23,247.02 ఎకరాలు." (ఆధారం : ఎనగ్జర్-1, పేపర్ ఆన్‌ల్యాండ్ రెవిన్యూ అడ్మినిస్ట్రేషన్ - ఏ హిస్టారికల్ అవుట్‌లుక్ : సి.ఉమామహేశ్వరరావు, కమిషనర్ ఎం.ఎం.ఆర్-ఎ.పి.ఎ.ఆర్.డి.)

అయితే సాధారణంగా దళితులకిచ్చిన భూములు అత్యంత నిస్సారమైనవి. సగటున దళితులకు ఎకరాలోపు భూమి పంపిణీ జరిగిందనుకుంటే ఆ భూమిని సాగులోకి తేవడానికి అతనికి సంవత్సరాలు ఖర్చు అవుతాయి. ఈ భూమిని సాగుచేయడానికి అవసరం అయ్యే సాధనాలు ఏమీ వాళ్ల

దగ్గర ఉండవు. భూమి మీద ఆధారపండి జీవించాలనుకుంటే కనీసం 2 నుంచి 3 సంవత్సరాలు అతను వేతనశ్రమ నుంచి వైదొలగాల్సి ఉంది. 1970–80వ దశకంలో ఇది కనీసం ఊహకందని విషయం. అందుకనే సరిగ్గా ఆ దశకంలోనే పంచిన భూములలో అత్యధికభాగం అన్యాక్రాంతం అయ్యాయి. తిరిగి "కూలోళ్లకు భూములిస్తే వాళ్ల దగ్గర భూములుంటాయా? కూలోడు భూమిని కాపాడుకోగలడా? వాళ్లకు వ్యవసాయానికి ఒళ్లు ఒంగుతుందా? అని వీళ్ల శ్రమతోనే పంటలు పండించుకునే రైతాంగం వీళ్లమీద ప్రచారం చేయడాన్ని గమనంలోకి తీసుకోవాలి. భూమి నుంచి ఉత్పత్తిని తీయడానికి శ్రమతోపాటు అవసరమైన అన్ని సాధనాలను వాళ్లకు అందుబాటులోకి తేలేనంతకాలం భూపంపిణీ వలన ఆచరణలో ఒరిగేది ఏమీ ఉండదు.

పరిశీలించిన గ్రామాలను చూసినపుడు దళితులకు పంచిన భూమి దాదాపుగా వాళ్ల చేతుల్లో లేకుండా పోయింది. గ్రామీణ ధనిక వర్గానికి దళితుల ద్వారా భూమిని పంపిణీ చేసే కార్యక్రమంగా ఈ భూమి పంపిణీ కార్యక్రమాలు మిగిలాయి. ఈ విషయాలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయశాఖామంత్రి శ్రీ రఘువీరారెడ్డి స్పష్టంగా ప్రకటించారు. "రాష్ట్రం ఏర్పడిన తర్వాత పేద ప్రజలకు ప్రభుత్వం పంపిణీ చేసిన భూములు మొత్తం 46 లక్షల ఎకరాలు. అందులో దాదాపు 10వంతు అంటే 4.35 లక్షల ఎకరాల భూమి చేతులు మారింది. కొన్ని భూములు లబ్దిదారులు విక్రయించగా మరికొన్ని భూములను వేరే వ్యక్తులు అన్యాక్రాంతం చేసినట్లు ప్రభుత్వ సర్వేలో బయటపడింది. ఇప్పటికే 2.88 లక్షల ఎకరాల భూమిని స్వాధీనం చేసుకున్నాం." (ఆంధ్రజ్యోతి, 1-1-2013)

"జాతీయ స్థాయిలో చూసినపుడు భూమి గురించి ఎన్ని చర్చలు చేసినా, ఎన్ని చర్యలు చేపట్టినా దేశంలో దళిత వ్యవసాయదారుల జాబిత ఏడాదికేడాది తగ్గిపోతూనే ఉంది. 1961 లెక్కల ప్రకారం దళితుల్లో వ్యవసాయదారుల శాతం 37,76 కాగా అది 1971 నాటికి 27.87 శాతానికి, 1981 నాటికి 28.17 శాతానికి తిరిగి 1991 నాటికి 25.44 శాతానికి చేరింది. 2001 నాటికి వీళ్ల శాతం 22.08కి పడిపోయింది". (ఆధారం : 2004–05 జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ నివేదిక) అంటే 60 వసంతాల భూమి పంపిణీ ప్రహసనం దళితులను ఉన్న కాస్తా నేల నుంచి తరిమివేస్తోందని, తిరిగి భూమి కేంద్రీకరణకు దారితీస్తోందని ఈ పరిణామాలు అర్థం చేయిస్తున్నాయి. భూమిలేని దళితుల శాతం తీసుకుంటే జాతీయ స్థాయిలో సగటున 12.62 మంది భూమిలేనివారే. ఇదే ఆంధ్రప్రదేశ్‌లో 13.88 శాతం మంది దళితులకు అసలు భూమే లేదు.

అధికారిక లెక్కలు ఇలా ఉండగా క్షేత్రస్థాయి పరిశీలనలో చూసుకున్నపుడు 56 మండలాలలో 78 గ్రామాల దళితుల నుంచి చేసిన సమాచార సేకరణ భూమి పంపిణీ, వ్యవసాయంలో ఇబ్బందులు, గ్రామీణ రైతాంగ కులాల కర్కశత్వం గురించి విభ్రాంతికరమైన వాస్తవాలే తెలుస్తాయి. నిజానికి ప్రతి గ్రామ దళితవాడకు దానిదైన ఒక ఘటన, దాని స్వానుభవంలోకి వచ్చిన కర్కశత్వం ఉన్నప్పటికీ కొన్ని గ్రామాలను మాత్రమే ఉదాహరణలివ్వగలిగే స్థితి స్థలాభావంరీత్యా ఉన్నది.

నేను అధ్యయనం చేసిన 78 గ్రామాలలో మొత్తం దళిత కుటుంబాలు 4855 కాగా అందులో మాల కుటుంబాలు 3462, మాదిగ కుటుంబాలు 892, పైడి కుటుంబాలు 290, కాగా రెల్లి కుటుంబాలు 67 ఉన్నాయి. ఇందులో జిరాయితీ భూములు కల్గి ఉన్నవారు 67 కుటుంబాలు మాత్రమే. అంటే జిరాయితి భూములు కల్గిఉన్నవారి శాతం 1.3 మాత్రమే.

భూసంస్కరణలు, ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా కొనుగోలు, దళితులు ఆక్రమించుకోవడాలు, ఇలా ఈ మూడు మార్గాలలో ఈ 78 గ్రామాలలో 39 గ్రామాల దళితులకు భూమి దక్కింది. 39 గ్రామాలలో దళితులకు ఇలా దక్కిన భూమి 679.67 ఎకరాలు మాత్రమే. మొత్తం జిల్లా అంతా జమీందారీ భూములే ఉన్న కాలం 1948 వరకూ కొనసాగింది. దున్నే వానికే భూమి అనే ఉద్దేశ్యంతో జమీందారులు రద్దు అయితే క్షేత్రపరిశీలన చేసిన 78 గ్రామాలలో దళితులకు జమీందారీ రద్దు చట్టం ద్వారా భూమి వచ్చినది కేవలం ఒక్క గ్రామంలోనే. ప్రస్తుతం రేగిడి ఆముదాలవలస మండలం ఆడవరంలో రెండు దళిత కుటుంబాలకు మాత్రం 8 ఎకరాల భూమి వచ్చింది.

ఈ 679.67 ఎకరాలు 1063 దళిత కుటుంబాలకు దక్కాయి. అయితే ఇందులో అత్యధిక భూములు నాసిరకం అయినవి. లేదా నదీ, కొండ పోరంబోకులు మాత్రమే. కొన్ని గ్రామాలలో భూసంస్కరణల పేరుమీద పంపిణీ అయిన భూములు నేటికీ ఆయా తొలితరం ధనిక, పెత్తందారీ కుటుంబాల దగ్గరే ఉన్నాయి. పంచిన భూములలో సగంకి పైగా భూములు దళితులు కోల్పోయిన స్థితి ఉన్నది. ఒక గ్రామంలో రికార్డుల ప్రకారం 95 ఎకరాలు పంచినా, ఒక్క సెంటు కూడా దళితులకు దక్కలేదని దళితులు చెప్పారు. నిర్దిష్టంగా భూమి చుట్టూ జరిగిన భౌతికదాడుల పరంపరను, దళితులకు ఆచరణలో భూమి నుంచి వెలివేసే నూతన తరహా పథక రచనలను తెలుసుకోవడానికి కొన్ని గ్రామాల ఉదాహరణలు చూడాలి.

జమీందారీ, ఇనాందారీ రద్దు అయిన తర్వాత ఈ జిల్లాలో భూయాజమాన్యం కళింగ, కొప్పులవెలమ, కాపు, పోలినాటి వెలమల లోని ఉన్నత శ్రేణి రైతాంగంకి దఖలు పడింది. 1970–75 నాటికి ఈ కులాలు ఒక శక్తివంతమైన వర్గంగా ఏర్పడాయి. అంతకుముందు సామాజిక వర్గాలైన బ్రాహ్మణ, క్షత్రియ, కొండ జమీందార్లకు లేని, సంఖ్యాబలం ఒకటి అదనంగా వీరికుంది. సెంటు భూమిలేని పేదలైనా కూడా కులంపేరుతో ఈ ఉన్నత శ్రేణికి చెందిన వారికి సైన్యంలా ఉపయోగపడ్డారు. నిర్దిష్టంగా కొన్ని ఉదాహరణలు చూడాల్సివుంది.

**మెరకముడిదాం** మండలం గోపన్నవలసలో 8 దళిత కుటుంబాలకు 6.72 ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయించింది. అయితే ఈ కేటాయించిన భూమి చెరువుగర్భం అని, చెరువుగర్భంలో భూకేటాయింపులు జరపరాదని గ్రామంకి చెందిన కాపు రైతాంగం వివాదాలు లేవనెత్తారు. అయితే న్యాయస్థానాలు అవి చెరువుగర్భం భూములు కాదని స్పష్టం చేసాయి. ఆ భూములు చెరువు గర్భం కాకపోయినప్పటికీ గ్రామానికి వచ్చే వర్షపు నీరు ముందుగా ఆ భూముల్లో నిలువచేరి ఇతర చెరువుల్లోకి ప్రవహిస్తుందని రైతులు వాదిస్తున్నారు. పట్టాలు రావడంతో దళితులు వ్యవసాయం ప్రారంభించారు. ఈ భూముల్లో వ్యవసాయం చేయడం వల్ల నీటి ప్రవాహానికి అడ్డు ఏర్పడి చెరువులు ఎండిపోయాయని, ఆ ఎండిపోతున్న చెరువుల్ని దళితులు ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నారని రైతులు వాదిస్తున్నారు. వివాదం న్యాయస్థానాలకు పోయింది.

ఒకవైపు న్యాయస్థానాల్లో వివాదాలు నడుస్తుండగానే దళితులకు నాయకత్వం వహిస్తున్న ఇద్దరు దళిత నాయకులు హత్యకు గురయ్యారు. దీనిపై జిల్లావ్యాప్తంగా ఆందోళనలు జరిగాయి. క్రిందిస్థాయి కోర్టులు రైతాంగంకి యావజ్జీవ శిక్షలు ఖరారు చేయగా, హైకోర్టు అందరినీ నిర్దోషులుగా విడిచిపెట్టింది. హత్యలు అయితే నిజంగానీ హంతకులెవరన్నది నేటికీ తేలలేదు.

**పొందూరు** మండలం తోలాపిలో 70వ దశకంలో 33 దళిత కుటుంబాలకు 4.95 ఎకరాల భూమిని పంపిణీ చేసారు. ఒక్కో కుటుంబానికి 0.15 సెంట్ల భూమి ఇచ్చారు. అప్పటి నుంచీ సాగు చేయాలని ప్రయత్నించినప్పుడల్లా కళింగ కులానికి చెందిన రైతాంగం ఈ పంటలలో పశువులను దింపి ధ్వంసం చేసేవారు. 5 సం॥ల పాటు దళితులు దీన్ని అడ్డుకునే ప్రయత్నం చేసినా నిరంతరం ఈ పంటల ధ్వంసం సాగుతూనే ఉండడంతో దళితులు పంటలు వేయడం మానుకున్నారు.

**గరివిడి** మండలం కోనూరులో మొత్తం భూమిలో 90 శాతం యాజమాన్యం స్థానిక క్షత్రియ కుటుంబాలదే. ప్రభుత్వం బంజరు భూములను గుర్తించి కొద్దిమంది దళితులకు పట్టాలు జారీ చేసింది. అయితే ఈ భూములను కూడా ఈ క్షత్రియ కుటుంబాలకు చెందినవారే సాగు చేసుకునేవారు. భూసంస్కరణల చట్టం నుంచి తప్పుకోవడానికి క్షత్రియులు తమ దళిత పాలేర్ల పేరుతో భూమిని రిజిష్టర్ చేయించారు. 1980వ దశకంలో ఈ విషయం తెలుసుకున్న ఒక దళిత పాలేరు మజ్జి తమ్మన్న, క్షత్రియుల ఆగడాలను భరించలేని మెజార్టీ కులంకి చెందిన కాపులలో కొంతమంది ఐక్యమయ్యారు. క్షత్రియులకు వ్యతిరేకంగా భూమి హక్కు కోసం అధికారులను కలిసారు. దీనితో సాంఘిక ఆధిపత్యాన్ని ప్రదర్శించడాన్ని క్షత్రియులు తగ్గించడంతో కాపులు వెనక్కు తగ్గినా కొంతమంది దళితులు మాత్రం వెనక్కి తగ్గలేదు. క్షత్రియులు దళితవాడపై దాడి చేసారు. దీనితో జిల్లా అధికార యంత్రాంగం దగ్గరకు దళితులు వెళ్లారు. ఈ దశలో 'శోధన' అనే స్వచ్ఛంద సంస్థ దళితులకు అండగా నిలిచింది. దళితుల పేర వ్రాసిన భూములు దళితులకే దక్కాలని 'శోధన' దళితులను కదలించడం వల్లనూ అదే సమయంలో రాష్ట్ర రాజకీయ రంగంలో వచ్చిన మార్పులవల్లనూ దళితులకు భూమి దక్కింది. అయితే రికార్డులలో పేరున్న దళితులు అనేకమంది భూములను సాగుచేయడానికి సిద్ధపడలేదు. మజ్జి తమ్మన్న నాయకత్వంతో దళితులు, భూములను ఆక్రమించుకుంటామని బెదిరించారు. దీనితో రికార్డులలో పేరున్న దళితులు భూములను సాగుచేయడానికి సిద్ధపడ్డారు.

**బొద్దాం** గ్రామంలో ప్రభుత్వం 40 ఎకరాల పోరంబోకు భూమిని 60 దళిత కుటుంబాలకు పంపిణీ చేసింది. ఈ భూమిని బాగుచేసుకుని, సాగులోకి తేవడానికి దళితులు ప్రయత్నించారు. గ్రామానికి చెందిన పోలినాటి వెలమ రైతాంగం సాగుచేయడానికి సిద్ధపడ్డ దళితులపై భౌతిక దాడులకు పాల్పడింది. దళితవాడపై దాడి చేసి ఇళ్లను ధ్వంసం చేసే ప్రయత్నం చేసారు. ఈ దాడి జరిగేటప్పుడు సంబంధిత పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ దళిత కులానికి చెందిన వారు కావడంతో వెంటనే కేసు నమోదు చేసారు. అయినప్పటికీ దళితులకు ఎటువంటి నష్టపరిహారం

అందలేదు. భూమిపై సాగును కూడా దళితులు వదిలేసుకోవాల్సి వచ్చింది.

ఇద్దరు జిల్లా కలెక్టర్‌లు ప్రయత్నించినా దళితులకు భూమి దక్కని స్థితి వలన మొత్తం దళిత కుటుంబాలలో 90 శాతం మద్రాస్‌కు వలసపోయిన ఘటన దళాయిపేటలో జరిగింది. 1960వ దశకంలోనే దళాయిపేట గ్రామ దళితులు, కురుపాం రాజా భూములను ఆక్రమించారు. అయితే ఈ ఆక్రమణ నాటి కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో చేయడంతో ఆనాటి ప్రభుత్వాలు ఆ భూమిపంపిణీపై ఆసక్తిని చూపలేదు. అయితే 70వ దశకం తొలినాళ్లలో దళితులు తిరిగి ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేయడంతో దళాయిపేట దళితులకు వాళ్లు ఆక్రమించుకున్న 80 ఎకరాల భూమికి పట్టాలిచ్చారు. అయితే ఈ భూమికి ఎటువంటి నీటిపారుదల సౌకర్యం లేకపోవడంతో 'పంటలు' వరుణుడి దయాదాక్షిణ్యాలపై ఆధారపడ్డాయి.

ఈ స్థితి గమనించిన నాటి జిల్లా కలెక్టర్ శ్రీ బి.దానం ఈ భూమికి నీటిపారుదల సౌకర్యం కల్పించడానికి ప్రయత్నం చేసారు. గుమ్మడి గెడ్డ నుంచి వచ్చే నీరును, మాదలంగి చెరువులోకి మళ్లించి, అక్కడ జలాశయం ఏర్పాటు చేసి దళితుల పొలాలకు నీరు ఇవ్వాలనేది ఆ ప్రణాళిక. అయితే ఇలా చేస్తే తమ గ్రామం ముంపుకి గురి అవుతుందని మాదలంగి రైతాంగం ఈ పథకాన్ని వ్యతిరేకిస్తూ న్యాయస్థానాలను ఆశ్రయించి అనుకూల ఉత్తర్వులు సాధించడంతో ఈ పథకానికి పురిట్లోనే సంధికొట్టింది.

మరో 10 ఏళ్ల తర్వాత జిల్లాకి కలెక్టర్‌గా వచ్చిన మరో దళిత అధికారి శ్రీ రాధ తిరిగి ఈ భూములకు నీటిపారుదల కల్పించే అంశాన్ని పరిశీలించారు. నాగావళి నదికి దగ్గరలోనే ఈ పొలాలు ఉండడంతో ఆ నదిలో లిఫ్ట్ ఇరిగేషన్‌ను ప్రవేశపెట్టి నీరు అందించారు. ఈ పథకం కొంతకాలం బాగానే పనిచేసి దళితుల పొలాలకి నీరు అందించింది. ఈ లిఫ్ట్ ఇరిగేషన్ పరికరాల పర్యవేక్షణను దళితులే నిర్వహించేవారు. అలా నిర్వహిస్తేనే నీళ్లు పొలాలకు అందుతాయి. దళితులు సక్రమంగానే విధులు నిర్వహించారు. అయితే దళితుల స్వంతసాగుతో అక్కసు పెంచుకున్న కాపు రైతాంగం 1994 ఎన్నికలను అవకాశంగా తీసుకుని దళితుల ఐక్యతను దెబ్బతీసారు. దీనితో లిఫ్ట్ పథకం మూలపడి దళితులు తిరిగి వ్యవసాయ కూలీలయ్యారు. 2000 వచ్చేసరికి 91 కుటుంబాలకు గానూ గ్రామంలో 20 కుటుంబాలు మిగిలాయి. మిగతా కుటుంబాలన్నీ మద్రాస్‌కు వలసవెళ్లాయి.

ప్రభుత్వ పథకం వల్లనే భూములు కోల్పోయిన ధళితులున్నారు. చిత్రంగా వినిపించవచ్చుగానీ ఇది వాస్తవం. కొత్తూరు మండలం శిరుసువాడలో 50 దళిత కుటుంబాలకు బంజరు భూములను పంపిణీ చేసింది. ఈ బంజరు భూములను సాగులోకి తెచ్చారు. అయితే బలహీన వర్గాలవారికి నివేశన స్థలాల కేటాయింపుకోసం ఇందులో కొంతభూమిని ప్రభుత్వమే తీసుకుంది. కొంతకాలం గడిచిన తర్వాత వంశధార రెండవదశ ప్రాజెక్టు నిర్మాణం పేరుతో వరదకాలవలు నిర్మించడానికి మరికొంత భూమిని తీసుకుంది.

**పాలకొండ మండలం అన్నవరం** గ్రామదళితులకు నాగావళి నది ప్రక్కన బంజరు భూమిని కేటాయించింది. దళితులు తమ శ్రమతో పాటు ధనాన్ని కూడా ఈ భూమికి ఖర్చుచేసి సాగులోకి తెచ్చారు. కొంతమంది దళితులు అప్పులు చేసి బోర్లు కొని, నీరు ఏర్పాటు చేసుకున్నారు. మరికొంతమంది మామిడి, జీడితోటలను వేసారు. అయితే 1990లో ఈ నదికి వరదలు రావడంతో వరద ముంపునుంచి గ్రామాన్ని తప్పించడానికి కరకట్టను నిర్మించారు. ఈ కరకట్టలో దళితులకు పంపిణీ చేసిన భూమి మొత్తం మునిగిపోయి దళితులు యధాతధస్థితికి చేరారు.

ప్రభుత్వం కొనుగోలు చేసి మరీ ఇచ్చిన భూమి, మరో ప్రభుత్వ పథకానికి ఖాళీ అయిపోయిన ఒక చిత్రమైన ఉదాహరణ పార్వతీపురం మండలం గోచెక్కలో జరిగింది. గోచెక్కలోనే కాదు పార్వతీపురం మండలంలో అత్యధిక భూములు 'పెట్టుబడిదారీ రైతాంగం' చేతుల్లోకి మారాయి. ఈ గ్రామంలో ఈ జిల్లాకు చెందిన వారే కాకుండా ఇతర జిల్లాలకు చెందిన వారు సహితం భూములు కొన్నారు. దళితులకు భూమి పంపిణీ కోసం కమ్మకులానికి చెందిన ఒక రైతు దగ్గర ఎస్సీ కార్పొరేషన్ భూమిని కొనుగోలు చేసి దళిత కుటుంబాలకు ఇచ్చింది. ఈ భూములలో నిజానికి జీడితోటలున్నాయి. దళితులు కొంతమేరకు జీవనోపాధిని పొందారు. అయితే ఇందిరమ్మ ఇళ్ల పథకం క్రింద ఈ దళితులకు ఇళ్లు మంజూరు అయ్యాయి. 'ఉన్న ఇంటికన్నా మెరుగైన ఇళ్లు' అనే కోరికతో ఈ పథకం ద్వారా ఇళ్ల నిర్మాణంకి దిగారు. ప్రభుత్వం ఇచ్చిన డబ్బులు చాలకపోవడంతో తిరిగి ఋణచక్రంలోకి వెళ్లారు.

ఇళ్లు పూర్తి అయ్యేసరికి ప్రభుత్వం ఒక కమ్మ రైతు నుంచి కొనుగోలు చేసి ఇచ్చిన భూములు ఋణాల ఊబిలో కూరుకుపోయిన దళితులు మరో క్షత్రియ రైతుకు అమ్మివేసారు. దీనితో భూమి తిరిగి దళితులనుంచి వలస వచ్చిన రైతుల చేతిలోకి బదిలీ అయిపోయింది. ఇలా భూపంపిణీ ద్వారా వచ్చిన భూమి, మరో ప్రభుత్వం పథకానికి ఆవిరైపోయి, ఇళ్లను కూడా వదలి గ్రామ దళితులు వలసబాట పట్టారు. నిజానికి పరిశీలించిన అనేక గ్రామాలలో దళితులేకాదు, ఇతర కులాల పేదరైతాంగం ఇందిరమ్మ ఇళ్ల కోసం ఋణాల ఊబిలో చిక్కుకున్నారు. దళితులకు ఇచ్చిన భూములు అమ్మకోకూడదు అని చట్టంలో ఉన్నప్పటికీ ఈ కొనుగోళ్ళూ, తాకట్టులూ జరిగిపోతూనే ఉంటాయి. అయితే ఈ కొనుగోళ్లకు చట్టబద్ధత లేకపోవడంతో మార్కెట్ ధరకంటే అత్యంత తక్కువ ధరలకే భూమి పరాయికరణకు గురి అవుతుంది. చట్టం నిషేధించినప్పటికీ ఈ కొనుగోళ్లు నిరంతరాయంగా సాగుతూనే ఉంటాయి. రక్షణ కోసం చేసిన ఈ చట్టం వలన భూమి పరాయికరణ ఆగలేదు కానీ అత్యంత కనిష్టధరలకే భూమిని కోల్పోవడం జరుగుతోంది. కాబట్టి చట్టంనైనా సరిగ్గా అమలు చేయాల్సిఉ ంది లేదా దళితులకు ఒకసారి భూమి ఇచ్చిన తర్వాత అమ్ముకోవడంతో సహా అన్ని హక్కులు కల్పిస్తే కనీసం న్యాయమైన ధర అయినా దళితులకు దక్కుతుంది.

ఇలా చెప్పుకుంటూ పోతే ప్రతీ ఊరి భూపరిస్థితి కథా ఇదే. జాతీయ ఎస్సీకమిషన్ ఈ పరిణామాలను గుర్తించే, 8వ ప్రణాళిక సందర్భంగా నియమించబడిన ప్లానింగ్ కమిషన్ నిపుణుల నివేదికను ఉటంకిస్తూ ఇలా చెప్పింది. "భూసంస్కరణల చట్టాల ద్వారా వచ్చిన సీలింగ్ భూమిని దళితులకు పంపిణీ చేసినా ఆచరణలో అనేక అవరోధాలు ఎదురౌతూనే వున్నాయి. దళితులను భూమి నుంచి వైదొలగించడం లేదా వాళ్లు చేస్తున్న వ్యవసాయానికి ఆటంకం కల్పించడం లాంటి చర్యలకు ధనిక రైతాంగం పాల్పడుతోంది. ఈ సందర్భంగా వేసిన వ్యాజ్యాలలో దళితులను కూడా భాగస్వాములను చేసి వాళ్ల హక్కులను రక్షించాలి" (జాతీయ ఎస్సీ కమిషన్ నివేదిక 1994-95)

సరిగ్గా ఇవే ఘటనలు బొడ్డాంలో కావచ్చు. తోలాపిలో కావచ్చు. పొనుగుటివలసలో కావచ్చు. ఇలా అనేక గ్రామాలను పరిశీలించినపుడు ఎదురుపడినా ఏ ఒక్క కేసులో కూడా దళితుల భూమిని నిలబెట్టుకోలేకపోయారు.

**అర్ధ బానిసకు నకలుగా పాలేరు జీవితం:**

భూమి మీద ఎటువంటి యాజమాన్యపు హక్కులూ లేని దళితులకు భూమిమీద శ్రమ చేసి బతకడం మినహా గత్యంతరం లేకపోయింది. అయితే వ్యవసాయ కూలీ కూడా సంవత్సరం పొడుగునా దొరికే అవకాశం లేదు. దీనితో 'నికర ఉద్యోగం'గా కనిపించే పాలేరు వృత్తి దొరకడమే అదృష్టం అని భావించే స్థితిలో దళితులు, భూమిలేని పేదలు ఉండేవారు. జిల్లాలో వివిధ ప్రాంతాలలో వివిధ కులాలకు చెందిన పేదలు పాలేర్లుగా ఉండినప్పటికీ పాలేర్లలో అధిక భాగం దళితులే. అంతేకాక దళితుల ప్రధానవృత్తి పాలేరుగా గడపడంగానే ఉండేది.

ఇలా పొట్టగడవక పాలేర్లుగా మారడం గురించి రాకేశ్ బసంత్ గారు ఒక వివరమైన పరిశోధనా వ్యాసం వ్రాసారు. "దినసరి కూలీల కన్నా సగటున సగం కూలీకే కంబారీలుగా దేశంలో బ్రతుకు లీడుస్తూన్నారని, ప్రత్యేకించి ఈ పాలేర్లు దళిత, గిరిజన, ఇతర వెనుకబడిన కులాల సమూహానికే చెందినవారని ఆయన పేర్కొన్నారు. ఇంకా ఆసక్తికరంగా దినసరవేతనాలలో పెరుగుదల లేకపోవడానికి 'పాలేర్ల వ్యవస్థ' కారణం అని కూడా అతని పరిశోధన పేర్కొంది. ఉన్నస్థితి నుంచి వైదొలగలేని స్థితిలో దళితులు, గిరిజనులు ఉండడంతో వ్యవసాయ కార్మికుల కూలీ రేట్లను కూడా పెంచాల్సిన అగత్యం ధనిక రైతాంగానికి లేకుండా పోయిందని" ఆయన గణాంకాలతో సహా ఋజువు చేసారు. (సోర్స్: ఎటాచ్డ్ అండ్ క్యాజువల్ లేబర్ వేజ్ రేట్స్: రాకేష్ బాసంత్: ఇపిడబ్ల్యు మార్చి 3, 1984)

పాలేర్ల జీతాలు అత్యంత హీనంగా ఉండేవి. పని గంటలకు ఏ మాత్రం నియంత్రణ లేదు. ఉదయం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల దాకా పాలేరు ఏదో ఒక పనిచేస్తూనే ఉండాలి. ఉదయం 4 గంటలకు పశువులకు దాణాతో మొదలై, రాత్రి 8 గం॥లకు పశువులకు గడ్డి వేయడంతో దినచర్య ముగింపుకొచ్చేది. ఈ మధ్యకాలంలో పూర్తిగా రైతు ఆధీనంలోనే పాలేరు జీవితం గడిచిపోతుంది.

70వ దశకంలో పాలేర్లకు 180 కేజీలు ధాన్యం జీతంగా ఉండేది. ఈ కొలతలలో చాలా తేడా ఉండేది. మూడు పూటల ఆహారం పెట్టేవారు. ఈ ఆహారం అత్యంత నాసిరకంగా ఉండేది. తీవ్రమైన ఆహార సమస్యతో కొట్టుమిట్టాడే దళిత కుటుంబాలు తమ బిడ్డలను చిన్న పాలేర్లుగా ఉంచేవారు. పశువులను కాపలా కాసే వృత్తితో ప్రారంభమయ్యే దళిత బిడ్డల జీవితం, భవిష్యత్ పాలేర్లుగా తయారుకావడానికి అప్రెంటిస్‌షిప్‌గా ఉపయోగపడేది. మరోవైపున పాల్లేర భార్యలు కసవు ఊడ్చేవారుగా, ఇంటికి సరిపడే నీళ్లు మోసేవారుగా ఉండేవారు. దాదాపుగా పాలేరుగా ఉన్న దళిత కుటుంబాలు అర్ధబానిస బంధనాలతో ఇరుక్కొని, మొత్తం కుటుంబాలకు కుటుంబాలే చాకిరీలో బందీ అయ్యేవారు. ఇంత దురవస్థలో పాలేర్లుగా ఎందుకు పనిచేయాల్సి వచ్చిందంటే కణుగుల వలసకు చెందిన

దళితుడు ఒక ఇసుక కుప్పను చూపిస్తూ "ఇంత అన్నాన్ని ఎప్పుడైనా తినగలమా? అన్నట్లు రోజులుండేవి 'కడుపు జరక్క కంబారీతనం' అని చెప్పడం నాటి విషాదకర పరిస్థితికి అద్దంపడుతుంది.

1960-70 మధ్య జిల్లాలో మైదాన, గిరిజన ప్రాంతాలలో వ్యవసాయ కార్మిక, గిరిజన సంఘాలు పనిచేయడం ప్రారంభించాయి. ఆ కాలంలో మైదాన ప్రాంతాలో చాలా కొద్దిచోట్ల, గిరిజన ప్రాంతంలో చాలా ఎక్కువగానూ పాలేర్ల జీవితం మెరుగుదల కోసం ఆందోళనలు జరిగాయి.

1970 తర్వాత దాదాపుగా జిల్లాలో ఇలాంటి ఆందోళనలు లేనేలేవు. క్షేత్ర పరిశీలన చేసిన ఈ 78 గ్రామాలలో ఏ అస్థిత్వ వాదనలూ, ఏ నిర్మాణమూ పాలేర్ల రక్షణ కోసం వచ్చిన దాఖలాలు లేవు. పని గంటలలో నిర్నీత వేళలు లేవు. పనికి పరిమితి లేదు. అయినా వీళ్ళ గోడును విన్పించుకొనేవారుగానీ, వాళ్ళ ఆక్రందనను వినే నాథుడు గానీ లేరు. అంతెందుకు తాము, అత్యంత దుర్భరస్థితిలో చిక్కుకున్నామన్న స్పృహలోనే 'దళిత పాలేరు లోకం' లేదు.

గ్రామీణ ప్రాంతాలలోకి పెట్టుబడిదారి సంబంధాలు ప్రవేశించడంతో, అవి రహదారుల రూపంలో కావచ్చు, ప్రసార మాధ్యమాల రూపంలో కావచ్చు, ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాల రూపంలో కావచ్చు, ఆత్మగౌరవ స్పృహవలన కావచ్చు ఇలా అనేక కారణాలు కలగలసి దళితులు 'పాలేరు వృత్తి' అనే ఉక్కుపిడికిలి నుంచి బయటపడ్డారు. 1980వ దశకం చివర నుంచీ పాలేరు వృత్తి నుంచి దళితులు వైదొలగడం ప్రారంభమై 2000 సంవత్సరం నాటికి జిల్లాలో పాలేరు వృత్తి దాదాపుగా అదృశ్యమైంది. మొత్తంగా చూసినపుడు పాలేర్ల వ్యవస్థ రద్దు కావడానికి గల కారణాలను ఏ గ్రామంలో దళితులను ప్రశించినా రెండు సమాధానాలలో సారూప్యత ఉండేది. అవి స్వతంత్ర్య జీవనం సాగించడానికి వీలుగా పట్టణాల్లో ఉపాధి దొరకడం. మరొకటి సాంఘిక గౌరవం లభించడం.

పాలేర్ల వ్యవస్థ రద్దు అయినందుకు చింతిస్తున్నది మాత్రం మధ్యతరగతి, ధనిక రైతాంగానికి చెందినవారే. ఒకప్పుడు సాంఘిక, ఆర్థిక, రాజకీయ ఆధిపత్యం నెరపడానికి శూద్ర కుల రైతాంగానికి పదునైన ఆయుధంగా దళితుల పాలేరు వృత్తి ఉపయోగపడింది. వ్యవసాయం వీళ్లు లేకుండా సాగించడం అనేది ఊహకు కూడా అందని విషయం. ఈ రోజున దీనిని గురించి ప్రశించినపుడు "ఇప్పుడులాగా రోజులుండేవా? అప్పట్లో వేకువజామకి పాలేరు రాకపోతే స్తంబానికి కట్టి కొట్టేసేవాళ్లం' అని కాపుకులానికి చెందిన 80 ఏళ్ల మహిళ దళాయిపేటలో మాట్లాడిందంటే ఈ అర్థబానిస సంబంధాలు ఎంత గాఢంగా జిల్లాలో ఉండేవో అర్థం చేసుకోవచ్చు. 1990ల తర్వాత పాలేర్ల సమస్య మీద నేను పరిశీలించిన గ్రామాలలో, పాలేర్లను కదిలించి, వాళ్ల కూలీ రేట్ల పెంపుదల కోసం 'దుగ్గేరు' గ్రామంలో మాత్రమే ఆందోళన సాగింది. కొంతమేరకు గిరిజనులు, దళితులు విజయం సాధించడం జరిగింది. అయితే అప్పటికే జిల్లాలో మైదాన ప్రాంతాలలో పాలేర్ల వ్యవస్థ రద్దు దిశగా ప్రయాణం చేస్తోందని గుర్తించాలి.

**వ్యవసాయ కూలీ:**

పాలేరు వృత్తిని మినహాయిస్తే దళితుల మరో ప్రధాన వృత్తి వ్యవసాయకూలీ. దేశవ్యాప్తంగా రైతాంగం క్రమక్రమంగా భూమి నుంచి నెట్టివేతకు గురౌతూ కూలీ జనాభాలో చేరుతున్నారు. 90వ దశకం వరకూ ఈ కూలీ జనాభా ప్రాథమికంగా వ్యవసాయరంగంలోకే వచ్చిచేరేది. తొలి నుంచీ భూమి మీద ఎటువంటి హక్కులూ లేని దళిత జనాభా వ్యవసాయ కూలీలుగానే వున్నారు.

1971లో జిల్లాలో మొత్తం వ్యవసాయకూలీల సంఖ్య 4,13,538. దళిత వ్యవసాయ కూలీల సంఖ్య 97,740 అంటే మొత్తం కూలీలలో దళిత వ్యవసాయ కూలీల శాతం 23.63. దళిత వ్యవసాయ కూలీల సంఖ్య అత్యధికంగా 1991లో 1,13,213గా నమోదైంది. ఈ సంవత్సరంలో మొత్తం వ్యవసాయ కూలీల సంఖ్య 6,04,164. దళిత వ్యవసాయ కూలీల శాతం 1991లో 18.74కి తగ్గింది. ఇక 2001 నాటికి నికర సంఖ్యలో కూడా తగ్గుదల వచ్చింది. నికరంగా వ్యవసాయ కూలీల సంఖ్య 82,238 కాగా నికర తగ్గుదల 30,975. మొత్తం వ్యవసాయ కూలీలలో దళిత వ్యవసాయ కూలీల శాతం 2001 నాటికి 10.02 శాతానికి పడిపోయింది.

మొత్తంగా దళితుల వృత్తిపరంగా వ్యవసాయం నుంచి రైతుగానూ, వ్యవసాయ కూలీగానూ కూడా తగ్గుదల కనిపించడాన్ని చూస్తాం.

దాదాపుగా జిల్లాలో 1970 తర్వాత వ్యవసాయ కార్మికుల కోసం ప్రత్యేకించి గ్రామీణ ప్రాంతాలలో ఎటువంటి ఆందోళనలూ జరిగిన దాఖలాలు లేవు. మరీ నిర్దిష్టంగా పరిశీలించిన గ్రామంలో ఏనాడూ వ్యవసాయ కార్మికుల వేతనాల కోసం ప్రజలను సంఘటితం చేయలేదు. దీనితో కూలీ నిర్ణయం జిల్లాలో ఆయా గ్రామాలకు చెందిన శూద్ర అగ్రకులాలుగా తమను తాము పరిగణించుకునే కళింగ, కొప్పుల వెలమ, తూర్పు కాపు, పోలినాటి వెలమలకు చెందిన ధనిక రైతాంగపు దయాదాక్షిణ్యాల మీదనే 90వ దశకం చివరి వరకూ, 2000 సం॥ తొలి సంవత్సరాల వరకూ సాగేది.

వ్యవసాయ కూలీల వేతనాలను పరిశీలించినపుడు "ఆంధ్రప్రదేశ్‌లో 1970-71లో వ్యవసాయ కూలీల దినవేతనం 2-70 పైసలు. 1984-85లో ఈ వేతనం రూ॥ 10-41పైకి చేరుకుంది. ఆంధ్రాలో కనీస వేతనాల చట్టం తయారు చేసే రూపకర్తలకే కనీస వేతనాలను న్యాయమైన వేతనాలుగా నిర్ణయించనక్కరలేదనే అభిప్రాయం బలంగా ఉంది. ఈ కమిటీలో సభ్యులు కూలీ నిర్ణయం గురించి ఇలా మాట్లాడారు "జాతీయ ఆదాయం చాలా తక్కువగా ఉంది. అందుకని న్యాయసూత్రాల ప్రకారం వ్యవసాయకూలీలకు వేతనాలు ఎక్కువగా నిర్ణయిస్తే అది దేశ ఆర్థిక వ్యవస్థనే తలక్రిందులు చేస్తుంది. వ్యవసాయాభివృద్ధికి పెద్ద అవరోధం అవుతుంది." (ఆధారం: ఎకనమిక్ అండ్ పొలిటికల్ వీక్లీ : జూన్ 14-21 1980: షామ్ ఆఫ్ మినిమమ్ వేజెస్)

విస్తారమైన ప్రాంతాలలో విస్తరించి ఉన్న గ్రామాలు, అవిద్య, అమాయకత్వం, సాంఘిక, ఆర్థిక పీడనలతో నలిగిపోతున్న గ్రామీణ వ్యవసాయ శ్రామికులు అందునా దళిత శ్రామికులు తమ జీవనానికి సరిపడే వేతనాల మాటకేమిగానీ, ఆర్థాకలితో బ్రతుకునీడ్చటానికి సరిపడే వేతనాలు కూడా సాధించుకోలేకపోయారు.

వ్యవసాయ కార్మికులకు ప్రభుత్వం నిర్ణయించిన కూలీరేట్లు అమలు కానిస్థితి ఒకటున్నది. నిర్దిష్టంగా ఈ జిల్లాను పరిశీలించినపుడు 2000 సంవత్సరం తర్వాతనే వేతనాలలో సాపేక్షకంగా పెరుగుదలను చూస్తాం. అయితే నిజవేతనాల స్థాయిలోనూ, జిల్లాలో వ్యవసాయ ఉత్పత్తుల పెరుగుదల ప్రాతిపదికగానూ చూస్తే వేతనాలలో పెరుగుదల స్వల్పం అని అర్థం అవుతుంది.

వ్యవసాయరంగంలోకి ఎరువులు, నీటిపారుదల సౌకర్యాలు, బ్యాంకింగ్ ఋణ సౌకర్యాలు, గిట్టుబాటు ధర, ఉత్పత్తిలో పెరుగుదల ఇలా ఎన్ని వచ్చినప్పటికీ రైతాంగంకే ఆ పెరుగుదల లాభాలన్నీ దక్కాయికానీ భూమిపై కూలీ చేసి జీవించే వ్యవసాయ కార్మికులకు అందులో న్యాయమైన వాటా ఏమీ దక్కలేదు.

వ్యవసాయ కార్మికులకు నిజ వేతనాలు పెరగలేదనే విషయాన్ని తన పరిశోధన ద్వారా ప్రొఫెసర్ జి. పార్థసారధి "స్టేగ్నేషన్ ఆఫ్ రియల్ వేజెస్" అనే వ్యాసంలో శాస్త్రీయంగా నిరూపిస్తూ "అంకెలలో కూలీ రేట్లు పెరిగినట్లు అనిపించినా నిజ వేతనాలను గమనంలోకి తీసుకుంటే వేతనాలు యథాతథంగానే ఉన్నాయని చెప్పక తప్పదు" అని చెప్పారు. (రియల్ వేజెస్ ఆఫ్ అగ్రికల్చరల్ లేబర్ ఇన్ ఆంధ్రప్రదేశ్ : టు డికేడ్స్ ఆఫ్ స్టేగ్నేషన్ : ఇ.పి.డబ్ల్యు : జులై 31, 1982 పేజి 1248)

వ్యవసాయ కూలీ వేతనాలలో ఈ స్తబ్ధతకు కారణం ప్రాథమికంగా శ్రామిక ప్రజానీకం సంఘటితం కాకపోవడమే. వేతనాలలో స్త్రీ, పురుషుల మధ్య నేటికీ వ్యత్యాసం కొనసాగుతోంది. పురుషుడి వేతనంలో స్త్రీలకు సగమే లభ్యమవుతున్నది. నేడు జిల్లాలో విస్తారంగా పండిస్తున్న పత్తిపంటలో మహిళలకు కేవలం 50 రూ॥లు మాత్రమే కూలీ వస్తోంది. అయితే ఎక్కువ పనిదినాలు లభిస్తున్నాయన్న 'సంతృప్తి'ని జిల్లాలో మహిళలు ప్రదర్శిస్తుండడమే వాళ్ల దైనస్థితిని తెలియజేస్తుంది.

వ్యవసాయ కార్మికులకు ఈ మాత్రం వేతనాలు పెరగడానికి కారణం వ్యవసాయ రంగంలో యాంత్రీకరణ. వ్యవసాయ రంగంలో కూలీల వేతనాల ఖర్చును తగ్గించుకోవడానికి, కూలీల బేరమాడే శక్తి ఏమాత్రం ఉన్నా దాన్ని నిరోధించడానికి రైతాంగం రెండు మార్గాలను ఎంచుకొంది. పొరపాటున ఏ గ్రామ కూలీలైనా వేతనాలు పెంచమని కోరితే ప్రక్క గ్రామాల నుంచి కూలీలను తెచ్చి పనిచేయించుకోవడం లేదా యంత్రాలను కనీసస్థాయిలో ప్రవేశపెట్టి శ్రమకు ప్రత్యామ్నాయంగా యంత్రాలను చూపించి తక్కువ ధరలతో కూలీ పనులు చేయించుకోవడం అనేది ఈ వ్యూహాలకున్న రెండు ముఖాలు. అయితే నేటి దశకి వచ్చేసరికి ఆచరణలో అవి రైతాంగాన్నే దెబ్బతీసాయి.

యంత్రాలను ఒక దశలో ప్రధానంగా ట్రాక్టర్ రూపంలో 1990 దశకం తొలినాళ్లలో రైతాంగం ప్రవేశపెట్టింది. దీనితో ఒకవైపున ట్రాక్టర్లు పెరిగేకొద్ది కూలీలు గ్రామీణ ప్రాంతాలను వదిలి పట్టణాల బాటపట్టారు. దీనితో కూలీల కొరత తీవ్రమై కూలీరేట్లు సాపేక్షంగా పెంచాల్సివచ్చింది. దీనితో కూలీరేట్ల ఖర్చును తగ్గించడానికి ప్రత్యామ్నాయ పంటలు అంటే తోటలు, పామ్‌ఆయిల్ వైపు ధనిక రైతాంగం అడుగులు వేసింది. ఇలా పరస్పర సర్దుబాట్లతో గ్రామీణ ప్రాంతాల కూలీలు ప్రత్యేకించి ప్రత్యామ్నాయ ఆర్థిక అవకాశాలు కల్పించిన బస్తీలు, పట్టణాలు, నగరాలకు తమ ప్రయాణం సాగించారు.

ఈ వ్యాసం *పల్లెను మింగిన పెట్టుబడి: గ్రామీణ ఆర్థికం; ఒక పరిశోధన*, పీకాక్ బుక్స్, హైదరాబాద్, 2013 పే. 301-338.

# రైతాంగ సమస్య అప్పుడూ-ఇప్పుడూ

## (హెన్రీ బెర్న్‌స్టీన్)

**యూరప్‌లోనూ యూరపేతర దేశాలైన జపాన్, అమెరికా, రష్యా మరియు కొన్ని వర్ధమాన దేశాలలో జరిగిన జరుగుతున్న వ్యావసాయిక సమాజాల్లో వచ్చే మార్పులనూ, పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధి క్రమాన్నీ టి.జె.బైర్స్ తన జీవితకాల రచనల్లో విస్తృతంగా విశ్లేషించాడు. బైర్స్‌కి గౌరవార్థం ప్రచురించిన సంకలనంలో, టి.జె బైర్స్ రచనల్ని తనదైన విమర్శనాత్మక దృష్టితో అతని శిష్యుడు బెర్న్ స్టీన్ రాసిన సమీక్షా వ్యాసం ఇది. పెట్టుబడిదారీ విధానం ఆవిర్భవించే క్రమంలో వ్యవసాయ రంగంలో వచ్చే సమస్యలకు మూలం – వ్యవసాయం నుంచి వచ్చే అదనపు విలువను పారిశ్రామికీకరణకు మళ్ళించటంలో ఉంది – అని బెర్న్ స్టీన్ ప్రతిపాదిస్తాడు. ఈ క్రమం కొన్ని దేశాలకు మాత్రమే పరిమితం కాదనీ ప్రపంచ వ్యాప్తంగా జరుగుతోందనీ, దీనికి పెట్టుబడిదారీ వ్యవస్థలతోపాటు సోషలిస్ట్ వ్యవస్థలు కూడా మినహాయింపు కాదని కూడా అతడు అన్నాడు. వ్యవసాయ రంగంలో ఉత్పత్తి సంబంధాలు పూర్తి పెట్టుబడిదారీ సంబంధాలుగా పరిణమించకముందే – ప్రపంచీకరణలో భాగంగా వివిధ దేశాల ఆర్థిక వ్యవస్థలు ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థకు అనుసంధానించ బడుతున్నప్పుడు వ్యవసాయ రంగంలో వచ్చే రైతుల, శ్రామికుల సమస్యలను మరింత లోతుగా పరిశీలించాల్సి ఉంటుందని బెర్న్ స్టీన్ భావించాడు. –సంపాదకులు**

"సామాజిక మార్పులను పారిశ్రామిక రంగం, పట్టణ పెట్టుబడిదారీ వర్గం ఎక్కువగా ప్రభావితం చేస్తున్నప్పుడు వ్యవసాయ సమస్య అంతగా పట్టించుకోవాల్సిందిగా కనిపించదు"(టి.జె.బైర్స్, 1991:12)

"వ్యవసాయ సమస్య ప్రధానంగా అంతకు ముందున్న ఉత్పత్తి విధానం నుంచీ పారిశ్రామికీకరణ అభివృద్ధి చెందే సంధి దశకు సంబంధించినది" (లెనిన్ మరియు నియోకాస్మోస్ 1989: 243.

**వ్యవసాయ పరిణామ క్రమం:**

వర్తమాన పేద దేశాల్లో ఏర్పడుతున్న వ్యవసాయరంగంలోని సంక్షోభాలను అర్థం చేసుకోవటానికి టి.జె.బైర్స్ రచనలు, ఆయన విశ్లేషణా పద్ధతీ ఉపయోగపడతాయని బెర్న్‌స్టీన్ అభిప్రాయం. తనకన్నా ముందున్న ఆర్థికవేత్తలు కొన్ని ప్రయత్నాలు చేశారు గానీ, అవి అనేక పరిమితులతోనూ, లోపాలతోనూ ఉన్నాయనీ, తరచుగా మూస పద్ధతులుగా తయారయ్యారనీ బైర్స్ భావించాడు. అప్పటిదాకా వ్యవసాయరంగ సంక్షోభాన్ని అర్థం చేసుకోవటానికి మూడు ప్రధాన ఆలోచనా ధోరణులు ఏర్పడి ఉండటాన్ని బైర్స్ గుర్తించాడు.

**మొదటిది:** రైతు జనాభా అత్యధికంగా ఉన్న దేశాలలో అధికార సాధన కోసం పారిశ్రామిక రంగంలోని కార్మికులతో వారి ఐక్యత ఎలా ఉండాలని ఆలోచించిన యూరోపియన్ మార్క్సిస్టుల ప్రయత్నం. ఎంగెల్స్ చేసిన పని సరిగ్గా ఇదే.

**రెండవది:** వ్యవసాయరంగం పారిశ్రామిక రంగాల మధ్య సంబంధాలు, వాటిలోని మార్పులూ గడ్డకట్టుకున్నట్టు ఒకేలా ఉండవనీ, వివిధ దశలలో వివిధ రకాలుగా ప్రతిఫలిస్తూ ఉంటాయని నొక్కి చెప్పిన కౌట్స్కీ. నిజానికి రష్యాలో వ్యవసాయక సమాజం ఘనీభవించిందనీ అక్కడ పెట్టుబడిదారీ సంబంధాలకు స్థానం లేదనీ భావించిన నారోద్నిక్కులతో విరోధిస్తూ చేసిన సైద్ధాంతిక చర్చలో లెనిన్ కౌట్స్కీ అవగాహనతో ఏకీభవించాడు. రష్యాలో వ్యవసాయ రంగంలో పెట్టుబడిదారీ సంబంధాలు అప్పటికే కావల్సినంతగా ఏర్పడ్డాయని లెనిన్ వాదించాడు. వ్యవసాయ రంగంలోని శ్రామికులు వివిధ వర్గాలుగా విభజించబడ్డారనీ, ఉమ్మడి యాజమాన్యం స్థానంలో చిన్న కమతాలూ, వాటి హక్కుదార్లూ ఎదగటం, వేతన సంబంధాలు ఏర్పడ్డాయని లెనిన్ నిరూపించాడు.

**మూడవది:** సోవియట్ యూనియన్ ఏర్పడిన తరువాత వ్యవసాయ మిగులును తక్కువ ధరకే పారిశ్రామికీకరణ కోసం వినియోగించి పరిశ్రమలను అభివృద్ధి చేయటం. నిజానికి వలస ప్రాంతాలుగా ఉండి తర్వాత స్వతంత్ర రాజ్యాలుగా ఏర్పడిన భారతదేశం వంటి దేశాల్లో 1960ల వరకూ జరిగింది కూడా ఇదే. గ్రామాల్లో పెట్టుబడిదారీ సంబంధాలు పూర్తిగా అభివృద్ధి చెందినా, చెందకపోయినా పారిశ్రామికీకరణలో వ్యవసాయరంగం నిర్వహించిన ముఖ్యమయిన పాత్రలోనే వ్యవసాయ పరిణామం కూడా ఉందని బైర్స్ నొక్కి చెప్పాడు. అంటే పరిశ్రమలు ఎదగటంలో పెట్టుబడిదారీ సంబంధాలు (పెట్టుబడీ, వేతన కూలీలు) ప్రధాన పాత్ర వహిస్తాయని అర్థం.

మొదటి, రెండవ మార్గాల సందర్భం లేకుండా కూడా మూడవ మార్గంలో వ్యవసాయ సమస్య పరిష్కారం సాధ్యమవుతుందని బైర్స్ భావించాడు. అంటే వ్యవసాయరంగంలో పెద్ద (పెట్టుబడిదారీ) కమతాల పక్కనే చిన్న చిన్న కమతాలూ కొనసాగుతూ ఉండవచ్చు. వ్యవసాయం తన మిగులును తరలిస్తూ పారిశ్రామికరణకు దోహదపడుతూ ఉంటుంది. పారిశ్రామికీకరణకు అడ్డంకి కానంత వరకూ ఈ సమాంతర క్రమం నడుస్తూనే ఉంటుంది. సామాజిక మార్పులను పారిశ్రామిక రంగం, పట్టణ పెట్టుబడిదారీ వర్గం ఎక్కువగా ప్రభావితం చేస్తున్నంత కాలం వ్యవసాయరంగంలో సంక్షోభం అంతగా పట్టించుకోవాల్సినంత రాజకీయ సమస్యగా వారికి కనిపించదు.

పై మూడు పద్ధతులకూ AQ1, AQ2, AQ3 అని పేరుపెట్టాడు బెర్న్ స్టీన్.

AQ1 ని వదిలేసి మిగతా రెంటినీ లోతుగా పరిశీలించటం ఆర్థికవాదంగా కనిపించవచ్చు కానీ, ఇప్పటి పరిస్థితులలో లోతైన రాజకీయ విశ్లేషణకు అది తప్పనిసరి అని ఆయన భావించాడు. అయితే రైతు జనాభా అధిక సంఖ్యలో ఉన్నప్పుడు AQ1ను తప్పక పరిగణించాల్సిందని ఆయన అభిప్రాయపడ్డాడు.

**వ్యవసాయ పరిణామ క్రమంలో వివిధ మార్గాలు:**

బైర్స్ చేసిన విశ్లేషణ రూపంలోనూ, సారంలోనూ వైవిధ్యభరితమయినదని బెర్న్‌స్టీన్ అభిప్రాయం. ప్రధానంగా ఆరు దేశాల్లో జరిగిన చారిత్రక పరిణామాల మీద ఆధారపడి బైర్స్ విశ్లేషణ సాగింది. అవి ఇంగ్లండు, ఫ్రాన్స్, జర్మనీ, ఉత్తర అమెరికా, జపాన్ ఇంకా సౌత్ కొరియా / తైవాన్.

**ఇంగ్లండ్:** అక్కడ భూస్వాములూ, పెట్టుబడిదారీ మధ్య రైతులు (వారు కౌలు రైతులు కూడా అక్కడ) స్వేచ్ఛా శ్రమ జీవులుగా ఏర్పడటం సాధ్యం కావడంతో పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి చెంది ఆ తర్వాత పారిశ్రామిక విప్లవానికి దారితీసింది.

**ఫ్రాన్స్:** ఫ్రెంచ్ రివల్యూషన్ నేపథ్యంలో భూస్వామ్య విధానం రద్దు అయి, చిన్న రైతుల పెట్టుబడిదారీ విధానం అమలులోకి వచ్చింది. ఫ్రాన్స్ ఉత్తర ప్రాంతంలో పెద్ద పెట్టుబడిదారీ కమతాలు ఏర్పడినప్పటికి మొత్తంగా చూస్తే పారిశ్రామికీకరణలో ఈ కమతాల కంటే వర్తకం, వలస దోపిడి అక్కడి పారిశ్రామిక పరివర్తనకు ప్రాథమిక చోదక శక్తులు. వ్యవసాయ రంగం పాత్ర పరిమితమే.

**జపాన్:** 1868 ప్రాంతంలో భూస్వాములు తీవ్ర స్థాయిలో దోపిడి కౌలుదార్లను అపరిమితమైన దోపిడి చేసిన దరిమిల జరిగిన ఘర్షణల కారణంగా ప్రభుత్వం అక్కడి భూస్వాముల అధికారాలకు కళ్ళెం వేసింది. దీనివల్ల భూస్వాములే పెట్టుబడులు పెట్టి కౌలుదార్లను ఆకర్షించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో వ్యవసాయరంగంలో పెట్టుబడిదారీ సంబంధాలు వచ్చి, మిగులు ఉత్పత్తులను సాధించి తద్వారా పారిశ్రామికీకరణకు ఉపకరించాయి.

**సౌత్ కొరియా / తైవాన్:** సుదీర్ఘకాలం సామ్రాజ్యవాదానికీ భూస్వామ్యానికీ లోబడి ఉన్న ఈ దేశాల్లో రెండవ ప్రపంచ యుద్ధానంతరం విముక్తి తర్వాత 1950 ప్రాంతంలో జరిగిన జరిగిన భూసంస్కరణల ఫలితంగా స్వేచ్ఛా శ్రమ జీవుల వలసలు జరిగాయి. అలా గ్రామాల్లో అధిక ఉత్పత్తులను పట్టణాలకు తరలించటం వల్ల అక్కడి వేతన శ్రమ చౌకగా లభించి పారిశ్రామికీకరణకు సహాయపడింది.

**ప్రష్యా:** నెపోలియన్ ప్రష్యాను ఓడించాక అక్కడ జరిగిన సంస్కరణల ఫలితంగా జంకర్ భూస్వాములు తమ పెద్ద కమతాల్లో పెట్టుబడులు పెట్టి మరింతమంది స్వేచ్ఛా శ్రమజీవులకు పని కల్పించి పెట్టుబడిదారీ రైతులుగా మారాల్సి వచ్చింది. జర్మనీ దేశం ఐక్యమయ్యాక జరిగిన పారిశ్రామికీకరణ వల్ల వ్యవసాయరంగంలో మార్పులు కూడా మరింత వేగవంతమయ్యాయి. అయితే ఆర్థిక, రాజకీయ రంగాల్లో జంకర్ భూస్వాముల అధిపత్యం కొనసాగుతూనే వచ్చింది. నాజీలకు మద్దతుగా అక్కడి వ్యవసాయ జనాభాను కూడకట్టటంలో వారి పాత్ర చాలా పెద్దది.

**జర్మనీ:** ఇక్కడ AQ2ని పరిష్కరించాక AQ1 జరిగింది. తద్వారా అది AQ3కి దారి తీసింది.

**యు.ఎస్:** అంతర్యుద్ధం జరిగి అమెరికా దక్షిణ రాష్ట్రాల్లో బానిస వ్యవస్థ రద్దయ్యేవరకూ అక్కడ పెట్టుబడి ఎదగటానికి ఆ బానిసత్వం సహాయపడింది. అలా బానిసత్వం రద్దుతో AQ1 పరిష్కరించబడింది. కానీ AQ2 AQ3 పరిష్కరించటానికి సుదీర్ఘకాలం పట్టింది. AQ2లో భాగంగా అక్కడి తోటల యజమానులు తమ పొలాలను పూర్వపు బానిసలకే కౌలుకివ్వటం చేశారు. ఆ రకంగా ఈ నల్లజాతి కౌలుదారులు ఈ అర్థ శతాబ్దం కడుపులు మాడ్చుకుని మిగులు ఉత్పత్తి చేసి పారిశ్రామిక రంగానికి పరోక్షంగా ఊడిగం చేశారు.

19వ శతాబ్దంలో అమెరికా రాష్ట్రాల్లో అప్పులతో ముడిపడి ఉన్న వ్యవసాయ విధానాన్ని ఇతర దేశాలతో పోల్చి పరిశీలించాడు బైర్స్ (అలా ఈ నేపథ్యంలో ముడిపడి ఉన్న భారత ఆర్థిక విధానాన్ని 'సెమీ ఫ్యూడల్' అని 1960లలో నిర్వచించారు అమిత్ బాధురి (1976) భరద్వాజ్ (1978)) అమెరికాలో బానిసత్వం రద్దు తర్వాత యాంత్రీకరణ, ఆధునిక పద్ధతులు, బాంకు రుణాల సౌలభ్యత వల్ల 1920ల వరకూ ఈ కుటుంబ కమతాల ద్వారానే రైతలు అత్యధిక ఉత్పత్తులు సాధించగలిగారు. కానీ 1929లో వచ్చిన గ్రేట్ డిప్రెషన్ వల్ల పంటల ధరలు పడిపోవటం, చిన్నా, పెద్దా రైతులు కుప్పకూలిపోవటం జరిగింది. అలా మొదటి ప్రపంచ యుద్ధం వరకూ అమెరికన్ పెట్టుబడిదారి వ్యవసాయ రంగం పారిశ్రామికీకరణకు ఎంతో తోడ్పడింది.

అలా యు.యస్, జర్మనీ రెండు చోట్లా పారిశ్రామికీకరణ కోసం వ్యవసాయ రంగం అనేక తప్పనిసరి పెట్టుబడిదారీ పరిమాణాలకు గురికావల్సి వచ్చింది. కాబట్టి చరిత్రలో రెండు మార్గాలు కనిపిస్తాయి: వ్యవసాయంలో పెట్టుబడిదారీ విధానం ముందురావడం (ఇంగ్లండులాగ), రెండవది ఆలస్యమైన పారిశ్రామిక పెట్టుబడి విధానం అందుకోవడం కోసం (రాజ్యం ప్రమేయంతో) వ్యవసాయ పెట్టుబడి అనుబంధాలు మారి మొదటి దానికి ఆయువుగా తయారుకావడం.

**ప్రపంచ వ్యాపిత అసమాన అభివృద్ధి:**

పెట్టుబడిదారీ విధానం యూరప్‌తో ప్రారంభమయినప్పటికీ, ప్రపంచ వ్యాప్తంగా వేరు వేరు చోట్ల వేరు వేరు స్థాయిల్లో జరుగుతున్న దాని విస్తరణా క్రమాన్ని ఎలా అర్థం చేసుకోవాలన్నది మొదటి సమస్య. ఆ విస్తరణ వల్ల వేరు వేరు దేశాల్లో జరుగుతున్న పరిణామాలనూ, అదే సమయంలో ప్రపంచ అభివృద్ధిలో భాగంగా వాటిని చూడవలసి రావటం ఇంకో సమస్య. పశ్చిమ దేశాల్లోనూ, జపాన్‌లోనూ అవి ఇతర ప్రాంతాలను ఆక్రమించటం, ప్రపంచ దేశాలతో వ్యాపారం, వలస దేశాల దోపిడీ వల్ల అక్కడ వ్యవసాయ రంగంలో మార్పులు విజయవంతమయ్యాయి. తైవాన్, ఉత్తర కొరియాల్లో మాత్రం కోల్డ్ వార్ సమయంలో ఆ వలస దేశాలు లేకపోయినా, అమెరికా–జపాన్ భాగస్వామ్యం సహకారంలో పెరిగిన పెట్టుబడి విధానంతో భాగమై పరిణామం చెందడం.

యూరోప్‌కి వలస ప్రాంతాలుగా మారిన ఆసియా, ఆఫ్రికా దేశాలు వేరు వేరు చారిత్రక దశల్లో ప్రపంచ వ్యాపారంలో భాగమయ్యాయి. అందువల్ల ఒక్కో వలస దేశంలో ఒక్కొక్క రకమయిన పరిణామాలు సంభవించాయి. మొత్తంగా చూస్తే ఈ అన్ని దేశాలూ 1940ల నుంచీ 1960ల లోపు స్వతంత్ర దేశాలుగా మారే వరకూ, అక్కడి వ్యవసాయరంగంలో మార్పులూ, పారిశ్రామికీకరణా చోటుచేసుకోలేదు.

ఈ వలస దేశాల్లో పారిశ్రామికీకరణకూ, అంతుకుముందు ఇతర దేశాల్లో జరిగిన పారిశ్రామికీకరణకూ చాలా తేడా ఉంది. స్వతంత్రం వచ్చాక అక్కడి జాతీయ ప్రభుత్వాలు అనేక అభివృద్ధి ప్రణాళికలు వేసుకున్నా, అందుకు కావలసిన పెట్టుబడి సమీకరించటంలో అంతకుముందు సామ్రాజ్యవాద దేశాలకున్న అవకాశం వాటికి లేకుండా పోయింది. అందువల్ల వేరు వేరు స్థాయిల్లో పారిశ్రామికీకరణ జరిగింది. ఆ దేశాల్లో వ్యవసాయరంగం ఈ పారిశ్రామికీకరణకు దోహదపడినా, అడ్డుపడినా, లేక తటస్థంగా ఉన్నా, దాని ఫలితం ఎలా వచ్చినా వ్యవసాయ రంగానికీ, పారిశ్రామిక రంగానికీ ఉన్న పరస్పర సంబంధాలే వ్యవసాయ సమస్యకూ అదే విధంగా పారిశ్రామిక సమస్యకూ మూలం అని చెప్పవచ్చు. ఈ సంబంధాలను ప్రపంచ పెట్టుబడీ, మార్కెట్లూ ప్రభావితం చేస్తూ వచ్చాయి.

క్లుప్తంగా చెప్పాలంటే ఒక శతాబ్దానికి పైగా ఉనికిలో ఉన్న సామ్రాజ్యవాదం వ్యవసాయరంగంలో జరగాల్సిన అభివృద్ధి కంటే పారిశ్రామికీకరణకే ఎక్కువ దోహదపడింది. సామ్రాజ్యవాదానికి లోబడిన పేద దేశాల్లో వ్యవసాయ రంగం పారిశ్రామిక రంగానికి చేసిన సహాయం కూడా వేరు వేరు స్థాయిల్లో ఉండింది.

ఇంతకీ మనం ఈ రోజు ఏ పేద దేశాల గురించి మాట్లాడుతున్నాం?

సబ్ సహారన్ ఆఫ్రికా, కాంటినెంటల్ సౌత్ ఏసియా దేశాల గురించి. ఈ దేశాల్లో పారిశ్రామికీకరణ పెద్ద స్థాయిలో ఏమీ చోటుచేసుకోలేదు. గత శతాబ్దాలతో పోలిస్తే ఈ దేశాల్లోని పురోగతి గతుకుల మార్గంలో ఒక్కోసారి వెనక్కీ ముందుకీ జరిగింది. దక్షిణ అమెరికా, ఆసియా దేశాల్లో జరిగిన పరిణామాలు కూడా 18, 19 శతాబ్దాలతో పోలిస్తే విభిన్నంగా ఉన్నాయి.

దీనర్థం ప్రపంచ జనాభాలో సగానికి పైగా ఉన్న ఈ ప్రాంతాలు వ్యవసాయిక సమాజాలు అని కానీ, అక్కడ ఏ మార్పులే చోటుచేసుకోలేదనీ కాదు. నిజానికి గత శతాబ్దంలో ఈ ప్రాంతాల్లో చెప్పుకోదగిన మార్పులు చాలా జరిగాయి.

ఈ సందర్భంలో MC మైఖేల్, ఫ్రైడ్ మాన్‌ల రచనలు చాల సహాయపడతాయని బెర్న్ స్టీన్ భావించాడు. 18వ శతాబ్దం నాటికే వలస పాలనలో ఉన్న ఈ అతి పెద్ద భూభాగాల నుంచి వ్యవసాయ ఉత్పత్తి ప్రపంచ వినియోగానికి అందుబాటులోకి వచ్చింది. ఫలితంగా ప్రపంచ వ్యవసాయ రంగంలో మూడు దశలుగా మార్పులు సంభవించాయి.

**మొదటి దశ:** ఈ దశలో 1814 నుంచీ 1914 వరకూ రెండవ ప్రపంచపు (అమెరికా, సౌత్ ఆఫ్రికా, ఆసియా, ఆస్ట్రేలియా) దేశాల్లో వ్యవసాయిక ఉత్పత్తి యూరోప్ పారిశ్రామిక రంగానికి అనుసంధానించబడింది. ఈ దశలోనే స్వేచ్ఛా వర్తకం ఒక పక్క అనేక అవకాశాలను సృష్టించింది. మరో పక్క పారిశ్రామికీకరణకు దారులు వేసేందుకు అసమాన మారక విధానాన్ని తయారు చేసింది. మొదటి ప్రపంచ యుద్ధంతో ఈ మొదటి ప్రపంచస్థాయి ఆహార ఉత్పత్తి దశ ముగిసినట్టయింది. ఈ దశలో ప్రపంచ ఆర్థిక సంక్షోభం (గ్రేట్ డిప్రెషన్) వల్ల అప్పటికే పారిశ్రామికీకరణ జరిగిన అమెరికా కంటే వ్యవసాయ ఆధారిత దక్షిణ అమెరికా, ఇంకా ఆసియా ప్రాంతాలు ఎక్కువగా దెబ్బ తిన్నాయి.

**రెండవ దశ:** రెండో ప్రపంచ యుద్ధం ముగిసిన తర్వాత 1945 నుంచీ అమెరికా ప్రపంచ పెట్టుబడిదారీ కేంద్రమయిన నేపథ్యంలో రెండవ ఆహార ఉత్పత్తి దశ మొదలయ్యింది. తన పాలసీలో భాగంగా అధిక ఆహార మిగులు ఉత్పత్తిని అమెరికా తన మిత్ర దేశాలకు తరలించటం మొదలుపెట్టింది. కానీ ఈ సమయంలోనే వలస దేశాలు విముక్తి చెందటంతో అక్కడ కూడా పారిశ్రామికీకరణ మొదలై ఆహార ఉత్పత్తిలో కొత్త దశ మొదలయ్యింది. మెరుగైన మౌలిక సదుపాయాలు, కొత్త సాంకేతికత, రుణాల లభ్యత, ఆహార ధరలకు గిట్టుబాటు ధరలు వంటి విధానాల వల్ల ఆ దేశాల్లో కూడా పారిశ్రామికీకరణకు అవసరమయిన ప్రాథమిక పెట్టుబడికి వ్యవసాయరంగం తోడ్పడింది. 1980ల్లో రెండవ ప్రపంచీకరణలో భాగంగా ప్రపంచ ఆర్థిక సంస్థలు ఏర్పడటంతో ఈ దశ ముగిసింది.

**మూడవ దశ:** ఇప్పుడు జరుగుతున్న మూడవ దశలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ఆహార సేకరణకు మల్టీనేషనల్స్ కోసం చిన్న తరహా వ్యవసాయ ఉత్పత్తిదారులు అనుసంధానించబడి ఉన్నారు. పారిశ్రామిక పెట్టుబడి కోసం గ్లోబల్ పెట్టుబడి అనుసంధానం అయింది. కాబటి, వ్యవసాయం నుండి వచ్చే మిగులుపై ఈ దేశాల్లో పారిశ్రామిక పెట్టుబడి ఆధారపడట్లేదు. ఈ ఇరవయ్యో శతాబ్దపు పెట్టుబడిదారీ విధాన నియంత్రణ వల్ల సార్వభౌమత్వాన్ని సంపాదించిన దేశాల రాజకీయ వ్యవస్థలు కూడా ఈ ఉత్పత్తిదారులకు పెద్ద అవకాశాలేమీ ఇవ్వలేవు. పైగా సమకాలీన సాంకేతిక పరిజ్ఞానంతో ఎక్కువగా ఉద్యోగాలు సృష్టించబడవు కాబట్టి, వ్యవసాయ ఆధారిత జనాభా ఆరంగంలోనే చిక్కుబడి ఉండాల్సి ఉంటుంది. ఇక వ్యవసాయ సమస్యను జాతీయ పరిధిలో కాక ఒక అంతర్జాతీయ పరిధిలో చూడాల్సొస్తుంది.

అంతర్జాతీయ పెట్టుబడి వ్యవసాయం లోకి దాని మిగులును లాక్కోవటానికి అగ్రి బిజినెస్ రూపాల్లో వస్తుంది. వర్తకం, ఫైనాన్స్, మిల్లులు, ఎరువుల డీలర్షిప్, రిటైల్ ట్రేడ్ వంటి వాటిలోకి అది ప్రవేశిస్తుంది కానీ, అసలు పంట ఉత్పత్తి

ప్రక్రియను మాత్రం అది చిన్నతరహా వ్యవసాయ ఉత్పత్తిదారులకే వదిలిపెడుతుంది. తద్వారా దోపిడీ వాటా తను దక్కించుకొని, వ్యవసాయంలో వచ్చే ఒడిదుడుకులనూ, నష్టాలనూ రైతులకే వదిలి పెడుతుంది.

గ్లోబల్ పెట్టుబడి ప్రవేశంవల్ల ఈ దేశాల్లో AQ1, AQ2లను దాటి AQ3 ప్రాసంగికత మాత్రం మిగిలి ఉంటుంది.

**ముగింపు:** వ్యవసాయిక సమస్యకు సంబంధించి అంతకుముందున్న మూడు మార్గాలనూ విశ్లేషించి ఓ కొత్త ఆలోచనను ప్రతిపాదించాడు బెర్న్‌స్టీన్ AQ1, AQ2 AQ3లలో నిర్వచించినట్టు వ్యవసాయరంగంలో పరిణామాలు పారిశ్రామికీకరణకు కావలసిన పెట్టుబడి సమీకరణకు మూలాధారమవుతాయని, వ్యవసాయిక సమస్య పారిశ్రామిక పెట్టుబడితో ముడిపడి ఉందనీ, ఇదే అసలు సమస్య అనీ ఆయన విశ్లేషించాడు. ప్రతిచోటా, దేశాల స్థాయి నుంచీ ప్రపంచ స్థాయి వరకూ, వ్యవసాయిక మార్పులు పారిశ్రామిక పెట్టుబడి చేత నియంత్రించ బడతాయనీ, వ్యవసాయం పారిశ్రామిక పెట్టుబడికి ముడిసరుకుగా మాత్రమే పనికొస్తుందనీ కూడా అన్నాడు. ఈ నేపథ్యంలో వ్యవసాయిక సమస్యను లోతుగా పరిశీలించాలి.


ప్రష్యన్, అమెరికన్ ప్రాంతాల్లోని రాజకీయ, ఉత్పాదక శక్తుల సమస్యలను లెనిన్ చర్చించాడు. అలాంటి ప్రజాస్వామిక మార్గాన్ని రష్యా ఎంచుకొంటే రాబోయే సమస్యల గురించి ఆందోళన చెందాడు. AQ3 లెనిన్ కంత ముఖ్యం కాదు. భూస్వామ్య వర్గాన్ని పడదోసాక శ్రామిక వర్గ ఉత్పాదకత పెరిగినప్పుడు వచ్చే శ్రామిక వర్గ (రైతుకూలీల, కార్మికుల) సమస్యను ఆయన లేవనెత్తాడు.


ఇప్పటికింక వలసానంతర సమాజాలలో పైన పేర్కొన్న అభివృద్ధి కానీ, గ్రామీణ ప్రాంతాల్లో రైతులు (Peasant Capitalism) సాగించే వర్గపోరాటాలు కానీ వ్యవసాయ శ్రామికులను దారిద్ర్యం నుంచీ, దుస్థితి నుంచీ రక్షించలేవు. ఆ పెట్టుబడిదారీ పరిణామం భూస్వామ్య విధాన ప్రభావంలాగ తిరోగమన స్వభావం కలిగి ఉండి చిన్న వ్యవసాయ పురోగతికి అడ్డంకిగా మారుతుంది. మరోపక్క ప్రపంచ స్థాయి వస్తు ఉత్పాదకత ప్రధాన పాత్ర వహించటం వల్ల శ్రామిక ప్రజల పరిస్థితి దయనీయంగా మారుతుంది. వ్యవసాయేతర రంగాలకు తమ అదనపు ఉత్పాదకత తరలించబడటం వల్ల శ్రామికులు చేసే ఏ పోరాటమయినా ఓడిపోబోయే దిశలోనే ఉంటుంది. అయితే తిండి కోసం, ప్రజాస్వామిక హక్కుల కోసం శ్రామిక ప్రజలు చేసే పోరాటాలు వ్యవసాయ సమస్యను ఉపాధి కోణంలో కొనసాగిస్తాయి.

**మూలం:**

హెన్రీ బెర్న్‌స్టిన్ రాసిన 'అగ్రేరియన్ క్వశ్చన్: దెన్ అండ్ నౌ వ్యాసం ఆయన, టామ్ బ్రాస్, ఫ్రాంక్ కాస్ కలిసి సంపాదకత్వం వహించిన "అగ్రేరియన్ క్వశ్చన్స్: ఎస్సేస్ ఇన్ అప్రేసియేషన్ ఆఫ్ టి.జె. బైర్స్" 1996 పుస్తకంలో వచ్చింది.

**అనువాదం : బి. సురేష్**
**సంక్షిప్తీకరణ: ఆర్.వి.రమణమూర్తి**



# పెట్టుబడి, పెట్టుబడేతర విలువ:

## (కల్యాణ్ సన్యాల్)

**నేపథ్యం :** కల్యాణ్ సన్యాల్ వాదనను అర్థం చేసుకోవటం కోసం ఈ క్రింద పేర్కొన్న మార్క్సిస్టు ఆర్థిక సిద్ధాంత నిర్మాణానికి సంబంధించిన పది అంశాలను దృష్టిలో పెట్టుకోవలసి ఉంటుంది.

1. పెట్టుబడికి సార్వజనీనమైన ప్రవృత్తి ఒకటి ఉంటుంది. అది శ్రమనంతటినీ ప్రామాణిక, సమరూప సరుకులా పరిగణిస్తుంది. ఏ శ్రామికుడైనా సరే గంటకింత ఉత్పత్తి చేయాలంతే; ఒకరు లేకపోతే మరొకరు. ఉత్పత్తి ప్రక్రియను యాంత్రీకీకరణ చేసి, శ్రామికుడి దగ్గర ఏ ప్రత్యేకతా, నిపుణతా లేకుండా చేసి, శ్రమను సరళీకరించటం ద్వారా పెట్టుబడి ఈ పని చేస్తుంది. ఇతర ఉత్పత్తి సంబంధాలన్నింటినీ తొలగించి, పెట్టుబడిదారు, వేతన శ్రామికుడి మధ్య కేవలం ఆర్థిక సంబంధం మాత్రమే ఉండేటట్లు చూస్తుంది.

2. పెట్టుబడి, శ్రామికీకరణ చేసే క్రమంలో కార్మికులందరినీ, ఏ నైపుణ్యం లేని, ఒకే విధమైన వేతన శ్రమని అమ్మేవారిగా పరిగణిస్తూ వారిని విస్థాపన చేసింది. తనలో లీనం చేసుకునే ప్రయత్నం చేస్తుంది. అన్ని మానవ లక్షణాలు తొలగించబడిన కార్మికుల యదార్థ జీవితాలు మానవ శ్రమంటే రూపం లేని సాధారణ సరుకు అనే అనే సిద్ధాంతాన్ని ప్రతిబింబించేవిగా మారతాయి.

3. మిగులు విలువను పరిశ్రమలో తిరిగి పెట్టుబడిగా పెట్టాలనే అంతులేని ఆకలి తీర్చుకొనే ప్రక్రియలో పెట్టుబడిదారి విధానం సామాజిక శ్రమ మొత్తాన్ని సమూలంగా మింగేస్తుంది.

4. సంపదను అన్వేషించటానికి వ్యక్తిగత స్వేచ్ఛ కోసం పెట్టుబడిదారీ విధానం అందరికీ సార్వత్రిక మానవ హక్కు (ప్రధానంగా ఆస్తికి హక్కు) లుంటాయనే భ్రమను కల్పిస్తుంది. అయితే చాలా కొద్ది మందికి లభించే ఈ బూర్జువా మానవ హక్కు స్వేచ్ఛారహిత వేతన శ్రామికులని లొంగదీసుకునే దోపిడీపై ఆధారపడి ఉంటుంది.

5. పెట్టుబడిదారీ వ్యవస్థ తన సుదీర్ఘమైన చరిత్రను దాని పూర్వమున్న భూస్వామ్య వ్యవస్థలోని వివిధ రూపాలలో ఉన్న ఆస్తి, సంపద, విధులు, సాంప్రదాయ హక్కులను, దౌర్జన్యపూరితంగా స్వంతం చేసుకునే ఆదిమ పోగుబడితో ప్రారంభిస్తుంది.

6. పరిణితి చెందిన పెట్టుబడి, తన వ్యవస్థలోనే అంతర్గతంగా మిగులు విలువను సృష్టించటం ద్వారా మదుపు చేసుకోవటానికి అవసరమైన సంపదను సృష్టిస్తుంది. ఆదిమ పోగుబడి విధానాన్ని పెట్టుబడికి ముందున్న చరిత్రలోని అవసరమైన పరివర్తన దశగా పరిగణించి, వదిలి పెడ్తుంది.

7. ఏకరీతిన పెట్టుబడిదారీ విధాన ఆధీనంలోనికొచ్చి, దోపిడీ ద్వారా దానిలో లీనం చేయబడిన వేతన శ్రామికులు, ఒకే విధంగా ఆలోచించి, తమ సమిష్టి ప్రయోజనాల ఐక్యత గుర్తించి తమకోసం తాము పోరాడుకునే వర్గంగా తయారు కావటానికి దోహదం చేస్తుంది. అలా అందరూ సమానులుగా ఉండచ్చనే సామాజిక సార్వజనీనతని చరిత్రలో మొట్టమొదటిగా గుర్తించేది శ్రామిక వర్గమే.

8. పరిణితి చెందిన పెట్టుబడిదారీ వ్యవస్థలో కనిపించే సంపద కేంద్రీకరణ, అసమాన పంపిణీ, వాణిజ్య చక్రాల వలన అవసరానికి మించిన ఉత్పత్తి జరిగి, రాజకీయ ఆర్థిక వ్యవస్థలో సంక్షోభానికి దారి తీస్తుంది. ఇదే క్రమంలో తమ అవసరాలకు తగినంత సంపాదించుకోలేని స్థితిలో పేదరికంలోకి నెట్టబడి తమ పైన జరుగుతున్న దోపిడీ గుర్తించిన శ్రామిక వర్గానికి సమానత్వం కోసం కృషి చెయ్యాలనున్న స్వప్నం చివరికి శ్రామిక విప్లవానికి దారి తీస్తుంది.

9. ఈ విప్లవం మనుష్యులందరూ తమకు అవసరమైన వాటిని పొందే నిజమైన సార్వజనీన హక్కును, శ్రేయస్సుని సాధ్యం చేస్తుంది.

10. సైద్ధాంతికంగా కొన్ని భేదాలున్నప్పటికీ (ముఖ్యంగా గ్రామ్స్కీ విషయంలో) మార్క్సిస్టు ఆలోచనా ధోరణిలో పరివర్తన సిద్ధాంతం, పెట్టుబడి కుండే సార్వజనీన లక్షణం, కేంద్ర బిందువులు.

ఈ సార్వజనీన ఆర్థిక పరిణామ సిద్ధాంతంతో ఉండే సమస్య ఏమిటంటే ఇది మూడవ ప్రపంచ దేశాలలో జరిగే పరిణామాల్ని వివరించదు. నిజానికి ఈ రకమైన పరివర్తన చాలా మొదటి ప్రపంచ దేశాలలో కూడ సంభవించలేదు. మొదటి ప్రపంచ దేశాలలో ఆర్థిక పరివర్తన (ప్రధానంగా వ్యవసాయ రంగానికి) గురించి చేసిన సైద్ధాంతిక అధ్యయనాలను ఈ బ్రాడ్‌షీట్‌లో వివిధ వ్యాసాలు సంక్షిప్త రూపంలో పరిచయం చేస్తాయి. ఇవిగాక, భారతదేశంలో వ్యవసాయ రంగంలోని మార్పు గురించి మార్క్సిస్టు అధ్యయనవేత్తల మధ్య జరిగిన వివాదాన్ని ప్రఫుల్ బిద్వయ్ సమీక్ష చర్చిస్తుంది. ఈ వ్యాసం పెత్తందారీ భూస్వామ్య పరిస్థితుల నుండి పెట్టుబడిదారీ వేతన శ్రమకు జరిగే వలసానంతర ఆర్థిక పరివర్తన జరగక తప్పదనే భారతీయ మార్క్సిస్టుల సైద్ధాంతిక ప్రతిపాదనని కల్యాణ్ సన్యాల్ విమర్శిస్తూ చేసిన సైద్ధాంతిక రచనపై ఆధారపడింది.

వలసానంతర మూడవ ప్రపంచ జాతీయ రాజ్యాలలో పెట్టుబడిదారీ వ్యవస్థ పరివర్తన గురించి వివిధ రకాల సైద్ధాంతిక దృక్పథాలు, మార్క్సిజంలోను, మార్క్సిజం బయట కూడా సూత్రీకరించటానికి ప్రయత్నించాయి. ఈ దేశాలలో కూడ పెట్టుబడిదారీ వ్యవస్థ పరివర్తన తప్పనిసరిగా జరుగుతుందనే భావన పైనే ఇవన్నీ ఆధారపడి ఉంటాయి అని సన్యాల్ వాదిస్తారు. వీటిలో కూడా శ్రామిక శక్తి సార్వత్రిక దోపిడీ ఆధారిత సంబంధంలోనికి లాగబడుతోందని, దానిద్వారా మూడవ ప్రపంచ దేశాల ఆర్థిక, సామాజిక వ్యవస్థలలో మార్పుకు ఆధారభూతం అవుతోందనే భావన కూడా ఉంది. శ్రామిక విప్లవం జరుగుతుందనే ఆశ సన్నగిల్లినా, వ్యవస్థలోకి శ్రామికులు పూర్తిగా విలీనం చేయబడి, భూస్వామ్య పరిస్థితులలో కంటే మెరుగైన జీవితాన్ని అనుభవిస్తారనే నమ్మకం ఉంది. అయితే ఈ విధంగా సార్వత్రిక విలీనం జరుగకుండా, పెట్టుబడిదారీ వ్యవస్థకి పరివర్తన జరగని పక్షంలో వచ్చే సైద్ధాంతిక, ఆచరణాత్మక సమస్యలేవిటి?

**తొలి పరిశీలన:** నెమ్మదిగా కిందివారి జీవితాలను మెరుగుపరిచే బ్రెజిల్ ఆర్థిక చిత్రపటం గురించి ఇగ్నేసీసాక్స్ చేసిన పరిశీలనను సన్యాల్ ప్రస్తావిస్తాడు. "బ్రెజిల్ బెలిండాగా పరివర్తన చెందింది. బెలిండా అంటే ఇండియా మధ్య భాగంలో బెల్జియం ఈశాన్యంలో బంగ్లాదేశ్‌వంటి దేశం, దేశం కలిపినట్లు తయారైంది. ఇక్కడ పారిశ్రామికీకరణ ఆర్థర్ లూయిస్ ప్రతిపాదించిన (ట్రికిల్ డౌన్) బదులు పూర్తి వ్యతిరేక పరిణామానికి దారితీసింది. నిపుణత లేని శ్రామికులను క్రమేపీ వ్యవస్థీకృత రంగంలోకి విలీనం చేసుకుని వారి నిల్వని తగ్గించటానికి బదులు వారి ఆర్థిక సామాజిక వెలివేతని, తీవ్రతరం చేసింది. ఈ ప్రక్రియ నగరాలలో పెద్ద ఎత్తున నిరుద్యోగ శ్రామికులను తయారు చేసింది. వీరిలో గ్రామీణ ప్రాంతాలలోని పెద్ద ఎస్టేట్ల నుండి బయటకు నెట్టేయబడిన తాత్కాలిక వ్యవసాయ కార్మికులు కూడా భాగమే. (సాక్స్ 1991:99, సన్యాల్ 2007లో ప్రస్తావింపబడి, మార్పు చేయబడినది).

ఇండియాలో గ్రామీణ ప్రాంతాలలో, నగరాలలో కూడా ఇటువంటి వికారమైన కార్మిక స్తబ్ధత స్పష్టంగా చూడొచ్చని సన్యాల్ సూచిస్తాడు. వారి పరిస్థితిని విశదీకరించటానికి మైకెల్ ఫూకో పదహారవ శతాబ్దంలో మతిస్థిమితం లేనివారిని యూరప్‌లో బంధించిన తీరుని ఉపమానంగా వాడతాడు. ఆ కాలంలో యూరప్‌లో మతిస్థిమితం లేని వారిని ఓడల్లో ఎక్కించి ఒక ఓడ రేవు నుండి మరొక రేవుకి తిప్పుతూ ఉండేవారు; వారికి ఆ ఓడల నుండి కిందికి దిగడానిగ్గానీ, తప్పించుకోవటానిగ్గానీ అవకాశం ఇవ్వకుండా పకడ్బందీగా బంధించి ఉండేవారు. తమ దేశాల్లో 'మతిలేని' వారిని సమాజం నుంచి వెలివేసి అంతటితో ఆగకుండా అంచులకి కట్టి పడేయడం; వెలివేసి, బంధించి ఉంచటం. అలాగే మూడవ ప్రపంచ దేశాలలో పెద్ద జనాభా ఈ రకంగా అభివృద్ధి ప్రక్రియకు వెలుపల ఉంచబడుతుంది. వారు వేతన శ్రామికులుగా విలీనం

చేయబడరు, అలాగని, స్వతంత్రంగా బతికే అవకాశం ఉండదు. ఈ రకంగా పెద్ద సంఖ్యలో శాశ్వతమైన రిజర్వు శ్రామిక సైన్యంగా నిరుద్యోగులై ఉంటారు అని సన్యాల్ వాదిస్తాడు.

"మూడవ ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థల చిత్రీకరణలో వెలివేత, నెట్టివేయబడటం అనే అంశాలకు ప్రాముఖ్యత నివ్వటం, నా సిద్ధాంతంలో ప్రధాన వ్యూహం. నా చిత్రపటం, మూడవ ప్రపంచ దేశాలలో ఆర్థిక వ్యవస్థ నిర్మాణం గురించి ప్రధాన స్రవంతి అభివృద్ధి దృక్పథం వర్ణించే చిత్రానికి చాలా భిన్నంగా ఉంటుంది. ప్రధాన స్రవంతి దృక్పథంలో, అభివృద్ధిలేమి అంటే ఆధునికీకరణ; అభివృద్ధి ఆయా పరిస్థితులని పూర్తిగా మార్చేసే పూర్వం ఉండే స్థితి మాత్రమే. తగినంత అభివృద్ధి లేని పరిస్థితికి ఇది ప్రతిబింబం అన్నమాట. ఆధునిక రంగం తగినంతగా వ్యాకోచించి, తన చలనశీలతతో అంచులని మార్చలేని అశక్తతతో ఉందని దీనర్థం; మరో మాటలో అభివృద్ధి లేమి అంటే అభివృద్ధి ప్రక్రియ దేనిని మార్చటంలో విఫలమయిందో ఆ మునుపటి పరిస్థితి యొక్క అవశేషం"

ఆధిపత్య సిద్ధాంత ధోరణిలో అభివృద్ధిలేమిని గురించి చేసే ప్రతిపాదనల్ని వివరించిన తరువాత, సన్యాల్ ఈ దృక్పథానికి తన సవాలును ప్రతిపాదిస్తాడు.

"ఈ దృక్పథానికి వ్యతిరేకంగా, అభివృద్ధి లేమిని నేను అభివృద్ధిచే తిరస్కరించబడిన స్థితికి ప్రతినిధిగా చూస్తాను. అంటే అభివృది చెందకపోవడాన్ని, అభివృద్ధి ప్రక్రియ ఫలితంగానే చూస్తాను. వలసానంతర ఆర్థిక నిర్మాణాల గురించి కొత్త సూత్రీకరణలు చేసే సైద్ధాంతిక వెసులుబాటు దీనితో లభిస్తుందని నేననుకుంటున్నాను. వెలివేత, నిర్బంధం పెట్టుబడికి అత్యవసరమైన పరిస్థితులుగా ఈ సూత్రీకరణ ప్రతిపాదిస్తుంది. ఈ పరిస్థితిని సృష్టించటానికి దోహదం చేసే ప్రత్యేక అధికార సాంకేతిక పరిజ్ఞానాన్ని వెలుగులోకి తెస్తుంది.

1. మూడవ ప్రపంచ దేశాల్లో పెట్టుబడితీరును అర్థం చేసుకోవటానికి ఈ దృక్పథం సైద్ధాంతికంగా ఎలా దోహదం చేస్తుంది? 2. ఈ పరిస్థితుల్లో పెట్టుబడి ప్రబలటానికి ఆచరణాత్మక సాధనాలుగా ఏవి పనికొస్తున్నాయి?

ఇక్కడ రెండు ప్రశ్నలకు సమాధానం వెతకాలి!

(ఎ) ఈ దృక్పథానికి ఉన్న సిద్ధాంతపరమైన పర్యవసానాలు

(బి) ఈ ప్రక్రియ సాగటానికవసరమయ్యే ఆచరణాత్మ సాధనాలు.

**<u>సైద్ధాంతిక మలుపులు:</u>**

(ఎ) సాంప్రదాయ మార్క్సిస్టు సిద్ధాంతాన్ని మనం గుర్తు తెచ్చుకున్నట్లైతే, తొలి దశలో పెట్టుబడి సమకూరే విధానాన్ని ఆదిమ పోగుబడి అంటారు. ఈ ప్రక్రియలో పెట్టుబడిదారీ స్థితికి పూర్వ శ్రామికులు తమ ఉత్పత్తి సాధనాల (భూమి, పరికరాలు, నిపుణతలు మొదలగునవి) నుండి వేరు చేయబడుతారు (మార్క్స్ 2010, 668) ఇది, "పెద్ద సంఖ్యలో శ్రామికులు హఠాత్తుగా, బలవంతంగా తమ జీవనాధార సాధనాల నుండి వేరు చేయబడి, 'స్వేచ్ఛగా బంధాలు వీడిన' శ్రామికులుగా శ్రామిక మార్కెట్‌లో విసిరివేయబడే ప్రక్రియ. (ibid 669) దీని ప్రకారం ఆదిమ పోగుబడి పెట్టుబడిదారీ వ్యవస్థకు పూర్వాంకం.

పెట్టుబడిదారీ వ్యవస్థ సార్వజనీనతను సంతరించుకున్న తరువాత, ఆదమ పోగుబడి నిలిచిపోయి తరువాత జరిగే మదుపు స్పష్టంగా పెట్టుబడిలో మిగులు శ్రమ ద్వారా సమీకరించేదే. అయితే, వలసానంతర సరిహద్దులో మదుపు సమీకరణ కోసం, అప్పటికే నగరీకరించిన పెట్టుబడి, ఆదిమ పోగుబడి పైనే నిరంతరంగా ఆధారపడుతుందని సన్యాల్ ప్రతిపాదిస్తాడు. పెట్టుబడి ఎప్పటికీ పరిపూర్ణ స్వతంత్రం పూర్తిగా పొందదు. ఇక్కడి సమాజం పెట్టుబడిదారీ విధానానికి పరిణామం చెందకూడానే, పెట్టుబడి నిరంతరం తన రూపాలను మార్చుకుంటూ ఉంటుంది. అందువలన పెట్టుబడి నిర్మాణంతోపాటు ఆదిమ పోగుబడి ప్రక్రియ కూడా సమాంతరంగా జరుగుతూనే ఉంటుంది. మరో మాటలో చెప్పాలంటే, పెట్టుబడి వ్యవసాయరంగ శ్రామికులని, నిరంతరం దోచుకుని, వారి వనరులను వారినుండి లాక్కుని, జీవనాధారం దొరక్కుండా వారిని బయటికి విసిరేస్తుంది.

(బి) సాంప్రదాయ మార్క్సిస్టు సిద్ధాంతం ప్రకారం, పెట్టుబడి వల్ల విస్తాపన చెందిన శ్రామికులు, బంధాలనుండి విముక్తులయి మార్కెట్‌లోకి తోయబడి, పెట్టుబడిచేత వేతన శ్రామికులుగా నియమింపబడతారు. ఈ రకంగా పెట్టుబడి శ్రామికులను తన స్వాధీనంతోకి తీసుకుని, తనలో లీనం చేసుకొని, వారి శ్రమను వినియోగించుకోవటం లేదా దోపిడీ చేయటం ద్వారా మిగులు విలువని సృష్టిస్తుంది. పెట్టుబడిదారీ వ్యవస్థ, సార్వత్రిక దోపిడీకి అనుగుణమైన సామాజిక, రాజకీయ పరిస్థితులను సృష్టించటం వల్ల శ్రామిక వర్గం తన మీద జరుగుతున్న దోపిడీని అర్థం చేసుకుని విప్లవాత్మకమైన చైతన్యాన్ని తన ఉనికిగా మార్చుకోవటానికి దారులేస్తుంది.

వలసానంతర స్థితిలో, సాంప్రదాయ ఉపాధి నుంచి తొలగించబడిన శ్రామికులు వ్యవస్థలో విలీనం చేయబడరని సన్యాల్ వాదిస్తాడు. దీనివలన, పెట్టుబడిచేత విస్తాపనకు గురయిన శ్రామికులకు జీవనాధారం వేతన శ్రమ ద్వారా పొందే అవకాశం ఉండదు. అంతేకాదు, శ్రామికీకరణ తరువాత, ప్రగతిశీల చైతన్యం ఏర్పర్చుకోవటానికి గానీ, తమ స్థితిని మెరుగు పరచుకోవడానిగ్గాని, ఆత్మ సమృద్ధి కోసం శ్రమించటానికి గానీ, వారికి మార్గం ఉండదు. దీనికి బదులుగా వాళ్ళు అభివృద్ధిలోకి ప్రవేశం నిరాకరించబడిన వాళ్ళవుతారు. ఈ రకంగా, పెట్టుబడిదారీ వ్యవస్థలో ఉంటూనే అభివృద్ధి నుంచి మినహాయించబడతారు.

ఈ రకంగా తిరస్కరించబడిన వీరు వేతన శ్రామికులు కాకుండ ఎలా జీవించగలుగుతున్నారు? అనేది ఇక్కడ సమస్య. **ఉత్పత్తి సాధనాల నుండి దూరం చేయబడిన శ్రామికులు బ్రతుకుతారనే గారంటీ ఏ మాత్రం లేదు. ఆధునిక యూరోపు ప్రారంభ దశలో ఇటువంటి శ్రామికులు కరువు కాటకాల్లోనూ, అంటువ్యాధులతోనూ కోకొల్లలుగా చనిపోయారు. అయితే ప్రస్తుతం పనిలేని వారిని చావటానికొదిలేసే పరిస్థితుల్లేవని సన్యాల్ అంటారు.**

**ఆచరణాత్మక అంశాలు:**

(Subsistance) పెట్టుబడి స్వయం సమృద్ధ శ్రామికులని ఆదిమ పోగుబడి ద్వారా విస్తాపన చేసిన తరువాత వాళ్ళ బతుకులు 'గాల్లో దీపాలే'అని సన్యాల్ వాదిస్తాడు. అయితే,

"ఇప్పటి రాజకీయ, సామాజిక జీవనంలో ప్రజాస్వామ్యం, మానవ హక్కుల చర్చ తప్పించుకోలేని, విడదీయలేని అంశాలయ్యాయి. ఇవి పెట్టుబడి నుండి కొంత స్వతంత్రత తెచ్చుకుని, ఈ వాతావరణంలోనే పెట్టుబడి తనను తాను పునరుత్పత్తి చేసుకోవలసిన పరిస్థితులు కలిపించాయి. ఈ పునరుత్పత్తికి కీలకమైన షరతేమిటంటే, ఆదిమ పోగుబడి బాధితులని మిషెల్ ఫూకో ప్రతిపాదించిన ప్రభుత్వ తత్వంలో (గవర్నమెంటాలిటీ) భాగంగా చూసుకోవలసి ఉంటుంది. ఇంకో మాటలో ఇవే అభివృది రాజ్యాలు ప్రజల సంక్షేమం కోసం చేసే కార్యకలాపాలు. ఈ సంక్షేమ పాలనాతత్వమే నా ఉద్దేశంలో ఆదిమ పోగుబడి ప్రభావాన్ని వెనుకకి తిప్పుతోంది. అవసరాలని తీర్చే ఈ ఆర్థిక రంగ సృష్టి ప్రభుత్వాలకి తప్పని సరిగా మారింది." (పే. 60, మార్చబడింది)

ఆదిమ పోగుబడి వలన జరిగిన నష్టాన్ని పూడ్చటానికి, పెట్టుబడి వ్యవస్థ లోపలి నుంచీ వెలుపలికి సంపద తిరిగి ప్రవహిస్తేనే పెట్టుబడి నిరాధారం చేసిన వాళ్ళకు మద్దతు నివ్వటం సాధ్యపడుతుంది. ఈ రకంగా పెట్టుబడిదారీ రంగం నుంచి అత్యవసర వస్తువుల రంగం లేదా పెట్టుబడేతర రంగానికి డబ్బు ప్రవహిస్తుంది. ఇది మిగులు విలువను తిరిగి పెట్టుబడి పెట్టటడమనే ద్రవ్య వలయంలో భాగం కాదు. పెట్టుబడేతర అవసరాల ఆర్థిక రంగం, నిరాధారం కాబడిన వర్గాన్ని నిలబెట్టడానికి పెట్టుబడికి దోహదం చేయని రకరకాల జీవనాధార రూపాలని పోషిస్తుంది. అంతర్జాతీయంగా ప్రామాణికంగా మారిన అభివృద్ధితత్వం దాని కార్యాచరణ ఈ రంగంలోకి జరగాల్సిన తిరుగు ద్రవ్య ప్రవాహాన్ని నిర్దేశిస్తాయి. రాజ్యం, రాజ్యేతర రంగాలు కలిసి ఈ ప్రవాహాన్ని నియంత్రించి, దారి చూపుతుంటాయి.

అయితే, వీటి వలన, అవసర వస్తువుల ఆర్థిక రంగం స్థిరపడి కొంత మదుపు పెట్టగలిగే స్థాయికి ఎదిగిన మరుక్షణం, పెట్టుబడిదారీ ఆర్థిక రంగం ఆ ఎదుగుదల, స్థిరత్వాన్ని పెంపొందించే అంశాల పైన ఆకస్మిక దాడి జరిపి సఫలీకృతులైన వారిని తన్నుకు పోతుంది.

ఈ కారణంగానే ఈ వ్యవస్థని వర్ణించటానికి సన్యాల్ మూర్ఖుల నౌక (ship of fools) ఉపమానాన్ని ఎంపిక చేసుకుంటాడు. అణగారిన వర్గాలకి వ్యవస్థని విడిచి వెళ్ళే అవకాశం ఉండదు; అలాగని అందులో కలువటానికీ అవకాశం ఉండదు. వ్యవస్థ వాళ్ళని దగ్గర్లోనే ఉంచుకుని, వెలివేస్తుంది.

**ఈ వాదనలోని ఆలోచనీయాంశాలు:**

● పెట్టుబడిదారీ వ్యవస్థ శ్రామికులందరినీ తనలో విలీనం చేసుకోవటం ద్వారా, సార్వత్రిక శ్రామిక వర్గాన్ని స్థాపిస్తుందనే ఆశ మనమింక పెట్టుకోలేము. వాళ్ళు ఎప్పటికీ అణగారిన స్థితిలో ఉండి; రాజ్యం కనీస స్థాయిలో అవసరమైన పెట్టుబడేతర రంగానికి తరలించే వనరుల సాయంతో తమ ఉనికిని నిలబెట్టుకునే ప్రయత్నం చేస్తూ ఉంటారు. వీటికి గుర్తుగా ఉండే బస్తీలు, కటిక పేదరికాన్ని సూచించే అంశాలు, వలసానంతర చిత్రపటంలో ఎప్పటికీ

నిలిచిపోయి ఉంటాయి.

● శ్రామిక వర్గం, స్వతంత్రమైన వర్గ దృక్పథంతో అందరికీ ఉపయోగపడే సార్వజనీన చైతన్యాన్ని కలిగి ఉండే శక్తిని కోల్పోయింది. పెట్టుబడిదారీ వ్యవస్థ, శ్రామికులందరినీ తనలో లీనం చేసుకోలేక, నిరుద్యోగ సమూహాలను తయారు చేసినట్లైతే శ్రామిక వర్గ చైతన్యం సార్వజనీనమయ్యే అవకాశమే లేదు ఎందుకంటే నిరుద్యోగ, నిరాధార వర్గాలకు ఒకటయ్యి పెట్టుబడికి వ్యతిరేకంగా పోరాటం చేయటానికి సమిష్టి ఆశయం ఏర్పడదు. ఆరకంగా పెట్టుబడి కంటికి కనిపించని శత్రువుగానే ఉండిపోతుంది.

● పెట్టుబడిదారీ వ్యవస్థ స్వతంత్రమైనది కాదు. అది రాజ్యం, రాజ్యేతర వ్యవస్థల నియంత్రణకు లోబడి ఉంటుంది. శ్రామిక ప్రజలందరికీ పెట్టుబడిదారీ వ్యవస్థ ఉపాధి చూపించలేక పోయినట్లైతే రాజ్యం, చట్టం, విద్య, సంక్షేమ వ్యవస్థ వంటి ఉపనిర్మాణాన్ని (superstructure) నిలబెట్ట గలిగిన పునాదిగా, పెట్టుబడి తన విధిని నిర్వర్తించలేదన్న మాటే. పెట్టుబడికీ, పెట్టుబడేతర రంగానికి మధ్య, రాజ్యం, నిర్ణేతగా వ్యవహరిస్తూ ఉండవలసి రావటం వలన, పెట్టుబడి తన భావజాల ఆధిపత్యాన్ని నిలబెట్టుకోలేదు, రాజీపడవలసి ఉంటుంది. అంటే, కొంత మేరకు, పెట్టుబడి తన కార్యకలాపాలను, రాజ్యం ఆదేశాల మేరకు నిర్వర్తించాల్సి ఉంటుంది.

చారిత్రక గతితార్కిక గమనానికుండే (dialetic) శక్తివల్ల వైరుధ్యాల ఉదాత్తీకరణ చెంది సామాజిక, ఆర్థిక పరివర్తన జరుగుతుందనే భావన నిజమయ్యే అవకాశం తక్కువ. నిరాధార ప్రజలుండటం వలన, శ్రామిక వర్గం అంతా గతి శీలతని ఏర్పర్చుకోలేదు. విప్లవాత్మక పరివర్తనకు అవసరమైన చోదక శక్తి లభించదు.


● అయితే పెట్టుబడేతర రంగంలో 'బతకాలనే ఇచ్ఛ' ఏ సహాయం లేకుండా మనగలగటం వల్ల, స్వతంత్రతని నిర్మాణాన్ని ఏర్పర్చుకుంటుంది. ఈ నిర్మాణమే నిరుద్యోగులై, అణగారిన ప్రజల్లో తమదైన చైతన్యానికి దారితీయవచ్చు. సంఘటితం చేయటానికి, చైతన్యవంతులను చేయటానికి ఇక్కడ కొత్త పద్ధతులు అవసరమవుతాయి. కొత్త అవకాశాలని కల్పించి, పెట్టుబడియుగంలో పెట్టుబడేతరరంగ అభివృద్ధి తీసుకునే రూపాలను నిర్దేశిస్తాయి.


● అట్టడుగున దోపిడి చేయబడుతున్న వారి దృక్పథంతో శ్రామిక వర్గం సమాజ చైతన్యానికి ప్రాతినిథ్యం వహిస్తుందనే మార్క్సిస్టు గతితార్కికతలోని అంతర్గత చలనశీలత సూత్రం ఇక్కడ పని చేయదు. ఆధిపత్య శ్రేణిలో శ్రామికులిప్పుడు అట్టడుగున లేరు. అందువల్ల శ్రామిక వర్గం తన వేతన బానిసత్వం కంటే కింది నుండే దోపిడిని ఊహించుకోలేదు: ఇది ఉద్యోగం దొరికే అవకాశం లేకుండా చేసే దోపిడి మరి.

"రిథింకింగ్ కాపిటలిస్ట్ డెవలప్‌మెంట్: ప్రిమిటివ్ అక్యూములేషన్, గవర్నమెంటాలిటీ, పోస్ట్–కొలోనియల్ కాపిటలిజం" పుస్తకానికి

**అనువాదం: పి.మాధవి**

**సంక్షిప్తీకరణ– ఆర్. శ్రీవత్సన్**



# ప్రపంచీకరణ-వ్యవసాయక సమస్య

(హరూన్ అక్రమ్‌లోధీ, క్రిస్టాబెల్ కే)

**అభివృద్ధి చెందుతున్న దేశాల్లో వ్యవసాయ సమస్యను అనేక సందర్భాల్లో అత్యంత ఇరుకైన సాంప్రదాయిక నమూనాలో, మూస పద్ధతిలో విశ్లేషించారు. ఈ రకమైన చర్చలో చారిత్రకంగా ఇంగ్లాండు, ఫ్రాన్సు, జర్మని, రష్యా, జపాన్, దక్షిణ కొరియా మరియు తైవాన్ దేశాల్లో వివిధ రకాలుగా జరిగిన వ్యవసాయ పరివర్తనను పరిగణనలోకి తీసుకున్నట్లు కనపడదు. సిద్ధాంతపరమైన ఈ అస్పష్టతను అధిగమించడానికి రచయితలు ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా మార్క్స్ నుండి బెర్న్‌స్టీన్ వరకు జరిగిన చర్చను పున:సమీక్షించారు. మార్క్స్, ఎంగెల్స్, కౌట్‌స్కీ ఆ తరువాత వచ్చిన సిద్ధాంతకర్తలు ఎవ్వరూ కూడా ప్రస్తుత వామపక్ష సిద్ధాంత చర్చలు భావిస్తున్నట్లుగా, ఉపఖండ వ్యవసాయంలో భూస్వామ్యం నుండి పెట్టుబడిదారీ వ్యవస్థకు ఒకేరకమైన సరళరేఖాత్మక మార్పు జరుగుతుందని ప్రస్తావించలేదు. శ్రద్ధగా పరిశీలిస్తే 19 మరియు 20 శతాబ్దాల్లో వ్యవసాయ సమస్యపై జరిగిన చర్చ చారిత్రక మరియు నిరంతరం మారుతున్న పరిస్థితులపై సుసంపన్నమైన అవగాహన కల్పిస్తుంది. ఇది ప్రస్తుత ప్రపంచీకరణ నేపథ్యంలో వ్యవసాయిక సమస్యను సమీక్షించడానికి సరియైన మార్గాలను అన్వేషించడానికి, తోడ్పడుతుంది. రెండు శతాబ్దాల చర్చని సమీక్షించిన ఈ వ్యాసం 21వ శతాబ్దపు రైతు దృష్ట్యా విశ్లేషణాత్మక స్పష్టతనివ్వటంతో పాటు వ్యవసాయ సమస్యను నూతన వెలుగులో ఆవిష్కరిస్తుంది. -సంపాదకులు**

**ఎక్కడ ప్రారంభించాలి?**

ఒక శతాబ్దం క్రితం కార్ల్ కౌట్‌స్కీకి ప్రధాన వ్యవసాయ సమస్య అంటే "ఏ విధంగా పెట్టుబడి వ్యవసాయాన్ని తన ఆధీనంలోకి తీసుకొని తీవ్ర మార్పులకు గురిచేసి పాత వ్యవసాయిక పద్ధతులకు స్వస్తి చెపుతూ అవసరమైన కొత్త పద్ధతులను ఆవిష్కరిస్తుందని." (కౌట్‌స్కీ, 1889 ఈ సంపుటిలో సమీక్ష చూడండి) ఒక శతాబ్దం తరువాత టెరెన్స్ జె.బైర్స్‌కు (1996 సంపుటిలో సమీక్ష చూడండి) 'వ్యవసాయ సమస్యకు మూలం; వ్యవసాయ మరియు పారిశ్రామిక రంగాల్లో పెట్టుబడి సమీకరణకు గ్రామీణ ప్రాంతాల్లోని ఆటంకాలు'. ప్రస్తుత ప్రపంచీకరణ సందర్భంలో కూడా పెట్టుబడి, జాతీయ పెట్టుబడి మాదిరిగా రైతాంగాన్ని మార్పుకు గురిచేస్తుందా లేక వారు అల్ప సరుకు ఉత్పత్తిదారులుగా కొనగలుగుతారా? అక్రమ్‌లోధి మరియు క్రిస్టోబెల్ కె (ఎల్&కె) దృష్టిలో ప్రపంచీకరణ ఒక సంక్లిష్ట చలనశీల స్థితిని సృష్టించి, రైతాంగాన్ని ప్రపంచ మార్కెట్లతో అనుసంధానం చేసి, వారి సంక్షోభాన్ని తీవ్రతరం చేసింది. వారిని మార్క్స్ ప్రతిపాదించిన పారిశ్రామిక రిజర్వు సైన్యాల స్థితి కంటే దూరంగా నెట్టివేసింది. ఈ తర్కానికి రైతాంగం నుండి వచ్చే ప్రతిఘటన; రైతులు అంచులకు నెట్టబడే తప్పనిసరి పరిస్థితి రెండూ కూడా ప్రధాన వ్యవసాయ సమస్యగా పరిగణించాలని రచయితలు భావిస్తారు.

**సాంప్రదాయిక మార్క్సిజంలో రైతుసమస్య : వర్గీకరణ మరియు పరివర్తన**

ఎల్&కె మొదటగా మార్క్సు, ఎంగెల్స్, కౌట్‌స్కీ, లెనిన్‌ల విశ్లేషణల ప్రకారం యూరప్‌లో పెట్టుబడీదారి వ్యవస్థ ఎలా ప్రవేశించి, వ్యాపించిందో వివరంగా చర్చిస్తారు. ఇది వ్యవసాయిక ఉత్పత్తి నిర్వహణలో మరియు రైతాంగ జీవితాల్లో వివిధ రకాల మార్పులను తీసుకువచ్చింది. భిన్నమైన రాజకీయ వ్యవస్థలు మరియు సామ్రాజ్యవాద విస్తరణలో ఏర్పడ్డ కాలనీల కారణంగా వ్యవసాయ రంగంలో పెట్టుబడిదారీ వ్యవస్థ బహుళ మార్గాల్లో ప్రవేశించింది. మార్క్స్ రైతాంగాన్ని ఒక పూర్వ పెట్టుబడిదారి అవశేషమని, వీరిని ఆధునికతలోకి పెట్టుబడిదారి వ్యవస్థ మాత్రమే తీసుకెళ్తుందని అన్నాడని బాగా ప్రాచుర్యంలో ఉన్న అభిప్రాయంతో రచయితలు విభేధిస్తారు. కాపిటల్ మొదటి వాల్యూమ్ లో వ్యవసాయ ప్రశ్నపై పరిణామం చెందిన మార్క్స్ ఆలోచనవైపు మన దృష్టిని మళ్ళిస్తారు.

"అన్ని విప్లవాలు చారిత్రక పెట్టుబడిదారి వర్గం ఏర్పడడానికి సందర్భాలుగా సహకరిస్తాయి. ఈ సందర్భాల్లోనే మానవ సముదాయాలు, హఠాత్తుగా, నిర్బంధంగా, వారి ప్రాథమిక జీవన వనరుల నుండి వేరు చేయబడి శ్రామిక మార్కెట్‌లోకి స్వేచ్ఛాయుత, రక్షణ హక్కులు లేని శ్రామికులుగా నెట్టివేయబడుతారు. వ్యవసాయ ఉత్పత్తిదారుడు లేక రైతు భూమి నుండి దూరం కావడమే ఈ ప్రక్రియకు ప్రాతిపదిక. ఆస్థి మీద హక్కును కోల్పోవడం వివిధ చారిత్రక సందర్భాల్లో వేరు వేరు రూపాల్ని తీసుకుంది. దేన్నైతే ఉదాహరణగా తీసుకుంటామో ఆ ఇంగ్లండులో మాత్రమే అది ప్రామాణిక పద్ధతిలో జరిగింది." (మార్క్స్ 1976, 876)

ఎల్&కె మార్క్స్ చెప్పిన మరొక అంశాన్ని కూడా ప్రస్తావించారు. పెట్టుబడి అన్ని ప్రాంతాల్లో రైతులను భూమి నుండి వేరు చేయకపోవచ్చు కాని వారి శ్రమను మిశ్రమ పద్ధతుల్లో వాడుకుంటూ మిగులును బలవంతంగా సేకరించవచ్చు. మార్క్స్ (1881) తన మిత్రురాలు వెరాజాసులిచ్‌కు వ్రాసిన ఉత్తరాల్లో పారిశ్రామికంగా ఎదుగుతున్న రష్యాలో రైతాంగపరిస్థితిని నిశిత దృష్టితో గమనిస్తూ, చిన్న స్థాయి రైతుల వ్యవసాయ సమస్య బహుళ విధాలుగా పరిష్కారమయ్యే అవకాశం ఉంటుందని భావించాడు.

ఎల్&కె అవలంబించిన విశ్లేషణ పద్ధతిలో అత్యంత ఆసక్తికరమైన ఉపయోగకరమైన అంశం సిద్ధాంతపరమైన ప్రతి సూత్రీకరణను చారిత్రిక నేపథ్యంలో పరిశీలించడం.

ఎంగెల్స్ వ్యవసాయ సమస్యను యూరోపియన్ సామ్రాజ్యవాద విస్తరణలో భాగంగా, ఆహార వ్యవస్థ అంతర్జాతీయకరణను సంతరించుకుని యూరప్‌లో రైతాంగ జీవితాలను క్షీణింప చేస్తున్న సందర్భంలో పరిశీలించాడు (ఇతర వివరాలకు ఈ సంపుటిలో ఎంగెల్స్‌ను చూడండి). ఈ శతాబ్దంలో తరువాత వచ్చిన పారిశ్రామిక పెట్టుబడి శకంలో కౌట్‌స్కీ (1880) లెనిన్ (1889) వ్యవసాయంలో నిరంతరంగా వచ్చే మార్పు పై దృష్టి కేంద్రీకరించారు. పారిశ్రామిక పెట్టుబడి, వ్యవసాయంతో గ్రామీణ మరియు చిన్నతరహా ఉత్పత్తికున్న సాంప్రదాయిక సంబంధాన్ని విచ్చిన్నం చేసి, వ్యవసాయ ఉత్పత్తిని సరుకుగా మార్చి సుదూర మార్కెట్లతో అనుసంధానం చేసింది (వివరాలకు ఈ సంపుటిలో కౌట్‌స్కీని చూడండి) వారి దృష్టిలో, పెరుగుతున్న పారిశ్రామిక పెట్టుబడి, వ్యవసాయంలో పెట్టుబడికి ఊతమిచ్చిందన్న మాట.

ఆ తర్వాత పారిశ్రామిక పెట్టుబడి ఆధిపత్యాన్ని రైతాంగం ఏ విధంగా తట్టుకుని, మనగలిగే వ్యూహాలను (ఈ ప్రామాణిక సిద్ధాంతకర్తల దృష్టిలో) ఎంచుకుందో రచయితలు వివరించారు. ఈ పరిస్థితుల్లో రైతు కుటుంబాలు సామాజికంగా సంపదను సమీకరించుకున్న కుటుంబాలు మరియు విఫలమై కనీస అవసరాల కొరకు పోరాడే కుటుంబాలుగా విడిపోతాయని మార్క్స్ గుర్తించాడు. పారిశ్రామిక పెట్టుబడి ప్రభావంలో గ్రామీణ ఉత్పత్తిని తీవ్రతరం చేసి తమను తాము పీడించుకున్న చిన్న రైతాంగాన్ని గురించి చర్చించిన కౌట్‌స్కీ ఈసందర్భంలో వ్యవసాయిక ప్రశ్న సామ్రాజ్యవాద మార్కెట్లతో ముడి పడుతుందని గుర్తించాడు. లెనిన్ చేసిన వర్గీకరణ ప్రకారం రైతాంగంలో పీడించే భూస్వాములు, సంపన్న పెట్టుబడిదారీ రైతులు, పీడనకు గురైన చిన్నరైతులు మరియు వ్యవసాయ కూలీలు ఉంటారు. కౌట్‌స్కీ మరియు లెనిన్ ఇద్దరికీ కూడ వ్యవసాయంలో పెట్టుబడిదారీ విధానం కోసం చిన్న రైతాంగాన్ని తొలగించటం తప్పనిసరి కాదు.

**ప్రణాళికా ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయ సమస్య: సామ్యవాద ఆదిమ పోగుబడి**

ప్రపంచమంతటా పారిశ్రామిక పెట్టుబడి రైతాంగం మధ్య అపరిమిత పోటీ పెట్టి దేశంలోకి దిగుమతులను స్వేచ్ఛగా అనుమతించడం ద్వారా వ్యవసాయ ఉత్పత్తుల సాపేక్ష ధరలను నిరోధించి పెట్టుబడి సమీకరణను వేగవంతం చేసింది. మరి ప్రణాళికా వ్యూహం పాటించిన దేశాలు ఏ విధంగా వ్యవసాయ సమస్యని పరిష్కరించాయి? ఇందుకు సోవియట్ యూనియన్ ఒక మంచి ఉదాహరణ అవుతుంది.

సోవియట్ యూనియన్ స్థాపన తరువాత ప్రణాళికా కర్తలకు వ్యవసాయ / రైతాంగ సమస్యకు పరిష్కారం వెతకవలసిన ప్రత్యేక పరిస్థితి ఏర్పడింది. పెరుగుతున్న పట్టణ డిమాండు వల్ల వ్యవసాయ ఉత్పత్తుల ధరలు పెరిగిపోయాయి. పారిశ్రామిక అభివృద్ధి, వ్యవసాయ ఉత్పత్తుల కొరత వల్ల ఆహార వస్తువుల ధరలు తీవ్రంగా పెరిగి పారిశ్రామిక రంగంలో పెట్టుబడి సమీకరణను తగ్గించాయి. దీర్ఘకాలంలో ధరల సమతుల్యతను సాధించడానికి ఆహార ధరలపై ఆంక్షలు ఉండకూడదని బుఖారిన్ ఒకవైపు వాదించగా అతని సమకాలీనుడు ఎవగే ప్రెబ్రజెన్స్కి ఆధునిక పారిశ్రామిక రంగంలో పెట్టుబడి సమీకరణ కోసం సాపేక్షికంగా వ్యవసాయ ధరలను తక్కువగా ఉంచాలని కోరాడు. ఆధునిక పారిశ్రామిక రంగం అభివృద్ధిని ముందుకు తీసుకెళ్ళడంతో పాటు వ్యవసాయం నుండి తొలగించబడిన మిగులు శ్రామికులను సంగ్రహిస్తుంది కాబట్టి సాపేక్ష ధరలు వ్యవసాయానికి ప్రతికూలంగా ఉండాలని అన్నాడు. ఈ సలహాను బలవంతపు సమిష్టి వ్యవసాయం ద్వారా ఆచరణలో పెట్టారు. ఇది హింసాయుతంగా సాగి ఆ విధానాన్ని వ్యతిరేకించిన రైతాంగాన్ని నిర్బంధానికి గురి చేసింది. ప్రిబ్రజ్‌నెస్కి దీనిని సామ్యవాద ఆదిమ పోగుబడిగా వర్ణించాడు.

**లెనిన్ తరువాత వ్యవసాయిక సమస్య: చరిత్రకారుల మధ్య చర్చ**

లెనిన్ తరువాత పెట్టుబడిదారి వ్యవస్థకు జరిగే పరివర్తనను గురించి ప్రధానంగా చరిత్రకారులు చర్చించారు. ఇందులో రెండు అంశాల పై దృష్టి పెట్టారు. మొదటిది, యూరప్‌లో భూస్వామ్య వ్యవస్థ పతనం ఎలా జరిగింది; రెండవది, పెట్టుబడిదారీ వ్యవస్థ మిగులును భిన్న రూపాల్లో ఎలా సృష్టించి, దాన్ని హస్తగతం చేసుకుని ఎదుగుతుంది. ఇంగ్లండులో భూస్వామ్య వ్యవస్థ పతనానికి భూస్వాములకి, రైతులకి మధ్య ఏర్పడిన విరుద్ధమైన సామాజిక సంబంధాలు కారణమని మారిస్ డాబ్ (1963) వాదించాడు. భూస్వాములు రైతుల నుండి ఎక్కువ మొత్తంలో వసూలు చేసిన కౌళ్ళు, మిగిలిన వసూళ్ళు వారికీ రైతులకీ మధ్య హింసాత్మక ఘర్షణకు దారితీసాయి. చివరికి భూస్వాములు కంచెలు నిర్మించి చిన్న రైతుల్ని వారి భూముల నుండి వెళ్ళగొట్టారు. వారిలో అధికశాతం రోజు కూలీలుగా కుదించబడితే, కొంత మంది స్వతంత్ర్య భూస్వాముల నుండి డబ్బు కౌలుకు భూములను కౌలుకు తీసుకున్నారు.

1976లో, రాబర్ట్ బ్రెన్నర్ యూరప్‌లో జరిగిన మార్పును విస్తృతంగా అధ్యయనం చేసిన తరువాత చర్చను తిరిగి ప్రారంభించాడు. చారిత్రక భౌతిక వాద పరిమితుల్లో సమగ్ర వివరణ కూడా ఇచ్చాడు. బ్రెన్నర్ ఉద్దేశ్యంలో వ్యక్తిగత ఆస్తి హక్కుల స్థాపన రైతుల్లో వర్గీకరణ తేవటంలో, వర్గ పోరు పరిష్కారంలో కీలకమైన పాత్ర పోషించింది. రాజ్యం ప్రసాదించిన వ్యక్తిగత ఆస్తి హక్కులు భూస్వాములకు భూమిని అభివృద్ధి చేయడానికి; భూములను స్వేచ్ఛా రైతాంగానికి కౌలుకివ్వడానికి ప్రోత్సాహకాలను కల్పించింది. బ్రెన్నర్ దృష్టిలో వర్గ నిర్మాణంలో మార్పులు, వర్గ సంబంధాల్లో మార్పులు వర్గ పోరాటానికి పరిష్కారం చూపాయి.

**20వ శతాబ్దపు చివరన వ్యవసాయిక సమస్య:**

20వ శతాబ్దపు చివరలో ప్రామాణిక చర్చను పొడిగిస్తూ వ్యవసాయ సమస్య గురించి ఒక కొత్త అవగాహన ఏర్పడిందని చెపుతూ ఆ తరువాత వ్యవసాయ సమస్యని మూడు విశ్లేషణాత్మక కోణాలలో అర్థం చేసుకోవాలని బెర్న్‌స్టీన్ చేసిన సిద్ధాంతీకరణపై రచయితలు దృష్టి సారిస్తారు. 21వ శతాబ్దంలో బెర్న్‌స్టీన్ యూరప్, ఆసియా మరియు ఉత్తర అమెరికాలో పెట్టుబడి దారి వ్యవస్థకు జరిగిన పరివర్తనపై టి.జె.బైర్స్ రచనలను సమీక్షిస్తూ వ్యవసాయిక ప్రశ్నలోని భిన్న విశ్లేషణాత్మక అంశాలను ఈ క్రింది విధంగా ప్రతిపాదించాడు.

వ్య. ప్ర. 1. 'రాజకీయ' సమస్య : ఎంగెల్స్ సిద్ధాంతపరమైన రచనల నుండి దీన్ని తీసుకున్నారు. ఆధిపత్య–పరాధీన సంబంధాలను నిర్దేశించే నిర్మాణాలు, మిగులును స్వాధీనం చేసుకునే నిర్మాణాలు, వ్యవసాయ పరివర్తనకు నాయకత్వం వహించే సామాజిక వర్గాల సంబంధాల్లో మార్పులపై ఈ విశ్లేషణ దృష్టిని పెడుతుంది. భూస్వామ్య నిర్భంధానికి వ్యతిరేకంగా వనరుల కొరకు జరిగే రాజకీయ పోరాటాలు ఏ విధంగా వ్యవసాయంలో పరివర్తనకు దారి తీస్తాయో అర్థం చేసుకోవటం ఇక్కడ కీలక రాజకీయ సమస్య సామాజిక తరగతుల మధ్య సమతుల్యతకు సంబంధించిన ప్రామాణిక చర్చ, డాబ్, స్వీజీల మధ్య సంవాదం, బ్రెన్నర్ విమర్శ ఈ కోవకి చెందినవే.

వ్య. ప్ర. 2. 'ఉత్పత్తి' సమస్య : దీని ప్రస్తావన కౌట్స్కీ, మార్క్స్ మరియు లెనిన్ రచనలలో ఉంది. పెట్టుబడిదారి వ్యవస్థ గ్రామీణ రంగంలో ఎంతమేరకు అభివృద్ధి చెందింది, దాని రూపం, దాని అభివృద్ధికి గల పరిమితులను విశ్లేషిస్తుంది. అల్ప సరుకు ఉత్పత్తిదారులైన రైతు కూలీలని, పూర్తిగా శ్రమని అమ్ముకునే శ్రామికులుగా మార్చే సూక్ష్మ రాజకీయ ఆర్థికాంశాలని పరిశీలిస్తుంది. సూక్ష్మ క్షేత్రస్థాయి అధ్యయనాల ఆధారంగా భారతీయ వ్యవసాయ ఉత్పత్తి వ్యవస్థని ఎలా అర్థం చేసుకోవాలని జరిగిన చర్చ ఈ కోవకి చెందినదే.

వ్య. ప్ర 3. పోగుబడి లేదా సమీకరణ సమస్య: ఇది ప్రిబ్రజెనెస్కీ ప్రతిపాదించిన సామ్యవాద వ్యవస్థలో ప్రాథమిక ఆదిమ పోగుబడి సిద్ధాంతం నుండి తీసుకున్నది. వ్యవసాయానికి తన అవసరాలకు మించిన మిగులు

ఉత్పత్తిని, ఆర్థిక మిగులును సృష్టించచే శక్తి ఉందా అన్న విషయాన్ని ఇది విశ్లేషిస్తుంది. ఈ మిగులే పారిశ్రామికీకరణకు, నిర్మాణాత్మక మార్పుకు, పెట్టుబడి సమీకరణకు అలాగే వ్యవసాయంలో మరియు ఇతర రంగాల్లో పెట్టుబడి ఆవిర్భావానికి ఉపకరిస్తుంది.

రైతులు అల్ప సరుకు ఉత్పత్తిదార్ల నుండి వేతన శ్రామికులుగా మారటం, వారిని వనరుల నుండి దూరం చేసే సంక్లిష్టమైన శక్తుల గురించి బెర్న్‌స్టీన్ ఇచ్చిన విశ్లేషణాత్మక స్పష్టత కారణంగా 1990ల వరకు బహుళ మార్గాల్లో వ్యవసాయిక పరివర్తన జరిగే అవకాశాలున్నాయనే అవగాహన వచ్చింది. వ్యవసాయం పెట్టుబడిదారీ విధానానికి మారేక్రమంలో పూర్తిగా పరివర్తన చెందొచ్చు, చెందకపోవచ్చు, లేదా పాక్షికంగానే పరిణామం చెందొచ్చు. ఒకవేళ రైతాంగం గతంలో మాదిరిగా తాముచేసే ఉత్పత్తితో తమ మౌలిక వినియోగ అవసరాలు తీర్చుకోలేకపోతే అవి పొందడానికి తమ శ్రమ శక్తిని విపణిలో అమ్ముకోవలసి ఉంటుంది. ఇటువంటి వేతన శ్రమను పట్టణ ప్రాంతాల్లో శ్రామికులను నియమించుకునే వారికి గాని, గ్రామీణ పెట్టుబడిదారి రైతులకు లేక వ్యవసాయేతర ఉత్పత్తి సంస్థలకు అమ్ముకోవచ్చు. ఈ విధంగా గ్రామీణ అల్ప సరుకు ఉత్పత్తిదార్లు (రైతులు, చేతివృత్తులు లేక సేవలందించేవారు) వేతన శ్రామికులుగా లేక తొలి (పూర్వ) పెట్టుబడిదారి రైతులుగా పరివర్తన చెందుతారు. ఇటువంటి మార్పు తనదైన తర్కంలో పనిచేసే మార్కెట్‌లో అవుతుంది. ఈ మార్కెటే వారి ఉత్పత్తికి గమ్యస్థానం కూడా.

క్లుప్తంగా చెప్పాలంటే మానవ శ్రమ ఒక వినియోగ సరుకుగా మార్పు చెందినపుడే వినియోగ వస్తువుల ఉత్పత్తి వ్యవస్థ ఏర్పడి, దానితో పాటే ఉత్పత్తి వ్యవస్థ మార్పుకి లోనవుతుంది. తమ స్వంత వినియోగం కోసం కాక విపణిలో మార్పిడి కోసం, సంపద పోగుబడి కోసం ఉత్పత్తి జరుగుతుంది. వ్యవసాయ సమస్య అంటే ఇటువంటి మార్పు జరిగిందో, లేదో తత్ఫలితంగా మిగుల పోగుబడిపైన, పెట్టుబడి ఆవిర్భావం పైన ఏర్పడే ప్రభావం గురించి అర్థం చేసుకోవటం. బెర్న్‌స్టీన్ (2004) వ్యవసాయిక సమస్యను మొదట పెట్టుబడి ఆవిష్కరణగా; తదుపరి పెట్టుబడి పోగుబడిపై ఆధారపడిన పునరుత్పత్తిగా నిర్వచించాడు. వ్యవసాయ పరివర్తనకి పెట్టుబడి సమీకరణ, ఉత్పత్తి మరియు రాజకీయాలు ఏ విధంగా తోడ్పడుతున్నాయో లేక ఆటంకపరుస్తున్నాయో పరిశీలించడం ముఖ్యమని భావించాడు.

**ప్రపంచీకరణ నేపథ్యంలో వ్యవసాయ సమస్య**

ప్రపంచీకరణ, అభివృద్ధి శక్తులను మరియు ఉత్పత్తి సంబంధాలను ప్రపంచ స్థాయిలో మార్పుకు లోను చేసింది. 20వ శతాబ్దంలో ప్రపంచీకరణ పరిస్థితులు వ్యవసాయ రంగ పరివర్తనను ఎలా నిర్దేశిస్తున్నాయనేది ఇప్పుడు చూద్దాం.

కీన్స్ ఆర్థిక సిద్ధాంతం ప్రాచుర్యంలో ఉన్న 1950, 1960లలో భూసంస్కరణలు మరియు ప్రభుత్వ పంపిణి పథకాలు ఆర్థిక రంగంలో సమిష్టి డిమాండును పెంచే దిశగా ఉన్నాయని పాలకులు భావించారు. అయితే ఇటువంటి దేశీయ– మార్కెట్ ఆధారిత, ప్రభుత్వ నేతృత్వంలోని పెట్టుబడిదారి అభివృద్ధి వ్యూహం స్థానాన్ని త్వరలోనే ఎగుమతి ఆధారిత మార్కెట్ వ్యూహం భర్తీ చేసింది. ఆఫ్రికా, ఆసియా మరియు లాటిన్ అమెరికా దేశాల్లో అంతర్జాతీయ ద్రవ్యనిధి, ప్రపంచ బ్యాంకు కలిసి వివిధ రకాల షరతులతో కూడిన రుణాలతో వ్యవసాయ ఉత్పత్తిని ప్రపంచ మార్కెట్లతో తిరిగి అనుసంధానం చేశాయి. పెట్టుబడులని అందుబాటులోకి తెచ్చి, అంతర్జాతీయంగా తిరిగి చెల్లించే పద్ధతులు ఏర్పాటు చేసి, సాంకేతిక పరిజ్ఞానంలో మార్పులని ప్రోత్సహించి, ఉత్పాదకత, ఉత్పత్తి మరియు లాభాలను పెంచాయి (ప్రపంచ బాంకు 2007, అక్రమ్‌లోధీ 2008, వెల్ట్ మెయర్ 2009)

ఈ సందర్భంలో బెర్న్‌స్టీన్ (1996) ను ఒక విషయంపై స్పష్టత కోరడం అవసరం. ప్రస్తుత నయా ఉదారవాద ప్రపంచీకరణలో వ్యవసాయిక పరివర్తన సాధ్యమవుతుందా? అసలు ఇప్పుడు ఆ పరివర్తనకి ప్రాసంగికత ఉందా?

మొదటిగా గుర్తించాల్సిన కీలక అంశం ఏమిటంటే 20వ శతాబ్దం రెండవ భాగంలో మూలధన సమీకరణ సమస్యకి, వ్యవసాయ రంగానికి చారిత్రకంగా ఉండిన సంబంధం తెగిపోయింది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడి సమీకరణ ప్రధానంగా పారిశ్రామిక ఉత్పత్తి రంగం మరియు సేవల రంగం నుండి అందుతున్నదని గుర్తుపెట్టుకోవాలి. మూలధనం ప్రపంచీకరింపబడటం వలన, జాతీయ పెట్టుబడికి అంతర్జాతీయ మూలధనంతో అనుసంధానం వలన, దానికి ప్రస్తుతం వ్యవసాయంలో మిగులు వనరుల అవసరం అంతగా లేదు. అందువల్ల వ్యవసాయ ఉత్పత్తిని అందుకు అనుకూలంగా పునర్నిర్మించుకోవలసిన అవసరం లేదు. వ్యవసాయ రంగ పరివర్తన జాతీయ స్థాయిలో పెట్టుబడిదారి వ్యవస్థ అభివృద్ధికి ఇప్పుడు తప్పనిసరి కాదు. ఇపుడు అంతర్జాతీయ పెట్టుబడి ప్రపంచ స్థాయిలో సాంకేతిక పరంగా మరింత సమర్ధవంతమైన వనరుల పంపిణి ద్వారా మిగులు విలువను పెంచుకుంటున్నది (అరిఘి, 2009)

దీనిలోనే రెండవ కీలక అంశంకూడా నిబిడి ఉంది. మూలధన సమీకరణ అంతర్జాతీయం అయిన తరువాత అంతర్జాతీయ మూలధనానికి, జాతీయ శ్రామిక వ్యవస్థలతో సంబంధం కూడా తెగిపోయింది. శ్రామిక వ్యవస్థలు క్రమంగా ముక్కలయిపోయి, జీవనోపాధిని కల్పించలేని స్థితిలోకి నెట్టబడ్డాయి. ప్రపంచ స్థాయిలో మూలధన సమీకరణకు వ్యవసాయం కూడ ముఖ్యమే అయినప్పటికి, అంతర్జాతీయ మూలధనం శ్రామికులను చిన్న చిన్న సమూహాలుగా విడదీసి, శ్రామిక రిజర్వుసైన్యాన్ని పెంచి, విడిపోయిన తరగతుల మధ్య పునరుత్పత్తి సంక్షోభాన్ని కల్పించి, జాతీయ స్థాయిలో వ్యవసాయిక సమస్యను ఒక అనవసర అంశంగా మార్చివేసింది.

ప్రపంచ వ్యాప్తంగా సమకాలీన వ్యవసాయ సమస్యను ఏడు భిన్నమైన విశ్లేషణాత్మక సమస్యలుగా ప్రస్తుతం అధ్యయనం చేస్తున్నారు.

**ప్రపంచీకరణలో ఏడు వ్యవసాయిక ప్రశ్నలు:**

**వ్య.ప్ర 1: వర్గ శక్తుల వ్యవసాయిక ప్రశ్న:**

ఉత్పత్తి శక్తులు, ఉత్పత్తి సంబంధాల్లో మార్పులు అనేక

పద్ధతుల్లో, సంక్లిష్ట మార్గాల్లో జరుగుతాయి. ప్రపంచవ్యాప్తంగా ఈ మార్పు పరిస్థితులని బట్టి ప్రత్యేక రూపం తీసుకుంటుంది. గ్రామీణ ఉత్పత్తి ప్రక్రియలు పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంలో ఎలా మార్పు చెందుతున్నాయో అర్థం చేసుకోవడం అవసరం. ఈ ప్రక్రియలను ప్రపంచ స్థాయిలో మార్పుల నేపథ్యంలో చూడవలసి ఉంటుంది. సామాజిక వర్గీకరణ, భూస్వామ్యవర్గ స్వభావం, మార్కెట్ ఆవశ్యకత, విలువ సూత్రం సాంద్రత, రాజ్యస్వభావం మొదలైనవి ఈ వ్యవసాయ సమస్య విశ్లేషణా చట్రంలో కీలకం. క్లుప్తంగా, ఈ విశ్లేషణా చట్రం రైతాంగ వర్గీకరణను, గ్రామీణ పెట్టుబడిదారి వ్యవస్థ ఆవిర్భావాన్ని చర్చిస్తుంది.

**వ్య. ప్ర. 2. వ్యవసాయ సమస్య ఏ మార్గాల్లో పయనిస్తుంది?**

బిల్ వారెన్ ప్రతిపాదించిన ఈ సిద్ధాంతం, సామ్రాజ్యవాదం వలసల ఏర్పాటు ద్వారా ప్రపంచమంతటా పెట్టుబడిదారీ సంబంధాలను ప్రవేశపెట్టిందని వాదిస్తుంది. భౌగోళిక, కాల పరిస్థితులను బట్టి భిన్నంగా ఉన్నప్పటికీ, అభివృద్ధి చెందుతున్న దేశాల్లో అది ఒక అనిశ్చితతో కూడిన, శ్రమను సరుకుగా మార్చే ఆపశక్యంగాని చలనశీల ప్రక్రియను ప్రవేశపెట్టింది. నిరంతరంగా కొనసాగుతున్న వేతన శ్రామికుల పెరుగుదల గ్రామీణ ప్రపంచంలో పెట్టుబడిదారి ఆర్థిక వ్యవస్థను లోతుగా పాతుకునేట్టు చేసి వ్యవసాయిక ఉత్పత్తి విధానంలో మార్పును తెచ్చింది. అంతిమంగా ఏ ప్రాంతం కూడ ఇటువంటి మార్పుకు అతీతంగా ఉండలేదు. ఈ విశ్లేషణా చట్రం, రైతులు భూమిని కోల్పోయేస్థితిపై; తదుపరి వేతన శ్రామికులుగా మారటంపై గ్రామీణ పెట్టుబడిదారి వ్యవస్థ క్రమాన్ని నిరోధించడానికి జరిగే పోరాటంపై దృష్టి కేంద్రీకరిస్తుంది.

**వ్య. ప్ర 3. ప్రపంచ శ్రామిక రిజర్వు సైన్యానికి సంబంధించిన వ్యవసాయ సమస్య.**

ఈ సమస్యను ఫర్హద్ అరఘి (2009) లేవనెత్తాడు. ప్రస్తుతం అడ్డులేకుండా కొనసాగుతున్న నయా ఉదారవాద ప్రపంచీకరణ, 19వ శతాబ్దంలోని ఉదారవాద సామ్రాజ్యవాద కొనసాగింపని చెపుతాడు. 1830 నుండి 1870 వరకూ, 1973 నుండి ఇప్పటి వరకు జరిగిన కాలాల మధ్యలోని ఆర్థిక ఉదారవాదంలో, ప్రజా సంక్షేమం పట్ల వ్యతిరేకత, స్వేచ్ఛామార్కెట్ మాయాజాలం, ప్రపంచ శ్రామిక మార్కెట్లకు అనుగుణమైన శ్రమ విభజన సర్వసాధారణంగా కనిపిస్తాయి. అరఘి దృష్టిలో, ఆధునిక నయా ఉదారవాద ప్రపంచీకరణ ఆహార వ్యవస్థను తన ఆధీనంలో పెట్టుకుని ప్రపంచస్థాయిలో విలువను ఉత్పత్తి చేయటమేకాక, దాని బదిలీ, పంపిణీలను కూడా నియంత్రిస్తుంది. ప్రపంచ ఆహారవ్యవస్థపై ఇటువంటి నియంత్రణ వల్ల ఉత్తరాది ప్రపంచానికి రాయితీలతో కూడిన ఆహార వినియోగం ఎక్కువ మొత్తంలో చేసే అవకాశాలు ఏర్పడ్డాయి. ఇది ప్రపంచ స్థాయిలో పేద నివాస సముదాయాలను, నిరుద్యోగ మిగులు సైన్యాన్ని, ఉపాధి కొరకు వలసలను సృష్టించింది. ఈ విధంగా వ్యవసాయిక సమస్య కొత్త అంశాలతో మరింత క్లిష్టంగా పునరావృత్తమవుతున్నది. ఈ విశ్లేషణా చట్రం, పెట్టుబడి – కేంద్రకమైన వ్యూహాన్ని అవలంబించి ప్రపంచ పెట్టుబడిదారీ విధానం చిన్న రైతులను క్రమంగా ఉత్పత్తి నుండి దూరం చేయటాన్ని విశ్లేషిస్తుంది.

**వ్య. ప్ర 4. సంబంధం తెగిపోయిన శ్రామిక వ్యవసాయ సమస్య:**

ఇది బెర్న్‌స్టీన్ లేవనెత్తిన ప్రశ్న, ప్రపంచ పెట్టుబడిదారి వ్యవస్థలో జాతీయ పెట్టుబడి, అంతర్జాతీయ పెట్టుబడితో అనుసంధానం కావడం వల్ల వ్యవసాయరంగం పెట్టుబడిదారి వ్యవస్థకు పరివర్తన చెందాలన్న విషయం ప్రాధాన్యతను కోల్పోయింది. వ్యవసాయిక పెట్టుబడిది పరాధీనత గల అస్తిత్వం. ఉత్పత్తి సంబంధాల్లో మార్పులను ప్రభావితం చేయగలిగిన శక్తి ఉన్నప్పటికీ గ్రామీణ వ్యవస్థలో వివిధ వర్గాల శక్తులను ఏకం చేయడంలో దాని ప్రభావం స్వల్పంగానే ఉంటుంది. అందువల్ల బెర్న్‌స్టీన్ ఉత్పత్తి లేదా సమీకరణ సమస్య కన్న గ్రామీణ రాజకీయ సమీకరణలే ప్రధానమైనవని భావించాడు. ఈ విశ్లేషణా చట్రం, ప్రపంచీకరించబడిన పెట్టుబడిదారీ వ్యవస్థకు మరియు ప్రపంచ విలువ గొలుసులో పేదరికంలోకి నెట్టబడుతున్న రైతాంగానికి మధ్య జరిగే పోరాటంపై దృష్టి కేంద్రీకరిస్తుంది.

**వ్య. ప్ర 5. కార్పొరేట్ ఆహారవ్యవస్థకు సంబంధించిన వ్యవసాయ సమస్య:**

దీనిని ఫిలిప్ మెక్‌మైకెల్ (2009) లేవనెత్తాడు. అరాఘి లాగే మెక్‌మైకెల్ కూడా వ్యవసాయ సమస్యను ప్రపంచీకరణ నేపథ్యంలో పునరాలోచించాలని అంటాడు. అయితే ఉదారవాద సరళీకరణ; ద్రవ్యీకరణ; ప్రపంచ ఆహార వ్యవస్థ ఏర్పాటు వంటి చారిత్రక పరిస్థితులు వ్యవసాయంలో వస్తువుల సమీకరణ ఉన్మాదాన్ని ప్రోత్సహిస్తాయని నొక్కి చెప్తాడు. కార్పొరేటు ఆహార వ్యవస్థ ఏ కష్టం లేని పై వర్గాల కోసం నడిపే మార్కెట్‌ల ద్వారా పనిచేస్తూ, పేద ప్రజా సమూహాలను ఆహారానికి దూరం చేస్తుంది. ప్రపంచ పెట్టుబడి కదలికల బట్టి ఈ కార్పొరేటు ఆహార వ్యవస్థలు నడుస్తాయి. ఈ వ్యవస్థల నిబంధనల కనుగుణంగా రైతాంగ ఆర్థిక వ్యవస్థ తనను తాను పునరుత్పత్తి చేసుకుంటుంది. ఈ సిద్ధాంతం కూడ వ్యవసాయ ఆహార సమస్యను ప్రపంచ చారిత్రిక దృక్కోణంలో విశ్లేషించి, ప్రస్తుత వ్యవసాయ సమస్య గ్రామీణ జీవనోపాధికి మరియు ప్రపంచీకరణ స్వభావాన్ని సంతరించుకుంటున్న సాధారణ వస్తు ఉత్పత్తికి (శ్రామికులు మరియు పెట్టుబడి) మధ్య పోరాటంగా చెపుతుంది.

**వ్య. ప్ర. 6 జండర్ అసమానతని పరిగణించాల్సిన వ్యవసాయ సమస్య:**

ఇది గతంలో బ్రిజెట్ ఓ లాఫ్లిన్ (2009) లేవనెత్తిన సమస్యకు మరొక కోణం. మిగులు పోగుబడి, ఉత్పత్తి సంబంధిత రాజకీయాలకు జెండర్ కోణాలుంటాయని ఆమె ప్రతిపాదించింది. కుటుంబాల కోసం స్త్రీలు చేసే చెల్లింపులు లేని, సరుకు రూపం తీసుకోని శ్రమ, 'శ్రమ సరుకు' విలువని సృష్టించటంలో విశేషంగా సహాయపడుతుంది. వ్యవసాయ సమస్య చుట్టూ తిరిగే రాజకీయాలు, కనీసం జెండర్ శ్రమ విభజనని అర్థం చేసుకుని, సమస్యగా లేవనెత్తాలి. ఈ సిద్ధాంతం వ్యవసాయ పోరాట రాజకీయాలని విమర్శనాత్మకంగా చూసి, వాటిలోకి జెండర్ కోణాన్ని తెస్తుంది.

**వ్య. ప్ర. 7. జీవావరణ మరియు పర్యావరణ వ్యవసాయ సమస్య:**

వ్యవసాయ ఉత్పత్తి, దానిలో జరిగే పెట్టుబడి సమీకరణ, ఆ సంబంధిత రాజకీయాలు, జీవ భౌతిక, వ్యవసాయ జీవావరణ అంశాలతో సంబంధాన్ని కలిగి ఉంటాయి. ఈ అంశాలే ఆస్తులని, ఉత్పత్తి ప్రక్రియను, వర్గాల ఏర్పాటును ప్రభావితం చేస్తాయి. దూరదృష్టిలేని వ్యాపార వ్యవస్థ, వ్యవసాయావరణ వనరులను, సుస్థిరతలేని సాంకేతికతల ద్వారా విరివిగా ఉపయోగించటం వల్ల పెట్టుబడి సమీకరణ రేటుకు పరిమితులేర్పడుతాయి. కార్పొరేటు వ్యవసాయ పద్ధతులు జీవావరణాన్ని విచ్ఛిన్నం చేస్తున్న సందర్భంలో, జీవావరణ సంబంధాన్ని, వర్గ మరియు జీవావరణ వైరుధ్యాలను వ్యవసాయ సమస్య తప్పని సరిగా పట్టించుకోవలసిన అవసరం ఉంది (పియర్ బ్లాకీ 1985, టోనీ వెయిస్ 2007, బెల్లమీ ఫోస్టర్ 2009). పెట్టుబడిదారీ వ్యవస్థలో జీవభౌతిక వైరుధ్యం ఒక వ్యవసాయ సమస్యగా, రాజకీయ పోరాట వాతావరణాన్ని ప్రభావితం చేస్తుంది.

సమకాలీన పరిస్థితుల దృష్ట్యా వ్యవసాయిక సమస్యను అర్థం చేసుకోవడానికి రచయితలు వ్యవసాయ పరివర్తనకు సంబంధించిన వైరుధ్య అంశాలను మదింపు చేయాలని వాదిస్తారు. పైన పేర్కొన్న వివిధ అంశాలలో ఎక్కువగా ఒకదానికొకటి పూరక అంశాలుగా ఉన్నప్పటికి, వ్య. ప్ర. 6 మరియు 7 ఇతర అంశాలతో వైరుధ్యాన్ని కలిగి ఉన్నాయి.

**ముగింపు: 21వ శతాబ్దంలో రైతాంగ ప్రశ్న:**

అక్రమ్ లోధీ–కేల ఉద్దేశంలో, 21వ శతాబ్దంలో నయా ఉదారవాద పెట్టుబడి, ప్రపంచ వ్యవసాయ ఉత్పత్తి విధానాన్ని మునుపెన్నటికన్నా ఎక్కువగా యాంత్రీకరించి ఎగుమతి పరిశ్రమగా మార్చివేసింది. ఇది రైతాంగంలో అంతరాలని తీవ్రతరం చేస్తోంది. చిన్న ఉత్పత్తిదారులు గ్లోబల్ సప్లై చైన్‌లతో అనుసంధానం గావించబడుతున్నారు. మార్కెట్ల ఆటుపోట్లలో చిన్నాభిన్నమై రోజు రోజుకూ దరిద్రులయిపోతూ, శ్రామికుల్లా దోపిడీకి గురైతున్నారు. లోకల్ మార్కెట్ల స్థానాన్ని ఎగుమతి మార్కెట్లు ఆక్రమిస్తున్నాయి. కోకో, టీ, కాఫీ, రబ్బర్, పంచదార, పత్తి, జనుము, సుగంధ ద్రవ్యాలు, పాలు, మాంసం, చేపలు, పళ్ళు, కూరగాయలు, ఆహార ధాన్యాలు, పొగాకు ఏదైనా సరే గ్లోబల్ సరఫరాలో భాగం అయిపోయాయి. వాటి ధరలను గ్లోబల్ మార్కెట్లు నిర్ణయిస్తున్నాయి. ఇవి పెద్ద రైతాంగానికి లాభాలు, చిన్న రైతాంగానికి నష్టాలు మిగులుస్తున్నాయి. పెట్టుబడి ప్రపంచీకరణ చెందింది. దీనిలో భాగంగా వ్యవసాయ మిగులు కూడా ప్రపంచీకరణ చెందింది.

చరిత్రకారుడు హాబ్‌స్వామ్ అన్నట్లు రైతులేమీ అంతరించిపోలేదు. వియత్నాం, మధ్య ఆసియాలో కో ఆపరేటివ్స్‌లో చేరిన రైతులు వ్యక్తిగత రైతులుగా పున:విచ్ఛిన్నమయ్యారు. భూమిలేని కూలీలు భూమి కౌలుకు తీసుకుని రైతు అవతారం ఎత్తుతున్నారు. జీవితపు జరుగుబాట్లు పున నిర్వహణకు గురైతున్నాయి. మార్కెట్లు ప్రజల జీవితాల్లో మరింత లోతుగా పాతుకుంటున్నాయి. విలువ సూత్రం మార్కెట్ల ద్వారా ప్రపంచ ఉత్పత్తిని పెంపొందిస్తూ, రైతు–కూలీలను దోపిడి చేస్తూ ప్రపంచ ఆహార ఉత్పత్తిని శాసిస్తోంది. రైతాంగ ప్రశ్నను రాజకీయ ప్రశ్నగా మలచడానికి ఈ నేపథ్యం అర్థం చేసుకోవడం అత్యంత అవశ్యం.

పరిణామం బహు ముఖమైనది, విశిష్టమైనది, సంఘర్షణాత్మకమైనది. శాస్త్రీయ కోణంలో రైతాంగ ప్రశ్న ఉనికి కోల్పోయినట్లనిపించవచ్చు. అది దేశీయ ప్రారిశ్రామిక పెట్టుబడిని నిర్మించే కార్యక్రమం నుండి అంతర్జాతీయ పారిశ్రామిక పెట్టుబడిని నిర్మించే కార్యక్రమానికి మార్చబడింది. దాని పరిణామమే రైతాంగ సంక్షోభం, రైతాంగ దారిద్ర్యం. రైతాంగ సమస్య ముగియలేదు, ప్రపంచీకరణ నేపథ్యంలో తిరిగి ప్రత్యక్షమయింది.

**మూలం:**

హరూన్ అక్రమ్‌లోధీ, క్రిస్టాబెల్‌కే రాసిన 'వ్యవసాయ సమస్య: మూలాల శోధన'కు సంక్షిప్త రూపం. 2010లో జర్నల్ ఆఫ్ పెజెంట్ స్టడీస్‌లో ప్రచురితమైంది ఈ వ్యాసం. వా. 37, నెం. 1 జనవరి 2010, పే. 177–202

**అనువాదం: బి. వెంకటేశ్వరరావ్**

**సంక్షిప్తీకరణ:ఆర్.వి.రమణమూర్తి**

# పెత్తందారీ భూస్వామ్య వ్యవస్థ నుండి పెట్టుబడిదారీ వ్యవసాయిక వ్యవస్థకు పరివర్తన

## మూడు ఉత్తమ దృష్టాంతాలు: ఇంగ్లండు, ఫ్రాన్సు, ప్రష్యా


**(టి.జె. బైర్స్)**



**ఐరోపా ఖండంలో పెత్తందారీ భూస్వామ్య వ్యవస్థ నుండి పెట్టుబడిదారీ వ్యవస్థకు మారిన సమాజ పరిణామాన్ని సూచించే ఏకైక ఉత్తమ మోడల్‌గా ఇంగ్లండులో వ్యవసాయ రంగంలో వచ్చిన మార్పును పేర్కొంటారు. ముఖ్యంగా భారత దేశంలో జరిగే అనేక రాజకీయ వామపక్ష చర్చలలో దీనిని ప్రస్తావిస్తూ వుంటారు. ప్రపంచమంతటా కూడా, వివిధ దేశాల్లో జరిగిన వ్యావసాయిక పరిణామాల విస్తృతిని గాని, తీరు తెన్నులని గాని, పరిమాణాన్ని గాని అంచనా వేస్తున్నప్పుడు కూడా ఈ కొలమానాన్ని వుపయోగించి నిర్ణయిస్తుంటారు. అది రాజకీయ క్రియాశీల కార్యక్రమాలలో కావచ్చు, పరిశోధకుల రచనల్లో కావచ్చు. కానీ నిజానికి సమాజ మార్పుకు ఒక మోడల్ అంటూ ఉందనీ, అమెరికాలలోనే కాకుండా, ఆసియా దేశాలైన జపాను, దక్షిణ కొరియాల్లోనూ, యూరపులోనూ వ్యావసాయ రంగంలో పరిణామం అనేక భిన్నమైన తీరులలో సాగిందన్న అంశాన్ని టి.జె.బైర్స్ తన పరిశోధనలో రాస్తారు. ఈ పరిశోధనా వ్యాసంలో పెట్టుబడిదారి విధాన పరిణామ క్రమానికి ఇంగ్లండు, ఫ్రాన్సు, జర్మనీలని మూడు ఉదాహరణలుగా చూపుతారు. వ్యవసాయ రంగంలో కేపిటలిజం ప్రవేశించి, ఎదిగి రూపుదిద్దుకొని స్థిరపడటానికి వెనక గల మూల కారణాలు అనేకం మరియు సంక్లిష్టం. వ్యక్తిగతమైన ఆస్తి హక్కుల వ్యవస్థీకరణ; భూస్వాములకి ప్రభుత్వంపై ఉన్న ఆధిపత్య తగ్గుదల; ప్రభుత్వపు పన్నుల విధానం; వ్యవసాయ ఉత్పత్తులకు గిరాకి; తమ భూములపైన, శ్రమ పైన భూస్వాముల పెత్తనాన్ని కౌలుదారులు, రైతుకూలీలు ప్రశ్నించటానికి చట్టంలో అవకాశాలు మొదలైన కారణాలు; చిన్న రైతుల, కూలీల స్థితిగతులు ఇవన్నీ కూడా ఈ మూడు దేశాల్లోనూ కాలక్రమేణా రకరకాలుగా మారుతూ వచ్చాయని బైర్స్ మనకు గుర్తు చేస్తారు. అంతే కాకుండా ఆ 19వ శతాబ్దపు చిన్నరైతుల, రైతు కూలీల పరిస్థితులకు ఈనాటి 20వ శతాబ్దపు రైతుకూలీల పరిస్థితులకు చాలా వ్యత్యాసం ఉందని అంటారు. చిన్నరైతులు, పొలం కూలీలు అప్పుడూ వున్నారు, ఇప్పుడూ వున్నారు. కానీ 20వ శతాబ్దపు ఆరంభంలో వారి స్థితికీ, హరిత విప్లవం (1960ల) కాలం నాటి వారి స్థితికీ, ఎంతో తేడా ఉందనీ, అంతేకాకుండా హరిత విప్లవం నాటి వారి స్థితికీ ప్రపంచీకరణానంతర (1990ల) కాలంలో వారి స్థితికీ కూడా వ్యత్యాసం ఉందని బైర్స్ అంటారు. మరొక సంగతి కూడా బైర్స్ బాగా నొక్కి చెప్తారు. ప్రపంచమంతటా పారిశ్రామిక కేపిటలిజమే ఏకైక శక్తిగా రాజ్యమేలుతున్నప్పుడు సమకాలీన భారత దేశంలో రైతుకూలీల వ్యవసాయపు ఆర్థిక స్వరూపాన్ని 'పాక్షిక ఫ్యూడల్' (semi-feudal) విధానంగా పేర్కొనడం అంత ఉపయోగకరం కాదని అంటారు.**
**–సంపాదకులు**


వ్యవసాయ రంగంలో పెనుమార్పులు వచ్చి కేపిటలిజంగా పరిణామం చెందడంలో జరిగిన ఆ అనుభవాలు, పయనించిన విభిన్న మార్గాలను అర్థం చేయించటానికి బైర్స్ ఎంచుకున్న మూడు చారిత్రక ఉదాహరణలు ఇవే: మొదటి ఉదాహరణ, ఇంగ్లండులో జరిగిన 'కేపిటలిజపు దిగ్విజయం'. ఇది భూస్వామి మధ్యవర్తిత్వంతో దిగువ నుండి సాధించిన కేపిటలిజం. రెండవది, ఫ్రాన్స్‌లో ఆలస్యంగా ప్రవేశించిన పెట్టుబడిదారి విధానం; మూడవది, ప్రష్యా (జర్మనీ)లో లెనిన్ వర్ణించినట్లు 'పైనుండి' ఆవిర్భవించిన పెట్టుబడిదారి విధానం. వీటన్నింటి వెనుకా యూరపులోని ఫ్యూడల్ సమాజంలో ప్రధాన వర్గాల మధ్య అంతర్లీనంగా వున్న సంఘర్షణలే ప్రధాన కారణమని చెప్తారు. కేపిటలిజం బాగా ప్రబలిన సమాజాల్లో సమ్మెలు ఎంత సహజమో భూస్వామ్య ఆధిపత్యం రాజ్యమేలుతున్నప్పుడు వ్యవసాయ రంగంలో తిరుగుబాట్లు కూడా అంతే సహజం. 'ఫ్యూడల్ సమాజంలో సంబంధ బాంధవ్యాలు ఏ విరోధాలు లేకుండా చాలా శాంతిపూరితంగా వుండేవని; పోషకుల రక్షణ, విధేయుల కృతజ్ఞత అనే సూత్రాలపై ఈ సంబంధాలు ఆధారపడి వుండేవి' అనే భావాలను బలంగా నమ్మే కొన్ని పండిత వర్గాల ఆలోచనా వైఖరిని బైర్స్ ప్రతిపాదన తోసిపుచ్చుతుంది.

### ఇంగ్లండు: దిగువ నుండి కేపిటలిజం

13వ శతాబ్దంలో సంపన్న రైతు వర్గాల్లో అడుగు శ్రేణిలో వున్నవారికి, 30 ఎకరాలకు పైగానే స్వంతానికి భూమి వుంటే, కొద్ది మందికి మాత్రం 60 ఎకరాలకు పైనే వుండేది. ఈ సంపన్న రైతుల వర్గం సమిష్టి భూములని కబ్జా చేసుకుని, స్థానికంగా పాటించవలసిన అచారాలని నిర్దేశిస్తూ, సామాన్య ప్రజల పైన అధికారం చలాయిస్తుండేది. స్థానికంగా కట్టవలసిన పన్నులను నిర్ణయిస్తూ, దివాణంలో న్యాయస్థానం నిర్వహిస్తూ, గ్రామీణ సమాజాన్ని తమకనుగుణమైన క్రమంలో నడిపిస్తుండేది. ఈ న్యాయస్థానాలకి చట్టపరమైన చర్యలు తీసుకొని శిక్షలు అమలు చేయడం, భూముల అమ్మకాలు, కొనుగోళ్ళకు సంబంధించిన వివరాలు నమోదు చేసే పత్రాలు తయారు చేయడం మొదలైన అధికారాలుండేవి. వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకాలలో మంచి లాభాలు కనిపిస్తుండటం వల్ల సంపన్నులైన రైతులు తమ భూములను పెంచుకోవడం మొదలుపెట్టారు. సాధారణంగా ఉన్నత కుటుంబాల జాగీరు భూముల చుట్టూ వారు వాడుకొని స్వంత స్థలాలు వుంటూ వుండేవి. గ్రామాలలో ఒక్కొక్కరికి స్వంతానికి వుండవలసిన భూమి ఇంత అని పరిమితులు వున్నందువల్ల ఈ సంపన్న రైతులు కులీన కుటుంబాలు వాడుకొని భూములను ఆక్రమించుకొని తమ స్వంతం చేసుకుంటుండేవారు.

ఇలా అవతరించిన కొత్త భూస్వాములు తమ భూముల విస్తీర్ణం పెంచుకొని తమ స్వంత పద్ధతుల్లో వాటిని నిర్వహించుకోసాగారు. ఈ భూముల పర్యవేక్షణకు ప్రత్యేక ఏజెంట్లను నియమించుకున్నారు. ఈ ఏజెంట్లు 'చట్ట పరిమితుల్లో బలప్రయోగం' చేసి కూలీల నుండి పని రాబడుతూ, భూస్వాములకు వచ్చే లాభాలు తగ్గకుండా గట్టి ప్రయత్నాలు చేసేవారు. అయితే వీరి లాభాపేక్ష పెరుగుతున్న కొద్దీ రైతుకూలీలలో అసంతృప్తి కూడా పెరిగింది. ఈ అసంతృప్తి, సామాజిక ఒత్తిడి పెరగడానికి ఇతర కారణాలు కూడా తోడ్పడ్డాయి.

మొట్టమొదటి నిరసన ఫ్యూడల్ కౌలుదార్లయిన చిన్నరైతులు వ్యక్తపరిచారు. భూస్వాములు తమనుండి విపరీతమైన సేవలు (వెట్టి) రాబడుతున్నారని రాచరిక న్యాయస్థానాలకు వెళ్ళి పిర్యాదు చేసారు. అంతేకాక, తమకు కూడా చట్టరీత్యా కొన్ని హక్కులు వున్నాయి కాబట్టి, భూస్వాములు తమ చేత ఇంత చాకిరీ చేయించటం చట్టసమ్మతం కాదని కౌలు రైతు సమూహాలు వాదించాయి. అంటే తాము సామాన్య కౌలుదార్లు కామనీ, అందువల్ల భూస్వాములు ఇష్టారీతిగా వాడుకోవటానికి వీల్లేదని వాదించారు. భూమి పన్నుల వసూలును విరోధించటమే కాక, భూమి అమ్మటానికి, కొనుక్కోవటానికి హక్కులు తమకున్నాయన్నారు. తమ ఆడపిల్లల వివాహ సందర్భాల్లో భూస్వాములు వసూలు చేసే అపరాధ సుంకాన్ని కూడా వ్యతిరేకించారు. రాజులకు చెల్లించవలసిన సుంకాన్ని చెల్లించమన్నారు. వెట్టిచాకిరీని సమిష్టిగా వ్యతిరేకించారు. భూస్వాముల బంగళాల్లోకి బలవంతంగా చొచ్చుకుపోయి అధికార పత్రాలను ఎత్తుకుపోయేవారు. వారి భవనాలను తగలబెడతామని, కుటుంబ సభ్యులపై దాడి చేస్తామని బెదిరించేవారు. అటువంటి దాడులు అనేకం జరిగాయి కూడా. వ్యక్తిగత ప్రభుత్వాధికారాలని హింసాయుతంగా ధిక్కరించే సంఘటనలు మామూలయి పోయాయి. ఇక 1340ల చివరకు ఈ సామాజిక సంఘర్షణలు తీవ్ర దశకు చేరుకున్నాయి. దీనికి కారణం జనాభాలో సుమారు యాభై శాతం ప్రజలను తుడిచి పెట్టేసి 'బ్లాక్ డెత్'గా పిలవబడే ఘోర విపత్తు. మిగిలిన కౌలుదారులను, కూలీలను

అదుపులో పెట్టాలని పెత్తందారులు నిర్ణయించుకున్నారు. ఇది భూస్వాములకి, కౌలుదారులకి మధ్య సంఘర్షణ మరింత తీవ్రతరం చేసి, 1381లో ఇంగ్లీషు తిరుగుబాటు (English Rising) జరగటానికి పాక్షికంగా దోహదం చేసింది. అయితే ఈ తిరుగుబాటుదారులు ఓడిపోయారు. తమ లక్ష్యాలను సాధించుకోలేకపోయారు.

ఈ వర్గ సంఘర్షణలు భూస్వాముల పొల్లాల్లో, తోటల్లో పనిచేస్తున్న శ్రామికుల జీతభత్యాలని, వారు కట్టాల్సిన కౌలుని ప్రభావితం చేసాయి. తమ ఎస్టేట్లను అసలు లాభదాయకంగా నడిపించడం సాధ్యమేనా అనే సందేహాన్ని భూస్వాముల్లో లేవనెత్తాయి. 14వ శతాబ్దం ఆరంభం నుండి 16వ శతాబ్దపు తొలి దశాబ్దాల మధ్య కాలంలో ప్రపంచ వ్యాప్తంగా భూముల కౌలు ధరలు పడిపోయాయి. దివాణాలకు చెందిన భూములను కౌలుకిస్తే వచ్చే లాభాలు తగ్గిపోయాయి. అయితే కాలంతోపాటు కూలీల జీతభత్యాలు పెంచక తప్పలేదు. వ్యవసాయ ఉత్పత్తుల ధరలు పది శాతం తగ్గిపోయాయి. కానీ జీతభత్యాలు రెండున్నర శాతం పెరిగాయి. డబ్బు రూపంలో ఇచ్చే రోజుకూలీ రెండింతలు పెరిగింది. తమ స్వంత (జాగీరు భూముల కాకుండా) పంట పొలాల్లో పనులకు రోజు కూలీల మీద ఎక్కువెక్కువగా ఆధారపడుతున్న భూస్వాములను ఈ 'పెరుగుతున్న రోజుకూలీ ధరలు' బాగా దెబ్బతీశాయి. అందుచేత భూస్వాములు తమ భూములను 'డబ్బు కౌలుకి' ఇవ్వడం ఎక్కువ చేసారు. (ఈ రకమైన కౌలు పద్ధతికి ప్రస్తుతం ఆంధ్రా, తెలంగాణా రాష్ట్రాల్లో వుండే కౌలు విధానానికి చాలా తేడా ఉంది. ఇక్కడ ఆ రకమైన జమీందారీ వ్యవస్థ లేదు కాబట్టి. ఎక్కువ డబ్బు ఇచ్చిన వారికే భూస్వాములు తమ భూములను కౌలుకు ఇవ్వడం, తక్కువ కాల పరిమితికి మాత్రమే కౌలుకు ఇవ్వడం జరుగుతుంది) దీనినే 15వ శతాబ్దంలో జరిగిన 'భూస్వామ్య ఆర్థిక వ్యవస్థ పతనం'గా రాడ్నీ హిల్టన్ వర్ణించాడు. ఉన్నత సంపన్న వర్గాలకు చెందిన అనేక కుటుంబాలు దివాలా తీశాయి. 15వ శతాబ్దం సగం గడిచేసరికి ఏర్పడిన సంక్షోభం కొంత వరకయినా రైతుకూలీలు చేసిన వర్గ పోరాట ఫలితంగా ఏర్పడిందే. పెత్తందారీ భూస్వామ్యం ఇక పైన కొనసాగడం సాధ్యమవదని తేలింది. అయితే భూమి పెద్ద ఎత్తున భూస్వామ్య వర్గాల చేతుల్లోనే వుండి పోయింది. ఫ్యూడలిజం స్థానంలో మరింకేం రాబోతోంది?

ఇంగ్లీషు భూస్వామ్య వర్గం తమకు వస్తున్న కౌలు ఆదాయం తగ్గిపోవడంతో తమ పరిస్థితిలో మార్పు తెచ్చుకోడానికి ఫ్యూడల్ వర్గం నుండి తమను కేపిటలిస్టు భూస్వామ్య వర్గంగా పరివర్తించుకున్నారు. ఎక్కువ కౌలు సంపాదించటానికి పాత కౌలుదార్లను, చిన్న రైతులను భూముల నుండి ఖాళీ చేయించారు. చిన్న చిన్న ముక్కలుగా ఉన్న తమ భూములను కలిపి పెద్దగా చేసి, ఎక్కువ కౌలుకు ఇచ్చి, తమ లాభాలని పెంచుకునే ఏర్పాట్లు చేసుకున్నారు. తమ భూముల చుట్టూ (అవి పంట పొలాలు గాని, పచ్చిక బీడులు గానీ) కేపిటలిస్టు వ్యవసాయానికి అనుగుణంగా వుండటం కోసం కంచెలు నిర్మించారు. ఈ కంచెలను భూస్వామి గాని, కొత్తగా వచ్చిన కేపిటలిస్టు కౌలుదార్లు గాని నిర్మించేవారు. ఎక్కువగా కౌలుకు తీసుకున్నవారే చేపట్టేవారు. ఈ పెద్ద భూముల మధ్య ఇరుకున్న చిన్న చిన్న రైతులు ఈ కంచెల్ని తీవ్రంగా వ్యతిరేకించారు. అయితే, పెరిగిపోతున్న కౌలు రుసుముల్ని వ్యతిరేకిస్తూ, పశువుల మేతకు గడ్డి భూముల కోసం, కంచెల నిర్మాణానికి వ్యతిరేకంగా వారు చేసిన పోరాటం కాలక్రమేణా బలహీనమై పోయింది. ట్యూడర్ వంశ పాలన అంతరించే సమయానికి ఈ పరివర్తన పూర్తి అయింది. ఒక కొత్త వర్గ స్వరూపం నిలదొక్కుకుంది. గ్రామాలలోని వ్యవసాయ శ్రామిక వర్గానికి, నగర పెట్టుబడిదార్లతో జతకట్టిన వారి యజమానులకి మధ్య వ్యతిరేకత తీవ్రరూపం చాల్చటానికి తగిన భూమిక ఏర్పడింది. ఈ విధంగా ఇంగ్లండులో వ్యవసాయరంగం భూస్వామ్య వర్గాలు, కేపిటలిస్టు కౌలు రైతులుగా తమను తాము మార్చుకోవటం ద్వారా, పెట్టుబడిదారీ వ్యవస్థగా పరివర్తన చెందింది.

*ఇంగ్లండులో సమైక్యమైన రైతుకూలీలు జరిపిన వర్గ పోరాటం ఫలితంగా ఫ్యూడల్ భూస్వామ్య వర్గానికి కాలం చెల్లిపోయింది. తరువాత ఈ భూస్వామ్య వర్గమే అభ్యుదయ, కేపిటలిస్టు భూస్వామ్య వర్గంగా రూపం మార్చుకుంది. ఈ వర్గం ఇప్పుడు చుట్టూ కంచెలు వేసిన తమ భూములను 'లాభదాయకరమైన' బాడుగకు, కౌలుకు ఇవ్వడం మొదలుపెట్టింది. పాత ఫ్యూడల్ వివక్షల నుండి బయటపడిన ఒక సంపన్న రైతాంగం (కనీసం వారిలో ఉన్నత శ్రేణి వారు,సంపన్నులు) కేపిటలిస్టు కౌలు వ్యవసాయదారుల వర్గంగా రూపాంతరం చెందారు. వీరు ఇప్పుడు అధిక బాడుగ (కౌలు) చెల్లించే స్థితిలో, కనీస లాభాలు ఆర్జించే స్థితిలో ఉన్నారు. 16వ శతాబ్దంలోని ఆ పెనుమార్పులో కీలకమయిన అంశం: తమను తాము పునర్ నిర్మించుకున్న భూస్వామ్య వర్గం రైతు కూలీలపై సాధించిన ఘన విజయం.*

**ఫ్రాన్సు : ఆలస్యంగా ప్రవేశించిన కేపిటలిజం**

ఫ్రెంచి గ్రామాలలో 19వ శతాబ్దపు చివరి రోజుల వరకు ఫ్యూడల్ వ్యవస్థే అమలులో ఉండేది. స్వంతానికి చిన్న చిన్న పొలాలు వున్నా కూలీలుగా కూడా పనిచేసే మేనరియర్లు అనే చిన్నరైతులు, మధ్యతరగతి రైతులూ వుండేవారు. గుర్రాలు, నాగళ్ళు కలిగున్న వీరి పైన రకరకాల స్థాయిల్లో ధనవంతులైన రైతులు వుండేవారు. అందరికన్నా పైన చాలా కొద్ది మంది ధనిక రైతులు వుండేవారు. 80 నుండి 150 ఎకరాల భూములను వ్యాపార దృష్టితో సాగు చేసే ఒక చిన్న రైతాంగ వర్గం కూడా వుండేది. వీరు పెద్ద ఎత్తున వ్యవసాయం చేయించేవారు. వీరిలో కొందరు కౌలు రైతులు, మరి కొందరు జమీందార్ల ప్రతినిధులు, మరికొందరు వ్యవసాయదారుల ప్రతినిధులు వుండేవారు. 18వ శతాబ్దంలో పెద్ద రైతుల వద్ద రుణాలు తీసుకున్న చిన్న రైతుల బకాయిలు బాగా ఎక్కువై పోయి, చిన్న రైతులు రోజు కూలీలుగా పనిచేయవలసి వచ్చింది. అలాగే స్వంతానికి చేరెడు నేల కూడా లేని వారి సంఖ్య పెరిగిపోయి, కేవలం రోజు కూలీ కోసం పనిచేసే వర్గం ఒకటి తయారయింది. అయితే 1789లో ఫ్రెంచి విప్లవం నాటికి ఫ్రాన్సులో వ్యవసాయం పెట్టుబడిదారీ విధానానికి పరివర్తన జరగలేదు. ఇంగ్లండులో లాగా మతాచార్యులు, ఉన్నత కుటుంబీకులు, మధ్యతరగతి వారు ఫ్రాన్సులో తమ ఆస్తిపాస్తుల నిర్వహణ తాము చేసుకునేవారు కాదు. తమ ఆధీనంలోని భూములను చిన్న చిన్న ఖండాలుగా విభజించి ఒక మాదిరి సైజు వ్యవసాయ భూములు గానో, చిన్న పంట పొలాలు గానో కౌలుకు ఇస్తుండేవారు. అయితే ఇక్కడ భూముల చుట్టూ కంచె వెయ్యక పోవటల వల్ల స్వంతానికి చిన్న చిన్న పొలాలున్న చాలామంది రైతులు బ్రతక కలిగారు. ఫ్రెంచ్ భూస్వామ్య వర్గానికి, చిన్న కారు రైతాంగానికి మధ్యలో సుంకాలు వసూలు చేసే దళారీ వర్గం ఒకటి వుండేది. ఈ వర్గంలో వర్తకులు, దుకాణదారులు, నోటరీలు వుండేవారు. యజమానులకు, కౌలు రైతులకు మధ్యనున్న వీళ్ళు ఒకరో ఇద్దరో భూయజమానుల భూమిని పాలుకి తీసుకుని వీటిని ఇతరులకు మళ్ళీ కౌలుకిచ్చే వారు. యజమానులైన భూస్వాములు ఉన్నత వర్గానికి చెందిన ప్రభువులు కనుక వారి తరపున కౌలు వసూలుకు ఈ మధ్యవర్తులను నియమించుకునే వారు. భూమిని వుపయోగించుకునే హక్కులు కూడా ఈ మధ్యవర్తులకు ఇచ్చేవాళ్ళు. వ్యాపారం కోసం ఉత్పత్తి కన్నా తమ అధికారానికి, హోదాకు హాని కలగకుండా చూసుకోవడమే భూస్వాములకు ముఖ్య లక్ష్యంగా వుండేది.

ఫ్రాన్సులో వ్యవసాయ విప్లవం తీసుకరావటానికి కౌలు రైతులకి అవకాశం పెద్దగా లేకపోయింది. పెరిగిపోతున్న కౌలు ధరలు వారిని పీల్చి పిప్పి చేస్తున్నా పాత ఫ్యూడల్ విధానాలకు వారు అంటిపెట్టుకొని వుండి పోయారు. స్వంతానికి గుర్రాలు, నాగళ్ళు వుండి ఎంతో కొంత ఆదాయం ఉన్న కూలీ జనమే మార్పు కోసం పోరాడారు. నడుములు విరిగే కౌలురేట్లకి వ్యతిరేకంగా నిరసన తెలుపుతూ ఆందోళన చేసారు. గ్రామాలకు స్వతంత్ర స్వయం ప్రతిపత్తి కోసం బలమైన ఉద్యమం ఆరంభమైంది. చట్టబద్ధమైన అపరాధ రుసుములను భూస్వాములకు చెల్లించాల్సిన పన్నులను క్రమబద్ధీకరించాలని, మరణ సుంకం రద్దు చేయాలని, నిర్ధారిత వివాహ సుంకం ఉండాలని అలాగే ఆస్తి లావాదేవీల రుసుమును నిర్ధారించాలని వీరు ఆందోళన చేశారు. వీటితో పాటు తమకు 'వ్యక్తిగత ప్రతిపత్తి సేచ్ఛ' ఉండాలని కూడా డిమాండు చేశారు.

ఫ్రెంచి విప్లవం జరిగిన తర్వాత కేపిటలిజం కట్టలు తెంచుకోవటానికి రంగం సిద్ధమయింది. పైకి 'స్వతంత్ర' రైతుకూలీల సమాజంలా కనబడే (స్వతంత్రులు అని ఎందుకంటున్నామంటే వారు బానిసలు కాదు కాబట్టి) ఫ్యూడల్ సమాజపు సంబంధాలలోని స్వత:సహజంగా వుండే భారీ అడ్డుగోడలను అది కూల్చి వేసింది. భూస్వాముల వంశపారంపర్య అధికారాన్ని నాశనం చేసి వారి హక్కులను రద్దు చేసింది. సంపూర్ణ వ్యక్తిగత ఆస్తి హక్కుని ప్రవేశపెట్టింది. చర్చిల ఆధీనంలో, కులీన వర్గాల ఆధీనంలో ఉన్న భూములని అమ్మటం వల్ల భూమి పంపకాల్లో, యాజమాన్యంలో మార్పులు తప్పలేదు. దీన్నుండి బాగా లాభపడినవారు, పట్టణ మధ్యతరగతి, సంపన్న రైతు వర్గాలు. ముఖ్యంగా 'ఫ్రెంచి గ్రామీణ సమాజం' నాశనమయిపోయింది. ఒక పక్క కూలీలు తమంతట తాము

ఒక వర్గంగా ఏర్పడి గ్రామీణ ప్రాంతంలో ఆధిపత్యాన్ని చేజిక్కించుకున్నారు. ఇంకోపక్క, పేద, మధ్య తరహా రైతులు సంప్రదాయ వ్యవసాయ పద్ధతులని వదలకుండా, వ్యక్తిగత ఆస్తి హక్కులపై సమూహ నియంత్రణ ఉండాలని వాదించారు.

*ఫ్రాన్స్‌లో పెత్తందారీ భూస్వామ్య వర్గం, పెట్టుబడిదారి భూస్వామ్య వర్గంగానో లేక పెట్టుబడిదారీ రైతాంగ వర్గంగా మారే ఏ ప్రగతిశీల లక్షణాలను కనపరచలేదు. సంపన్న రైతు వర్గ మిగులుని, రాజ్యం, భూస్వాములు కలిసి పీల్చిపిప్పి చేయ్యటం వల్ల అది కూడా పెట్టుబడిదారీ లక్షణాలను అలవర్చుకోలేదు. 1789 వరకు ఇలాగే కొనసాగింది. పేద, మధ్య తరగతి రైతులు పట్టువదలకుండా పోరాడటం వల్ల పెట్టుబడిదారి సమాజం ఉద్భవించటంలో 19వ శతాబ్దం వరకూ జాప్యం జరుగుతూ వచ్చింది.*

**ప్రష్యా : ఎగువ నుండి కేపిటలిజం**

11వ, 12వ శతాబ్దాల మధ్యకాలంలో ప్రష్యాలో రెండు రకాల ఐశ్వర్యవంతులు (చర్చికి చెందినవారు, చెందనివారు) ప్రభుత్వం నుండి ఎల్బెకు తూర్పు ప్రాంతంలో వున్న భూములపై హక్కులు పొంది, రైన్ లేండు దిగువ ప్రాంతాలలోని రైతులను అక్కడకు రప్పించి, స్వతంత్రులైన రైతులుగా స్థిరపడడానికి ప్రోత్సహించారు. జంకర్లుగా పిలువబడే ఈ వలసవాద జర్మను, పోలిష్ భూస్వాములు ఇక్కడ గ్రామాలు స్థాపించి, పశ్చిమ ప్రాంతాల కంటె ఎక్కువ స్వతంత్ర జీవనం, దానికి అవసరమయ్యే సౌకర్యాలను అక్కడ స్థిరపడిన వారికి కల్పించారు. భూములని తక్కువ నిబంధనలతో కౌలుకిచ్చారు. కూలీల సంతానం కూడా పెరిగి పెద్దవారయాక కౌలు భూములను వారసత్వంగా పొందే అవకాశం కల్పించారు. చర్చికి వారు కట్టాల్సిన కౌలు కూడా తగ్గించారు. ఉచితంగా చేయవలసిన సేవలను (వెట్టి చాకిరీ) కట్టవలసిన సుంకాన్ని మాఫీ చేయించారు. వారిపై ఆధికారుల జులుంని, ఆర్థికపరమైన ఒత్తిడిని నియంత్రించారు. భూస్వామికి బదులుగా భూస్వామి నియమించిన ఏజెంటు వీరి పైన అజమాయిషీ చేసేవాడు. ఈ ఏజెంటుకి కౌలు రైతు కంటె మూడు నాలుగు రెట్లు ఎక్కువ కౌలు భూమి లభించేది. ఈ ఏజెంటు తక్షణ యజమాని అవతారమెత్తి గ్రామ న్యాయస్థానానికి అధిపతిగా వ్యవహరించి అపరాధ రుసుముల్లో కొంత భాగాన్ని తానే తీసుకొనేవాడు.

'బ్లాక్ డెత్' మొదలైనవి సంభవించడంవల్ల 14వ శతాబ్దంలో ఈ పరిస్థితి అమాంతంగా మారిపోయింది. ప్రజలు తమ నివాసాలు వదిలి పారిపోయారు. గ్రామాలు మనుష్య సంచారం లేక ఖాళీ అయిపోయాయి. 15వ శతాబ్దం పొడుగునా విపరీతమైన శ్రామికుల కరవు ఏర్పడింది. భూస్వాముల పక్షాన జంకర్లు నాయకత్వం వహించి రైతులు వదిలి పెట్టి వెళ్ళిపోయిన భూములను స్వంతం చేసుకుని కొత్తగా రైతులు దొరికేవరకూ తప్పనిసరి కాబట్టి తామే ఈ భూముల్లో వ్యవసాయం చేయసాగారు. అయితే 16వ శతాబ్దంలో మొక్కజొన్న ధరలు పెరగడంతో ఈ ఆపద్ధర్మ వ్యవసాయం కాస్తా శాశ్వతమై పోయింది. ఇటు రోజూ జీతం తీసుకుని పనిచేసే స్వతంత్రులైన కూలీలు గాని, అటు శ్రామిక సమితుల ద్వారా లభించే పనివారు గాని దొరక్క పోవడం చేత విపరీతమైన సమస్యను ఎదుర్కున్న జంకర్లు, ఉన్న రైతుకూలీలు అటూ ఇటూ పోకుండా వారిని నిర్భందంలో వుంచారు. వారికి ఇచ్చే వేతనాలపై పరిమితులు విధించారు. అంతవరకు వసూలు చేస్తున్న కౌలునిపెంచి, ఎక్కువ కౌలు ఇచ్చిన వారికే భూములు కేటాయించడం మొదలుపెట్టారు. రైతు (కూలీ)లు తప్పనిసరిగా చేయవలసిన విధులను, సేవలను (వెట్టి చాకిరీ) అనేక రెట్లు పెంచారు. 16వ శతాబ్దానికల్లా డబ్బు తీసుకుని పనిచేసే శ్రామికుల సంఖ్య అనేక రెట్లు పెరిగింది. కూలి రేటు స్థిరపడి, ఇక అదే ప్రమాణంగా నిలబడింది. స్వతంత్రులైన రైతులు పూర్తిగా మాయమయ్యారు.

అయితే ప్రష్యాలోని రైతుకూలీలు దిగజారుతున్న పరిస్థితులను, హక్కులని అంత తేలికగా ఆమోదించలేదు. రాజాస్థానాలలో, న్యాయస్థానాలలో వారు పెట్టుకున్న అభ్యర్ధనలకు ఫలితం లేకపోయింది. వారి రాజకీయ తిరుగుబాట్లు క్రూరంగా అణచివేయబడ్డాయి. ఈ వర్గ పోరాటంలో జంకర్లు తిరుగులేని విజయాన్ని సాధించారు. 16వ శతాబ్దం ముగిసేలోగా ప్రష్యాలో జంకర్లు ప్రభుత్వపు తోడ్పాటుతో స్వతంత్రం రైతులను భూస్వామ్య సేవకులుగా మార్చటంలో సఫలీకృతులయారు. జంకర్ ఆర్థిక విధానం ఒక రకమైన ఫ్యూడల్ (భూస్వామ్య) మార్కెట్ (వ్యాపార) ఉత్పాదనగా పరిణమించింది. ఈ విధానంలో భూస్వాములు ఆర్థికపరమైన అదనపు ఒత్తిడి, బెదిరింపు వుపయోగించి శ్రామికుల జీతాల ఖర్చులను, ఎస్టేటు భూములు సాగు చేయడానికి అవసరమైన గుర్రాలు, పనిముట్లు మొదలైన ఖర్చులను కూడా రైతుల నెత్తిన వేశారు. ఫ్యూడలిజం ఇంగ్లండు, ఫ్రాన్సులలో తిరిగి తలెత్తకుండా అణగారి పోతున్న సమయంలో ప్రష్యాలో మాత్రం కసితో పున:స్థాపించబడింది.

అయితే త్వరలోనే ఈ అస్వతంత్ర రైతుల మధ్య వ్యత్యాసాలు వృద్ధిచెందాయి. అస్వంతత్ర రైతుల్లోని ఒక చిన్న వర్గం దళారీ వర్గంగా తయారైంది. వీరు జంకర్ల పక్షాన వారి ప్రధాన కార్యనిర్వహణ అధికారులుగా, పోలీసు ఆఫీసర్లుగా పనిచేసేవారు. గ్రామంలో వున్న శ్రామికులపై అజమాయిషీ చేసేవారు. అస్వతంత్రులైన రైతుకూలీలు రెండు రకాలుగా విభజితమయ్యారు. ఒకరు 'నిజమైన బేరన్'లు మరొకరు 'దిగువ బేరన్'లు. మొదటి రకం బేరన్‌లు మధ్య తరగతి, పెద్ద తరగతి రైతులు. వీరు ఏభైనుండి 170 ఎకరాల భూమి సాగుచేస్తే, దిగువ బారన్‌లకి 5 ఎకరాల భూమి మాత్రమే వుండి సామాన్య రైతుకూలీలుగా పరిగణింపబడుతుండేవారు. ఈ అన్ని తరగతుల రైతుల మీద జంకర్లకు చెందిన పశువుల సంరక్షణ బాధ్యత వుండేది. వారి పొలం సైజును బట్టి చూసుకోవాల్సిన పశు వుల సంఖ్య నిర్ణయించబడేది.

18వ శతాబ్దపు ఉత్తరార్ధంలో ఈ రెండు రకాల బేరన్‌లు వర్గ పోరాటంలో పాల్గొన్నారు. భూస్వాముల పెత్తనం, వారి క్రింద చాకిరీ నిషేధించాలని ఆందోళన చేపట్టారు. ఈ కారణంగా భూస్వామ్య వ్యవస్థ పూగిసలాడటం మొదలైంది. 18వ శతాబ్దపు చివరి రోజుల్లో భూస్వాముల పెత్తందారీతనం నిషేధించవలసిన సమయం వచ్చిందని ప్రష్యాలో నాయకులు గ్రహించారు. 1806లో నెపోలియన్ సేనల చేతిలో ప్రష్యా ఘోరంగా ఓడిపోయింది. ఇక ఆ పైన 1807లో భూస్వామ్య వ్యవస్థను పూర్తిగా నిషేధించారు. ఇంగ్లండులో ఇది జరిగిన 350 సంవత్సరాల తరువాత జరిగిన ఈ మార్పు తరువాత ప్రష్యాలో ఎట్టకేలకు భూస్వామ్యం నుండి పెట్టుబడిదారీతనం వైపు పరివర్తన ప్రారంభమయింది.

ఇంగ్లండులో కేపిటలిస్టు వ్యవసాయం 16వ శతాబ్దంలో ఆరంభమయితే ప్రష్యాలో ఇది 19వ శతాబ్దంలో జరిగింది. అయితే మునుపటి భూస్వామ్య వర్గంలోని యజమానులే ఇప్పుడు కేపిటలిస్టు రైతులుగా రూపుదాల్చారు. అందుచేత ఇది 'ఎగువ నుండి వచ్చిన కేపిటలిజం'. ఇది ఎలా జరిగిందో వివరంగా పరిశీలిద్దాం.

ఇంగ్లీషు భూస్వామ్య వర్గంలాగే జంకర్లు కూడా భూములను తమ స్వంతానికి, తమ యజమాన్యం కిందే వుంచుకుని సంపన్న రైతులు, పేద రైతు కూలీల తీవ్ర నిరసనల మధ్య, తమ భూముల చుట్టూ కంచెలను నిర్మించారు. దీనిని రైతులు ఎంతగానో ప్రతిఘటించినప్పటికీ భూస్వాములు పట్టు వదలలేదు. అయితే 18వ శతాబ్దపు చివరి దశాబ్దాలలో ప్రష్యాలోని ఉన్నత సంపన్న కుటుంబాలు మితిమీరిన ఋణభారంలో మునిగిపోయాయి. 1820లో జరిగిన ద్రవ్య క్రుంగుబాటుతో (డిఫ్లెషన్) ధాన్యం ధరలు పూర్తిగా పడిపోయి, వాటికి వుండే గిరాకీ తగ్గిపోయింది. ఈ కారణంగా బలమైన నిర్ణయాలు తీసుకోవలసిన అవసరం ఏర్పడింది. ఉన్నత కుటుంబీకులు ఎస్టేట్లను సామాన్య ప్రజలకు అమ్మక తప్పలేదు. ఈ కొత్త యజమానుల వద్ద పెట్టుబడికి ధనం వుండటం చేత ఇది ప్రష్యా వ్యవసాయ రంగంలో పెద్ద పెట్టున రూపమార్పిడి జరగడానికి దారి తీసింది. 1850లు వచ్చేసరికి జంకర్ల ఆస్తులు సామాన్యుల హస్తగతమవడం ఎక్కువయింది. సుమారు మూడింతలు, నాలుగింతలుగా ఈ ఆస్తుల మార్పిడి పెరిగి 1856 కల్లా 56 శాతానికి చేరుకుంది. అయితే ఈ కొత్త యజమానులు మాత్రమే కేపటలిస్టు వ్యవసాయం వైపు మళ్ళలేదు. పాతవారు కూడా ఈ కొత్త మార్గాల వైపుగా మళ్ళారు.

ప్రష్యాలోని భూస్వాముల యాజమాన్యంలోనే వుండి పోయిన భూముల్లో చాలా భాగం రైతు కూలీల కౌలు పొలాలే. కానీ వీరు ఇంగ్లీషు భూస్వాముల్లా మిగిలిపోలేదు. కేవలం రైతు వద్ద నుండి కౌలు వసూలు చేసుకోవడం మాత్రమేకాక, ఈ భూముల్లో ఏ రకంగా వ్యవసాయం చేయాలి, ఏయే పంటలు పండించాలి వంటి నిర్ణయాలు తీసుకునే వారు. అందుచేత 1807కు పూర్వం కూడా పంట ఉత్పత్తి విషయాలను వీరు పట్టించుకునేవారు. ఇటువంటి భూస్వామ్య వర్గమే వేతనాలు ఇచ్చి శ్రామికుల చేత పని చేయించుకునే వర్గంగా మారడానికి అవకాశాలు ఎక్కువ. అంతేకాని ఇంగ్లండులోలాగా డబ్బు కౌలు రూపేణా అదనపు విలువను స్వాహాచేసే భూస్వామ్యంలో ఈ మార్పుకు అవకాశాలు

తక్కువ. అటువంటి పరిస్థితి ఇంగ్లండులో బాగా ప్రబలి ఉండేది. కౌలు ధర పెంచి అదీ డబ్బు రూపంలోనే ఇవ్వాలి అనే పద్ధతి పెరిగిన కొద్దీ వారికి ఉత్పత్తితో లంకె తెగిపోయింది. వీరు కూడా కేపిటలిస్టు రైతు వర్గంగా పరివర్తన చెందే అవకాశం ఉంది. కానీ భూస్వాములకు డబ్బు రూపంలో చెల్లించే వేతనాల ద్వారా శ్రామికులతో ప్రత్యక్ష సంబంధాలు వుండి, పంటల వుత్పత్తిలో కూడా పాల్గొన్నప్పుడే అది సాధ్యమయే అవకాశాలు వుంటాయి.

భూస్వాములకు తమ సేవలను అందించడం తప్పనిసరి విధిగా భావించే కూలీల కాలం అంతరించింది. ప్రష్యాలో తమ కట్టడిలో వుండి కూలీ పనులు చేసే పనివారి కొరత భూస్వాములకు ఏర్పడింది. పూర్వం కట్టు బానిసల్లాగా పనిచేసిన వారు ఇప్పుడు జంకర్‌ల తోటల్లో, పొలాల్లో పనిచేయడానికి ఒప్పుకోవడం లేదు. కూలి డబ్బు కోసం పని చేసే ఈ కొత్త రకాలైన శ్రామిక పద్ధతులను పూర్తిగా కేపిటలిస్టు సమాజపు విధానాలు అని చెప్పలేము, ఇవన్నీ మార్పు చెందుతున్న సమయంలో రకరకాల రూపాలు దాల్చిన పద్ధతులు అనవచ్చును. జంకర్లు భూస్వామ్యపు గర్భకోశంలో నుండి కిరీటాలు ధరించి, పట్టం గట్టుకొని కేపిటలిస్టు రైతులుగా పుట్టుకొని రాలేదు. వారి భూస్వామ్య తొడుగులు తొలగించుకోవడానికి కొంత సమయం పట్టింది. మొదట్లో జంకర్ల పొలాల్లో రైతు కూలీల చేత, వారి కుటుంబాల్లోని యువకుల చేత నిర్బంధంగా పనిచేయించుకునేవారు. ఇవి ఆగిపోయి, ఆ స్థానంలో కాంట్రాక్టు పద్ధతి మీద కూలీలను పెట్టుకోవలసి వచ్చింది. కాటేజర్ విధానం అంటే, ఉండటానికి ఇల్లిచ్చి వారి చేత పనులు చేయించుకోవడం కూడా వాడుకలోకి వచ్చింది. అంటే కొంత నేల, ఇల్లు ఇచ్చి అందుకు బదులుగా తమ పొలాల్లో వారు పనిచేయాలి అనే నిబంధనను భూస్వాములు పెట్టారు. (పెర్కిన్స్ 1984, 5). పొలాలలో పనిచేసే ఈ శ్రామికులు ఒక రకంగా స్వతంత్రులే కానీ వారి రాకపోకలపై కట్టడులు వుండేవి. దీని తరువాత మరొక పద్ధతి వచ్చింది. స్వల్పకాలిక కాంట్రాక్టులు రాసుకొని పనిలోకి ప్రవేశించి కూలీలు యజమానులకు బందీలుగా వుండి పోయేవారు. ఎటువంటి పద్ధతి అయినా డబ్బు రూపంలో జీతాలు వుండేవి కావు. జీవన ప్రమాణాలు చాలా అధ్వాన్నంగా వుండేవి. చివరకు జంకర్లు రోజుకూలీలను అంటే పగలు మాత్రమే పనిచేసే వారిని జీతమిచ్చి పెట్టుకోక తప్పలేదు. వీరికి డబ్బు రూపంలో వేతనం లభించేది. మార్పు సూచించిన అర్థంలో వీరు స్వతంత్రులైన రోజు కూలీలు. అయితే ఫ్యూడలిజపు శేష ఛాయలు వీరి పైన లేకుండా పోలేదు. 1871కి గాని ఈ పెనుమార్పులు పూర్తి అవలేదు. అప్పటికి ఏ రకంగా చూసినా జంకర్లు పూర్తిగా కేపిటలిస్టులు అయిపోయారు. కొద్ది కాలం క్రింద ముగిసిపోయిన ప్రష్యా ఫ్యూడల్ గతం లోతుగా పాతిన మరకలు, మచ్చలు గల కేపిటలిజం ఇది. ఆ గతంతో పాటుగా వచ్చిన రైతుకూలీ వర్గపు ప్రచండమైన అణచివేత కూడా.

ప్రష్యాలో ఎల్బెకు తూర్పు ప్రాంతాల్లోనికి మొట్టమొదట వలస వచ్చిన సంపన్న భూస్వాములు స్వతంత్రులైన రైతు– కూలీలను ఆహ్వానించి వారికి అక్కడ నివాసాలు ఏర్పరచి, అక్కడే స్థిరపడిపోయే వీలు కల్పించారు. ఆ తరువాత 16వ శతాబ్దంలో ఈ రైతు–కూలీలను తమకు కట్టుబానిసలుగా చేసుకున్నారు. 18–19 శతాబ్దాల మధ్య కాలంలో భూస్వాములు తమకు డబ్బు రూపంలోను, శ్రమ రూపంలోను చెల్లించవలసిన వాటి కోసం ఈ రైతుకూలీలను పీడించసాగారు. రైతు–కూలీలు ప్రతిఘటించారు. జంకర్లు క్రమక్రమంగా బలహీనపడ్డారు. బానిసల్లాగా పనిచేసే కూలీలు లభ్యమవడం తగ్గిపోయింది. 19వ శతాబ్దపు మధ్యకాలంలో జంకర్ వర్గం కేపిటలిస్టు రైతువర్గంగా రూపం మార్చుకున్నది. పొలాల్లో పనిచేయడానికి దినభత్యంపై కూలీలను పెట్టుకోవడం మొదలైంది. సంపన్నులైన రైతు–కూలీ తరగతికి చెందినవారు తగినంత సంఖ్యల్లో లేకపోవడం వలన ఆ తరగతి ద్వారా దిగువ నుండి కేపిటలిజం పుట్టుకొని రావడం ఏమాత్రమూ సాధ్యమవలేదు. 16వ శతాబ్దంలో ఫ్యూడలిజాన్ని అమలు చేయడంతో 'స్వతంత్రులైన' రైతు–కూలీల పైన జంకర్లు ప్రథమ విజయం సాధించారని చెప్పవచ్చు. 19వ శతాబ్దంలో అర్థబానిసలైన రైతు–కూలీలపై జంకర్లు సాధించిన విజయం కేపిటలిజపు ప్రవేశంగా పేర్కొనవచ్చు. ఇదే 'ఎగువ నుండి కేపిటలిజం'.

**ఈ పరివర్తన చర్చకు ఈనాడు వున్న ప్రాధాన్యం ఏమిటి?**

మధ్య యుగాల నాటి రైతు–కూలీ సమాజాల గురించి చేసిన పరిశీలనలను, ఏర్పరచుకున్న అభిప్రాయాలను ఇప్పటికాల సమాజాలకు వర్తించడం ప్రమాదకరంగా పరిణమించవచ్చు. ఉదాహరణకు తొలి దశలోని యూరోపియన్ కేపిటలిజంలో ప్రముఖ పాత్ర వహించిన కేపిటలిస్టు రైతువర్గం రంగప్రవేశం చేసిన కాలంలో చిన్నతరహా పరిశ్రమలకు అనువైన ఒక రకం వాతావరణం వుండేది. ఇప్పుడు, ఈ వర్తమాన ప్రపంచంలో, ప్రపంచం అంతా కూడా వ్యాపారం, పరిశ్రమలు గుత్తాధిపత్య కేపిటలిజం చేతిలో ఉన్నాయి. ఇప్పటి రైతు–కూలీ సమాజాల స్థితిగతులను మధ్యయుగం నాటి రైతుకూలీ సమాజాలతో ఎలా పోల్చగలం? ప్రస్తుత రైతు–కూలీ సమాజ నాయకత్వం చేయ్యాల్సిన కృషికి గతంలోని ఆ నాయకత్వపు కృషికి ఏమాత్రం పోలిక లేదు. రెండూ పూర్తిగా భిన్నమైనవన్నది స్పష్టం. అయితే ఒక అంశం మాత్రం ఇందుకు మినహాయింపు. అదేమిటంటే, ఇద్దరికీ సంఘర్షణ బ్రతుకులో ఒక భాగం. పోరాటం లేకుండా ఏదీ సాధించలేము. దీనికి అదనంగా నేను మరొకటి చేరుస్తున్నాను. గతంలో కాని, వర్తమానంలో కాని, రైతు–కూలీ సమాజాలను గురించి చర్చిస్తున్నప్పుడు అవి ఎంత విభిన్నమైనవి అయినా సరే ప్రధానంగా పరిగణించవలసిన విషయం ఒకటి వున్నది. ఆయా రైతు–కూలీ తరగతులను విడదీసి వాటిపై ప్రత్యేకమైన ముద్రను వేస్తున్న సామాజిక వైవిధ్య స్వరూప స్వభావాన్ని, దాని విస్తృతిని, దాని హెచ్చుతగ్గులను స్పష్టంగా చూడగలగాలి. దీనితో పాటుగా భూస్వామ్య వర్గపు స్వరూప స్వభావాలను కూడా పరిశీలనలోకి తీసుకోవాలి.


**మూలం:**

టెరెన్స్ బైర్స్ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ లాండ్, పావర్టీ, సోషల్ జస్టిస్, డెవలప్‌మెంట్‌లో 2006లో సమర్పించిన "ద పెజంట్రీ అండ్ ది డవలప్‌మెంట్ ఆఫ్ కాపిటలిజం ఇన్ కంపారటివ్ పెర్‌స్పెక్టివ్"

**అనువాదం: సరోజిని ప్రేమ్‌చంద్**

**సంక్షిప్తీకరణ: ఆర్.వి.రమణమూర్తి**



# భారతీయ వ్యవసాయం, అర్ధ భూస్వామ్యమా? లేక పెట్టుబడిదారీ వ్యవసాయమా?

(ప్రఫుల్ బిద్వయ్)

**భారత వ్యవసాయ రంగంలో నెలకొంటున్న ధోరణులను ఎలా అర్థం చేసుకోవాలి? వ్యవసాయంలో ఇంకా భూస్వామ్య వ్యవస్థే వున్నదా లేక పెట్టుబడిదారీ వ్యవస్థ వైపు పయనం మొదలైందా అన్న విషయం గురించి గతంలో భారతీయ విద్యావేత్తల నడుమ రెండు దశాబ్దాల పాటు ఒక సుదీర్ఘమైన చర్చ జరిగింది. ఆ చర్చ సారాంశాన్ని ఈ వ్యాసం మీ ముందుంచుతున్నది. ఉత్పత్తి వ్యవస్థపై తమ అంచనాల ఆధారంగానే వామపక్ష వుద్యమాలు సాధారణంగా తమ పోరాట రూపాలను నిర్ణయించుకుంటాయన్న నానుడి వుంది. ఈ చర్చలో పాల్గొన్న వారందరూ, భారత ఉపఖండం నలుమూలల నుండీ సేకరించబడ్డ క్షేత్రస్థాయి సమాచారం ఆధారంగానే తమ తమ వాదనలను నిర్మించారు. ప్రఫుల్ బిద్వయ్ గారు "ద ఫీనిక్స్ మొమెంట్" అనే గ్రంథం రాసి అందులో "ఉత్పత్తి వ్యవస్థపై భారత దేశంలో జరిగిన చర్చ" అనే ఒక సమీక్షా వ్యాసాన్ని ఆ పుస్తక అనుబంధంగా ప్రచురించారు. ప్రస్తుతం మేము మీ ముందు వుంచుతున్న ఈ వ్యాసం బిద్వయ్ గారి ఆ సమీక్షా వ్యాసం ఆధారంగా క్రోడీకరించబడిన వ్యాసంగా గమనించగలరు. డేనియల్ థార్నర్ లాంటి ఇతరుల వ్యాసాలను కాకుండా బిద్వయ్ గారు రాసిన ఈ వ్యాసాన్నే మేము ఎంచుకోవడానికి గల కారణం ఒకటే. ఈ వ్యాసంలో బిద్వయ్ గారు వ్యవసాయంపై వలసవాద ప్రభావాన్ని దృష్టిలోకి తీసుకోవడంతోపాటు 'ఉత్పత్తి వ్యవస్థ' చర్చలో పాల్గొన్న వివిధ విద్యావేత్తలు తీసుకున్న భిన్న వైఖరులు ఎలాంటి భిన్న రాజకీయ ఆచరణలకు దారితీయగలవో కూడా అంచనా వేసారు. వ్యవసాయంలో పెట్టుబడిదారీ ఉత్పత్తి సంబంధాలు స్పష్టంగా బలపడిన కారణాన, సాంప్రదాయిక వామపక్ష ఉద్యమం సంస్థలు "భ్రాంతి జనిత భూస్వామ్య భూతం" పై పోరాటం మాని పెట్టుబడిదారీ దోపిడీకి గురవుతున్న వ్యవసాయ కార్మికుల, నిరుపేద రైతుల ప్రయోజనాల గురించి మాట్లాడ్డంపై, వారిని సంఘటితం చేయడంపై తమదృష్టి పెట్టాలని, బిద్వయ్ గారి వ్యాసం స్పష్టమైన నిర్ధారణకు వచ్చింది. బ్రాడ్‌షీట్ తాజా సంచిక ద్వారా మేము పాఠకుల ముందుకు తెస్తున్న 'వ్యవసాయ ప్రశ్న' పై మార్క్సిస్టు చర్చ అనే విశాల చర్చలో భారత వుత్పత్తి వ్యవస్థపై సాగిన ఈ చర్చ చాలా అర్థవంతమైన విడదీయరాని భాగమని మేము అనుకుంటున్నాము. – సంపాదకులు**

1960 మరియు 70వ దశకాలలో స్థూలంగా మార్క్సిస్టు సిద్ధాంత ఒరవడికి చెందిన అనేక మంది భారతీయ, విదేశీ విద్వాంసుల నడుమ భారతీయ వ్యవసాయ రంగంలో ఎలాంటి ఉత్పత్తి సంబంధాలున్నాయి అనే అంశంపైన తీవ్రమైన చర్చ చెలరేగింది. అశోక్ రుద్ర, అమిత్ బాధురి, ఉత్సాపట్నాయక్, జయరస్ బానాజీ, జాన్ హారిస్, డేనియల్ థార్నర్, నిర్మల్ చంద్రా, ప్రధాన్ ప్రసాద్, హమ్జా అలావీ తదితరులు ఇందులో ప్రధాన భాగస్వాములు. ఈ చర్చ సందర్భంగా రేకెత్తిన ముఖ్యమైన ప్రశ్నలు ఈ విధంగా వున్నాయి.

1. భారత వ్యవసాయంలో ఆధిపత్య స్థానంలో వున్న ఉత్పత్తి సంబంధాలేమిటి?

2. అవి "పెట్టుబడిదారీ–పూర్వం" లేక "అర్థ భూస్వామ్య" సంబంధాలా లేక "పెట్టుబడిదారీ" తరహా సంబంధాలా? పెద్ద భూ ఖండాల యజమానులుండడమూ, కౌలుదారీ వ్యవస్థ, సాలుదారీ వ్యవస్థ, భూమిపై కిరాయి, వెట్టి చాకిరీ లాంటి రూపాలు అనివార్యంగా అర్థఫ్యూడల్ వ్యవస్థకు ఋజువులా?

3. వ్యవసాయ సంబంధాలపై, భూమి ఆస్తి పద్ధతిపై వలసవాద ప్రభావం ఏమిటి?

4. వ్యవసాయంలో వున్న అల్ప సరుకు వుత్పత్తి క్రమేణా పెట్టుబడిదారీ వ్యవస్థ వైపుకు దారి తీస్తున్నదా?

5. వర్గ పోరాటాలలో ఏది ప్రధాన విభజన రేఖ?

6. వామపక్షం ఎటువంటి వర్గ సంఘటన నిర్మాణం చేయాలి?

ఈ చర్చలో పాల్గొన్న వారందరూ 1950'లలో జరిగిన మరో చర్చను ఆధారంగా చేసుకుని తమ వాదనలు నిర్మించుకున్నారని చెప్పవచ్చు. 1950'ల నాటి చర్చ యూరప్ తదితర సందర్భాలలో ఫ్యూడలిజం నుండి పెట్టుబడిదారీ వ్యవస్థ వైపుకు జరిగిన పరివర్తన గురించి పాల్ స్వీజీ, మారిస్ డాబ్, రాడ్నీ హిల్టన్, తకహాషీ మొదలైన విద్వాంసుల మధ్య జరిగింది. ఈ చర్చ, భారతీయ చర్చకు కూడా నేపథ్యంగా వుండింది. భారత దేశంలో జరిగిన చర్చలో పాల్గొన్న విద్వాంసులు, కార్యకర్తలూ వాస్తవాల ఆధారంగా తమ వాదనలు నిర్మించారు. కానీ ఈ చర్చలకు నేపథ్యంగా పనిచేసిన మరో ప్రముఖ దృగ్విషయాన్ని మనం మరువరాదు. అది 1960ల చివర్లో పశ్చిమ బెంగాల్‌లోని నక్సల్బరీ తిరుగుబాటు. అలాగే దక్షిణ, ఉత్తర భారతాల్లో పెల్లుబికిన సమరశీల రైతాంగ పోరాటాలు ఈ చర్చకు నేపథ్యంగా పనిచేస్తాయి. ఈ చర్చ ప్రత్యక్షంగా కమ్యూనిస్ట్ పార్టీల వ్యూహాలనూ, ఎత్తుగడలనూ ప్రభావితం చేయకపోయినా, దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథా ప్రాసంగికతకు మద్దతుగా ఒక స్థూల అవగాహనా ఆవరణాన్ని మట్టుకు రూపొందించింది. బూర్జువా ప్రజాస్వామ్య పరిధిలో పట్టణ కార్మిక వర్గ సమీకరణ కన్నా గ్రామీణ వ్యవసాయ విప్లవాన్నే ఈ చర్చ స్థూలంగా సమర్థించింది అని చెప్పవచ్చు.

**ప్రారంభం :**

పంజాబ్ రాష్ట్రంలోని కొన్ని గ్రామాలను శాంపిల్‌గా తీసుకుని చేసిన సర్వే ఆధారంగా అశోక్‌రుద్ర 1969లో ఈ "ఉత్పత్తి వ్యవస్థ" చర్చను ప్రారంభించాడు. సాపేక్షికంగా సంపన్నవంతమైన ఈ ప్రాంతంలో కూడా పెట్టుబడిదారీ వ్యవసాయం ఏమంత చెప్పుకోదగ్గ స్థాయిలో వృద్ధి చెందలేదన్నది ఆయన వాదన. తమ కుటుంబ సభ్యుల శ్రమకన్నా ఇతరుల వేతన శ్రమ ద్వారా తమ భూములను సాగు చేసి, మార్కెట్ కొరకు సరుకుల ఉత్పత్తి సాగించి, సేద్య యంత్రాలును వుపయోగించే – పెట్టుబడిదారీ రైతులు మొత్తం రైతుల సంఖ్యలో చాలా అల్పసంఖ్యలో వున్నారన్నది ఈయన నిర్ధారణ.

అశోక్‌రుద్ర వాదనను ఉత్సాపట్నాయక్ పైధానిక (Methodological) కారణాలతో సవాల్ చేసింది. రుద్ర తన విశ్లేషణా క్రమంలో వుపయోగించిన శ్రేణులు(categories) అచారిత్రకమన్నది ఉత్సా వాదన. పెట్టుబడిదారీ సంబంధాలను నిర్ధారించేందుకు వేతనశ్రమ, మార్కెట్‌కై అదనపు ఉత్పత్తి అనేవి సరిపోవనీ, శ్రమదోపిడీ కారణంగా అదనపు విలువ పోగుబడడమూ, అది తిరిగి పెట్టుబడిగా మారి మదుపు పెట్టబడడమూ అనేవి నిరంతరాయంగా, అంతకంతకూ హెచ్చు స్థాయిల్లో జరుగుతూ వుండాలనీ, ఈ షరతులు కూడా పూర్తి అయితే కానీ పెట్టుబడిదారి సంబంధాల వునికిని నిర్ధారించలేమనీ ఆమె వాదించింది. భారతదేశం లాంటి మాజీ వలస దేశాలలో, ఉత్పత్తి వ్యవస్థను విప్లవాత్మకంగా మార్చకుండానే, పరిమితమైన, విరూపమైన పెట్టుబడిదారీ సంబంధాలు అభివృద్ధి చెందగలగడం చూడగలమనీ, అది ఈ దేశాలకున్న ఒక లక్షణమంటుందామె. కేవలం భూకమతాల విస్తీర్ణం ఆధారంగా ఉత్పత్తి సంబంధాల గూర్చి ఏమీ చెప్పలేమని ఒకవైపు చెబుతూనే, భూమి మార్కెట్, శ్రమ మార్కెట్‌లపై ఆధారపడ్డ ఆస్తి సంబంధాలు కూడా, పెట్టుబడిదారీ ఉత్పత్తి సంబంధాలతో సంబంధం లేకుండా, వునికిలో వుండగలవని ఉత్సా ప్రకటించింది. ఈ సంవాదంలో జోక్యం చేసుకున్న పరేష్ ఛటోపాధ్యాయ ఉత్సా చేసిన వాదనను గట్టిగా వ్యతిరేకించాడు. ఆస్తి సంబంధాలు కేవలం ఉత్పత్తి సంబంధాల చట్టబద్ధ రూపమే కాబట్టి ఉత్సా వాదన నిలవదన్నాడు.

**భారత వ్యవసాయం అర్థ భూస్వామ్య స్వభావం :**

భారతదేశంలో ఆశ్రయం పొందిన అమెరికన్ మార్క్సిస్ట్ మేధావి, డేనియల్ థార్నర్, 1956లో ఒక పరిశీలన చేసాడు. భారతీయ గ్రామీణ ప్రాంత ఉత్పత్తి రంగంలో కొన్ని "వృద్ధి నిరోధకాలు" అంతర్నిహితంగా వున్నాయనీ, భారతీయ సమాజానికే ప్రత్యేకమైన చట్టసంబంధ, ఆర్థిక, సామాజిక సంబంధాల సమ్మిళిత ప్రభావం కింద ఈ "వృద్ధి నిరోధకాలు" వుత్పన్నమవుతున్నాయనేది ఆయన వాదన. అసమానమైన భూ పంపిణీ, సరిపాలు పద్ధతితో కూడిన కౌలుదారీ వ్యవస్థ, నిర్దాక్షిణ్య అతి వడ్డీ వ్యాపారము, కౌలు రైతుల నుండి భూస్వాములు వసూలు చేసే అధిక కిరాయి, అతి తక్కువగా వున్న సాంకేతిక ప్రగతి మొదలైన అంశాలన్నీ కలిసి రైతును పేదరికం కోరల్లోకి నెట్టివేస్తున్నాయని థార్నర్ వివరించాడు. ఈ వృద్ధి నిరోధకాల ఉమ్మడి ప్రభావం వల్ల వ్యవసాయం స్తంభించి పోయి, అల్ప ఉత్పాదకత స్థిరపడిందనీ అంటారు ఆయన. థార్నర్ వాదననే భారత

వ్యవసాయ రంగంలో పాతుకుపోయిన 'అర్థ భూస్వామ్య' సంబంధాల వర్ణనగా చూడటం జరిగింది.

ఈ అభిప్రాయానికి శక్తివంతమైన ప్రతినిధి అమిత్ బాధురీ. 1970లో పశ్చిమ బెంగాల్‌లోని ఓ 20 గ్రామాలలో పరిశోధన జరిపి ఆయన అర్థ–భూస్వామ్య పని తీరును వర్ణించే ఒక అందమైన గణిత నమూనాను రూపొందించాడు. అది ఇలా వుంది.

"భూస్వాముల వద్ద సరిపాలు వ్యవసాయం చేసే ఒక కౌలు రైతు తన కుటుంబ వ్యవసాయ అవసరాల కొరకు అదే భూస్వామి వద్ద అధిక వడ్డీ కింద అప్పు చేస్తాడు. భూస్వామికి ఇప్పుడు రెండు ఆదాయాలు. ఒకటి భూమిపై లభించే కౌలు, అప్పు వడ్డీ. రైతు పండించిన పంటలో కౌలు, వడ్డీ పోను మిగిలేది సున్నా. అంటే అసలు అప్పు పూర్తిగా తీర్చకుండానే ఆ కౌలు రైతు మళ్ళ అప్పు చేయాల్సిన పరిస్థితి. ఆ విధంగా అతను శాశ్వత ఋణ బంధనాలలోకి వెళతాడు. ఇట్టి పరిస్థితుల్లో, భూస్వామికి, భూమి ఉత్పాదకతను పెంచక పోవడం వల్లనే ప్రయోజనం పెరుగుతుంది. కొత్త సాంకేతిక పరిజ్ఞానం వల్ల రైతు ఉత్పాదకత పెరిగి ఋణ విముక్తుడయ్యే అవకాశం వుంది. అది భూస్వామికి నష్టం. ఆ విధంగా అర్థ–ఫ్యూడల్ భూస్వామి ప్రత్యక్ష ఉత్పత్తిదారునిపై పరాన్నజీవిగా మారతాడు. వ్యవస్థలోని ఉత్పత్తి సంబంధాలు ఉత్పత్తి శక్తులకు అవరోధంగా మారతాయనే శాస్త్రీయ మార్క్సిస్టు సూత్రీకరణకు సజీవ ఉదాహరణగా ఈ సంబంధాలు తయారవుతాయి.

(ఈ విశ్లేషణ ప్రకారం అధిక వడ్డీలు వసూలు చేసే వడ్డీ వ్యాపారి స్థానంలో బ్యాంకింగ్ ఋణాలు అందుబాటులోకి తేవడం, కౌలుదారీ నియంత్రణ చట్టాల ద్వారా కౌలును నియంత్రించడం, నూతన వ్యవసాయ సాంకేతికత ద్వారా వుత్పాదకతను పెంచడం మొదలైన చర్యలతో అర్థ–ఫ్యూడల్ సంబంధాలు కూడా అంత మొందుతాయన్నది తార్కికంగా వూహించవచ్చు).

అమిత్ బాధురీ నిర్ధారణను బలపరుస్తూ మరికొన్ని అధ్యయనాలు జరిగాయి. బీహార్ నుండి ప్రధాన్ హెచ్.ప్రసాద్, పశ్చిమ బెంగాల్ నుండి నిర్మల్ కుమార్ చంద్రలు తమ అధ్యయనాల ద్వారా ఇదే నిర్ధారణలకు వచ్చారు. భూస్వాములు కొత్త సాంకేతిక పరిజ్ఞానాలను వ్యతిరేకిస్తారనీ, భూదాస్య సంబంధాలనే కాపాడుకో చూస్తారనీ, అల్ప ఉత్పాదకత, వనరుల అల్ప వినియోగం కొనసాగేలా చూస్తారని వీరూ వాదించారు.

1951–71 మధ్య కాలంలో భారతదేశంలోని పెక్కు ప్రాంతాలలో అర్థ–ఫ్యూడల్ సంబంధాలే నిస్సందేహంగా ప్రాబల్యంలో వున్నాయని పై ముగ్గురూ స్పష్టంగా ప్రకటించారు.

నిర్మల్ చంద్ర ప్రకారం, ఈ అర్థ–ఫ్యూడల్ శక్తులు పుట్టిందీ, బలపడిందీ వలస పాలనలోనే కానీ ఈ శక్తులు తదనంతర కాలంలో కూడా రాజ్యమేలడానికి ప్రధాన కారణం ఏమిటంటే, చరిత్రలో ఎన్నడూ లేనంత విరాట స్థాయిలో అదనపు శ్రమ గ్రామీణ ప్రాంతాలలో అందుబాటులో వుండడమే అన్నది నిర్మల్‌చంద్ర వాదం. చంద్ర వాదనను మరింత బలపరుస్తూ రంజిత్ సాహూ మరిన్ని వాస్తవాలు మన ముందుకు తెచ్చాడు. వ్యవసాయం ఏమాత్రం గిట్టుబాటు కానప్పటికీ సన్నకారు రైతు తన పొలాన్ని సాగుచేయడానికి ముఖ్య కారణం, పారిశ్రామిక రంగంలో ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు లేకపోవడమే. గిట్టుబాటు కాని వ్యవసాయం చేయగలగడానికి వెనుక వున్న రహస్యం పేదరైతు అర్థాకలితో, పస్తులతో వుండడానికి సిద్ధం కావడమే అంటాడు రంజిత్ సాహూ. తమ్ము తాము తీవ్రంగా దోపిడీ చేసుకుంటూ మనుగడ సాగిస్తున్న ఈ చిన్నకారు రైతులను వ్యవసాయం నుండి వెళ్ళగొట్టడమెలాగో తెలియక పెట్టుబడిదారీ వ్యవసాయదారులు తలపెట్టుకున్నారు.

ఇది ఇలా వుండగా, 1974లో అశోక్ రుద్ర తన ఒకప్పటి వాదన నుండి మౌలికంగా పక్కకు జరిగి, నిర్మల్‌చంద్ర వాదాన్ని తీవ్రంగా విమర్శించాడు. నీటిపారుదల, ఆధునిక రసాయనిక ఎరువులు, నూతన సాంకేతిక పరిజ్ఞానం మొదలగు వాటిపై పెట్టుబడులు పెట్టకుండా, కేవలం అధిక వడ్డీలు, కౌలు సొమ్ము పైనే ఆధారపడి బతికే వర్గమే పశ్చిమ బెంగాల్‌లో లేదు పొమ్మన్నాడు. అంతేకాదు, భూమి క్రమంగా పెద్ద రైతుల చేతిలో ఎలా కేంద్రీకృతమవుతూ వున్నదో ఋజువు చేసే సమాచారాన్ని కూడా సూక్ష్మ పరిశోధనల ద్వారా వెలికి తెచ్చాడు. గ్రామీణ ప్రాంతాలలో ఉపాధిలేని శ్రామికులు అమిత సంఖ్యలో వున్నమాట నిజమైతే, వ్యవసాయ పనులు ముమ్మరంగా జరిగే కాలంలో కూలీల కొరతతో రైతులు ఎందుకు బాధపడుతున్నారో అర్థం కాదని రుద్ర విస్మయం వ్యక్తపరిచాడు.

1969లో పంజాబ్ అధ్యయనాల సందర్భంగా తాను తీసుకున్న సైద్ధాంతిక వైఖరికి పూర్తి విరుద్ధంగా అశోక్ రుద్ర "కూలీ శ్రమను వుపయోగించి అదనపు విలువను సృష్టించడమూ, ఆ విలువను తిరిగి పెట్టుబడి పెట్టడం ద్వారా అదనపు విలువ సంగ్రహణం చేయడమూ అనేవి పెట్టుబడిదారీ సంబంధాలకు తార్కాణమైనట్లైతే, పశ్చిమ బెంగాల్‌లో అటువంటి సంబంధాలు విస్తారంగా వున్నాయని" ప్రకటించాడు.

**వలసవాద ఉత్పత్తి వ్యవస్థ:**

కూలీ శ్రమ, పెట్టుబడి ఏర్పడటం, దాని రాశి మొదలైన "దృగ్గోచర" (observable) అంశాల మధ్య వున్న సంక్లిష్ట సంబంధాలను అర్థం చేసుకోవడంతో పాటు, సుదీర్ఘంగా సాగిన వలసపాలనలో రూపొందిన చట్టపర, ఆర్థిక, రాజకీయ పరిణామాల సంక్లిష్ట సమాహారాన్ని అర్థం చేసుకోవడంపై కూడా అనేక మంది విద్వాంసులు తమ దృష్టి సారించారు. జైరస్ బానాజీ, అశోక్ రుద్ర, కాథ్‌లీన్ గోఫ్, గెయిల్ ఓమ్‌వెట్ మొదలగు వారు వీరిలో ముఖ్యులు. ఉదా: జైరస్ బానాజీ పరస్పరం విరుద్ధంగా కనబడుతున్నప్పటికీ సహజీవనం చేస్తున్న ఒక దృగ్విషయంపై దృష్టి సారించాడు. ఒకవైపు కూలీ శ్రమ మరోవైపు కౌలుదారు – భూస్వామి – వడ్డీ వ్యాపారిల సంబంధాలు వుండే సంక్లిష్ట చిత్రాన్ని ఉత్సా పట్నాయక్, అమిత్ బాధురీలు ప్రస్తావించారు కూడా. ఈ వైరుధ్యాన్ని వివరించడానికి, బానాజీ, ఉత్పత్తి, విలువ వాస్తవీకరణకు సంబంధించిన అంశాలను తెరపైకి తెచ్చారు. శ్రమ పెట్టుబడి ఆధీనంలోకి వెళ్ళిపోయే రెండు భిన్న రకాల పద్ధతుల గురించి మార్క్స్ చేసిన విభజన వైపు బానాజీ మన దృష్టిని లాక్కుపోతాడు. 1. మొదటిది, పెట్టుబడిదారీ (సరుకుల) సరఫరా వలయంలో చిన్నతరహా ఉత్పత్తిదారులు విలీనం అయ్యే చారిత్రిక క్రమం. మార్క్స్ దీన్ని "లాంఛన ప్రాయవిలీనం"(Formal Subsumtion) అంటాడు.

(2) ఇక రెండవది, ఉత్పత్తి క్రమంలోకి శ్రామికులు భాగస్వాములుగా వచ్చి చేరడం. దీన్ని మార్క్స్ "వాస్తవిక విలీనం" (Real Subsumtion)అంటాడు.

మొదటి క్రమంలో యేమో, రైతాంగం సృష్టించిన అదనపు విలువ పరోక్షంగా దోపిడికి గురవుతుంది. రెండవ క్రమంలో కార్మికులు సృష్టించిన అదనపు విలువ ప్రత్యక్ష దోపిడీకి గురవుతుంది.

పెట్టుబడి వలయంలోకి (రైతాంగ) శ్రమ లీనమయ్యే లాంఛన ప్రాయ విలీనం అనే ప్రక్రియ వున్నదంటేనే, ఉత్పత్తి ప్రక్రియే పెట్టుబడి ప్రక్రియలో భాగమై పోయిందని అర్థం అంటాడు జైరస్ బానాజీ. పెట్టుబడి ప్రక్రియ అంటే విలువ స్వీయ–వ్యక్తీకరణ, డబ్బు పెట్టుబడిగా మారడం వగైరా. (కేవలం చిన్న ఉత్పత్తిదారుల ఉత్పత్తులు సరుకులుగా మారడమే కాక) మొత్తం ఉత్పత్తి క్రమమే పెట్టుబడి చెప్పు చేతల్లోకి వచ్చినట్లు, ప్రత్యక్ష ఉత్పత్తిదారుడు కేవలం ఈ ఉత్పత్తి క్రమంలో ఒక చిన్న అంశంగా మారినట్లు, అతనికి దిశా నిర్దేశం పెట్టుబడి నుంచే అందుతున్నట్లు గ్రహించాలని ఆయన వెల్లడించాడు. ఇంతేకాక, బానాజీ తన వాదనను మరింత విస్తరిస్తూ ఏమంటాడంటే, శ్రమశక్తి సరుకుగా మారిపోయిన నగ్నమైన పెట్టుబడిదారీ సంబంధాలు దేశమంతటా బహిరంగంగా వ్యక్తం కాకుండానే, పెట్టుబడిదారీ దోపిడీ సంబంధాలు మాత్రం విస్తారంగా అభివృద్ధి చెందాయని, ఇందుకు ఉదాహరణగా 1850–90 నాటి దక్కన్ ప్రాంత ఉదాహరణ ఆయన ఇస్తాడు. ఆ సమయంలో, పెరుగుతున్న బొంబాయి, పుణె నగరాల జనాభా అవసరాల కొరకు దక్కన్ ప్రాంత గ్రామాలు పత్తి, చెరుకు, వేరు శెనగ, పెరటి పంటల ఉత్పత్తిలోకి ఆకర్షించబడ్డాయి. అసమాన వినిమయం ద్వారా చిన్నతరహా సరుకుల ఉత్పత్తిదారుడు తీవ్రంగా దోపిడీకి గురి అయ్యాడు. పల్లెలు అంతకంతకూ పేదరికంలో కూరుకుపోగా పట్టణాలలో సంపద పోగుపడుతూ పోయింది. రైతుకూ, వడ్డీ వ్యాపారికీ మధ్య ఏర్పడ్డది పచ్చి పెట్టుబడిదారీ స్వభావ సంబంధం. చిన్న ఉత్పత్తిదారుల అదనపు విలువ 'వడ్డీ' రూపంలో దోపిడికి గురవుతున్నందువల్ల ఆ సంబంధ అసలు స్వభావం మరుగున పడిపోయింది. ఈ కారణాన బానాజీ వుద్దేశ్యంలో దేశంలో భిన్న రూపాలలో, ప్రబలంగా వున్న కౌలుదారీ సంబంధాలేవీ "పెట్టుబడిదారీ–పూర్వ" లేక "అర్థ ఫ్యూడల్" సంబంధాలు కావు. అవన్నీ స్పష్టంగా పెట్టుబడిదారీ సంబంధాలే. రైతులు కుటుంబ శ్రమతో లేక బయటి కూలీల శ్రమతో సేద్యం చేస్తున్నారా అనే అంశం కానీ, కౌలు పద్ధతి, సరిపాలు పద్ధతా లేక కౌలు చెల్లించే పద్ధతా అనే అంశం కానీ, కేవలం ఈ సంబంధం యొక్క చారిత్రక రూపాన్నే నిర్ణయిస్తాయి కానీ, అసలు ఉత్పత్తి యొక్క సాంఘిక లక్షణాలను కానీ, స్వభావాన్ని కానీ నిర్ణయించలేవు పొమ్మంటాడు.

జైరస్ బానాజీ అలాగే రైతాంగం అప్పుల ఊబిలో కూరుకు పోవడం కూడా పెట్టుబడిదారీ – పూర్వ సంబంధాల తిరుగులేని లక్షణం ఏమీ కాదనీ, అసలు పెట్టుబడి యొక్క నిరంకుశాధికారం తొలిదశలో స్థాపితమయ్యేదే డబ్బు బలం వల్లనే అనే సంగతి మనం మరవరాదని ఆయన స్పష్టం చేస్తాడు.

హమ్జా ఆలావీ కూడా ఈ రకమైన దృక్పథాన్నే వెలిబుచ్చాడు. భారతదేశంలో రైతాంగ ఆర్థిక వ్యవస్థ ఇప్పటికీ పాత సాంకేతిక పద్ధతులతోనే నడుస్తూ వున్నప్పటికీ, రైతుల శ్రమ మొదలు కౌలు రూపంలోనూ తరువాత నేరుగా శ్రామికుల శ్రమ దోపిడీ రూపంలోనూ పెట్టుబడి దోపిడీకి గురవుతున్నదని ఆలావీ కూడా చెబుతాడు. పట్టణ చిన్నసరుకు ఉత్పత్తిదారులతో పోల్చితే, రైతుల మనోబలం దృఢమైనదనీ, ఈ దృఢత్వానికి కల కారణం వారు ఆహారానికీ, ఆవాసానికీ మార్కెట్ పై ఆధారపడక్కరలేదనీ, అందువల్లే వారు తమ అతి చిన్న కమతాలను వదులుకోకుండా గట్టిగా నిలబడగలరనీ ఆలావీ అభివర్ణిస్తాడు. అది ఎలా వున్నా చిన్నకారు రైతాంగం జీవన పరిస్థితులు, బయట సంభవిస్తున్న

పెట్టుబడిదారీ అభివృద్ధి చలనాల తాకిడికీ గురై క్రమక్రమంగా ఛిద్రమై పోతున్న మాట కూడా అంతే వాస్తవం అని కూడా ఆయన మన దృష్టికి తెస్తాడు.

తమిళనాడులోని తంజావూర్ జిల్లా పరిస్థితులపై కాథలీన్ గోఫ్ విశ్లేషించింది. ఆ జిల్లాలో భూస్వాములకు కానుకలు చెల్లించడం తీవ్ర కుల వివక్ష, కూలీలపై భౌతిక దండనలు వేయడం ఇత్యాది పెట్టుబడిదారీ – పూర్వ లక్షణాలను ఆమె గమనించింది. ఈ లక్షణాలున్నప్పటికీ 19వ శతాబ్ద చివరికల్లా తంజావూరు ప్రాంతమంతటా పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం ప్రాబల్య స్థితికి వచ్చిందని ఆమె నిర్ధారణకు వచ్చింది. 1947–80ల మధ్య కాలంలో, సంకరజాతి విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారిణులు, ట్రాక్టర్‌లు, బోరుబావులు, విద్యుత్ పంపుసెట్లు తదితర ఆధునిక సాంకేతికతను సమకూర్చుకున్న తంజావూరు జిల్లా అత్యద్భుతమైన వృద్ధి సాధించిందని ఆమె గమనించింది. పెద్ద రైతుల వ్యవసాయ క్షేత్రాలలో యాంత్రికీకరణ, ఇతర సాంకేతికతలు నిరంతరం విస్తరిస్తూ (పెట్టుబడి ఆర్గానిక్ నిర్మాణం) శ్రామికుల ఉత్పాదకతను గణనీయంగా పెంచడం ద్వారా సాపేక్ష అదనపు విలువను సంగ్రహించడం కూడా పెరిగిన సంగతిని ఆమె వివరించింది.

ఇక ఓమ్‌వెట్, రుద్ర ఇద్దరూ ఈ ఉత్పత్తి వ్యవస్థ సంవాదంలోకి కుల అణచివేత అనే అంశాన్ని కూడా భాగం చేసారు. కులపరమైన (సాంఘిక) అణచివేతతో పాటు, కుల సంబంధమైన (ఆర్థిక) దోపిడిని కూడా ఏక కాలంలో ప్రతిఘటించవలసిన అవసరాన్ని వీరిద్దరూ ముందుకు తెచ్చారు. వలసకాలం నాటికన్నా పూర్తి భిన్నంగా ఈనాడు భారత వ్యవసాయం పెట్టుబడిదారీగా మారిందని ఆమె నిశ్చితాభిప్రాయం. గ్రామీణ జనాభాలో సగం కన్నా ఎక్కువ మందే కూలీ శ్రమపై ఆధారపడి బతుకుతూ వుండడం, సరుకుల ఉత్పత్తి సర్వసాధారణం అయిపోవడం, మార్కెట్‌లో అదనపు విలువ మదుపు చేయబడటం, వ్యవసాయానికి అవసరమైన ఉత్పత్తి సాధనాలన్నీ పారిశ్రామిక రంగంలో తయారు అవుతున్న ఆధునిక సేద్య పద్ధతులూ ఇవన్నీ వ్యవసాయ పెట్టుబడిదారీ స్వభావానికి తిరుగులేని నిదర్శనాలని గెయిల్ ఓమ్‌వెట్ వివరిస్తుంది. భారతదేశంలో అదనపు విలువను సంగ్రహించే అతి ప్రబలమైన పద్ధతి పెట్టుబడిదారీ పద్ధతే అని నొక్కి చెబుతుంది.

అశోక్ రుద్ర మరో అడుగు ముందుకు వేసి ఆర్.ఎస్.శర్మ, బి.ఎన్.ఎస్ యాదవ్ లాంటి వాళ్ళు "భారతీయ తరహా ఫ్యూడలిజం" అనే సూత్రీకరణే పూర్తిగా తప్పని వాదించాడు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రగతిశీలమైన ఏ మార్పుకొరకు జరిగే ఏ పోరాటమైనా బ్రాహ్మణీయ భావజాలం అనే అభివృద్ధి నిరోధక శక్తిపై గురి ఎక్కుపెట్టవలసిందే అని రుద్ర స్పష్టం చేస్తాడు.

ఈ చర్చలో పాల్గొన్న మెంచర్, చంద్ర, పట్నాయక్, రుద్ర, ప్రసాద్, బర్దన్ తదితరులు గ్రామీణ వర్గ నిర్మాణానికీ, కులానికీ మధ్య జరుగుతూ వున్న పరస్పర చర్యలపై దృష్టిపెట్టి, ఈ చర్చను మరింత సంపన్న వంతం చేసారు. అవి శ్రమదోపిడీ రూపాలు, రైతాంగంలో భిన్నవర్గాలు ఏర్పడటం, వాటి మధ్య నెలకొన్న సంక్లిష్ట, చలనశీల సంబంధాలు, పెద్ద భూఖండాల యజమానుల 'సంకర' 'లక్షణాలు' (కొంత ఫ్యూడల్, కొంత పెట్టుబడిదారీ) వంటివి.

భూస్వాములు, ధనిక రైతులూ ఒకవైపునా, నిరుపేద రైతులూ, భూమిలేని కూలీలు మరో వైపునా నిలబడి వుండగా ఈ రెండు మహా శిబిరాల మధ్య అంతకంతకు పెరిగిపోతున్న వైరుధ్యాల గురించీ, ఈ పండితులందరూ ఎంతో ఆసక్తికరమైన, అర్థవంతమైన, లోతైన చర్చ చేసారు. జాన్ బ్రెమన్ నిర్బంధ శ్రమ ఎన్ని రూపాల్లో వుంటూవున్నదో అధ్యయనం చేసాడు. అయినప్పటికీ ఈ రూపాలన్నీ పెట్టుబడిదారీ సారంతో ఎలా సమన్వయమవుతున్నాయో కూడా చూపాడు.

ఇటీవలి కాలంలో, మరీ ముఖ్యంగా హిందీ భాషీయ క్షేత్రాలలో వర్గానికీ, కులానికీ మధ్య ఏర్పడుతున్న సరికొత్త సమీకరణాల గురించి కూడా ఈ సందర్భంగా చర్చ జరిగింది. సంప్రదాయ ఆధిపత్య అగ్రకులాలకూ, శరవేగంగా ఎదుగుతున్న మధ్యస్త కులాలకూ(ఓబీసీ) మధ్య గ్రామాల్లో వున్న అధికార ఆధిపత్య సంబంధాలలో వస్తున్న పెద్ద మార్పులు, తత్ కారణంగా వెనుకబడిన కులాల ప్రాబల్యం క్రమంగా పెరిగి మండల్ నివేదికకు లేదా ఓబీసిల రిజర్వేషన్‌లకూ దారి తీయడం గురించి కూడా లోతైన చర్చ జరిగింది.

ఈ చర్చలో పాల్గొన్న వారిలో అత్యధికుల అభిప్రాయం ప్రకారం, గ్రామీణ ప్రాంతాల్లో అతి ప్రధాన వైరుధ్యం బడా రైతులకూ (ధనిక రైతులతో) మరియూ శ్రామికులకూ (భూమి వున్నా – లేని) మధ్యనే కేంద్రీకృతమై వుంది. మధ్య తరగతి రైతాంగ పాత్ర ఇతర అంశాలపైన వీరిమధ్య అభిప్రాయ భేదాలున్నప్పటికీ ప్రధాన వైరుధ్యం విషయంలో మాత్రం అత్యధికులది ఏకాభిప్రాయమే.

ఈ చర్చకూ రాజకీయ ఆచరణకూ మధ్య ఏర్పడగల సంబంధం :

ఒకటిన్నర దశాబ్దంపాటు భారత ఉత్పత్తి వ్యవస్థపై జరిగిన ఈ చర్చ అనంతరం ఎలీస్ థార్నర్ ఇలా ముగింపు పలికింది. "భారతీయ వ్యవసాయ రంగంపై పెట్టుబడిదారీ వ్యవస్థ ఆధిపత్యం గురించి బహుశా: ఇప్పుడు ఇక ఎవరికీ సందేహాలు లేవు. పారిశ్రామిక రంగం గురించి చెప్పక్కరనే లేదు. అయితే దీన్నిబట్టి, భారతదేశంలో ఉత్పత్తి వ్యవస్థ స్పష్టంగా పెట్టుబడిదారీ ఉత్పత్తి వ్యవస్థే, అది మార్క్స్ వివరించిన పెట్టుబడిదారీ అభివృద్ధి చలన సూత్రాల ప్రకారమే పని చేస్తున్నది" అని నిర్ధారించవచ్చునా? అనే ప్రశ్నకు జవాబు చెప్పడం మాత్రం కొద్దిగా కష్టమే. ఈ విచిత్ర పరిస్థితికి కారణం పెట్టుబడిదారీ ప్రధాన కేంద్రాలైన యూరప్ / అమెరికాల కన్నా భిన్నంగా భారత పెట్టుబడిదారీ విధానం వలసవాదంలో నుండి పుట్టుకు రావడమే" అంటుందామె. దేశవ్యాప్తంగా, ఇప్పటికీ విస్తారంగా అమలులో వున్న కౌలుదారీ పద్ధతులు కానీ, సరిపాలు పద్ధతులు కానీ ఫ్యూడల్ సంబంధాలకు ఋజువులు కాదనేందుకు స్పష్టమైన ఆధారాలున్నాయి. అదే విధంగా కూలీ శ్రమ వునికిలో వుండడమే పెట్టుబడిదారీ సంబంధాల వునికికి తిరుగులేని ఋజువుగా భావించలేమనీ ఆమె అంటుంది. ఇది ఎలావున్నా, కౌలు రైతుల శ్రమను దోపిడీ చేసే స్థానంలో కూలీ శ్రమను దోపిడీ చేసే పద్ధతుల వైపు శరవేగంగా పరివర్తన జరుగుతూ వుండడం మాత్రం నిర్వివాదాంశం అని ఎలీస్ థార్నర్ స్పష్టం చేసింది.

భారతదేశంలో పెట్టుబడిదారీ వ్యవసాయ అభివృద్ధితోపాటు ఉత్పత్తి సంబంధాలలో దోపిడీ రూపాలలో సమూల పరివర్తన జరగడం మనం గమనించగలమని చెబుతూ థార్నర్, వెట్టి, ఋణబంధ, సంప్రదాయ దాస్య శ్రమ రూపాలు దాదాపు అంతరించిపోయి, వాటి స్థానంలో స్వేచ్ఛాయుతమైన, సాపేక్షికంగా చలనశీలమైన కూలీశ్రమ నిలదొక్కుకుందనీ కూలీ కూడా డబ్బు రూపంలో చెల్లించే పద్ధతి సర్వవ్యాప్తం అవుతూ వుందనీ ఆమె వర్ణించింది. ఆధునిక, శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులపై పెడుతున్న పెట్టుబడులు ఇబ్బడి ముబ్బడిగా పెరిగాయనీ, మొత్తం పైన ఉత్పత్తి చాలా పెరిగిందనీ, కొన్ని ప్రాంతాల్లో కొన్ని పంటల విషయంలో ఈ అధిక ఉత్పత్తి స్పష్టంగా తెలుస్తూ వుందనీ ఆమె వెల్లడించింది. కౌలుదారీ పద్ధతులు ఇంకా వున్నప్పటికీ, అవి మారిన ఆర్థిక, సాంకేతిక అవసరాల రీత్యా తాము కూడా మార్పుకు గురి అయ్యాయని, కూడా థార్నర్ వివరించింది. అయితే గ్రామీణ ప్రాంతాల్లో అందరికీ భూమి అందుబాటులోకి రావడం, ఆహార భద్రత లభించడమూ ఇత్యాది సమస్యలను పరిష్కరించే శక్తి పెట్టుబడిదారీ వ్యవస్థకు లేదనే విషయంలో మాత్రం అందరి మధ్యనా ఏకీభావం కూడా వుంది.

రుద్ర, చక్రవర్తి ఇద్దరూ ఒక ముఖ్యమైన రాజకీయ నిర్దారణ కూడా చేసారు. "ఈ దేశంలో సంప్రదాయిక వామపక్షం గ్రామీణ ప్రాంతంలో అతి ప్రధాన అభివృద్ధి నిరోధక శక్తి ఫ్యూడలిజమే అనే అభిప్రాయం కలిగి వుంది. ఈ కారణంగానే 'దున్నేవాడికే భూమి' అనే నినాదం కూడా పుట్టింది. ఫ్యూడలిజం ఒకటే శత్రువుగా భావించడం వల్ల సహజంగా మిగిలిన వర్గాలన్నీ అంటే ధనిక రైతుల నుండి వ్యవసాయ కూలీల వరకూ అందరూ మిత్రవర్గాలే అవుతారు. అంతేకాక ఫ్యూడలిజం అభివృద్ధి నిరోధకమనీ, నవజాత పెట్టుబడిదారీ విధానం ప్రగతిశీలమనే భావంకూడా ఇందులో వుంది."

ఈ చర్చ ప్రారంభం కావడానికి మూలకర్త అయిన అశోక్‌రుద్ర ఈ చర్చ రాజకీయ ప్రాధాన్యత గురించి ఆఖరి మాట కూడా మాట్లాడాడు. "ఫ్యూడలిజమనే లేని శత్రువుకు వ్యతిరేకంగా అన్ని వర్గాల ఐక్య సంఘటన కట్టే ప్రయత్నాల వల్ల అనివార్యంగా పేద రైతులు, వ్యవసాయ కార్మికులూ నష్టపోతారు. ఆ విధంగా ఫ్యూడలిజం పై పోరాటం అనే పేరుతో సంప్రదాయ వామపక్ష ఉద్యమం వ్యవసాయ రంగంలో బలంగా ఎదుగుతున్న కొత్త పెట్టుబడిదారీ శక్తుల సమర్థకులుగా మారారు." ఈ వ్యాఖ్య చాలా తీవ్రమైనది, రెచ్చగొట్టేదీ అయినప్పటికీ, ఎవరినుద్దేశించి ఈ వ్యాఖ్య చేయబడిందో ఆ "సంప్రదాయ" వామపక్షం దీనికి ఎలాంటి స్పందనా చూపలేదు.

ఈ చర్చ జరిగి / ముగిసి నాలుగు దశాబ్దాలు పూర్తి కావచ్చినా, నేటికీ ప్రధాన వామపక్ష పార్టీలు, ఎమ్.ఎల్ పార్టీలతో సహా, భారత వ్యవసాయం అర్థ–ఫ్యూడల్ అనే అవగాహనతోనే బలంగా కొనసాగడమే కాదు ఇప్పటికీ రైతాంగాన్నీ (అందులో ఏ వర్గ విభజనా గమనించకుండా) మొత్తంగా సంఘటితం చేసేందుకో, వారి తరఫున మాట్లాడేందుకో ప్రయాసపడడం మనం చూస్తాం. వ్యవసాయం ప్రత్యక్షంగా పూర్తిగా పెట్టుబడిదారీ వ్యవస్థలో లీనం అయిందనేందుకు పెద్దయెత్తున ఋజువులు కనబడుతూ వున్నా వ్యవసాయ కార్మికుల కొరకూ, పేద రైతుల కొరకూ ప్రత్యేకంగా మాట్లాడవలసిన, సంఘటితం చేయవలసిన అవసరాన్ని మాత్రం వామపక్షం ఇంకా గుర్తించవలసే వుంది.

**మూలం:**

ప్రఫుల్ బిద్వయ్ 'ద ఫినిక్స్ ముమెంట్: ఛాలెంజెస్ కన్‌ఫ్రంటింగ్ ద ఇండియన్ లెఫ్ట్' న్యూ ఢిల్లీ, హార్పర్ కాలిన్స్, 2015.

**అనువాదం: గడియారం భార్గవ**

**సంక్షిప్తీకరణ: ఆర్.వి.రమణమూర్తి**

# భూస్వామ్య వ్యవస్థ నుంచి పెట్టుబడిదారీ వ్యవస్థకు జరిగిన పరిణామంలో వర్గ పోరాటం కీలక చోదక శక్తేనా?

## (ఎస్ ఆర్ ఎప్‌స్టీన్)

**చరిత్రలో భూస్వామ్య వ్యవస్థనుండి పెట్టుబడిదారీ వ్యవస్థ పరిణామానికి దోహదపడ్డ 'చోదక శక్తి' ఏమిటన్నది మార్క్సిస్టు చర్చలో ప్రధాన అంశం అయింది. ఉత్పత్తి శక్తుల అభివృద్ధా లేక ఉత్పత్తి సంబంధాల అభివృద్ధా? రెండింటికీ గతితార్కిక సంబంధం ఉన్నప్పటికీ, ప్రాథమికత మీద ఫోకస్ చేయటం జరిగింది. దీనికి బహుశా వర్తమానంలో కూడా కమ్యూనిస్టు పార్టీ చేయగలిగే వర్గ పోరాటం ముఖ్యమా, వ్యాపార సాంకేతిక అంశాల వల్ల అభివృద్ధి చెందే ఉత్పత్తి శక్తుల మార్పు నేపథ్యం ముఖ్యమా అన్న మీమాంశ రావడం జరిగింది. మారిస్ డాబ్-రాడ్నీ హిల్టన్ (బ్రిటిష్ మార్క్సిస్టులు) ఇంగ్లాండులో 'వర్గ పోరాటం ద్వారా జరిగిన ఉత్పత్తి సంబంధాల మార్పే ప్రధాన చోదక శక్తి' అన్న థీసిస్ ప్రస్తుత కార్యాచరణకు, వర్ధమాన దేశాల చరిత్రకు అన్వయించటం జరిగింది. వర్గ పోరాటం లేనిదే ఉత్పత్తి సంబంధాలు మారవని, అర్ధ భూస్వామ్య వ్యవస్థ అందువల్లే మారలేదనే అనుబంధ దత్తాంశాలు కూడా ఆ అవగాహనలో భాగమయ్యాయి. కానీ, వర్గ పోరాట రూపాలు ఎన్నో ఉంటాయని, ఉత్పత్తి శక్తుల చలనం వాణిజ్యం, రవాణా, సాంకేతిక మరియు రాజ్యం జోక్యంతో జరుగుతుందనీ, గతితార్కిక సంబంధాలు ఉత్పత్తి సంబంధాల మార్పుకు అనివార్యం అవుతాయన్న సత్యాన్ని చర్చలో పట్టించుకోక పోవడం జరిగింది. ఎప్‌స్టీన్ ఈ కారణాన్ని ఇంగ్లండు చరిత్రలోనే అవిష్కరించడం ఈ వ్యాసంలో ఉన్న సందేశం. -సంపాదకులు**

'కీలక చోదక' (prime mover) సిద్ధాంతానికి ఆద్యుడు రాడ్నీ హిల్టన్. బ్రిటిష్ కమ్యూనిస్టు పార్టీలోని చరిత్రకారుల బృందానికి వ్యవస్థాపక సభ్యునిగా, 1942-68 మధ్య కాలంలో వెలువడిన 'గతం - వర్తమానం' (Past-Present) పత్రికకు సంపాదకునిగా హిల్టన్ పనిచేసాడు. 1968కి ముందు జరిగిన మార్క్సిస్టు సైద్ధాంతిక చర్చలలో మారిస్ డాబ్ ప్రతిపాదించిన కీలక చోదక సిద్ధాంతంతో రాడ్నీ హిల్టన్ విపరీతంగా ప్రభావితం అయ్యాడు. సేవకులు/సాగుదారులు, భూస్వాములకూ మధ్య జరిగిన వర్గపోరాటమే పెట్టుబడిదారీ వ్యవస్థగా పరిణామం చెందడంలో కీలక చోదక శక్తిగా వ్యవహరించిందనేదే మారిస్ డాబ్ ప్రధానవాదన. ఈ వాదన రాడ్నీ హిల్టన్‌ను ఆకట్టుకుంది. పశ్చిమ ఐరోపాలో జరిగిన పెట్టుబడిదారీ పరిణామానికి సంబంధించిన స్థల, కాల పరిణామాలను విశ్లేషించేందుకు డాబ్/హిల్టన్ ప్రతిపాదించిన సైద్ధాంతిక చట్రం సరిపోదని ఎప్‌స్టీన్ అంటాడు. భూస్వామ్య వ్యవస్థను తెరవెనుకకు నెట్టేసి, పెట్టుబడిదారీ ఉత్పత్తి శక్తుల అభివృద్ధికి దారితీసిన సంక్లిష్ట రాజకీయ, సామాజిక, సాంకేతిక పరిణామాల వెలుగులో పెట్టుబడిదారీ వ్యవస్థ పరిణామాన్ని అవగాహన చేసుకోవలసి వుంటుందని కూడా ఎప్‌స్టీన్ వాదన.

**ఇంగ్లాండ్ / ఐరోపాలలో భూస్వామ్య వ్యవస్థ పతనం ఎలా మొదలైంది?**

ముందుగా, హిల్టన్ పైనా బ్రిటిష్ కమ్యూనిస్టు చరిత్రకారులలోని చాలా మంది పైనా చెరగని ముద్ర వేసిన మారిస్ డాబ్ ప్రతిపాదనలను విమర్శనాత్మక దృష్టితో పరిశీలిస్తాడు. మారిస్ డాబ్ ఉద్దేశ్యంలో 15వ శతాబ్దంలో ఇంగ్లాండ్‌లోని భూస్వామ్య వ్యవస్థ తనని తాను ఓటమి అంచులకు నెట్టివేసుకున్న ఒక అసమర్థ వ్యవస్థ. అందువల్లే ఒక సంక్షోభాన్ని ఎదుర్కొంది. పెట్టుబడి పోగయ్యేందుకూ, సాంకేతిక ఆవిష్కరణలకూ, సాగుదారుల అతి దోపిడీకీ అవకాశాలు కల్పించ లేక పోవటం; అంతేకాక, వ్యవసాయానికి ఎలాంటి వ్యవస్థీకృత ప్రోత్సాహకాలను అందించలేక పోవటం భూస్వామ్య వ్యవస్థ ఓటమికి కారణాలు. భూస్వాములు విపరీతమైన కౌలు వసూళ్ళు చేయటం, ఇతరేతర ఉచిత సేవలను బలవంతంగా వారినుండి గుంజటాన్ని సాగుదారులు తట్టుకోలేకపోయారు. ఫలితంగా ఈ ప్రక్రియ సాగుదారులకూ, భూస్వాములకూ మధ్య వర్గ ఘర్షణకి నాంది పలికింది.

కానీ, భూస్వామ్య వ్యవస్థ ప్రధానంగా అసమర్ధమైనదని సూత్రీకరించి, అందువల్లే కూలిపోయిందని నిర్ధారిస్తే, అది ఈ సంక్షోభాన్ని ఎదుర్కునే ముందు దాదాపు 500 ఏళ్ళపాటు భౌగోళికంగా, ఆర్థికంగా, సాంకేతికంగా విజయవంతంగా వ్యాప్తి చెందడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి అని ఎప్‌స్టీన్ ప్రశ్నిస్తాడు. డాబ్ సూత్రీకరణల్లో భూస్వామ్య వ్యవస్థ వ్యాప్తిని, అభివృద్ధిని వివరించే సానుకూల సిద్ధాంతం ఏదీ మనకు తారసపడదు. భూస్వామ్యం తనకు తానుగా కూలిపోయే వ్యవస్థ అనే భూమిక చరిత్రను విశ్లేషించటానికి పనికిరాదని ఎప్‌స్టీన్ అంటాడు. భూస్వామ్య వ్యవస్థలన్నీ (లేమిలో) కొరతతో నడిచిన వ్యవస్థలనీ, ధరల ప్రోత్సాహకాలకూ, విపణికీ సానుకూలంగా స్పందించలేని వ్యవస్థలనీ విశ్లేషించిన సిద్ధాంతాల వెలుగులోనే డాబ్ కూడా పెట్టుబడిదారీ వ్యవస్థ పూర్వశకాలని పరిశీలించాడు.

ఎప్‌స్టీన్ ఉద్దేశ్యంలో ఆంగ్లేయ ఉదాహరణపైన డాబ్ తన దృష్టిని కేంద్రీకరించటం అతని వాదనలోని రెండవ బలహీనత. దీనికి బలమైన కారణాలు లేకపోలేదు. పెట్టుబడిదారీ వ్యవస్థకు పరివర్తన చెందే క్రమంలో ఇంగ్లాండు నమూనా గురించి మార్క్స్ చేసిన వ్యాఖ్యానం; డాబ్ రాసేనాటికి ఇతర దేశాల చరిత్రపై సమాచారం లేకపోవడం కూడా ఇందుకు కారణాలు. భూస్వామ్యం నుండి పెట్టుబడిదారీ వ్యవస్థకు జరిగే మార్పుపై చర్చను కేవలం ఆంగ్లేయ వ్యవస్థ అనుభవానికే పరిమితం చేయడం వల్ల, యూరప్‌లో జరిగిన పెట్టుబడిదారీ అసమతల అభివృద్ధి గురించి కచ్చితమైన వర్గ-ఆధారిత మార్క్సిస్టు విశ్లేషణ చేయడంలో ఎదురయ్యే ఇక్కట్లు మరుగున పడ్డాయి.

అసలిక్కడ రెండు కీలక ప్రశ్నలు వేసుకోనేలేదు. మొదటిది - ఆసియా లోని కొన్ని ప్రాంతాలు ఆనాటికే ఆర్థికంగా చాలా పురోగామిగా వున్నప్పటికీ కేవలం పశ్చిమ ఐరోపాలోనే ఎందుకు పెట్టుబడిదారీ వ్యవస్థకు ముందుగా పరివర్తన ఎందుకు జరిగింది? రెండవది క్రీ.శ.1400-1700 మధ్య ఆంగ్లేయ ఆర్థిక వ్యవస్థ మాత్రమే ముందుగా పెట్టుబడిదారీ విధానాన్ని ఎందుకు అంది పుచ్చుకున్నది? అప్పటికి తనకన్నా చాలా పురోగామి అయిన ఐరోపా ప్రాంతాలకన్నా తదనంతర కాలంలో ముందుకు ఎలా చొచ్చుకుపోయింది?

ఇంగ్లాండులో భూస్వాముల దోపిడికి వ్యతిరేకంగా చెలరేగిన గ్రామీణ పోరాటాలూ, నిరసనలన్నీ కూడా హిల్టన్ రచనల్లో, ఆ వ్యవస్థని ఒక సుస్థిర, నిశ్చల వ్యవస్థగా చూపేందుకు కాక, దాన్ని హింసాయుత వైరుధ్యాలు కలిగిన ఒక అస్థిర వ్యవస్థగానే చూపాయి. సాగుదార్లకు, భూస్వాములకూ మధ్య తలెత్తిన ఘర్షణ అంతా కూడా విభేదాలకూ, పరివర్తనకూ దారి తీసింది; ఎక్కువగా విపణి కోసం ఉత్పత్తి చేస్తున్న ఒక వర్గం సంపన్న సాగుదారులకు ప్రయోజనం చేకూర్చేందుకు స్వయం సమృద్ధమైన చిన్న రైతాంగాన్ని భూముల నుండి ఖాళీచేయించింది. ఫలితంగా తమ జీవనావసరాలను తీర్చుకునేందుకు విపణిపైన తప్పనిసరిగా ఆధారపడవలసిన వేతన కూలీలు అధిక సంఖ్యలో రంగం మీదకి వచ్చారు.

వ్యవసాయిక పెట్టుబడిదారీ విధానం, కొనుగోలుదారులు, అమ్మకం దారులు కలిగిన పోటీతత్వ పెట్టుబడిదారీ విపణుల పుట్టుకకు కారణం వర్గపోరాటం మాత్రమేనని హిల్టన్ భావించాడు. అంటే? పారిశ్రామిక పెట్టుబడిదారీ విధానానికి జరిగిన పరివర్తనను వివరించ గలిగిన కీలక చోదక శక్తి వర్గపోరాటమే. అయితే, ఆర్థికంగా స్వయం సమృద్ధమైన రైతాంగాన్ని వారి భూముల నుంచి ఖాళీ చేయించడం వల్ల సాంకేతికంగా ధృడమైన, సంపూర్ణంగా వినియోగ వస్తువుల కేంద్రితంగా సాగిన పెట్టుబడిదారీ ఉత్పత్తి వ్యవస్థ ఎలా పుట్టుకొచ్చిందని ఎప్‌స్టీన్ ప్రశ్నిస్తాడు.

ఇటువంటి తులనాత్మక, చారిత్రక ప్రశ్నలకు జవాబు వెతికేందుకు మార్క్సిస్టు విశ్లేషణలోని రెండు మూల స్తంభాలను పరిచయం చేయవలసిన అవసరం ఎంతయినా వుందని ఎప్‌స్టీన్ భావిస్తాడు. ఎందుకంటే ఈ రెండు స్తంభాలూ కూడా హిల్టన్ (డాబ్) వ్యక్తీకరణల్లో బలహీనంగా వున్నాయని లేదా అసలే లేవని ఎప్‌స్టీన్ పరిశీలన. అవి సాంకేతిక అభివృద్ధి సిద్ధాంతం; విపణుల, రాజ్యాల, రాజకీయార్థిక విశ్లేషణ.

హిల్టన్, డాబ్ ఇద్దరూ కూడా భూస్వామ్య వ్యవస్థలో

సాంకేతిక అభివృద్ధి చాలా తక్కువ స్థాయిలో ఉంటుంది కాబట్టి, దాన్ని పెద్దగా లెక్కలోకి తీసుకోనవసరం లేదని భావించారు. ఆనాటి భూస్వాములు కేవలం 5 శాతం మాత్రమే భూమిపై పెట్టుబడి పెడుతూ వచ్చారని, 13వ శతాబ్దపు ఉత్పాదకతకు ఊతమిచ్చేందుకు, ఈ పెట్టుబడి ఏమాత్రం సరిపోదని హిల్టన్ వాదించాడు. పెట్టుబడి పెట్టకపోగా, ఆనాటి భూస్వామ్య వర్గం తమ ఆదాయంలో ఎక్కువ మొత్తాన్ని తమ ఎడతెగని పరివారాన్ని మేపేందుకూ, వ్యక్తిగత పటాటోప ప్రదర్శనకూ, తమ సామాజిక, రాజకీయ పరువు, ప్రతిష్టలను కొనసాగించేందుకూ మంచి నీళ్ళ ప్రాయంగా ఖర్చుచేసారు. రైతాంగం పైన భూస్వాములు విధించే కౌలు, ఇతర కప్పాలు, మతపరమైన సుంకాలు, రాచరికపు ఏకపక్ష శిస్తులు, పెరిగిన పన్నులు, ఇతరేతర వసూళ్ళు. విచ్ఛిన్న మవుతున్న కమతాలు వంటి కారణాల ఫలితంగా పెట్టుబడిగా మదింపు చేయడానికి తగినంత అదనపు విలువ భూస్వామ్య వ్యవస్థలో ఉత్పత్తి కాలేదని హిల్టన్ అంటాడు.

అయితే 13-14 వ శతాబ్దాలలో 5 శాతంగా పోగయిన వార్షిక నికర పెట్టుబడి రేటు పారిశ్రామిక పూర్వ ఆర్థిక వ్యవస్థకు మరీ చిన్న మొత్తమేమీ కాదని ఎప్స్టీన్ ఎత్తి చూపాడు. బ్లాక్ డెత్ (కరాళ మృత్యువు - 14వ శతాబ్దపు ఐరోపా జనాభాలో 30-60 శాతం జనాభాను తుడిచిపెట్టిన మహమ్మారి) వల్లే భూమి-మనిషి నిష్పత్తి గణనీయంగా తగ్గిందనీ, ఫలితంగానే వర్గపోరాటం సంభవించిందనీ హిల్టన్ నొక్కి చెప్పడం కూడా ఒక అసమంజసమైన వివరణే. ఎందుకంటే, ఐరోపాలో యుద్ధాలవల్లా, ఇతర అలాంటి అనేక కారణాల వల్లా భూమి-మనిషి నిష్పత్తి ఎన్నడూ స్థిరంగా, ఒకేలా లేదనీ ఎప్స్టీన్ వాదిస్తాడు. ఇలాంటి అంతర్గత కారకాలను హిల్టన్ తన పరిశీలనల్లో పట్టించుకోలేదు. మరి బాహిర్ కారకాల మాటేమిటి?

డాబ్, హిల్టన్ లిద్దరూ కూడా, వ్యవస్థీకృత చట్ర వృద్ధి కోసం రాజ్యం పోషించిన క్రియాశీల పాత్రని, భూస్వామ్య వ్యవస్థలో నానాటికీ పెరుగుతున్న 'చిల్లర సరుకు ఉత్పత్తి' (Petty Commadity Production) ప్రాపకాన్నీ గుర్తించారు కానీ, ముందుకెళ్ళి తమ నమూనాని తగినంతగా పున:సమీక్ష చేసుకోలేదని ఎప్స్టీన్ అంటాడు.

బి. ఇక రెండవ కీలక ప్రశ్న - భూస్వామ్య వ్యవస్థలో వాణిజ్యం పాత్ర. భూస్వామ్య వ్యవస్థ ప్రాథమికంగా స్వయంపోషక వ్యవస్థ మాత్రమేనా? లేక విపణి కోసం కూడా ఉత్పత్తి చేసిందా? చిన్నకమతాల రైతాంగం సరుకులను ఉత్పత్తి చేసింది అనేందుకు అవకాశమే లేదని (1940 లలో) డాబ్, హిల్టన్ లు మొదట వాదించినా మధ్య యుగానంతర కాలంలో విస్తృతంగా కనిపించిన రైతాంగ ఉత్పత్తి సరుకుల ధరల వివరాలకు సంబంధించిన ఆధారాలను బట్టి తమ ఆలోచనా విధానాన్ని సవరించుకున్నారని ఎప్స్టీన్ అంటాడు. పెరుగుతున్న వాణిజ్యం రైతాంగాన్ని విపణి కోసం ఉత్పతి చేయమని ప్రోత్సహించింది. ఇది సాగును మెరుగుపరచుకునేందుకు ఉత్పత్తి దారులకు దారి చూపి ప్రేరణగా నిలిచింది. తద్వారా చిరు వినియోగ సరుకుల మారకం పెరిగింది. ఇది 'చిల్లర సరుకు ఉత్పత్తి' వ్యవస్థలో పెట్టుబడి పోగయ్యేందుకూ, వర్గాల వ్యత్యాసానికీ దారితీసింది.

సి. మూడవ ప్రశ్న - వ్యవస్థీకృత చట్రం ఏర్పడటంలో రాజ్యం పోషించిన పాత్ర. మొదట్లో ఈ కారణాలేవీ హిల్టన్‌కి పెద్దగా ప్రాధాన్యమైనవి కాకపోయినా. తర్వాతి కాలంలో భూస్వామ్య వ్యవస్థకున్న ఈ కీలక లక్షణాన్ని గురించి సానుకూల దృష్టిని అలవరచుకున్నాడని ఎప్స్టీన్ అభిప్రాయం. బహుశా పెర్రీ ఆండర్ సన్ రాసిన 'పరిపూర్ణ రాజ్య *అనుక్రమం'* (Leneages of the Absolutist State - 1976) పుస్తక ప్రభావం కూడా హిల్టన్ పైన ఉండి వుండవచ్చు. ఈ రచన మాక్స్ వెబర్ భూస్వామ్య వ్యవస్థలో అధికారం ఖండ ఖండాలుగా ఉంటుందని చేసిన సూత్రీకరణని ప్రామాణిక మార్క్సిస్టు సిద్ధాంతీకరణలోనికి ప్రవేశపెట్టింది. ఈ క్రమంలోనే ఐరోపా భూస్వామ్య వ్యవస్థకుండే ఐదు కీలక లక్షణాలలో అధికార వికేంద్రీకరణ గురించిన మూడు గుణాలను హిల్టన్ చేర్చాడు.

1. భూస్వామ్య వ్యవస్థలో అధికార వికేంద్రీకరణ ఒక కీలక పార్శ్వం. అది దాని బలహీనత కాదు.

2. అదనపు విలువ వసూలు కోసం వ్యక్తిగత అధికారిక పరిధి రూపంలో వ్యక్తమయ్యేదే భూస్వామికుండే అధికారం.

3. భూస్వామ్య ప్రభువుల గుత్తాధిపత్యానికి చెల్లించాల్సిన భూస్వామ్య కప్పం (ఇందులో వాణిజ్య పన్ను కూడా మిళితమై వుంటుంది)

4. భూస్వామ్య వ్యవస్థకు కేంద్రంగా ఉంటూ భూస్వాముల ఆదాయాన్ని గణనీయంగా పెంచే రైతాంగ సరుకుల ఉత్పత్తి.

5. ఉత్పత్తి సంబంధాలలో డబ్బు ప్రాబల్యాన్ని మరింత మెరుగుపరిచిన వర్తక పెట్టుబడి; పెద్ద మొత్తంలో జరిగిన నగరీకరణ.

**అక్కడి నుంచి మన పయనం ఎక్కడికి?**

భూస్వామ్య ఉత్పత్తి విధానాన్నీ, అది పెట్టుబడి దారీ వ్యవస్థకు పరివర్తన చెందడాన్ని అర్థం చేయించే సిద్ధాంతాల్లో వాటివాటి చారిత్రక ప్రారంభం, ముగింపుల గురించి స్పష్టమైన నిర్వచనాలు ఉండాలని ఎప్స్టీన్ అంటాడు. అతని నిర్వచనంలో భూస్వామ్య వ్యవస్థ కింద పేర్కొన్న లక్షణాలు ప్రబలంగా కలిగిన ఒక సామాజికార్థిక వ్యవస్థ.

1. భూస్వాముల కుండే వికేంద్రీకృత అధికారం, దాన్ని వారు వ్యక్తిగత అధికారంగా చెలాయించటం.

2. 'భూస్వామ్య కప్పం' అంటే ప్రభువుల గుత్తాధిపత్యానికి చెల్లింపులు (వాణిజ్య పన్నులు కాకుండా)

3. రైతాంగం ఉత్పత్తి చేసే సరుకుల కేంద్రంగా సాగే ఆర్థిక వ్యవస్థ.

4. వర్తక పెట్టుబడి, నగరీకరణ వల్ల ఉత్పత్తి సంబంధాలలో నెమ్మదిగా ప్రాధాన్యత ఏర్పరుచుకున్న డబ్బు.

ఎప్స్టీన్ ఉద్దేశ్యంలో భూస్వామ్య వ్యవస్థ నుంచి పెట్టుబడిదారీ వ్యవస్థకు జరిగే ఏ పరివర్తన అయినా క్రింది చారిత్రక ప్రశ్నలకు సమాధానం చెప్పగలిగి వుండాలి.

1. వ్యవసాయిక వస్తువుల సరఫరా పెరుగుతున్న జనాభా అవసరాలకు తగినంత పెరిగిందా?

2. ప్రత్యేక ఆస్తి హక్కులు ఆ సమాజంలో ఎలా వృద్ధి చెందాయి?

3. వేతన ఆధారిత వ్యవసాయేతర రంగం ఎలా విస్తరించింది? దానివల్ల వ్యవసాయ రంగంపై ఆధారపడ్డ జానాభా ఎంత తగ్గింది? క్రీ.శ.1100లో ఐరోపా అంతటా భూస్వామ్య వ్యవస్థ వ్యవసాయ రంగంలో 90-95 శాతం జనాభా ఉపాధి పొందితే ఇంగ్లండ్‌లో క్రీశ 1800లో పూర్తి స్థాయిలో పెట్టుబడిదారీ సామాజిక ఆర్థిక వ్యవస్థ ఏర్పడే నాటికి వారి శాతం 30 శాతానికి పడిపోయింది.

4. విద్యుత్‌చ్ఛక్తి, వస్తువుల తయారీ రంగాలలో సాంకేతికత ఎలా పురోగమించింది? మార్క్స్ మాటల్లో చెప్పాలంటే 'చేతి మర నుంచి ఆవిరి మర వరకు' మార్పు ఎలా జరుగుతోంది?

**భూస్వామ్య వ్యవస్థలో వాణిజ్యం ద్వారా తలెత్తిన వైరుధ్యాలు**

హిల్టన్ లాంటి మార్క్సిస్టులూ, లేదా 'రికార్డో - మాల్తూసీయ' నిరాశావాదులయిన పోస్టన్ లాంటి వారు భావించినట్టు కాక మధ్య-ఆధునిక కాలానికే ఐరోపాలోని వ్యవసాయ ఉత్పత్తి బాగా విస్తరించిందని ఎప్స్టీన్ ఆధారాలతో చూపిస్తాడు. పోస్టన్ భావించినట్లు సాంకేతిక అభివృద్ధి లేకపోవటం వల్ల భూస్వామ్య వ్యవస్థలో ఉత్పత్తి పెరుగడల ఆగలేదు. కానీ మంచి ఫలితాలనిస్తాయని తెలిసినా, ఆ పద్ధతులని ఆచరించకపోవటం భూస్వామ్య వ్యవస్థలో కొట్టొచ్చినట్లు కన్పించే లోపం. అవి రాజకీయ, న్యాయధికారాలు విచ్ఛిన్నమయి ఉండటం వల్ల, ఎడతెరిపి లేని యుద్ధాల వల్ల ఏర్పడే సమన్వయ లోపాలు; రవాణా వ్యవస్థ, వాణిజ్య సదుపాయాలపై పెట్టుబడి పెట్టకపోవడం; విశ్వసనీయత కలిగిన న్యాయవ్యవస్థ, రాజకీయ, ఆర్థిక సుస్థిరత లేకపోవటం వల్ల అసమర్థత అన్ని స్థాయిల్లో రాజ్యమేలింది.

హిల్టన్ విశ్లేషణలో ఆర్థిక అంశాలు భూస్వామ్య రాజ్యం, సమాజాలపై ఆధారపడతాయి. ఆస్థి హక్కుని వ్యక్తిగత యాజమాన్య హక్కుగా మాత్రమే కాక, ఆ హక్కు అమలవటానికి అవసరమైన విస్తృత వ్యవస్థాగత చట్రంగా అర్థం చేయిస్తాడు హిల్టన్. ఇటువంటి వైధానిక పద్ధతి వల్ల కేవలం భూస్వామ్య వ్యవసాయ నిర్వహణకి సంబంధించిన అంశాలపైనో లేక ఇతర ప్రత్యేకతలపై కాక వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చిన పరిస్థితులపై దృష్టిని కేంద్రీకరించటానికి వీలయింది.

ఈ విశ్లేషణను ముందుకు తీసుకెళుతూ, భూస్వామ్య వ్యవస్థ గురించిన తన నమూనాని ఎప్స్టీన్ ఇలా వర్ణిస్తాడు.

భూస్వామ్య ఉత్పత్తి విధానంలో చాలా మంది గ్రామీణ ఉత్పత్తిదారులు తమ ఫలసాయంలో కొంత వాటా తమ అవసరాలకే వుంచుకుని మిగతాది విపణిలో అమ్మేవారు. మార్కెట్లో అమ్మేవాటాను గిరాకీ, సాపేక్ష ధరలను బట్టే ఎంత అమ్మాలో నిర్ణయించేవారు అంటే గిరాకీకి స్పందించే లక్షణం అప్పటికే ఈ ఉత్పత్తిదారులకి ఉండేది. భూస్వామ్య దొరలు (వీరిలో సుదూర గ్రామీణ ప్రాంతాలపై న్యాయాధికారాలు కలిగి, నగరాల్లో నివసించే కులీన వర్గం కూడా ఉంది) సైనిక బలగాల ఆసరాతో రైతాంగం నుంచి మిగులును, ఉత్పత్తిని దోచుకునేవారు. ఈ బలగాలు మిగులుని నేరుగా ధనం, కానుకలు, శ్రమ ద్వారా పరోక్షంగా కౌలుఅంటే చెల్లింపులు, వాణిజ్య సుంకాలు, న్యాయ సేవలకి చెల్లింపుల రూపంలోనూ వసూలు చేసుకునేవారు. భూస్వామ్య ఆదాయంలో వివిధ ప్రత్యక్ష, పరోక్ష మార్గాల ద్వారా వచ్చే ఆదాయ వంతు కొంత హెచ్చు తగ్గులకు గురయినప్పటికీ నాయాధికార హక్కుల వల్ల లభించే ఆదాయం (వెట్టి చాకిరీ సేవలతో సహా) గణనీయంగా ఉండేది. ఆ రకంగా చూసినప్పుడు వాణిజ్యం నుండి భూస్వామ్య వ్యవస్థ ఎలాంటి ప్రమాదం ఎదుర్కోలేదని అర్థమవుతుంది. నిజానికి ఒక దశ వరకు భూస్వామ్య వ్యవస్థ

వాణిజ్యంపైనే వర్ధిల్లింది.

భూస్వామ్య ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయ అభివృద్ధికి ప్రధాన ఆటంకంగా పరిణమించింది, క్రమేణా పెరిగిన వ్యాపారపు ఖర్చు. ఇది వ్యవస్థాగత నియంత్రణ, ఉత్పత్తిపై సుంకాలు, రాజకీయ, సైనిక సుస్థిరత, కొంత మేరకు రవాణా రంగంలో అభివృద్ధిపై ఆధారపడింది. ఫ్యూడల్ ప్రభువులు కూడా వాణిజ్యాన్ని సంరక్షించేందుకు ప్రత్యేకమైన ఆసక్తి కనబర్చేవారు, అందులోంచే కదా వారికి శిస్తువచ్చేది. వాణిజ్యం పెరిగితే వారికి రావాల్సిన శిస్తువాటా కూడా పెరిగేది. అలాగే శిస్తుపొందే అధికారమే వారి సామాజిక, రాజకీయ అధికారానికి భూమికగా ఉండేది. ఎప్పుయితే ఈ అధికారాలకి లోబడని 'స్వేచ్ఛా' వాణిజ్యాన్ని ప్రవేశపెట్టారో, దానివల్ల భూస్వాములకొచ్చే గ్రామీణ, పట్టణ ఆదాయం తగ్గిపోవటమే కాక అది రైతాంగంపై భూస్వాములకుండే అధికారాల్ని, నగరాలకి గ్రామీణ ప్రాంతాలపై ఉండే అధికారాలని కూడా దెబ్బతీసింది. దీర్ఘకాలికంగా చూసినపుడు ఇటువంటి బలమైన గ్రామీణ, పట్టణ భూస్వాములకుండే అధికారాలు వ్యవసాయ అభివృద్ధికి ఆటంకాలుగా పరిణమించాయి. మధ్య యుగ చివరి దశ కల్లా ఈ భూస్వామ్య అధికారానికి, వ్యవసాయ ఆవిష్కరణలకూ ఒక విలోమానుపాత సంబంధం నెలకొనింది. అలాగే, పారిశ్రామిక ప్రగతికి కులీనుల పట్టణ అధికార హక్కులు ఒక ఆటంకంగా తయారయ్యాయి. ఈ పరిణామమే భూస్వామ్య వ్యవస్థలోని కీలక వైరుధ్యాన్ని బహిర్గతం చేసింది.

భూస్వామ్య వ్యవస్థ తనతొలి మహా విస్తరణ దశలో (920–1250) విపణుల ఏర్పాటుకూ, ఆర్థిక కార్యకలాపాల నిర్వహణకూ ప్రాంతీయ వైవిధ్యం కలిగిన రాజకీయార్థిక వ్యవస్థగా రూపుదిద్దుకుంది. వివిధ ప్రాంతాల్లో ఆయా ప్రభువుల న్యాయాలు, చట్టాలు వేరుగా ఉండేవి. అయితే 1300 కల్లా అదే రాజకీయార్థిక వ్యవస్థ దానికి ముందు కాళ్ళ బంధంగా పరిణమించింది. అలా భూస్వామ్య వ్యవస్థలోని వ్యవసాయానికి సాంకేతిక జడత్వం నుంచి కాక భూస్వామ్య వ్యవస్థలోని సంస్థాగత పరిమితులనుంచే మౌలిక ప్రతిబంధకం ఎదురయింది. ప్రస్ఫుటంగా కనిపించే ఈ లక్షణాలతోనే భూస్వామ్య ఐరోపాలోని రాజకీయార్థిక వ్యవస్థలో బలమైన వైవిధ్యం ప్రదర్శితమైంది. పశ్చిమ ఐరోపాలోని చాలా ప్రాంతాల్లో బలవంతంగా పన్నులు వసూలు చేసేందుకు, వాణిజ్యాన్ని గుత్తాధిపత్యంగా మార్చేందుకు భూస్వామ్య ప్రభువులు చేసిన ప్రయత్నాలు ఒకపక్క ఆర్థిక వ్యవస్థని ఎదగనీయకుండా చేస్తే, ఈ పరిస్థితిని సరి చేసేందుకు స్థానిక యుద్ధాల ద్వారా రాజ్య విస్తరణ చేసే ప్రభువుల వ్యూహాలు మరోపక్క మనం చూడవచ్చు. అంటే భూస్వామ్య ప్రభువులు తమ అధికారాలను రెండు విధాలుగా వాడుకున్నారు.

అందుబాటులో వున్న రాజకీయ, ఆర్థిక వనరులను పెంపొందించుకోవడమే రాజ్య విస్తరణ ప్రధాన లక్ష్యం అయినప్పటికీ దీని వల్ల ఆర్థిక సామర్థ్యం కూడా మెరుగుపడింది. అధికారిక పరిధుల సమ్మేళనం, కొత్తగా చేరిన ప్రాంతాల్లో లావాదేవీల ఖర్చును తగ్గించగలగడం, ప్రభువుల బకాయిలను తగ్గించగలగడం, శత్రు భూస్వామ్యులనూ, పట్టణ గుత్తాధిపతులనూ బలహీనపరచడం, లేదా నిర్మూలించడం, చట్ట స్మృతులను, విధానాన్నీ క్రమబద్ధీకరించడం, తూనికలు, కొలతలు ప్రవేశపెట్టడం, విపణుల నిర్వహణకు సాయపడడం, దోపిడీలు జరిగే, యుద్ధాలు తలెత్తే అవకాశాలను నియంత్రించడం, ప్రజలకు వ్యతిరేకంగా పాలకులు నిరంకుశ స్థానిక బందిపోటుల్లా దోచుకునే అవకాశాలను నిరోధించడం–ఈ అన్ని చర్యల వల్లా ఆర్థిక సామర్థ్యం బాగా మెరుగుపడింది.

క్రమంగా జరిగిన రాజకీయ కేంద్రీకరణ వల్ల వికేంద్రీకృత బలప్రయోగంపై ఆధారపడిన ఆర్థిక విధానం బలహీనపడిందని ఎప్‌స్టీన్ అభిప్రాయపడతాడు. అప్పటి నుంచి వ్యాపార లావాదేవీలపైన ఆస్తి హక్కులను, కేంద్రీకృత రాజ్య ప్రోద్బలంతో నడిచే బలప్రయోగ ఆర్థిక వ్యవస్థ మంజూరు చేసింది. 15వ శతాబ్దం నుంచి రాజకీయ నిర్ణయాలను ఆర్థిక అంశాలు శాసించడం మొదలయ్యింది. కేంద్రీకృత గుత్తాధిపత్య అధికారిక పరిధులతో సాగిన తొలినాటి ఆధునిక రాజ్యాలు ఆధునిక పెట్టుబడిదారీ విధానానికీ, పెట్టుబడిదారీ వర్గపోరాటానికీ వ్యవస్థాగత పునాది వేసాయి.

స్థూలంగా చెప్పాలంటే భూస్వామ్య వ్యవస్థలో వ్యవసాయ విస్తరణ రెండు పరస్పర విరుద్ధ శక్తుల ఫలితంగా జరిగిందని ఎప్‌స్టీన్ అభిప్రాయపడతాడు. ఒకటి వికేంద్రీకరించిన సైనిక న్యాయాధికారాలు. దీనివల్ల వ్యాపారం, పెట్టుబడి పెట్టడం బాగా ఖర్చుతో కూడుకున్న వ్యవహారాలయ్యాయి. రెండు–పెరిగిన రాజకీయ, సైనిక అధికార కేంద్రీకరణ. దీని వల్ల పెట్టుబడులకి, వ్యాపారానికి పెట్టాల్సిన ఖర్చు తగ్గింది. దీర్ఘ కాలంలో రెండవ శక్తే ప్రబలటం వల్ల లావాదేవీల ఖర్చులు తగ్గిపోయాయి; వ్యాపారీకరణ, ప్రత్యేక నైపుణ్యాల వృద్ధి పుంజుకున్నాయి. భూస్వామ్య ఉత్పత్తి విధానంలో ప్రభువులు, రైతాంగం, విపణి, రాజ్యం మధ్య నెలకొన్న సంబంధాలలోనే 'కీలక చోదక శక్తి' లేదా దాని 'ప్రధాన వైరుధ్యం' పురుడు పోసుకుంది.

**పెట్టుబడిదారీ వ్యవస్థకు పరివర్తనలో సాంకేతిక ఆవిష్కరణల పాత్ర:**

అంతగా అభివృద్ధిచెందని వ్యవసాయ, వృక్ష సంబంధ శాస్త్రాలూ, వాతావరణ వైపరీత్యాలు, విపణుల్లో ఒడిదుడుకుల కారణంగా వ్యవసాయ రంగంలో సాంకేతిక ఆవిష్కరణలు చాలా మందకొడిగా సాగాయి. అయితే ఆధునిక పూర్వ సమాజపు నిపుణులు, ఇంజనీర్లు సాధించిన సాంకేతిక ప్రగతి లేకుండా అప్పటి పరిశ్రమలు పెట్టుబడిదారీ విధానానికి పరివర్తన చెందే అవకాశం లేదని ఎప్‌స్టీన్ వాదిస్తాడు. నిజానికి ఆసియా ప్రాంతాల పురోగతిని భూస్వామ్య ఐరోపా అందిపుచ్చుకోవడానికీ, వాటిని దాటి ముందడుగు వేయడానికీ ఈ సాంకేతిక ప్రగతే కారణంగా చెప్పుకోవచ్చు.

భూస్వామ్య ఐరోపాలో సాంకేతిక ప్రగతిని ఎప్‌స్టీన్ ఇలా వివరిస్తాడు. ఆ కాలపు సాంకేతిక పరిజ్ఞానమంతా మౌఖికం, అనుభవైక్యమైంది కావడం వల్ల, క్రోడీకరణ లేకుండా దాన్ని ఇతర ప్రాంతాల్లో పునరుత్పత్తి చేయడం కుదిరేది కాదు. ఒక ప్రాంతం నుంచి ఇంకో ప్రాంతానికి నిపుణులను తీసుకు పోవడం చాలా ఖర్చుతో కూడుకున్న అంశం. అందువల్ల ఆనాటి భూస్వామ్య వ్యవస్థలో సాముదాయిక జ్ఞానం బదిలీ చేయడం చాలా మందకొడిగా సాగింది. అయితే 11వ శతాబ్దం చివరికల్లా నైపుణ్య కార్మికుల గిరాకీ పెరగడంతో నైపుణ్యాలను పెంపొందించటానికి పనిలో పెట్టుకోవటం ద్వారా శిక్షణ ఇచ్చే గిల్డులు రంగంపై వచ్చాయి. ఈ గిల్డుల్లో సభ్యత్వం ఏకులానికో, మతానికో పరిమితం కాకపోవడం వల్ల నైపుణ్య కార్మికులు ఒక నగరం నుంచి మరో నగరానికి ఏ షరతులూ, జరిమానా లేకుండా వెళ్ళగలిగే వాళ్ళు. వివిధ రాజ్యాల మధ్య సాంకేతికత, విలాసవంతమైన వినియోగ వస్తువుల ప్రదర్శన, పోటీలు జరగటం వల్ల అంటువంటి విశిష్ట పరిజ్ఞానం చెలామణిలోకి రావటమే కాక, ఇతర ప్రాంతాలకు పాకడం సాధ్యమైంది. ఆ కారణంగానే అలాంటి నైపుణ్యం వున్న కళాకారులు/నిపుణులు తమ అవసరం ఏ ప్రాంతంలో వుంటే అక్కడికి వెళ్ళగలిగారు. అంతేకాక, కాలానుగుణంగా రాజ్యాల మధ్య పోటీ పెరిగి, నగరీకరణ పెరగడం వల్ల అట్లాంటి సాంకేతిక పరిజ్ఞాన వ్యాప్తికి అయ్యే ఖర్చు కూడా బాగా తగ్గిపోయింది.

15వ శతాబ్దపు మలి సంక్షోభం తర్వాత అభివృద్ధి చెందిన ప్రాంతీయ, జాతీయ మహానగరాల్లో పరిజ్ఞానం పంచుకునేందుకు అవకాశాలు మెరుగయ్యాయి; నాణ్యమైన శ్రామికవర్గం, అనుగుణమైన నైపుణ్యాల అవసరం పెరిగింది; పరిజ్ఞాన నమూనీకరణకూ, క్రోడీకరణకూ ప్రోత్సాహకాలు గణనీయంగా పెరిగాయి. మధ్య, తూర్పు ఇటలీ నుంచి (1200–1450) నైపుణ్య చేతివృత్తి కళాకారులు దక్షిణ ఇంగ్లాండ్‌కూ, దక్షిణ నెదర్లాండ్స్‌కూ (1450–1570), అక్కడి నుంచి డచ్ రిపబ్లిక్‌కూ (1570–1675), అలా చివరికి బ్రిటన్‌కూ (1675 తర్వాత) వలస రావడం వల్ల పాత తరాల పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని, స్థానిక అనుభవాలతో మేళవించి మేలైన పరిజ్ఞాన భాండాగారాన్ని రూపొందించుకునే అవకాశం కలిగింది. దీనివల్ల పశ్చిమ ఐరోపా అంతటా సాంకేతిక ఆవిష్కరణలు గణనీయంగా పెరిగి వ్యాప్తి చెందే వాతావరణం ఏర్పడింది. '17వ శతాబ్దపు సంక్షోభం' తర్వాత రాజ్యాలలో సమన్వయం, రాజ్యాల మధ్య పోటీతత్వం పెరగడం వల్ల మరొక సారి సాంకేతిక ఆవిష్కరణల ప్రగతి జరిగింది.

14వ శతాబ్దం నుంచి ఇటు పట్టణాలలో, అటు పల్లెటూళ్ళలోనూ గణనీయంగా వస్తువుల ఉత్పత్తి పెరగడంతో ఇంగ్లండ్‌లో పారిశ్రామిక రంగ పూర్వ కార్యకలాపాల్లోకి మునుపెన్నడూ లేనంత శ్రామికులు తేసుకోబడ్డారు. అప్పుడే పురుడు పోసుకుంటున్న ఈ పరిశ్రమలు పట్టణ సాంప్రదాయ వృత్తులని, పట్టణ పన్నుల పునాదిని సవాలు చెయ్యటమే కాక పట్టణ పాలకుల ఆగ్రహానికీ గురయ్యాయి. నిర్వాసితులయిన రైతాంగాన్ని రాత్రికిరాత్రే తమ పరిశ్రమల్లో నియమించి భూస్వాముల ఆగ్రహానికి గురి కాకుండా జాగ్రత్త పడవలసి వచ్చింది. ఉత్పత్తి పరికరాల నుంచి క్రమంగా దూరమయిన ఆ శ్రామికులు నిలువ నీడలేని వారిగా నిలిచారు. దాంతో వ్యవసాయేతర రంగంలో కూలీలు ఉపాధి వెతుక్కోవడం జరిగి భూస్వామ్య నిర్బంధం క్రమంగా సన్నగిల్లింది.

చివరగా మార్క్సిస్టు ప్రామాణిక సూత్రాలలోని రెండు మహా భూస్వామ్య సంక్షోభాలను అంతర్లీనంగా నడిపి, ఏకీకృతం చేసిన లక్షణమేమిటంటే–ఉత్పత్తి శక్తుల ప్రగతి రేటులో వృద్ధే అని ముగించ వలసి వుంటుంది.

**మూలం:**


స్టీఫెన్ ఆర్ ఎఫ్‌స్టీన్ వ్రాసిన "ఎక్రిటిక్ ఆఫ్ రాడ్నీ హిల్టన్: అన్ ద ప్రైమ్ మూవర్ ఇన్ ద ట్రాన్సిషన్ డిబేట్" 2006లో లండన్ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్ దీనిని వర్కింగ్ పేపర్‌గా ప్రచురించింది.


**అనువాదం: సి. అనంతు**

**సంక్షిప్తీకరణ: ఆర్.వి.రమణమూర్తి**

# వ్యవసాయ సమస్య

(కార్ల్ కౌట్స్కీ)

**1880–90 కాలంలో జర్మన్ సోషల్ డెమోక్రాటిక్ పార్టీలో అత్యంత ప్రాముఖ్యం గలిగిన నాయకుడు కార్ల్ కౌట్స్కీ ఈయన వ్రాసిన ప్రసిద్ధమైన రచన "వ్యవసాయ భూ సమస్య" 1899లో ప్రచురితమైంది. వ్యవసాయ రంగంలో పెట్టుబడిదారీ ఉత్పత్తి సంబంధాలు పూర్తిగా అభివృద్ధి చెందిన తర్వాత అందరూ అనుకున్నట్లు చిన్న రైతాంగం దానిలో కొట్టుకుపోయి అంతర్థానమవదనీ, పెట్టుబడిదారీ ఉత్పత్తితో పాటు అది కూడా కొనసాగుతుందనీ ఆయన చేసిన పరిశీలన సోషల్ డెమోక్రటిక్ పార్టీకి ఒక సవాలుగా నిలిచింది. శ్రామికులను, చిన్న రైతులను కలిపి కూటమిగా రూపొందించాల్సిన కార్యక్రమాన్ని వారి ముందుంచింది. చిన్న రైతులకు సంబంధించిన ఈయన పరిశీలన చాలా ప్రామాణికత కలిగినదిగా లెనిన్ అభిప్రాయపడ్డాడు. అక్టోబర్ విప్లవాన్ని వ్యతిరేకించిన కారణంగా చాలా కాలంగా మరుగున పడిపోయిన కౌట్స్కీ రాసిన ఈ ప్రసిద్ధ రచన 1980ల్లో మళ్ళా ప్రాచుర్యంలోకి వచ్చింది. ప్రపంచ వ్యాప్తంగా "వ్యవసాయ సమస్య"ని అర్థం చేసుకోవడంలో ప్రస్తుతం ఈ రచన అత్యంత ప్రాముఖ్యత కలిగిందిగా పరిగణింపబడుతోంది. సమకాలీన భారత దేశంలో వ్యవసాయ సమస్యపై జరుగుతున్న చర్చలో ఉపయోగం కోసం ఈ రచన ముఖ్య సారాంశాన్ని ఇక్కడ పొందుపరుస్తున్నాం. -సంపాదకులు**

మార్క్స్ అవగాహనలో వ్యవసాయ సమస్యను అర్థం చేసుకోవడమంటే "పెద్ద కమతాలు, చిన్న కమతాలను మింగేస్తాయా లేదా చిన్న కమతాలకు భవిష్యత్తు ఉంటుందా" అని అడగడం కాదు. పెట్టుబడిదారి ఉత్పత్తి విధానంలో వ్యవసాయం ఏ విధమైన మార్పులకు గురైంది అన్న విషయాన్ని సమగ్రంగా పరిశీలించడం. వ్యవసాయంలో పెట్టుబడి ప్రవేశించి దాన్ని తన గుప్పెట్లోకి లాక్కోవడం; దాని ఉత్పత్తి విధానం ఏ విధంగా విప్లవాత్మక మార్పులకు గురైంది, పాత ఉత్పత్తి విధానం తన దాడికి తట్టుకోలేక కొత్త రూపాన్ని సంతరించుకొనే అవసరంలోకి నెట్టేసే క్రమాన్ని అర్థం చేసుకోవటం.

**భూస్వామ్య క్షీణదశలో రైతు:**

తను ఏం ఉత్పత్తి చేయాలి, ఎటువంటి సాధనాలు ఉత్పత్తికి ఉపయోగించాలి అనే విషయంలో మధ్య యుగ కాలపు రైతు కుటుంబం (1000–1450) స్వయం నిర్ణయాధికారం కలిగి ఉండేది. విపణి ప్రభావం ఆ రైతుల భోగవిలాసాలపై, సౌకర్యాలపై ఉండేది కానీ వారి ఉనికిని ప్రభావితం చేసేది కాదు. నిరాటంకంగా, స్వయం పోషకంగా సహకార స్ఫూర్తితో కొనసాగుతున్న ఈ రైతు కుటుంబం ఆకస్మికంగా విపణి తెచ్చే ఉపద్రవాలకి లోనయింది. వాణిజ్యం పెరిగి నగరాలు అభివృద్ధి చెందటంతో రైతు జీవితంలో మార్పులు జరగడం ఆరంభించాయి. గమ్యం తెలియని ప్రాంతాలకు సాగుతున్న సరుకుల ఎగుమతులు కొత్త అవకాశాలు కల్పించి, కొత్త ఆశలు రేపాయి. అయితే వ్యవసాయ ఉత్పత్తులు 'సరుకు' స్వభావం సంతరించుకోవటం వల్ల తను చేస్తున్న ఉత్పత్తిని తన అంతిమ వినియోగదారుడికి నేరుగా అమ్ముకోవడం అనేది రైతుకు దాదాపుగా దుర్లభమై పోయింది. అమ్మకాలు, కొనుగోళ్ళలో మధ్యవర్తిత్వం చేసే వ్యాపారులు బాగ లాభపడ్డారు. ధాన్యం, పశువుల అమ్మకం లాంటి వ్యవహారంలో మధ్య దళారుల ప్రభావం పెరిగి వీరికి అధిక వడ్డీకి అప్పులిచ్చే వాళ్ళు కూడ జత కలవడం జరిగింది. వాతావరణ అనిశ్చిత స్థితికి, విపణి అనిశ్చిత స్థితి తోడై దాదాపుగా మార్కెట్ వ్యవస్థ అరాచకంగా తయారైంది. ఉత్పత్తికి, వినియోగానికి రెండింటికి కూడా అప్పులిచ్చే వ్యవస్థలు రైతులను కొత్త విపణి వ్యవస్థతో అనుసంధించటానికి సాధనాలయ్యాయి. పట్టణంలో ఉత్పత్తి అవుతున్న సరుకులు గ్రామాలకు కూడా విస్తరించడంతో సాంప్రదాయ రైతు కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నం కావడం ఆరంభించింది. అంతకంతకు మార్కెట్లపై ఆధారపడవలసి రావడం, పెరుగుతున్న డబ్బు అవసరాలు, అదే సమయంలో సాగుకు అదనపు భూమి అందుబాటులో లేకపోవడంతో బయట భూముల్లో పనిచెయ్యడానికి రైతు కుటుంబం తమ సభ్యులను పంపించాల్సిన పరిస్థితి ఏర్పడింది. రైతు కున్న భూమి పూర్తిగా తన కుటుంబ శ్రమ మీద ఆధారపడి ఉత్పత్తి చేసేటంత చిన్నదిగా కుచించుకుపోయింది. ఒకసారి 'మిగులు విలువ' ప్రాధాన్యం పెరిగిన తరువాత వారి దగ్గర అమ్ముగలిగే సరుకు కేవలం తమ శ్రమ శక్తే. చిన్న రైతులు పెద్ద భూక్షేత్రాలలో పని చేయాలి వచ్చింది. చిన్నతరహా భూ కమతాలు తమని తాము కోల్పోకుండా ఉండడం కోసం అత్యంత అసౌకర్యవంతమైన, కఠినమైన పరిస్థితుల్లో శ్రమిస్తేనే పెద్ద తరహా భూ క్షేత్రాలతోపాటు కొనసాగుతాయి.

పెట్టుబడిదారి సంబంధాలు పట్టణాల్లో అభివృద్ధి చెందుతున్న కొద్దీ గ్రామాల్లో రైతు జీవితం అంతకంతకు వేగంగా మార్పు చెందుతూ వచ్చింది.

**ఆధునిక వ్యవసాయం:**

19వ శతాబ్దం అర్థ భాగం నుండి విజ్ఞానశాస్త్ర అభివృద్ధి, పారిశ్రామికీకరణ పెరుగుదల వ్యవసాయంలో ముఖ్యమైన మార్పులకు దారితీసాయి. ఆవిరి మరియు విద్యుత్ నాగళ్ళతో చేసే వ్యవసాయం, సూక్ష్మదర్శిని ఆవిష్కరణతో సూక్ష్మ జీవులకు సంబంధించిన జ్ఞానం, ఎరువుల ఉపయోగం, నేల స్వభావానికి సంబంధించిన జ్ఞానం, వీటన్నింటి వలన వ్యవసాయంలో ఉత్పత్తి ఇతోధికంగా పెరిగింది. దీనితో ఉత్పత్తిని పెంచడానికి తక్కువ భూమి అందుబాటు వల్ల ఏర్పడే పరిమితులను అధిగమించటం సాధ్యమైంది. విశాల భూముల్లో వ్యవసాయానికి బదులు ఒకే చోట సాంద్ర వ్యవసాయం ఆచరణలోకి వచ్చింది. యూరప్ ఖండంలో వృక్ష, రసాయనిక, పశువుల మరియు వ్యవసాయ సంబంధమైన శాస్త్రాలు బాగా అభివృద్ధి చెందడం వలన వ్యవసాయోత్పత్తి విపరీతంగా పెరిగింది. దీనితో మౌలిక సదుపాయాలు, వ్యవసాయ రంగంలో యంత్రాలు, నూతన వ్యవసాయ నిర్వహణ పద్ధతులు లాంటి వాటిలో పెట్టుబడి అవసరం పెరిగింది. సాంకేతిక, ఖనిజ శాస్త్రాలలో అభివృద్ధి, ఆవిరి యంత్రం ఆవిర్భావంతో రవాణా రంగం పెనుమార్పులకు గురయి దాని పర్యవసానంగా పని గంటలు, కఠోర శ్రమ తగ్గడంతో రైతులు శ్రామికులకివ్వాల్సిన వేతనాలు మిగుల్చుకోగలిగారు. వందల సంవత్సరాల నుండి ఎదుగు బొదుగు లేకుండా కునారిల్లిన వ్యవసాయ రంగం ఆకస్మాత్తుగా విప్లవాత్మకమైన మార్పులకు లోనయి ఆధునిక పరిశ్రమలో వ్యవసాయం ఒక భాగంగా మారింది. ఒక జీవన వృత్తిగా ఎంచుకోవడానికి వీలుగా గల విద్యగా వ్యవసాయ శాస్త్రాన్ని ప్రవేశ పెట్టడం జరిగింది. వ్యవసాయం సమూలంగా మార్పు చెందింది. ఉత్పత్తిలో పెంపుదలే కాక ఉత్పత్తి ఖర్చులు తగ్గించి, లాభాలు ఆర్జించ గలిగే వ్యాపార స్వరూపాన్ని సంతరించుకుంది.

**పెట్టుబడిదారి స్వభావం సంతరించుకున్న వ్యవసాయం:**

వినియోగ సరుకుల ఉత్పత్తి స్వభావం, పెట్టుబడి, ధనం లాంటివి లేకుండా ఈ ఆధునిక వ్యవసాయం మనలేదు. సాపేక్ష విలువ, సాపేక్ష ధరలను నిర్ణయించే విలువ మాత్రం నెమ్మదిగా వేళ్ళూనుకుంటుంది. ఒక వస్తువు ధర అనేది దానికి విలువను గాని లేదా దానిలో నిబిడీకృతమైన శ్రమని గాని ప్రతిబింబించాలని పొరపాటున కూడా చెప్పదు. వస్తువు ధర దాని ఉపయోగపు విలువని బట్టి నిర్ణయించబడాలి కానీ ఇప్పుడు మారకపు విలువే దాని ధరను నిర్ణయిస్తుంది. ఆ వస్తువుకున్న సాపేక్ష అవసరం, దానిలో నిబిడీకృతమైన శ్రమ ఈ రెండూ కలగలసే మారకపు విలువ నిర్ణయించబడుతుంది. అంటే, దాని తయారీ ఖర్చు మారక విలువను నిర్ణయించాలి. అయితే వస్తువు ధర మారకపు విలువను ప్రతిబింబించకుండా మార్కెట్ చేత నియంత్రించబడుతూ వుంటుంది. ఒక్కొక్కసారి వస్తువు ధర దాని విలువ కన్నా, దాని ఉత్పత్తి ఖర్చు కన్నా తక్కువగా

వుంటుంది. కారణం అవసరానికి మించిన ఉత్పత్తి వలన. పెట్టుబడిదారీ వ్యవస్థలో అదనపు విలువని డబ్బుగా మార్చే మార్గం ధరకి, విలువకి మధ్య ఉండే ఈ ద్వంద్వ విభజన వల్లే సుగమం అవుతుంది.

మానవ చరిత్రలో ఉత్పత్తిదారుడు, వినియోగదారుడు మధ్య నేరుగా లావాదేవీలు జరిపే వ్యవస్థగా విపణి వందల సంవత్సరాలుగా ఉనికిలో వుంది. ఇటువంటి మార్కెట్ వ్యవస్థ భూస్వామ్య సమాజం, గిల్డుల వ్యవస్థలో కూడా ఉండేది. అప్పటి సరళ ఉత్పత్తి విధానాన్ని పెట్టుదారి ఉత్పత్తి విధానం తోసి రాజనటం ఇక్కడ గుర్తించవలసిన విషయం. ఒకప్పటి ఉత్పత్తిదారులు తమ ఉత్పత్తి సాధనాలకు దూరం చేయబడి శ్రామికులుగా మారడంతో అదనపు విలువను పిండుకోవడానికి అవసరమైన భూమిక ఏర్పడింది. విలువని, ధరని కలిపే ఈ మధ్య దళారీల వల్ల విలువ సూత్రం మరుగున పడిపోయింది. అంతటా వ్యాపించిన ఈ 'ధర' సూత్రం విలువ సూత్రాన్ని సహజంగా పని చేయనివ్వక, వక్రీకరిస్తుంది.

మార్క్స్ వివరించినట్లు ఒక సరుకు ధర దాని విలువను బట్టే నిర్ధారితమవ్వాలనే నియమం లేకపోవడం వల్ల వస్తువు ధర అదనపు విలువను పెట్టుబడిదారులకు లాభంగా మార్చుకునే ప్రాతిపదికన నిర్ధారించబడుతుంది. వ్యవసాయ ఉత్పత్తుల ధరల్ని కూలీ, కౌలు, లాభం అనే మూడు అంశాల బట్టి నిర్ణయించాలి. తక్కువ ఉత్పాదక సామర్థ్యం, ఎక్కువ ఉత్పత్తి వ్యయం ధరకి ప్రాతిపదిక కావాలి. అయితే పోటీ పరిస్థితులు, అధిక సరఫరా వలన లాభాలు కాదుకదా, ఉత్పత్తి ఖర్చును కూడా రాబట్టుకోలేని ధరని మార్కెటు నిర్ణయిస్తుంది. ప్రత్యేకించి అనిశ్చిత వాతావరణం, చీడవంటి వాటితో ప్రభావితమయ్యే వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్లు తరచు ఒడిదుడుకులకు గురవుతూ వుంటాయి. ఇటువంటి ఒడిదుడుకులని పెద్ద, చిన్న కమతందార్లు సమానంగా ఎదుర్కున్నప్పటికీ, ఈ ప్రమాద తీవ్రతను తట్టుకునే సామర్థ్యం చిన్న కమతందార్లకు తక్కువ. కౌలు రైతుల పరిస్థితి ఇంకా దారుణంగా వుంటుంది. చౌకగా లభ్యమయ్యే శ్రామికులు, కౌలు ఖర్చు లేని పెద్ద కమతం యజమానుల దగ్గర సహజంగానే అదనపు విలువ పోగువుతుంది. మార్కెట్లో వ్యవసాయ ఉత్పత్తుల ధరలు పడిపోయినట్లయితే వారి ప్రయోజనాలు కూడా దెబ్బతింటాయి.

కౌలు చెల్లించనవసరం లేని వ్యవసాయ పెట్టుబడిదారుడికి అధిక లాభం సమకూర్చే మరొక వనరు భూమి నుండి వచ్చే కౌలు. భూమి కౌలు రెండు రకాలుగా వుంటుంది.

(1) సాధారణ కౌలు

(2) ఎప్పటికప్పుడు నిర్ణయించే కౌలు.

కనిష్ఠ ఉత్పాదక సామర్థ్యం గల భూమి ఆధారంగా కౌలు నిర్ధారితమయితే చుట్ట పక్కలుండే భూముల ఉత్పాదక సామర్థ్యాల పెరుగుదల స్థాయిని బట్టి రెండవ రకమైన కౌలు నిర్ధారితమవుతుంది. ఆహార వినిమయం పెరిగినట్లయితే భూమి కౌలు పెరిగే అవకాశం వుంది. కాలం చెల్లిన యంత్రాలను మార్చాలి గాని భూమి మార్చడానికి వీలులేని పెట్టుబడి రూపం. భూమిపై ఆస్తి హక్కు కలిగుండడం వల్లే భూయజమానికి కౌలు పోగుబడవుతుంది. స్వంతంగా భూమి కలిగిన వ్యవసాయ పెట్టుబడిదారుడు అదనపు విలువ కౌలు ధరలోనే నిబిడీకృతమై వుండడం వలన లాభాన్ని మరింత అనుభవించగలుగుతాడు.

**పెద్ద&చిన్న కమతాలు :**

ఇంతకు ముందు భూస్వాములు తమ భూమిని తమ మనుషులు, రైతు సేవకుల సహాయంతో పశువుల శ్రమను వాడి వ్యవసాయం చేయించేవారు. అంతే తప్ప భూమిని మెరుగు పరచటం కోసం ఏ ప్రయత్నాలు చేసేవారు కాదు. పెట్టుబడిదారీ వ్యవసాయం ఈ పద్ధతినే పూర్తిగా మార్చివేసింది. అవే రైతులు నేడు శ్రామికులుగా మారిపోయారు. మార్కెట్‌కు అనుగుణంగా లాభాపేక్షతో మాత్రమే వ్యవసాయ ఉత్పతి జరుగుతోంది. భూయజమానులు ఖర్చులు తగ్గించుకొని నూతన పద్ధతులను అవలంబిస్తూ ఉత్పత్తిని పెంచుకుంటూ పోతున్నారు.

ఈ విషయంలో పెద్ద కమతాలకు చిన్న కమతాలతో పోలిస్తే ఎన్నో ప్రయోజనాలు వున్నాయి. అవి (1) పెద్ద కమతాలకు గట్లకోసం, హద్దుల కోసం ఉంచే భూమి తక్కువ అవ్వడం వలన సాగుకు ఎక్కువ భూమి అందుబాటులో ఉంటుంది (2) పెద్ద కమతాలు ఆధునిక వ్యవసాయ పరికరాలైన ఆవిరి నాగలి, కోత, విత్తనాలు చల్లే యంత్రాలు, రవాణా యంత్రాలను వాడటానికి అనువుగా వుంటాయి. నాణ్యమైన యంత్రాల వాడకం వలన వ్యవసాయంలో సమయం చాలా ఆదా అవుతుంది. ఇది చాలా ముఖ్యమైన అంశం. (3) వ్యవసాయ శాస్త్రంలో శిక్షణకు సంబంధించిన విద్య పెరగడంతో పెద్ద కమతాలలో సాంకేతికంగా అనుభవం కలిగిన వారిని పర్యవేక్షకులుగా నియమించుకోవడం జరిగి వినియోగ అవసరాలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు పంటలను, అవి వేసే పద్ధతులను మార్చుకుంటూ తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి సాధించడానికి అనువుగా వుంటాయి. (4) పెద్ద కమతాలలో మెరుగైన ఆధునిక నిర్వహణ, క్షేత్రస్థాయిలో సమర్థత, జమా ఖర్చులు నిర్వహించడం, ఖచ్చితమైన ధర నిర్ణయం లాంటి ఎన్నో ఉపయోగాలు వుంటాయి.

వీటితో పోలిస్తే చిన్న కమతాలు సూక్ష్మ స్థాయిలో వ్యవసాయాన్ని సమర్థతతో నిర్వహించ గలుగుతాయి. అయితే పెద్ద కమతాల్లో నిర్వహణా వ్యయం సాపేక్షంగా తక్కువగా వుండటం వల్ల లాభాలు ఎక్కువగా ఉంటాయి. బ్యాంకింగ్ సదుపాయాలు అందుబాటులో వుండటం, అధిక మిగులు వలన పెద్ద ఎత్తున పెట్టుబడి పెట్టడానికి పరిస్థితులు అనువుగా వుంటాయి.

**తక్కువ ఆహార వినియోగం, అధిక శ్రమ చేసే చిన్న రైతులు:**

చిన్న రైతుల దగ్గర పెద్ద భూ క్షేత్రాలని తట్టుకోవటానికి రెండు ఆయుధాలుంటాయి. మొదటిది, వారు వ్యవసాయంలో అధిక శ్రమ చేస్తూ ఎక్కువ జాగ్రత్తలు తీసుకుంటారు. కఠోర శ్రమకి వెనుకాడరు. ఒక వ్యవసాయ కూలి జీవితం కన్నా ఒక చిన్న రైతు జీవితం చాలా బలహీనంగా, అస్థిరంగా ఉండటం వల్ల ఆయా రైతులు, తామే కాకుండా ఇంట్లో అందర్నీ ఇటువంటి కఠిన శ్రమకు గురి చేస్తారు. కుటుంబంలో అందరూ అంటే పురుషులు, స్త్రీలు, పిల్లలు, వృద్ధులతో సహా అందరూ కాడెని మొయ్యవల్సిందే. చిన్న రైతు, వారి కుటుంబం వేరు వేరు కాదు. వాళ్ళ కుటుంబంలోని పిల్లలను కూడా చాలా దారుణమైన శ్రమకు గురి చేస్తారు. పండుగలకు, ఇతర సాంస్కృతిక అవసరాలకు మాత్రమే శెలవు తీసుకుంటూ మిగిలిన అన్ని రోజులు పని చేస్తూనే వుంటారు. యింతగా శ్రమపడే చిన్న కమతాదారుడి వద్దకు వెళ్ళి ఎనిమిది గంటల పని కోసం డిమాండ్ చేయగలమా?

చుట్టూ ఉండే పోటీ వాతావరణంలో ప్రేరేపితులయిన చిన్న రైతులు ఎప్పుడయితే తమ వినియోగానికి ఉత్పత్తి చేసుకోవటం మానేసి, మార్కెటు కోసం ఉత్పత్తి మొదలు పెడతారో అప్పుడే అధిక శ్రమ ప్రారంభమవుతుంది. సాంకేతికలో వెనుకబాటు తనం వల్ల పని గంటలు పెరుగుతూ పోతాయి. తన సాంకేతికతను పెంచుకుంటూ ఈ పోటీ వాతావరణాన్ని ప్రోత్సహించే ఈ వ్యవస్థ అంతకంతకు వారిపై అదనపు పని భారాన్ని మోపడానికి సిద్ధమవుతుంది. పని గంటలు పెంచుకునే అవకాశం ఉండటం వలన సాంకేతికపరమైన అభివృద్ధికి వీరు మొగ్గు చూపరు. పిల్లల చేత పనిచేయించడం అనేది చాలా సహజ పరిణామంగా మారిపోతుంది. పిల్లలు విద్యకు దూరమైపోయి కనీసం నైపుణ్య శ్రామికులుగా కూడ మారలేని పరిస్థితి వస్తుంది.

వ్యవసాయంలో వస్తున్న పోటీని తట్టుకోలేని చిన్న రైతులు జీవితంలో అతి చిన్న సౌకర్యాలకు, సౌఖ్యాలకు కూడ దూరమైపోతారు. లోభత్వం అతని జీవితంలో ప్రారంభమౌతుంది. ఊహించలేనటువంటి దారుణమైన పరిస్థితులకు చిన్న రైతులు గురవుతారు. కనీస ఆహారం కూడ తీసుకోలేని నిర్లక్ష్యం వలన, కొన్ని సార్లు చిన్న రైతు కన్నా రోజు కూలీలు ఆరోగ్యంగా కనిపిస్తారు. ఆహార లేమితో రక్తహీనతకు గురయ్యే చిన్న రైతులకు తోడుగా కుటుంబంలో పోషక ఆహార లేమితో బాధపడే వృద్ధులు, కూలి చేసుకునే పిల్లలు తోడయి మొత్తం కుటుంబ పరిస్థితి కడు హీనంగా మారిపోతుంది. కఠోర శ్రమతో కూడిన ఈ జీవితం వారికిచ్చే ప్రతిఫలం: ఎటువంటి దుర్భర పరిస్థితుల్లో కూడా చిన్నరైతులు తన జీవనాల్ని గడపగలరు అన్న నమ్మకం. అత్యంత కఠోర శ్రమ, కనీస తిండికి కూడా నోచుకోని రైతుకు ఈ చిన్న కమతం ఏ విధంగాను ఉపయోగకరం కాదని మనం ఇప్పటికైనా అంగీకరించాల్సిన విషయం. ఈ పరిస్థితి వారిని ఆర్థిక వెనుకబాటుతనానికి గురిచేస్తూ ఆర్థిక ప్రగతికి కూడ ఆటంకంగా మారుతుంది.

పనిలో ఎక్కువ శ్రద్ధ, అధిక పొదుపు ఈ రెండింటి వలన చిన్న రైతులు ఎక్కువ వినాశనానికి గురవుతుంటారు. ఇతరుల కోసం పనిచేసే శ్రామికులకన్నా తమ కోసం తాము పని చేసుకొనే శ్రామికులు పని గురించి ఎక్కువ శ్రద్ధ తీసుకుంటారనేది సత్యం. అన్ని రకాల సదుపాయాలు, పెట్టుబడి, సాంకేతికత కల్గిన పెద్ద కమతాలకు ఈ అవసరం వుండదు. పనిలో అధిక శ్రద్ధ వలన వచ్చే ఫలితాలను చిన్న

రైతులు చేసే అధిక శ్రమ, ఆహార లేమి, అజ్ఞానంలాంటివి మింగేస్తాయి.

**సహకార పద్ధతి:**

చిన్న రైతుల మనుగడకు సహకార పద్ధతి చాలా అవసరం. అయితే చిన్న రైతులు ఈ పద్ధతిని అంగీకరించి దాని ఫలితాలను ఏ విధంగా అందుకుంటారనేదే ప్రశ్న. వీళ్ళు అంగీకరించినప్పటికీ ఈ సహకార పద్ధతి మనుగడ సాధిస్తుందా? ప్రస్తుతం పని చేసే అనేక సహకార వ్యవస్థలు రుణ వ్యవస్థలుగా పనిచేస్తున్నాయి. కేవలం పాలు, పాల ఉత్పత్తులు, పంచదారవంటి అనుబంధ రంగాలలో సహకార రుణ వ్యవస్థల వలన ఫలితాలు పెద్దగా వుండవు. ఉత్పత్తి రంగంలో కూడ సహకార వ్యవస్థలు బలపడాల్సిన అవసరం వుంది. ఐతే దీనికి రైతుల మధ్య సహకారం చాలా అవసరం. దీనివల్ల తమ ఉత్పత్తులకు తగిన ధరలను బేరసారాలాడే సామర్థ్యం రైతులకు వస్తుంది. వీటిని తామే స్వయంగా నడుపుకున్నప్పుడు మాత్రమే వీరికి అధిక ప్రయోజనం చేకూరుతుంది. ఈ సహకార వ్యవస్థలు అందరికి ఉపయోగంగా వున్నప్పటికి చిన్న రైతుల కన్నా పెద్ద రైతులే వీటిని ఏర్పర్చడంలో ఎక్కువ చొరవ చూపుతున్నారు. చిన్న రైతులు చాలా అరుదుగా మాత్రమే ముందుకు వచ్చి ఈ వ్యవస్థల్ని ఏర్పర్చడానికి సిద్ధపడుతున్నారు. ముఖ్య కారణం వారిలో వారికి నమ్మకం లేకపోవడం, కుటుంబం బయట ఏ వ్యవస్థలోనూ పని చెయ్యలేకపోవటం.

సంస్థాపరమైన క్రమశిక్షణ లేకపోవటం, ప్రజాస్వామిక పద్ధతులు పాటించకపోవటం వలన కూడా చిన్న కమతాల రైతులు ఈ సహకార పద్ధతిని పాటించలేకపోతున్నారు. సంఖ్యరీత్యా తక్కువ వుండటం, సహకరించుకునే పద్ధతి మెలైనదిగా వుండటం, పనిలో వెసులుబాటు, సామాజిక పెట్టుబడి అందుబాటులో వుండటం వంటి కారణాలు వలన పెద్ద రైతులే చిన్న రైతుల కన్నా ఈ సహకార వ్యవస్థ ఏర్పాటుకు ఎక్కువ ఉత్సాహం చూపుతున్నారు. అయితే జర్మని, ఫ్రాన్సు, దేశాలలో ఈ వ్యవస్థలు క్రమ క్రమంగానూ, లేదా అకస్మాత్తుగానూ మూతపడుతున్నాయి. కాలానికి తట్టుకొని నిల బడగలిగే సహకార వ్యవస్థలు చాలా తక్కువ సంఖ్యలోనే వుంటున్నాయి. అయితే వీటివల్ల చిన్న రైతులకు ప్రయోజనాలు ఒనగూరాయి. నైపుణ్యలేమి, సహకారస్ఫూర్తి లేకపోవడం, వారిలో వారికి అపనమ్మకం, భూమితో విపరీతమైన అనుబంధం, పరిస్థితుల నుండి వచ్చిన సంకుచితత్వం వంటి సమస్యలతో చిన్నరైతులు నిరంతరం సతమతమౌతూ వుంటారు. ఇటువంటి కారణాలతో చిన్న రైతులు సహకార వ్యవస్థను ఒక ప్రత్యమ్నాయ వ్యవస్థగా మార్చుకోలేక చిన్న కమతాలు పెద్ద కమతాలుగా మారే అనివార్యమైన పరిస్థితి ఏర్పడుతుంది.

**పెట్టుబడిదారి వ్యవసాయ పరిమితులు:**


స్వాభావికంగానే పెద్ద కమతాలకు ఎక్కువ ప్రయోజనాలుంటాయనేది ఋజువు అయినప్పటికీ జర్మనీ, ఇంగ్లాండు, ఫ్రాన్స్ దేశాలలో చిన్న కమతాలు వేగంగా పెరగడం, ఉనికిలో వుండడాన్ని కూడా మనం వివరించాల్సి వుంది. ఏ విధమైన భద్రత లేకపోయినా బలవంతంగా కొనసాగుతున్న కౌలు రైతు వ్యవస్థలు, చిన్న కమతాలు కూడా పెద్ద పెద్ద జమీలన్‌తో పాటు ఉనికిలో ఉంటాయని బూర్జువా అర్థ శాస్త్ర పండితులైన ఆడమ్ స్మిత్, సిస్మోండిలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేసారు. ఇంగ్లాండులో చిన్న కమతాలు తగ్గిపోలేదు. జర్మనీలో మధ్య స్థాయి కమతాలలో పెరుగుదల, ఫ్రాన్స్‌లో చిన్న కమతాలు వేగంగా పెరగడం లాంటివి 1840–90 ప్రాంతంలో జరిగింది. ఒక్క అమెరికాలో మాత్రమే పెద్ద కమతాలు పెరిగాయి. దాని కథ వేరేగా వుంది. కమతం పరిమాణానికి వ్యవసాయంలో పెట్టుబడిదారి సంబంధాలకు ఏ విధమైన పొంతన లేకపోవడమనేది ఈ విరుద్ధమైన గణాంకాలు సూచిస్తున్నాయి. ఇది ఇంకా జాగ్రత్తగా ముందు ముందు పరిశీలించాల్సిన అంశం. చిన్న పరిశ్రమలు క్రమంగా తగ్గిపోవడం లేదా అంతర్ధానం అయిపోవడం లాంటి పరిస్థితి పారిశ్రామిక రంగంలో కూడ లేకపోవడమనేది మనం గుర్తించాల్సిన అంశం. వాటి వాటికున్న స్వాభావిక కారణాలరీత్యా చిన్న పరిశ్రమలు కూడా కొన్ని రంగాల్లో మనుగడ సాగించే పరిస్థితి వుంది.


పంటలో అనూహ్యంగా ఎదురయ్యే పరిస్థితులు, భారీ కమతాల వ్యవసాయం అన్ని వేళలా మేలయినది కాదు. కొన్ని రకాల పంటలకు చాలా నిశితమైన, నిరంతరాయమైన పర్యవేక్షణ ఎక్కువ అవసరం. వీటిని చిన్న రైతులు మాత్రమే బాగా చేయగలుగుతారు. అధిక వేతనాలు, కూలీల కొరత లాంటివి ఒక్కొక్కసారి పెట్టుబడిదారి పద్ధతుల్లో వ్యవసాయానికి ఆటంకంగా పరిణమిస్తాయి. యాంత్రీకరణ అనేది కూలీల కొరతను తీర్చినప్పటికి కూలీ అనేది లేకుండా కుటుంబ శ్రమగా సాగే చిన్నకమతాల వ్యవసాయం మార్కెట్ పోటికి తట్టుకొని నిలబడగలుగుతుంది.

పెద్ద కమతాలు తమ స్వప్రయోజనాల రీత్యా చిన్న కమతాలను కాపాడుతుంటాయి. చిన్న కమతందార్లు జీవనానికి కావాల్సిన దాంట్లో కొంత మాత్రమే తమ చిన్న కమతం నుండి పొందుతూ మిగిలిన దాని కోసం తక్కువ కూలికి పెద్ద కమతాలకు పోవడం వల్ల వారికి ఆటంకం లేకుండా నిరంతరాయంగా కూలీలు అందుబాటులో వుంటారు. తమ కమతాలను వదిలి వీరు పూర్తిగా గ్రామాల నుండి వలసపోరు. పెద్ద కమతాలు చిన్న కమతాలు కలిసి చాలా ప్రాంతాలలో మనుగడ సాధించడం అసాధారణ విషయమేమీ కాదు.

అనువాదం: జగన్నాథస్వామి

సంక్షిప్తీకరణ: ఆర్.వి.రమణమూర్తి



# ఫ్రాన్స్, జర్మనీలలో రైతు సమస్య

(ఫ్రెడరిక్ ఎంగెల్స్)

**1894లో ఫ్రెంచి, జర్మన్ సోషల్ డెమోక్రటిక్ పార్టీలు తమ తమ ఎన్నికల ప్రణాళికల్లో చిన్న రైతుల దురవస్థల గురించి రాస్తూ కార్మికుల, రైతుల మధ్య సఖ్యతకు కార్యాచరణ రూపమివ్వడానికి తీవ్రంగా ఆలోచిస్తున్నప్పుడు 1894లో ఎంగెల్స్ దూరదృష్టితో ఈ అవగాహనా పత్రాన్ని వ్రాసాడు. 1892లో మార్సెల్స్‌లో, దానికి అనుబంధంగా నాంటీస్ (జర్మన్ సోషల్ డెమోక్రటిక్ ఫ్రాంక్ ఫర్ట్ సమావేశం)లో వోల్‌మార్ లాంటి వివిధ రకాల ఫ్రెంచి సామ్యవాదులు (సోషలిస్టులు) ఆమోదించిన వ్యవసాయ కార్యక్రమాన్ని ఎంగెల్స్  వ్యాసం త్రోసి పుచ్చింది. చిన్నరైతులు (పెద్ద రైతులు కూడా) పెట్టుబడిదారి వ్యవస్థలో తీవ్రమైన పోటీ, ఒత్తిడులకు తట్టుకోలేక అప్పుల్లో కూరుకొని పోయి, తీవ్రమైన దారిద్ర్యాంలోనికి నెట్టబడతారని ఎంగెల్స్ స్పష్టమైన దృక్పథాన్ని తెలియజేసాడు. పార్టీలు రైతులను సహకార సంఘాలుగా ఏర్పాటు చేయ్యాలని, తదనంతరం వారిని భూములను జాతీయకరణ చేయడానికి ఒప్పించాలని, చెపుతూ బలవంతంగా వారి ఆస్తిని సమిష్టి ఆస్తిగా మాత్రం ఎప్పటికీ మార్చరాదని ఎంగెల్స్ సూచించాడు.   -సంపాదకులు**

సామ్యవాదులలో అకస్మాత్తుగా రైతు సమస్య గురించి ఆలోచన ఇప్పుడెందుకు కలిగిందా అని బూర్జువా పార్టీలు, ప్రతిఘాత (రియాక్షనరీ) పార్టీలు చాలా అబ్బురపడుతున్నాయి. అయితే వారు ఆశ్చర్యపడాల్సింది చాలా కాలం కిందనే జరగాల్సిన చర్చ ఇంకా ఎందుకు జరగలేదు అని. ఐర్‌లాండ్ నుండి సిసిలీ వరకు, అందలూసియా (స్పెయిన్) నుండి రష్యా, మరియు బల్గేరియా వరకు జనాభాలో, ఉత్పత్తిలో రాజకీయాధికారంలో రైతు చాలా ముఖ్యమైన భాగం. పశ్చిమ యూరప్‌లోని కేవలం రెండు ప్రాంతాలు మాత్రమే దీనికి మినహాయింపు. గ్రేట్‌బ్రిటన్‌లో పెద్ద, పెద్ద భూ క్షేత్రాలు, పెద్ద తరహా వ్యవసాయం స్వయంపోషక (subsistence) రైతులను పూర్తిగా మార్చేసింది; ప్రష్యాలో ఎల్బెకు తూర్పుదిశలో శతాబ్ద కాలంగా అదే ప్రక్రియ కొనసాగుతోంది. ఇక్కడ కూడ రైతుల్ని ఇలాగే తయారు చేస్తున్నారు. ఆర్థికంగా, రాజకీయంగా వారిని వెనుకకు నెట్టేసారు.

రోమన్ కాలం నుండి ఇప్పటి ఫ్రెంచి లేదా రష్యన్ నిరంకుశ పాలన దాకా జాతీయ రాజకీయలతో సంబంధం పెట్టుకోకుండా, తమ గోలేదో తాము చూసుకుందామనే రైతుల ధోరణి వల్ల వివిధ రకాల పార్లమెంటరీ అవినీతికి మార్గమేర్పడింది. పశ్చిమ యూరప్‌లో కార్మిక వర్గ పోరాటం మొదలైనప్పటి నుండి,  సామ్యవాద శ్రామికులని 'విభజించే వారని', 'సోమరి, పేరాశ గల పట్టణవాసులని', 'రైతుల ఆస్తులపై కన్నేసే' వారని రైతుల మనస్సులలో ముద్రేయటంలో బూర్జువా వర్గం సఫలీకృతమయింది. ఫ్రెంచి రైతుల ప్రతిఘాత వ్యతిరేక ఓట్లు ఫిబ్రవరి 1848 ప్యారిస్ కమ్యూన్‌లోని అస్పష్ట సామ్యవాద కోరికలను చాలా వేగంగా బుట్ట దాఖలు చేసాయి. గొడవల నుండి మనశ్శాంతి కావాలనుకున్న రైతాంగం, తనని తాను రైతుల చక్రవర్తిగా ప్రకటించుకున్న నెపోలియన్ బుట్టలో పడి రెండవ ఫ్రెంచి సామ్రాజ్య సృష్టికి దారితీసింది. రైతుల ఈ ఒక్క తప్పుడు చర్య వల్ల ఫ్రాన్స్ ప్రజలు ఎంత మూల్యాన్ని చెల్లించుకున్నారో మనందరికీ తెలుసు. ఆ దెబ్బ నుండి ఇంకా ఫ్రాన్స్ తేరుకోనే లేదు.

అప్పటి నుండి పరిస్థితి చాల మారింది. పెట్టుబడిదారి ఉత్పత్తి రూపం అభివృద్ధి చెంది వ్యవసాయ రంగంలో చిన్న తరహా ఉత్పత్తి జీవన నరాలు తెగగొట్టింది. చిన్న తరహా ఉత్పత్తి అనూహ్యంగా దెబ్బ తింటోంది, నాశనమవుతోంది. ఉత్తర, దక్షిణ అమెరికా మరియు భారత ఉప ఖండంలోని పోటీదారులు వారుత్పత్తి చేసిన చౌకధాన్యంతో, యూరోపియన్ మార్కెట్లను ముంచెత్తారు. ఈ పోటీని తట్టుకోలేని పెద్ద భూయజమానులు, చిన్న రైతులు ఒకే విధమైన నాశనాన్ని ఎదుర్కోబోతున్నారు. భూ యజమానులమైనా తాము చిన్న రైతుల ప్రయోజనాలను కాపాడే శూరుల పాత్రను పోషిస్తున్నామని పెద్ద భూస్వాములు అనుకుంటుంటే చిన్నరైతులు 'అవునవున'ని అంగీకరిస్తున్నారు.

ఈ మధ్య కాలంలో పశ్చిమాన ఒక శక్తివంతమైన సోషలిస్టు కార్మిక పార్టీ ఏర్పడి అభివృద్ధి చెందింది. ఈ పార్టీకి అస్పష్ట సాంఘిక, రాజకీయ వాదాలను వెనుకకు నెట్టి వేసే సామర్థ్యం ఉంది. సమాజానికి కావలసిన అన్ని శాస్త్రీయ అవసరాలను తీర్చడానికి విశాల ప్రాతిపదిక పైన లోతైన కార్యక్రమాన్ని తయారు చేసింది. జర్మనీ, ఫ్రాన్స్, బెల్జియం పార్లమెంట్లలో సోషల్ డెమోక్రటిక్ పార్టీల ఉనికి క్రమంగా పెరుగుతోంది. పట్టణాలలో రాజకీయాధికారం పొందిన తర్వాత గ్రామీణ ప్రాంతాలకు తప్పని సరిగా ప్రాకాలి. ఆర్థిక, రాజకీయాల మధ్యగల అంత: సంబంధాల గురించి ఈ పార్టీకి స్పష్టమైన దృక్పథం ఉంది. గొర్రె తోలు కప్పుకొన్న తోడేలు మాదిరిగా పెద్ద భూయాజమానులు చిన్న రైతుల ప్రయోజనాలను కాపాడే శూరుని అవతారం ఎత్తారని కూడా చాల కాలం కిందటే గ్రహించింది ఈ పార్టీ. ఈ దొంగ రక్షకుల చేతుల్లో మునిగిపోతున్న చిన్న రైతులను ఈ పార్టీ వదిలి పెట్టదని ఆశిద్దాం. ఈ దొంగ రక్షకులు స్తబ్దంగా ఉన్న రైతులను శ్రామిక వ్యతిరేక శక్తిగా మార్చేయగలరు. రైతాంగ సమస్యకి సంబంధించిన అసలు చిక్కు ఇక్కడే ఉంది.

**గ్రామీణ జనాభా: వైవిధ్యం**

గ్రామీణ జనాభా వివిధ రకాలుగా ఉంది. వివిధ ప్రాంతాలలో చాలా భిన్నంగా కూడా ఉంది. ఫ్రాన్స్, బెల్జియంలో లాగానే పశ్చిమ జర్మనీలో కూడా చిన్న తరహా వ్యవసాయం చేస్తున్న చిన్న కమతాల రైతులు ఎక్కువ. వారిలో అత్యధిక భాగం భూయజమానులు. కొంత మంది భూమిని కౌలుకు తీసుకుంటారు. వాయువ్య భాగంలో సాక్సోని కింది భాగంలో, సెల్స్ విగ్ – హొలాల్‌స్టీన్ ప్రాంతాల్లో పెద్ద, మధ్య తరగతి రైతులు ఉంటారు. వారు స్త్రీ, పురుష వ్యవసాయ సేవకులు లేకుండా, రోజువారి కూలీలు కూడా లేకుండా వ్యవసాయం చేయలేరు. బవేరియా ప్రాంతంలో కూడా అదే రకంగా ఉంది. ప్రష్యాలో ఎల్బె ప్రాంతానికి తూర్పున, యెక్లెన్ బర్గ్‌లో జీతగాళ్ళు, రోజువారి కూలీలతో పెద్ద తరహా వ్యవసాయం చేసే పెద్ద భూక్షేత్రాల ప్రాంతాలు ఉన్నాయి. చిన్న, మధ్య తరగతి రైతులు ఉన్నప్పటికీ వారికంత ప్రాముఖ్యం లేదు, పైగా వారి వాటా నెమ్మదిగా తగ్గుతోంది. మధ్య జర్మనీలోని వివిధ ప్రాంతాల్లో వేర్వేరు నిష్పత్తుల్లో అన్ని రకాల ఉత్పత్తి రూపాలు; భూయాజమాన్యాలు కలిసి కనిపిస్తాయి. ప్రత్యేకించి ఏ ఒక్క వ్యవసాయ ఉత్పత్తి పద్ధతి అధిక్యతా కనిపించదు.

ఇంతేకాకుండా వివిధ ప్రాంతాలల్లో వ్యవసాయం చేయదగిన స్వంత భూమి లేదా కౌలుకు తీసుకోగలిగిన భూమి కూడా రైతులకి లేవు. ఈ భూమి కేవలం కుటుంబ పరిశ్రమను కొనసాగించటానికి ఆధారంగా మాత్రమే పనికొస్తుంది. నమ్మశక్యం కాని అత్యల్ప వేతనాలను చెల్లించటం వల్ల. ఎంత విదేశీ పోటీ ఉన్నప్పటికి తమ ఉత్పత్తులను అమ్ముకోగలిగే దేశీయ పరిశ్రమ ఇది. సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఇటువంటి గ్రామీణ జనాభాలో ఏఏ ప్రజలను తమ వైపు ఆకర్షించుకోగలదు?

చిన్న రైతులు అంటే యజమాని కావచ్చు లేదా కౌలుదారు కావచ్చు కానీ, కేవలం తానూ, తన కుటుంబ సభ్యులు సాగు చేయగలిగి, తన కుటుంబానికి జీవనాధారంగా పనికొచ్చే భూమి మాత్రమే కలిగినవాళ్ళు. చేతివృత్తుల పనివాళ్ళ లాగే చిన్నరైతులు కూడా కష్టపడి పనిచేసే వారు. ఆధునిక కార్మికునికంటే చాలా భిన్నంగా ఉంటారు. తమ స్వంత పని ముట్లను కలిగి ఉంటారు. అందుకని ఇంకా గత ఉత్పత్తి పద్ధతి(Mode of Production)నే కొనసాగుతారు. వారికి, వారి పూర్వీకుల మధ్య మూడు తరాల వ్యత్యాసం ఉంటుంది – అంటే, దాసులు (serf), జీతగాళ్ళు (Bondman) మరియు భూస్వామికి సేవలందించే కౌలు రైతు.

మొదట ఫ్రెంచి విప్లవం రైతులను భూస్వామ్య సేవల నుండి, అంతకు ముందున్న అప్పుల నుండి విముక్తి చేసింది. మెజారిటీ రైతుల విషయంలో (కనీసం రైన్ నది ఒడ్డున)

రైతులకు భూమిని స్వంత ఆస్తిగా ఉంచుకునే హక్కు ఇచ్చింది. రెండవది, ఫ్రెంచి విప్లవం తర్వాతి ఫ్రాన్స్‌లో అంతకు ముందున్న సమూహ వ్యవస్థలు బద్దలయి చిన్న రైతులకు స్వేచ్ఛ వచ్చింది. కానీ భూస్వాముల సంరక్షణలో అంతకు ముందు లభించిన ప్రయోజనాలు పూర్తిగా పోయాయి. దీని వలన చిన్న రైతులు తన పశువులను మేపుకోవడానికి పశు గ్రాసం కొనాల్సి వచ్చింది. క్రమంగా చాలా మంది రైతులు పశువులను తమ దగ్గర ఉంచుకోలేని పరిస్థితి కొచ్చారు. నిషేధించబడిన భూస్వామ్య సేవల వల్ల లభించిన ప్రయోజనం కంటె గ్రామ సమూహ వ్యవస్థ నుండి తుంచి వేయబడట్టం వల్ల వారికి కలిగిన ఆర్థిక నష్టమే ఎక్కువ.

మూడవది, నేటి రైతులు ఇంతకు ముందున్న ఉత్పాదక కార్యక్రమాల్లో సగం కోల్పోయారు. ఇంతకు ముందు రైతు కుటుంబం మొత్తం ఉత్పత్తిలో పాల్గొని, తమకు కావలసిన ముడి సరుకులలో ఎక్కువ భాగం తమకు తామే స్వయంగా తయారు చేసుకొనేవారు. వ్యవసాయానికి అవసరమున్న వాటిని ఇరుగు పొరుగు దగ్గర వస్తు మార్పిడి లేదా సేవలను ఇచ్చిపుచ్చుకొనే పద్ధతిలో సమకూర్చుకొనేవారు. కుటుంబమే కాక గ్రామం కూడ దాదాపుగా వారికి కావలసిన ప్రతిదాన్ని ఉత్పత్తి చేసుకుంటూ స్వయం సమృద్ధిగా ఉండేది. దాదాపు అది ఒక అమిశ్రిత, సహజ సిద్ధమైన ఆర్థిక వ్యవస్థగా ఉండేది. దానికి దాదాపు ద్రవ్యం అవసరమే ఉండేది కాదు. పెట్టుబడిదారి విధానం తన ద్రవ్య ఆధారిత ఆర్థిక వ్యవస్థతో పెద్ద తరహా ఉత్పత్తిని తెచ్చి ఈ సహజ సిద్ధమైన ఆర్థిక వ్యవస్థకు చరమ గీతం పాడింది. పాత మార్క్ సామూహిక వ్యవస్థలో లభించే జీతభత్యాలు వారి ఉనికిని మౌలికంగా నిర్వచిస్తే, కొత్త వ్యవస్థ వారిని పారిశ్రామిక రంగంపై ఆధారపడేలా చేస్తుంది. దీనితో రైతులు సదా తరిగిపోతున్నారు. పన్నులు, పంటలు చెడిపోవడం, వంశపారంపర్య విభజనలు మరియు వ్యాజ్యాలు వగైరా కారణాలతో రైతు తర్వాత రైతు వడ్డీ వ్యాపారుల చేతుల్లోకి నెట్టబడుతున్నారు. ప్రతి రైతు క్రమంగా అప్పుల పాలవటమే కాక, ప్రతి కేసులో రుణ భారం పెరుగుతోంది. క్లుప్తంగా చెప్పాలంటే పాత ఉత్పత్తి పద్ధతి (Mode of Production) నుండి బతికి బట్ట కట్టిన అందరి లాగే మన చిన్న రైతుల బతుకు కూడా పూర్తి నిరాశాజనకం. వారే భవిష్యత్తులో కార్మికులుగా (Proletarian) మారబోతున్నారు.

నిజానికి ఈ రైతులకి మన సోషలిస్టు కార్యక్రమాన్ని వినవలసిన అవసరం చాలా ఉంది. కాని వారి పెట్టీ బూర్జువా సంస్కృతి ఎలాంటి సామాజిక కార్యక్రమాన్ని అయినా ఒప్పుకోవడానికి ప్రతి బంధకం. రైతులకు నిజమైన మిత్రులు లేనందువలన అభద్రతకు గురై తన ఆ చిన్న పొలం ముక్క పోతుందేమోనని భయంతో ఎంత సోషల్ డెమోక్రాట్లని నమ్ముకున్నా తమ భూఖండాన్ని అంతకంటే ఎక్కువగా నమ్ముకుంటారు. సోషల్ డెమోక్రాట్లు భూమినంతా సమాజపరం చేస్తారని అనుకుంటారు. అందువల్ల వీరు కూడా వడ్డీ వ్యాపారిలానో న్యాయవాదిలానో ఒక భయంకరమైన శత్రువుగా కనిపిస్తారు. ఈ భయాన్ని సోషల్ డెమోక్రసీ ఏ విధంగా అధిగమించగలదు? రైతుల అనుమతి లేకుండా, అలాంటి కార్యక్రమం చేపట్టమని చెప్పగలదా? ఈ సోషలిస్టుల వ్యవసాయ కార్యక్రమ ప్రకటనలో కావలసింది రైతుకు కావలసిన రక్షణ అంశం జోడించడం. ఈ కార్యక్రమంలో సాంప్రదాయ చిన్నరైతు భూ ఆర్థిక వ్యవస్థను సానుభూతి పూర్వకంగా అర్థం చేసుకోవడం చాలా ముఖ్యమైన విషయం.

**1892 మార్సెల్లిస్ సమావేశము:**

ఈ సమావేశం పార్టీ ప్రథమ వ్యవసాయ కార్యక్రమాన్ని ఆమోదించింది. అది ఆస్తిలేని గ్రామీణ కార్మికులకు (రోజువారి కూలీలు, ఇంకా కింది స్థాయిలో ఉన్న వారికి) ఈ క్రింది డిమాండ్లను ప్రతిపాదించింది: కార్మిక సంఘాలచే మరియు గ్రామ సంఘాలచే నిర్ణయించబడిన కనీస వేతనాలు ఉండాలి; గ్రామ కార్మిక కోర్టులలో సగభాగం కార్మికులుండాలి; గ్రామ సమిష్టి భూముల అమ్మకంపై నిషేధం; ప్రజల సంబంధమైన సమిష్టి భూములను గ్రామ సంఘాలకు కౌలుకు ఇవ్వడం, ఈ భూములు స్వంతంవి కావచ్చు లేదా కౌలుకు తీసుకున్నవి కావచ్చు, వీటన్నిటిని ఆస్తిలేని కార్మిక కుటుంబాల సంఘాలకు సమూహ సాగు కొరకు కౌలుకు ఇవ్వాలి. వారు వేతన కూలీలను నియమించు కోకూడదు. వీటిపై గ్రామ సంఘాల నియంత్రణ ఉండాలి.

పెద్ద భూ క్షేత్రాలపై ప్రత్యేక పన్ను విధించి, దాన్ని వృద్ధులకు, అంగవైకల్యం ఉన్న వారికి, రోగులకు పెన్షన్లు చెల్లించాలి. సంఘం ద్వారా కొన్ని యంత్రాలను ప్రత్యేక రాయితీలతో స్వల్ప రేటుకు చిన్న రైతులకు అద్దెకు ఇవ్వడం; ఎరువులను, కాలువ నీటి పైపులను, విత్తనాలను కొనడానికి మరియు ఉత్పత్తిని అమ్ముకోవడానికి రైతు సహకార సంఘాలు ఏర్పాటు చేయుట, 5000 ఫ్రాంకుల డబ్బుకు మించని రియల్ ఎస్టేట్ (భూముల అమ్మకం–కొనుగోలు) మార్పిడిపై పన్ను రద్దు పరుచటం;

ఐరిష్ పద్ధతిలో మధ్యవర్తులుండే కమీషన్ల ద్వారా రుసుములను, కౌలును నియంత్రించడం, పంటలలో భాగస్వామ్యాన్ని పొందే యజమానుల (మెటాయర్‌లు) భూముల విలువ పెరిగినపుడు కౌలు రైతులను తొలగిస్తే వారికి నష్టపరిహారం చెల్లించటం; భూస్వాములకు పంటలను జప్తి చేసే అధికారమిచ్చే సివిల్ కోడ్ ఆర్టికల్ 2102ను రద్దు పరచడం; పెరుగుతున్న పంటలపై అప్పులు ఇచ్చినవారు లెవీ విధించే హక్కును రద్దుపరచటం; రైతులకు సంబంధించిన కొన్ని నిర్దిష్టమైన పనిముట్లను జప్తి నుండి మినహాయించుట, పంటల లెవీ మినహాయింపు, విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పశువులు, ఇంకా రైతులకు తమ ఉత్పత్తి కార్యక్రమాలన్ని కొనసాగించడానికి కావలసిన ముఖ్యమైన వాటన్నిటిపై మినహాయింపు కల్పించటం;

చాలా కాలంగా పాతబడ్డ భూ రికార్డుల వ్యవస్థను అంటె భూమి శిస్తు విధానం, యాజమాన్యం, విలువ, విస్తీర్ణము మొదలగు వాటిని సాధారణ సవరణ చేయటం, అంత వరకు ప్రతి కమ్యూనిటీలో స్థానిక అంశాల ప్రకారం రికార్డులను, శిస్తు విధానాన్ని సమీక్షించటం జరిగేది. చివరగా, వ్యవసాయం చేయటానికి ఉచిత శిక్షణ నివ్వటం, వ్యవసాయ ప్రయోగాత్మక కేంద్రాలను ఏర్పాటు చేయటం.

ప్రతిపాదించిన ఈ కార్యక్రమంలో కొంత భాగం ఇంతవరకే కొన్నిచోట్ల అమలులోకి వచ్చింది. ఐరిష్ విధానాన్ని అనుసరించి కౌలుదారుల మధ్యవర్తిత్వ న్యాయస్థానాలు స్పష్టంగానే పని చేస్తున్నాయి. ఇదివరకే రైను నది ప్రాంతాలలో రైతు సహకార సంఘాలున్నాయి. పశ్చిమ యూరప్ అంతటా బూర్జువా ఉదారవాదులు, అధికారులు భూ రికార్డుల వ్యవస్థను(cadaster) సవరించాలని చాలా కాలంగా కోరుతున్నారు.

ఫ్రాన్స్ వ్యవసాయంలో ప్రాంతీయ తేడాలు చాలా ఉన్నప్పటికీ, పార్టీ ఈ కార్యక్రమాన్ని కొన్ని ప్రాంతాల్లో విజయవంతంగా అమలు పరుస్తోంది. కానీ, భవిష్యత్తులో ఈ కార్యక్రమం అమలు భారమవ్వచ్చనే భయం ఒకటి ఉంది. పార్టీ భవిష్యత్తులో రైతులకు ఏ విధంగా ఆదుకుంటుంది? భవిష్యత్తు కార్మికుని గానా లేదా ప్రస్తుత ఆస్తిగల రైతుగానా? దీన్ని నిర్ణయించడానికి తగిన సైద్ధాంతిక స్పష్టత కావాలి. ప్రత్యేకంగా, పెట్టుబడిదారి ఉత్పత్తి వ్యవస్థ తప్పదు అని తెలిసింతర్వాత, పాత ఉత్పత్తి పద్ధతికి చరమగీతం పాడాలన్న నిర్దిష్ట సైద్ధాంతిక స్పష్టత కావాలి.

1892 సెప్టెంబర్ నెలలో జరిగిన నాంటీ సమావేశం పీఠికలో ఆమోదించిన ఈ క్రింది డిమాండ్లను నిశితంగా పరిశీలిద్దాం.

<u>**పీఠిక ఇలా మొదలౌతుంది:**</u>

*ఉత్పత్తి సాధనాలను కలిగి ఉన్నంతవరకే ఉత్పత్తిదారులు స్వేచ్ఛగా ఉండగలరు.

*ఒకవైపు పారిశ్రామిక పెట్టుబడి కేంద్రీకరణ దశకు చేరుకొంటోంది, అప్పుడే సమిష్టి సంఘ రూపంలో శ్రామికులను వాస్తవమైన యజమానులుగా, ఉత్పత్తిదారులుగా గుర్తించగలిగే పరిస్థితి కల్పించబడుతుంది; కాని, ప్రస్తుత ఫ్రాన్స్‌లోని వ్యవసాయ రంగంలో కనీసం అలాంటి కేంద్రీకరణ లోపించడం వలన భూమి వ్యక్తిగత యాజమాన్యం కిందే ఉంది.

*వడ్డీవ్యాపారులకు, కొత్తగా ఏర్పడిన పెద్ద భూస్వాముల అక్రమ ఆక్రమణలకు వ్యతిరేకంగా వ్యవసాయ కార్మికులకు కేవలం ఇప్పుడున్న చిన్న చిన్న భూ కమతాలను కొనసాగించడమే కాకుండా, వారిని సమిష్టి లేదా సమాజ రూపంలోకి మార్చడమే సామ్యవాదం యొక్క లక్ష్యం.

*కౌలుదారుకు, పాలుకి తీసుకునే కౌలు రైతులకూ రక్షణ కల్పించడం తక్షణ అవసరమే కాక, హేతుబద్ధమైనది కూడా. దానికి కారణం రైతులుగా వీరు రోజువారి కూలీలను దోపిడి చేసినా, వారు స్వయంగా దోపిడికి గురి చేయబడతారు కాబట్టి.

సామ్యవాద అరాచకవాదుల్లా కాక కార్మిక పార్టీ సామాజిక పరివర్తన తీసుకొచ్చే క్రమంలో పేదరికాన్ని మాత్రమే లెక్కించాల్సిన అవసరం లేదు. కార్మికులతో పాటు సాధారణ ప్రజానీకం మొత్తం విముక్తిని సాధించడానికి గ్రామీణ, పట్టణ కార్మికుల సమిష్టి కృషితో ప్రభుత్వాన్ని ఏర్పరచుకొని, రాజ్యాంగాన్ని రూపొందించుకోవాలి. పార్టీ ఈ వ్యవసాయ కార్యక్రమంలాగే, ఇతర గ్రామీణ సరుకు ఉత్పత్తులపై కూడా ఒక విస్తృత కార్యక్రమం చేపట్టాలి. జాతి నేలను ఉపయోగించి భూస్వామ్య యాజమాన్య విధానానికి

వ్యతిరేకంగా పోరాటాలను నిర్మించాలి.

**ఇపుడు ఈ లక్ష్యాల పరిధులను గురించి క్షుణ్ణంగా పరిశీలిద్దాం:**

పరిశ్రమలో, వ్యవసాయ రంగంలో ఉత్పత్తి సాధనాలు సమాజపరం కావడం ఏకైక లక్ష్యంగా ఉండాలి. ఈ కార్యక్రమాన్ననుసరించి వ్యక్తిగత ఉత్పత్తి సాధనాలు ఎప్పటికి ఉండరాదు. అవి అందరి ఉత్పత్తిదారులకు చెందినవిగా ఉండాలి. వ్యక్తిగత సాధనాలనూ, ఆస్తులను కొనసాగించటంలో సామ్యవాద విధానానికి ఆసక్తి ఉండకూడదు.

పెట్టుబడిదారి మార్కెట్ యంత్రాంగంలో వ్యక్తులు కేవలం ఉత్పత్తి సాధనాలు కలిగి ఉన్నంత మాత్రాన నిజమైన స్వేచ్ఛ పొందలేరు. లండన్ లాంటి పెద్ద పెద్ద నగరాలలో హస్తకళా వృత్తులు ఏనాడో ధ్వంసం అయిపోయాయి. వాటి స్థానంలో పెద్దతరహా పరిశ్రమలు వచ్చి, శ్రామికుల శ్రమను పీల్చే గృహాలుగా అవతరిస్తున్నాయి. తమకాళ్ళ మీద నిలబడే చిన్న రైతులు తమ చిన్న భూముక్కలను రక్షించుకోలేరు, స్వేచ్ఛగానూ ఉండలేరు. వాళ్ళు, వారిళ్ళు, కమతం మరియు కొత్త భూమి కూడా చివరికి వడ్డీ వ్యాపారికే చెందే ప్రక్రియ మొదలైంది. వారి జీవితం కార్మికుల జీవితం కంటే అస్థిరంగా ఉంది. మధ్యలో కొన్ని మంచి రోజులు కనపడినా, చివరికి వారు అప్పులకి బానిసలే.

పారిశ్రామిక కార్మికుని జీవితం కంటే రైతుల జీవితం అధ్వాన్నంగా మారింది. పారిశ్రామిక కార్మికులు అప్పుడప్పుడు ప్రశాంతంగా రోజులు గడుపుతారు. అది చిన్న రైతులకు ఎన్నటికీ సాధ్యం కాదు. వారు ఎల్లప్పుడూ రుణ దాస్యంలో ఉండి నిరంతరంగా హింసకు గురౌతున్నారు. సివిల్ కోడ్ ఆర్టికల్ 2102ను కొట్టేయండి, చట్ట ప్రకారంగా వారికి కొన్ని వ్యవసాయ పనిముట్లను, పశువులను మొదలైన వాటిని ఇప్పించండి, పంట లేవీ నుండి మినహాయించండి. అయినప్పటికీ 'స్వచ్ఛందంగా' తన పశువులను అమ్మకోవాల్సిన దీన పరిస్థితి నుండి కాపాడగలమనే నమ్మకం లేదు. ఏదో విధంగా వడ్డీ వ్యాపారికి తనకు తానే శారీరకంగా, మానసికంగా అమ్ముడు పోయినట్లు సంతకం చెయ్యక తప్పదు. అలా తమ శిక్షని కొంత కాలం వరకు తామే ఆపుకుంటారు. చిన్న రైతులు తమ ఆస్తిని రక్షించడానికి చేసిన ప్రయత్నం ఏదీ కూడా వారి స్వేచ్ఛను రక్షించ లేకపోయింది. కానీ వారికి ఒక ప్రత్యేక రూపంలో వుండే దాస్యాన్ని మిగిల్చింది. అది అలానే కొనసాగుతూ వారిని బ్రతుకనివ్వదు, చావనివ్వదు. కాబట్టి మొదటి పేరాలో చెప్పిన మీ కార్యక్రమం మీరనుకున్నట్లు సమస్యా రహితం కాదు.

ఈ పీఠికలో చెప్పినట్లు, నేటి ఫ్రాన్స్‌లో భూమి, అంటే ఉత్పత్తి సాధనం, ఇప్పటికీ కూడ ఎక్కువగా చిన్న, లేదా వ్యక్తిగత ఉత్పత్తిదారుల చేతులలో ఉంది. శ్రామికుల నుండి ఆస్తిని వేరుచేయడం సామ్యవాదం ఉద్దేశ్యం కాదు; నిజానికి ఆ రెండింటిని కలిపి వారి చేతులలోనే పెట్టడమే చివరి కార్యక్రమం. సామ్యవాదం ఉద్దేశం వ్యక్తిగత ఉత్పత్తి సాధనాలను సమిష్టి ఉత్పత్తి సాధనాలుగా మార్పు చేయ్యటం. ఈ దృష్టి కోల్పోతే, పైన చెప్పిన కార్యక్రమం పక్కదారి పడుతుంది, చిన్న రైతుల ఆస్తిని కాపాడటం అనే భ్రమలకు గురి చేస్తుంది. సామ్యవాదం ఉద్దేశం చిన్న రైతులకున్న ప్రస్తుత బూటకపు ఆస్తిని వారి నిజమైన ఆస్తిగా మార్పిడి చేయటం. అంటే చిన్న కౌలుదారులను రుణ విముక్తుల్ని చేసి స్వంతదారులుగా మార్చాలి. నిస్సందేహంగా, ఇటువంటి బూటక వ్యక్తిగత ఆస్తి అదృశ్యమయ్యే విధంగా చూడటమే సామ్యవాదం యొక్క లక్ష్యం, కానీ దానికి పార్టీ ప్రకటించిన కార్యక్రమం సరిపోదు.

ఎట్లా అయినా వడ్డీ వ్యాపారులు, కొత్తగా ఏర్పడిన పెద్ద భూయజమానులు చేసే ఆక్రమణలకు వ్యతిరేకంగా రైతులు తమకున్న భూమిని తామే సాగుచేసుకొనే విధానం కొనసాగేలా చేయడమే సామ్యవాదం ధ్యేయం అని పీఠిక స్పష్టంగా ప్రకటించింది.

ఏదైతే అసాధ్యమని గత పేరాలో ప్రకటించిందో అంటే (చిన్న రైతుల వ్యవస్థ అనూహ్యంగా, అనివార్యంగా నాశనమైపోతుందని తెలియజేసిందో) ఆ అసాధ్యమైన చిన్న కమతాల రైతులను రక్షించాలని సామ్యవాద ధర్మమని పీఠిక చెప్పడం కొంత వైరుధ్యపూరితం. మునిగి పోయే రైతును రక్షించే బాధ్యత చిన్న కమతాల వ్యవస్థలో సాధ్యమైనది కాదు. చిన్న రైతులను నాశనం చేయడంలో రాజ్యం విధించే పన్నుల పాత్ర, వడ్డీ వ్యాపారుల దోపిడి, భూస్వాముల కౌలు దోపిడి అన్నీ సమిష్టిగా ఉంటాయి. వీటిని నిరోధించే మాధ్యమం సమకూర్చుకోకుండా చిన్న రైతులను పార్టీ ఎలా కాపాడుతుంది?

అలాగే "కౌలు రైతులు, పాలి రైతులైన ఉత్పత్తిదారులు, రోజు కూలీలను దోపిడీ చేస్తూన్నప్పటికీ వారిని రక్షించటం అవసరం. వారినా పరిస్థితికి నెట్టింది వారిని దోపిడీ చేస్తోన్న వ్యవస్థే కాబట్టి" అని కూడా ప్రకటించిందీ పీఠిక. ఇది మరొక ఆశ్చర్యకరమైన విషయం. సామ్యవాదం అంటేనే ప్రత్యేకంగా వేతన కార్మికుని దోపిడీకి వ్యతిరేకం. మరి ఇక్కడ ఫ్రెంచి కౌలుదారులు "రోజువారి కూలీలను దోపిడీ చేస్తున్నప్పటికి చిన్న రైతులు కాబట్టి సామ్యవాదం వారిని తప్పక రక్షించాలని అని ఈ పీఠిక ప్రకటిస్తుంది. "ఎందుకంటే ఇంతకు క్రితం ఆ కౌలుదారులే స్వయంగా దోపిడీకి గురయ్యారు కాబట్టి వారు కొంత వరకు రోజువారి కూలీలను దోపిడీ చేయడానికి నెట్టబడ్డారు" అంటుంది.

జారుడు బల్లమీద ఒకసారి ఎక్కామంటే జారటం తేలిక, హాయికూడా. ఇపుడు అదే విధంగా, పెద్ద, మధ్యతరగతి రైతులు ఫ్రెంచి సామ్యవాద పార్టీ కార్యవర్గంతో తాము చేస్తున్న స్త్రీ, పురుష వ్యవసాయం కూలీల దోపిడీని కూడా కాపాడమని; ఎందుకంటే, తాముకూడా వడ్డీవ్యాపారులు, పన్ను వసూలుదార్లు, ధాన్యం వ్యాపారులు, పశువుల డీలర్ల దోపిడీకి గురికాబడ్డ వారమేనని అర్థిస్తే పార్టీ వారిని కూడా రక్షిస్తుందా? వీరికి సమాధానం ఇవ్వగలదు? రాయబారానికి పెద్ద భూస్వామి కౌంట్ కానిట్జ్‌ను పంపరని గ్యారంటీ ఏది? (కౌంట్ కానిట్జ్ కూడ వారి లానే ధాన్యం దిగుమతి రాజ్య గుత్తాధిపత్యం కింద జరగాలని ప్రతిపాదన సమర్పించినవాడే) అదే ధోరణిలో గ్రామీణ కార్మికులను దోపిడీకీ గురి చేయటానికిన్నూడా సామ్యవాద పార్టీ రక్షణ కల్పించమని అడుగుతారు, తాముకూడా స్టాక్ బ్రోకర్లు, వడ్డీ వ్యాపార్లులు, ధాన్యం వ్యాపారుల దోపిడీకి గురి కాబడ్డామనే కారణం వారు కూడా చూపించగలరు.

నా ఉద్దేశ్యం ఫ్రెంచ్ మిత్రుల నిబద్ధతను శంకించటం కాదు కానీ, వారి రైతోద్ధరణ కార్యక్రమంపై కొంత వివరణ ఇవ్వాలి. ఉదాహరణకు, ఉత్తర ప్రాంత ఫ్రాన్స్‌లో చక్కెర-బీటు పంట సాగు చేసే జిల్లాల్లో, చాలా కఠినమైన షరతుల మీద చక్కెర బీటు పంటభూమిని రైతులకు కౌలుకి ఇచ్చారు. రాష్ట్ర కర్మాగారం నిర్ణయించిన ధరకే బీటు పంటను కర్మాగారానికి చేరవేయాలి; పరిమితమైన పరిమాణంలోనే విత్తనాలను, ఎరువులను వాడాలి. ఇది తప్పకుండా రైతును ముంచే బేరమే. చివరి క్షణంలో కొనను పొమ్మంటే రైతుకు దిక్కెవరు? జర్మనీలోనూ రైతులకు ఈ అనుభవమే ఎదురవుతోంది. కాబట్టి రైతులందరూ బాధితులే. కానీ చిన్నా పెద్దా రైతుల అంశానికి సంబంధం లేకుండా కార్యక్రమాన్ని అమలు చేయటంవల్ల సామ్యవాదంలోని మౌలిక సూత్రాన్నే మరచి పోయినట్లవుతుంది. అమలు చేసే సామ్యవాద పార్టీ, రైతుల వ్యక్తిగత ఆస్థిని రక్షించే పార్టీగా మిగులుతుంది. పీఠికలో పార్టీ గ్రామీణ ఉత్పత్తి శక్తులన్నింటినీ ఉమ్మడి శత్రువు పోరాడడానికి సమీకరించాలని చెప్పారు. ఆ ఉమ్మడి శత్రువు ఫూడల్ భూస్వామన్న విషయాన్ని మరచిపోకూడదు.

నా ఉద్దేశంలో సోషలిస్టు పార్టీ కార్యక్రమం గ్రామీణ కార్మికులు, చిన్న రైతులతో పాటు సోమరిపోతు పెద్ద రైతులను, పెద్ద క్షేత్రాల కౌలుదార్లను, పెట్టుబడిదారి పశు వుల పెంపకపుదార్లను ఇతర పెట్టుబడిదారి దోపిడీదార్లను ఏకతాటిపై తేవడం కానేకాదు. వీరందరికి భూస్వామ్య యాజమాన్యం ఉమ్మడి శత్రువుగానే కనిపించవచ్చు. కొన్ని అంశాలలో నిర్దిష్ట లక్ష్యాల కొరకు వారితో కలిసి ఉమ్మడిగా పోరాటం చేయవచ్చు. సమాజంలోని ప్రతి వర్గం నుండి అంటె పెట్టుబడిదారి, మధ్య రకం బూర్జువా వర్గం లేదా మధ్య తరగతి రైతు వర్గం నుండి వ్యక్తులను పార్టీ ఉపయోగించుకోవచ్చు, అభ్యంతరం లేదు. కానీ ఆ వర్గాల కొమ్ము కాయడం పార్టీ పని కాదు. అది ప్రధానంగా కార్మికుల పార్టీ అని గుర్తుంచుకోవాలి.

ప్రకటించిన కార్యక్రమంలో చాలా అంశాలు ఉన్నాయి. అన్నీ కూడా కేవలం చిన్న రైతుల ప్రయోజనాలని ఉద్దేశించినవి కావు. 3000 ఫ్రాంకులకు పైబడిన ఆదాయంపై ఒకే ఒక పురాగామి పన్ను; చిన్న రైతులపై భూమి శిస్తు నిషేధం నిర్మూలించటం; సబ్సిడీలపై వ్యవసాయ యంత్రాలను చిన్న రైతులకు ఇవ్వటం; రవాణా ఛార్జీలను తగ్గించడం; సబ్సిడీలపై ఎరువులను చిన్న రైతులకు అందించటం. దీని వలన కొద్ది మంది పెద్ద రైతులు కూడ ప్రయోజనం పొందినా, చిన్న రైతులకు ఈ డిమాండ్లు అవసరం. కానీ ఈ డిమాండ్లు చిన్న రైతులకు స్వల్ప కాలం మాత్రమే లాభిస్తాయి. పీఠికలో ప్రదర్శించిన సైద్ధాంతిక కృషి పార్టీ కార్యక్రమం పెంపొందించటంలో కనబరచలేదనే చెప్పాలి. ముఖ్యంగా చిన్న రైతులు, వారి కమతాల రక్షణ కోసం అరకొరగా ప్రతిపాదించిన నూతన వ్యవసాయ కార్యక్రమం ఆచరణలో విజయవంతమయ్యేది కాదు. ఫ్రాన్స్‌లోనే కాదు, ఏ దేశంలో అయినా కూడా అదే పరిస్థితి.

అయితే, ఒక విషయంలో, ఫ్రెంచి కామ్రేడ్లు చెప్పింది సంపూర్ణంగా సత్యం. ఫ్రాన్సులో చిన్న రైతుల అభీష్టానికి వ్యతిరేకంగా ఏ శాశ్వత విప్లవాత్మక మార్పు సాధ్యం కాదు. దానికి కావల్సిన కార్యక్రమం నిర్మించుకోవడం ఇంకా జరగలేదు. ఎన్నికలలో గెలవాలనే అత్యాశతో, తొందరపాటు సైద్ధాంతిక ఆలోచనలతో నష్టదాయకమైన వాగ్దానాలను చేసి రిస్క్ తీసుకుంటున్నారనిపిస్తుంది.

నిర్మొహమాటంగా చెప్పాలంటే, పెరుగుతున్న రుణభారం వల్ల, దారిద్ర్యంలో కూరుకుపోతున్న చిన్న రైతులను కాపాడగలమని శుష్క వాగ్దానాలు చేసి వారిని మన వైపు ఆకర్షించడం సాధ్యమా? కౌలుదారుల అప్పులను చెల్లించేసిన తర్వాత వారిని స్వంత వ్యవసాయదారులుగా మార్చేయగలమా? చేసినప్పటికీ ఆ చిన్న ఉత్పత్తిదారులు మనగలరా? దీర్ఘ కాల విపత్తును ఎదుర్కోటానికి స్వల్పకాలిక అభివృద్ధిని చూపడం తప్పు. ఆస్తి హక్కులపై చిన్నరైతుల కుండే పెటీ బూర్జువా నమ్మకాలను కొనసాగించడం పార్టీ ప్రయోజనానికి సరైంది కాదు. ఇది చిన్న చేతివృత్తి పని వాళ్ళు యజమాని కావాలను కోవడం వంటిదే. అపుడు, చిన్న రైతుల గురించి మన వైఖరి ఏంటి? మనం అధికారం హస్తగతం చేసుకునే సమయంలో ఏ విధంగా దాన్ని పరిష్కరించాలి?

ఫ్రెంచి కార్యక్రమంలో ఈ క్రింద చెప్పింది మాత్రం సరైనదే. మొదటిది, చిన్న రైతు నాశనం అనివార్యం అయినప్పటికీ, దాన్ని త్వరితం చేయటం మన ఉద్దేశం కాదు. రెండవది, పార్టీ అధికారంలోకి వచ్చినప్పటికి, ఏదో నామ మాత్రపు నష్టపరిహారాన్నిచ్చి చిన్న రైతు భూమిని బలవంతంగా లాక్కోటం ఎట్టి పరిస్థితుల్లో చేయకూడదు. వారిని ముందు సహకార సంఘాలలో కలవడానికి సమాయత్తపరచాలి. చిన్న ప్రైవేటు పరిశ్రమల పరిమితులను తెలియజేస్తూ సామాజికీకరణ అనివార్యతను వారు తెలుసుకొనే విధంగా చేయాలి.

20 సంవత్సరాల కిందే, డేనిష్ సామ్యవాదులు (వాళ్ళ రాజ్యం అనేక వ్యవసాయ క్షేత్రాల మధ్యలో ఉండే ఒకే ఒక పట్టణం) అధిక సంఖ్యలో వున్న చిన్న రైతులనందరిని ఒక పెద్ద సమిష్టి వ్యవసాయ క్షేత్రంగా సమీకరించి పెద్దతరహా, ద్రవ్య (విత్త). వ్యయపొదుపు, మెరుగైన నిర్వహణ ద్వారా రైతులు లాభాలు పొందవచ్చని నిరూపించారు. పెద్ద వ్యవసాయ క్షేత్రాన్ని గుత్తకు ఇవ్వడం వలన అదనపు ఉద్యోగాలు సృష్టించబడతాయి. రైతు సహకార సంఘాలను పరిశ్రమలతో సమీకృతం చేసి, సహకార సంఘాలను సాంకేతికంగా మార్పు చేసి, సమిష్టి కృషితో అధిక ఫలితాలను సృష్టించి, లాభాలను పంపిణీ చేసి, రైతుల ఆదాయాన్ని, చైతన్యాన్ని, పెంపొందించే సహకార కార్యక్రమం మొదలుపెట్టాలి.

ఇంతకు పూర్వం వివరించినట్లు, వ్యక్తిగత చిన్నకమతాల సాగే దాని అంతానికి దారి తీస్తుంది. ఒకవేళ అదే కొనసాగించాలని రైతులు భావిస్తే భావించవచ్చు. కానీ, పెద్ద తరహా వ్యవసాయం దాన్ని మింగేస్తుంది. వారి స్వప్రయోజనాల కోసం కమతాలని సమిష్టి రూపంలోకి తేవడం అవశ్యం. అది ఎంత అనివార్యం అయినప్పటికీ, రైతులను వారి కమతాలను విడిచిపెట్టమని ఎప్పటికీ బలవంతం చేయకూడదు. పెట్టుబడిదారి ఉత్పత్తి పద్ధతి (Capitalist Mode of Production)లో రాజ్యం పోషించే కుటిలమైన పాత్ర మామూలుగా కంటికి కనిపించదు. కాస్త ఆలస్యమైనప్పటికి, సోషల్ డెమోక్రాటిక్ పార్టీ చిన్న రైతుల సహకార ఉద్యమానికి నాందిపలకాలి. సహకార సంఘాలకు సహకరించే ఈ వ్యూహం మాత్రమే చిన్న రైతును పెట్టుబడిదారి విధానంలో బలికాకుండా కాపాడుతుంది. ఇతర రంగాలలో జరిగిన కార్మికీకరణలో చిన్న రైతును సహజమైన మిత్ర పక్షంగా పెంపొందిస్తుంది.

దీనిక్కావలిసిన పున:నిర్మాణ ఖర్చును రాజ్యం యొక్క ఖజానా నుండి చెయ్యొచ్చు. ఇది సామాజిక పునర్నిర్మాణం కోసం చేసే మంచి పెట్టుబడిగా భావించవచ్చు.

పెద్ద రైతుల గురించి కొంత ప్రస్తావిద్దాం. రైతాంగ వ్యవస్థలో వారసత్వం వలన, అప్పుల వలన ఏర్పడిన భూ విభజనలు, బలవంతపు భూ అమ్మకాల వలన చిన్న కమతాల రైతుల నుండి పెద్ద రైతుల వరకూ రకరకాలయిన కమతాలు ఏర్పడ్డాయి. ఇందులో మధ్య రకం రైతులు కూడా చిన్న రైతుల మధ్య ఉంటారు. వారు కూడా ఎక్కువ భాగం కుటుంబ శ్రమనే ఉపయోగిస్తూ చిన్న రైతుల పరిస్థితి కంటె ఎక్కువ భిన్నంగా కనిపించరు కానీ వారి పరిస్థితి వేరన్న విషయం గమనించాలి. ఈ మధ్య రైతులు, పెద్ద రైతుల ప్రాబల్యం ఉన్నచోట వారికి వ్యవసాయాన్ని కొనసాగించడానికి వ్యవసాయ కూలీల అవసరం ఉంటుంది. ఇది పూర్తిగా వేరే విషయం. అయినప్పటికీ ప్రప్రథమంగా ఒక కార్మిక పార్టీ వేతన కార్మికుల తరఫున రోజువారి కూలీల తరఫున పోరాడాలి. ఈ రైతుల ప్రయోజనాల కోసం కార్మికుల వేతన దాస్యాన్ని కొనసాగించే ఏ రకమైన వాగ్దానాలు చేయుటమైనా నిస్సందేహంగా తప్పు. కాని, పెద్ద, మధ్య రకం రైతులు వేతన కార్మికులు లేకుండా వ్యవసాయాన్ని నిర్వహించలేరు. అలాగే చిన్న, మధ్య మరియు పెద్ద రైతులకు; కూలీలకు మధ్య సంఘర్షణ రహిత, శాంతిపూరిత సహజీవనం కేవలం ఒక అభూత కల్పన అన్న విషయం గుర్తుంచుకోవాలి.

అలాగే పట్టణాలలో చేతి వృత్తుల వారి సమస్య కూడ అంతే. నిజంగా చెప్పాలంటే రైతుల కంటే ఎక్కువగా చేతి వృత్తుల వారు ఇంకా సర్వనాశనమై పోయారు. అందులో పని నేర్చుకునే అప్రెంటిస్‌లే అన్ని పనులు చేస్తున్నారు. చాలా మంది ఈ ఉత్పత్తి పద్ధతి కూడా అనివార్యంగా అంతమవుతుందని గుర్తిస్తున్నారు. పెరుగుతున్న ఋణ భారం, విదేశీ చౌక ధాన్యం మరియు పెట్టుబడిదారి పోటీని తట్టుకోలేని పెద్ద, మధ్య తరగతి రైతులకు కూడా ఇదే పరిస్థితి వర్తిస్తుంది. ఈ నశించి పోయే పరిస్థితిని ఎదుర్కోడానికి మనం పెద్దగా ఏమి చేయలేం, కమతాలన్నింటిని ఒక దగ్గరికి సమీకరించి సహకార సంఘాల రూపంలో ఏర్పాటు చేయడం తప్ప. దాని వలన వేతన కూలీల దోపిడి నిర్మూలించబడుతుంది. ఆ విధంగా జాతీయ స్థాయిలో ఉత్పత్తిదారుల సహకార సంఘాలు క్రమంగా మార్పు చెంది, ప్రతి వారు సమాన హక్కులను, విధులను అనుభవించే విధంగా ఎదగగలవు. ఒకవేళ వినకపోతే, వారి విధికి వారిని వదిలేయడం తప్ప చేయగలిగింది ఇంకేమి లేదు.

అంతిమంగా మనం భూమినంతా స్వాధీనం చేసుకోవాలి. నష్టపరిహారం చెల్లించో, చెల్లించకుండానో పెద్ద రైతుల భూములతో సహా సమస్త భూములను జాతీయకరణ చేయాలి. అది చేయాలంటే అసలు మనం అధికారంలోకి రావాలి.

ఈ విధంగా పట్టణ ప్రాంతాల వారికంటె ముందుగానే గ్రామీణ కార్మికులకు సామ్యవాద అవకాశాలను సృష్టించాలి. కాలంలో ప్రష్యా ప్రాంతంలోని తూర్పు-ఎల్బ్ ప్రాంతంలోని గ్రామీణ కార్మికులను మనవైపు గెలుచుకుంటే, ఒక్కసారి జర్మనీ అంతటా ఒక భిన్నమైన గాలి వీస్తుంది. జర్మన్ ఆధిపత్యం, ప్రష్యా జంకర్ల ఆధిపత్యం ఉన్న ప్రధాన రాజకీయ ప్రాంతమైన తూర్పు-ఎల్బెలో అసలైన అర్థ-బానిసత్వ గ్రామీణ కార్మికులను పెట్టుకుంటున్న జంకర్లు కూడా పోటీ నుండి వినాశనాన్ని ఎదుర్కొంటున్నారు. దానికి ప్రతి చర్యగా దెబ్బతిన్న అహం భావంతో రీచ్ మిలిటరీ జాతీయవాదానికి మద్దతుదారులుగా మారిపోతున్నారు. పాలక వర్గానికి ఎంత కొమ్ము కాసినా, డిస్టిలరీ కర్మాగారాల్లో, బీటు-దుంప-చక్కెర రిఫైనరీల్లో యజమానులుగా ఉండికూడా మార్కెట్ దోపిడి నుండి రక్షణ పొందడంలో విఫలమయ్యారు. రాజకీయ మద్దతు ఉన్నప్పటికీ క్షీణిస్తున్న ఆర్థిక పరిస్థితిని కాపాడుకో లేకపోయారు. అర్థ-బానిసత్వాన్ని (Semi-Serfdom) సాంప్రదాయంగానే కాక చట్టపరంగా కూడా అనుమతించి గ్రామీణ కార్మికులను అపరిమితంగా దోపిడి చేసే అవకాశం వల్ల మునిగిపోతున్న జంకర్లు మళ్ళీ తేలటానికి అవకాశం ఏర్పడింది. కార్మికుల్లో సామాజిక-ప్రజాస్వామ్య విత్తనాన్ని నాటండి, వారికి ధైర్యాన్నివ్వండి, వారి హక్కులను సాధించుకోవాలని ఉత్తేజపరుస్తూ జంకర్ల వైభవాన్ని అంతమొందించండి. యూరోప్ అంతటిని కొల్లగొట్టి జీవించిన రష్యా జార్ రాజ్యం కూడ ముల్లుగుచ్చుకొన్న నీటి బుడగ మాదిరిగా అదృశ్యమై పోగలదు. రాబోయే సంపూర్ణ ప్రజా తిరుగుబాటు వెల్లువ ఫలితంగా అధికార మార్పిడి జరగగలదు. విచ్ఛిన్నమైన ప్రష్యా సైనిక దళాలు సోషల్-డెమోక్రాట్‌లుగా మారగలవు. కాని దీని కోసం, పశ్చిమ జర్మనీలోని చిన్న రైతుల కంటె తూర్పు-ఎల్బ్ ప్రాంత గ్రామీణ కార్మికులను గెలుచుకోవడం చాల ముఖ్యం. మిత్రులారా, ఏనాటికైనా గెలుపు మనదే.

**మూలం:**

ఎంగెల్స్ రాసిన 'పెజంట్ క్వశ్చన్ ఇన్ ఫ్రాన్స్ అండ్ జర్మనీ'

సమిష్టి కౌలు, సమిష్టి సాగు చేసే స్వేచ్ఛా రైతుల చిన్న సమూహాలు ఏర్పాటు చేసుకున్న సంఘాలపై ఆధారపడిందే మార్క్ వ్యవస్థ. గీత, హద్దు అన్న అర్థం వున్న పేరు. ఆర్థికంగా, రాజకీయంగా స్వతంత్ర సమూహాలివి. బహుశా మొదట వీటిని స్థాపించిన వారందరూ బంధువులు, రక్తసంబంధీకులు అయి వుంటారు. (Wikipedia - Mark System https://en.wikipedia.org/wiki/Mark_system)

**అనువాదం: పి. రాజేశం**

**సంక్షిప్తీకరణ: ఆర్.వి.రమణమూర్తి**

# భూమి జాతీయకరణ: మార్క్స్

■ కార్ల్ మార్క్స్

భూమి (వ్యక్తిగత) ఆస్తిగా మారిన క్రమమే అన్ని రకాల సంపదలకు మూలం. భూమిపైన వ్యక్తిగత ఆస్తిని సమర్థిస్తూ ధర్మశాస్త్ర పండితులు, తత్వవేత్తలు మరియు రాజకీయ అర్థశాస్త్రవేత్తలు ముందుకు తేచ్చే వివిధ వాదనలను చర్చించే ఉద్దేశం నాకు లేదు. ప్రస్తుతానికి సహజ హక్కు అనే ముసుగులో భూమిని ఆక్రమించుకున్న వాస్తవాన్ని దాచిపెట్టడానికి వారు చేసే వ్యవహారానికి పరిమితమై మాట్లాడుతాను. ఈ ఆక్రమణ కొద్దిమందికి సహజ హక్కును కట్టబెడితే, మెజారిటీ ప్రజలు ఒక్కటై తాము కోల్పోయిన సహజ హక్కును తిరగి పొందడానికి తగిన శక్తిని సంపాదించుకోవడమే మార్గం.

చరిత్ర అభివృద్ధి క్రమంలో క్రూర పద్ధతి ద్వారా విజేతలైన వారు తమకు తాము బిరుదులు ఇచ్చుకోవడం, దానికి ఒక సామాజిక ఆమోదం వుందని చెప్పడానికి చట్టాన్ని ఒక సాధనంగా రుద్దటం జరిగింది. చిట్ట చివరగా వచ్చిన తత్త్వవేత్త ఈ చట్టాలు సర్వజన ఆమోదాన్ని ఇముడ్చుకున్నాయని రుజువు చేసే ప్రయత్నం చేశాడు.

ఒకవేళ భూమి మీద వ్యక్తిగత ఆస్తికి సర్వజన ఆమోదం వుందని అనుకున్నా, సమాజంలోని మెజారిటీ ప్రజలు దీనిని (వ్యక్తిగత ఆస్తి) వ్యతిరేకించడం ప్రారంభించిన రోజు అది అంతంకాక తప్పదు. ఏమైనప్పటికీ, ఆస్తి హక్కులుగా చెప్పబడే వాటిని పక్కనబెట్టి ఒక అంశాన్ని నొక్కి చెప్పదలుచుకున్నాను. సామాజిక ఆర్థిక పురోగతి ఫలితంగా పెరిగే జనసంఖ్య, ప్రజల కేంద్రీకరణ,తద్వారా ఏర్పడే పరిస్థితులు పెట్టుబడిదారీ వ్యవస్థలోని రైతుని ఉమ్మడి వ్యవసాయ క్షేత్రంవైపు, సంఘటిత కూలి వర్గంవైపు తప్పక నడిపించి; ఆధునిక యంత్రాలను తదితర పనిముట్లను సమీకరించుకుంటూ, చివరకు భూమిని జాతీయం చేయడాన్ని పదే పదే అనివార్యం చేస్తాయి. ఈ స్థితిలో ఆస్తి హక్కుల గురించి ఎంత మాట్లాడినా నిరుపయోగమే. ముందుగా సామాజిక అవసరాలను విధిగా తీర్చాలి, లేదా సంతృప్తిపరాచాలి; మార్పులు ఒక సామాజిక అవసరంగా నిర్ధేశించబడి సమాజాన్ని తమ పద్ధతిలో ప్రభావితం చేస్తాయి; తర్వాత క్రమంలో ముందు వెనుకలుగా తమ (మార్పులకు నాయకత్వం వహించే శక్తులు అన్న అర్థంలో) ప్రయోజనాలకు అనుగుణంగా ఈ మార్పులు చట్టంగా రూపొందిస్తాయి.

మనకు కావలిసింది రోజువారీ ఉత్పత్తి పెరుగుదల; కొద్దిమంది వ్యక్తుల చిత్తానికి, వ్యక్తిగత ప్రయోజనానికి, లేదా అజ్ఞానంతో భూమిని పీల్చి పిప్పిచేసేదానికి అవకాశం ఇస్తే ఉత్పత్తిలో పెరుగుదలను సాధించలేము. వ్యవసాయంలో పెద్దయెత్తున నీటిపారుదల, డ్రైనేజీ, యంత్ర నాగలి, రసాయనాల వాడకం మొ॥ పద్ధతులను తగిన విధంగా అమలుచేయాలి. అయితే మనకున్న విజ్ఞాన శాస్త్ర పరిజ్ఞానం, వ్యవసాయ సాంకేతిక పద్ధతలపై మనకున్న పట్టు విశాల భూఖండాలపై మాత్రమే అమలు చేయగలుగుతాము. ఆదాయ వ్యయ దృష్టితో చూసినప్పుడు విశాల భూఖండాలలో సాగు ఉన్నతమైనదని (పెట్టుబడిదారీ వ్యవస్థ సాగుదారుడిని గానుగెద్దును చేస్తుంది) రుజువైతే, చిన్నతరహా, అడపదడపా జరిగే సాగుకు జాతీయ స్థాయిలో ప్రోత్సహించినా ఉత్పాదకత పెరుగుదలకు ప్రేరణను ఇవ్వలేకపోవచ్చు.

భూమిన జాతీయం చేయడం ఒక సామాజిక అనివార్యమని, నిరంతరం పెరిగే ప్రజల అవసరాలు ఒక వైపు, నిరంతరం పెంచబడే వ్యవసాయ ఉత్పత్తుల ధరలు మరోవైపు, నిరంతరం పెంచబడే వ్యవసాయ ఉత్పత్తుల ధరలు మరోవైపు తిరుగులేని విధంగా రుజువు చేస్తున్నాయి.

దేశ ప్రయోజనాల దృష్టిలో సాగును అదుపుచేసి నడిపించగలిగినప్పుడు, వ్యక్తిగత స్థాయిలో (చిన్న తరహా వ్యవసాయం అన్న అర్థంలో) దుర్వినియోగానికి గురవుతున్న తక్కువ వ్యవసాయ ఉత్పాదకత అన్నది లేకుండా పోతుంది.

భూమి జాతీయకరణను సమర్థిస్తూ ఈ రోజు జరిగిన చర్చలో పాల్గొన్న వాళ్ళు తీసుకున్న దృష్టికోణం పూర్తి భిన్నంగా వుంది.

ఇంగ్లాండులో వున్న భూస్వామ్య వ్యవస్థకంటే, అతి తరచూ ప్రస్తావించబడే ఫ్రాన్స్‌లోని రైతుస్వామ్యం జాతీయకరణకు చాలా దూరంగా పోయింది. నిజమే ఫ్రాన్స్‌లో కొనగలిగిన వాళ్ళకు భూమి అందుబాటులో వున్నా, దాని ఫలితంగా భూమి చిన్న భాగాలుగా విభజించబడి, చివరకు కుటుంబమంతా పాటుపడవలసిన స్థితిని కల్పించింది, ఈ తరహా భూ ఆస్తి (చిన్న కమతాలు అన్న అర్థంలో) మరియు అడపాదడపా జరిగే సాగు, ఆధునిక వ్యవసాయ పనిముట్లను ఉపయోగించుకోలేని స్థితి చేరడమే కాకుండా, అంతిమంగా వ్యవసాయదారున్ని సామాజిక అభివృద్ధి క్రమానికి నిర్ణయాత్మకమైన శత్రువుగా, భూమి జాతీయకరణకు వ్యతిరేకిగా నిలబెడుతోంది. భూమికి బంధించబడి, అతి ముఖ్యమైన శక్తియుక్తుల్ని ధారపోసి, ఆదాయంలో అత్యధిక భాగాన్ని పన్నుల రూపంలో చెల్లిస్తూ బయటి ప్రపంచంలో జరిగే సామాజిక ఉద్యమాల గురించి ఏమీ తెలయని అజ్ఞానిగా తయారవుతాడు. తన చిన్న భూ ఖండం మరియు దానిమీద తనకున్న నామమాత్రపు హక్కు కోసం వెర్రి ఆశతో పట్టుకు వేళ్ళాడుతాడు. ఈ మార్గంలో ఫ్రెంచి రైతు కార్మిక వర్గానికి హానికరమైన శత్రువుగా నిలబెట్టబడ్డాడు.

భూమి జాతీయకరణకు అత్యంత అడ్డంకి అయిన రైతు స్వామ్యం వున్న ఫ్రాన్స్ దేశంలో, జాతీయకరణ సమస్య గురించి పరిష్కారాల కోసం వెతకకూడదు.

ఒక మధ్యతరగతి ప్రభుత్వం, భూమి జాతీయకరణ కార్యక్రమంలో భాగంగా, చిన్న భూఖండాలను వ్యక్తులకు లేదా కార్మిక సంస్థలకు కౌలుకు ఇవ్వడం ద్వారా, వారి మధ్య బాధ్యతా రహిత పోటీని ప్రేరేపించి, తద్వారా కౌలు రేట్లు నిరంతరం పెరగడానికి దారితీస్తుంది. ఈ క్రమం సంపదను పోగేసుకునే వాళ్ళకు కొత్త అవకాశాలను కలగచేస్తుంది.

1868లో బ్రస్సెల్సులో జరిగిన అంతర్జాతీయ మహా సభలో మన మిత్రుల్లో ఒకరు (సీజర్ డి పపే, రిపోర్ట్ ఆన్ ల్యాండ్ ప్రాపర్టీ, ఇంటర్నేషనల్ వర్కింగ్ మెన్స్ అసోసియేషన్ కాంగ్రెస్, 11-9-1868) అన్నట్లు: "చిన్న స్థాయి భూ ఆస్తి, విశాల భూఖండాలు ఏర్పడే సహజ క్రమంలో, విజ్ఞాన శాస్త్ర అభివృద్ధి తోడై నశించిపోతుంది. చివరకు ఒక ప్రత్యామ్నాయం మిగులుతుంది. ఈ భూమి తప్పని సరిగా అటు గ్రామీణ సంఘాలకు లేదా దేశానికి సొంతం కావాలి. ఈ సమస్యను భవిష్యత్తు తేలుస్తుంది."

పై విషయానికి భిన్నంగా నేను చెప్పేదేమిటంటే, ఈ భూమి కేవలం జాతికి మాత్రమే చెందాలన్న లక్ష్యంతో సామాజిక ఉద్యమం జరగాలి. గ్రామీణ సంఘాలకు ఈ భూమిని ఇవ్వడం అంటే సమాజాన్ని ఒక ప్రత్యేక తరహా ఉత్పత్తిదారుల ముందు మోకరిల్లే పరిస్థితి కల్పించడమే.

భూమి జాతీయకరణ అన్నది శ్రమకు పెట్టుబడికి వున్న సంబంధాలను పూర్తిగా మార్చివేస్తూ, గ్రామీణ, పారిశ్రామిక ప్రాంతాలలో అంతిమంగా పెట్టుబడిదారీ తరహా ఉత్పత్తికి దారితీస్తుంది. సంపద పునాదిగా వున్న వర్గ వ్యత్యాసాలు, సౌకర్యాలు అప్పుడు అదృశ్యమవుతాయి. మిగతా ప్రజల శ్రమమీద ఆధారపడి బతకడం అన్నది గతమైపోతుంది. ప్రభుత్వం లేదా రాజ్యం సమాజానికి భిన్నంగా ఇంకెంత మాత్రం వుండలేవు. గనులు, వ్యవసాయం, పారిశ్రామిక ఉత్పత్తి, ఒక్క మాటలో ఉత్పత్తి యొక్క అన్ని విభాగాలు క్రమక్రమంగా తగిన పద్ధతిలో వ్యవస్థీకరించబడతాయి. ఉత్పత్తి సాధానాలను జాతీయస్థాయిలో కేంద్రీకరించడం పునాదిగా ఏర్పడే సమాజంలో, స్వేచ్ఛ సమానత్వం ప్రాతిపదికగా పనిచేసే ఉత్పత్తి సంఘాలు, వివేకవంతమైన ప్రణాళిక ద్వారా సామాజిక వ్యాపారాన్ని నిర్వహిస్తాయి. అటువంటి మానవతావాద లక్ష్యం పందొమ్మిదో శతాబ్దపు ఆర్థిక ఉద్యమానికి దారి చూపుతుంది.

**మూలం:**

1872 మార్చి-ఏప్రిల్ నెలల్లో మార్క్స్ రాసి, అదే సమయంలో జరిగిన ఇంటర్నేషనల్ వర్కింగ్ మెన్స్ అసోసియేషన్, మాంచెస్టర్ విభాగం సమావేశంలో చదివిన వ్యాసం- మొదటి ముద్రణ : ది ఇంటర్నేషనల్ హెరాల్డ్. నెం. 11; 15-6-1872

**అనువాదం: బి. రామానాయుడు (లండన్)**

# పెట్టుబడిదారీ కౌలురైతుల ఆవిర్భావం

■ కార్ల్ మార్క్స్

ఇంత వరకూ మనం బలవంతంగా ఏ హక్కులూ లేని నిరుపేద వర్గాన్ని తయారుచేయడం గురించీ; వాళ్ళని రోజు కూలీలుగా మార్చిన హింసాయుత శిక్షణ గురించీ; శ్రమ దోపిడీని ఎక్కువగా చేసి మరింత త్వరగా పెట్టుబడిని పోగు చేసేందుకు పోలీసులను ఉపయోగించిన రాజ్యాధికారపు నీచమైన ఎత్తుగడల గురించీ పరిశీలించాం. ఇంక మిగిలిన ప్రశ్న, మొట్టమొదటి పెట్టుబడిదారులు ఎక్కడినించి వచ్చారు అనేది. ఎందుకంటే వ్యవసాయదారుల ఆస్తుల్ని ఆక్రమించుకోవడం మాత్రమే జరిగి ఉంటే కేవలం పెద్ద పెద్ద భూస్వాములే తయారై ఉండాలి. పెట్టుబడిదారీ వ్యవసాయదారుల ఆవిర్భావాన్ని చూస్తే అది చాలా శతాబ్దాల తరబడి నెమ్మదిగా జరిగిన పరిణామ క్రమం అని తెలుస్తుంది. మొదట్లో భూస్వామికి కట్టుబానిసలుగా వ్యవసాయం చేసేవారికీ, చిన్న కమతాల స్వతంత్ర రైతులకీ పూర్తిగా భిన్నమైన షరతుల కింద భూమిని కేటాయించడం జరిగేది. ఆ షరతుల నించి వాళ్ళకి విముక్తి కూడా వేరు వేరు ఆర్థిక పరిస్థితులలో జరిగింది. ఇంగ్లండులో వ్యవసాయదారులు మొదట భూస్వామ్య కట్టడి క్రింద వ్యవసాయదారులుగా ఉండేవారు. ఇది కట్టు బానిసత్వం లాంటిదే. వీళ్ళ స్థాయి పూర్వం రోమన్ సామ్రాజ్యంలోని లాంటిదే కానీ అంతకంటే పరిమితమైన పరిధిలో వీళ్ళ జీవితాలు నడిచేవి. 14వ శతాబ్దం రెండో భాగంలో ఈ కట్టుబానిసల స్థానంలోకి ఒక తరహా కౌలురైతులు వచ్చారు. వీళ్ళకు విత్తనాలూ, పశువులూ, పనిముట్లూ భూస్వాములే ఇచ్చేవారు. తమ కింద పనిచేసే రోజుకూలీల శ్రమ నుంచి ఎక్కువ దోపిడీ చెయ్యగలగడం తప్ప వీళ్ళ పరిస్థితికీ, భూస్వామి కింద పని చేసే వ్యవసాయదారులకీ, కూలీలకి పెద్ద తేడా లేదు. త్వరలోనే సరిపాలు రైతులుగా మారారు. వ్యవసాయంలో సగం మదుపు వీళ్ళు పెడితే మిగిలిన సగం భూస్వామి పెడతాడు. పంటను ఇద్దరూ ముందుగా చేసుకున్న ఒప్పందం ప్రకారం పంచుకుంటారు. ఇంగ్లండులో ఈ పద్ధతి తొందరగానే అంతరించి పూర్తిస్థాయి కౌలురైతులు అవతరించారు. వాళ్ళు రోజుకూలీల ద్వారా తన పెట్టుబడిని పెంపొందించుకుని అదనపు రాబడిలో కొంత భాగాన్ని డబ్బు రూపంలోనో పంట రూపంలోనో భూమిపై అద్దెగా చెల్లిస్తారు. అంతవరకూ, అంటే 15వ శతాబ్దం దాకా చిన్న రైతులూ, వ్యవసాయ కూలీలూ తమ కోసమూ, రోజుకూలీ కోసమూ పనిచేసుకుని స్వంత సంపాదనని పెంచుకున్నంత వరకూ కౌలు రైతు పరిస్థితీ, ఉత్పత్తి సామర్థ్యమూ అంతంత మాత్రంగానే ఉండేవి. 15వ శతాబ్దం చివరి ముప్పై ఏళ్లలో ప్రారంభమై, 16వ శతాబ్దమంతా (దాని చివరి దశాబ్దం తప్ప) వ్యవసాయ రంగంలో కొనసాగిన విప్లవాత్మకమైన మార్పులు – వ్యవసాయరంగంలో ఉన్న మిగిలిన ప్రజలని ఎంత త్వరగా నిరుపేదల్ని చేశాయో అంత వేగంగా కౌలురైతుల సంపదని పెంచాయి. (1)ఈ లోగా సమిష్టి భూముల (కామన్ ల్యాండ్స్) ఆక్రమణ కౌలురైతులకి తమ పశుసంపదను బాగా పెంచుకునే అవకాశాన్ని ఇచ్చింది. కాణీ ఖర్చు లేకుండా పొలాలకి మంచి ఎరువు సరఫరా అయ్యింది. దీనికి 16వ శతాబ్దంలో మరొక ముఖ్యమైన అంశం తోడయ్యింది. అప్పట్లో కౌలు ఒప్పందాలు చాలా ఎక్కువ కాల వ్యవధులకి – సాధారణంగా 99 ఏళ్ళకి – జరిగేవి. 16వ శతాబ్దంలో బంగారం విలువ, తద్వారా డబ్బు విలువ అంతకంతకూ పడిపోవడం కౌలు రైతులకు సువర్ణావకాశమయింది. దీనివల్ల, పైన చర్చించిన ఇతర పరిస్థితులతోబాటు రోజుకూలీ రేట్లు తగ్గిపోయాయి. ఇది పంట మీద వచ్చే లాభానికి తోడయ్యింది. మొక్కజొన్న, ఉన్ని, మాంసం –ఒక్క మాటలో చెప్పాలంటే అన్ని వ్యవసాయ ఉత్పత్తుల ధరలూ నిరంతరంగా పెరిగిపోవడంతో కౌలురైతుల దగ్గర ధనరూపంలో పెట్టుబడి దానంతట అదే పెరిగిపోయింది. పైగా, వారు భూమిపై చెల్లించాల్సిన అద్దె (కౌలు) పాత డబ్బు విలువ ప్రకారం లెక్కగట్టడం ద్వారా – అంతకంతకూ అసలు విలువ కోల్పోయింది(2). ఆ విధంగా వాళ్ళు అటు కూలీల నష్టాల నించీ, ఇటు భూస్వాముల నష్టాల నుంచీ బాగా లాభాలు చేసుకున్నారు. ఈ పరిస్థితులవల్ల 16వ శతాబ్దం చివరికల్లా ఇంగ్లండులో – అప్పటి లెక్కల్లో ధనవంతులైన పెట్టుబడిదారీ (కౌలు) రైతుల వర్గం ఏర్పడడంలో ఆశ్చర్యమేమీ లేదు.(3)

1. Description of England" పుస్తకంలో హారిసన్ ఇలా అంటాడు: కౌలురేటు నాలుగు పౌండ్ల నుంచి నలభైకి పెరిగినా, యాభైకీ, వందకీ పెరిగినా పరవాలేదు గానీ పాత కౌలు ఒప్పందం పూర్తయ్యే నాటికి తన దగ్గర (కొత్త కౌలు రేటు ప్రకారం) ఆరేడేళ్ళ కౌలుకు సరిపోయేటంత డబ్బు మిగలకపోతే రైతు తనకేమీ లాభాలు రాలేదనుకుంటాడు.

2. 16వ శతాబ్దంలో డబ్బు విలువ పడిపోవడం వల్ల విభిన్న వర్గాలపై పడ్డ ప్రభావం గురించి డబ్ల్యు.ఎస్. జంటిల్‌మన్ వ్రాసిన 'ఎ కంపెడియస్ ఆర్ బ్రీఫ్ ఎగ్జామినేషన్ ఆఫ్ సర్టన్ ఆర్డినరి కంప్లెయింట్స్ ఆఫ్ డైవర్స్ కంట్రీమెన్ ఇన్ దీజ్ డేస్' లండన్‌లో చూడవచ్చు. ఈ రచన సంభాషణల రూపంలో ఉండడం వల్ల చాలా మంది దీన్ని షేక్స్పియర్ రాశాడనుకున్నారు. 1751లో కూడా దీన్ని షేక్స్పియర్ పేరు మీదే ప్రచురించారు. దీని అసలు రచయిత విలియం స్టాఫర్డ్ ఈ పుస్తకంలో ఒక యోధుడు నైట్ ఇలా తర్కిస్తాడు:

యోధుడు: నా పొరుగువాడవైన నీవు వ్యవసాయదారుడవు. మెర్సెర్ గారూ, మీరు చేతివృత్తుల నిపుణులు. కమతగానివైన కూపర్, నీవు కూడా సేద్యం చేస్తావు. మీరూ, మిగిలిన చేతివృత్తుల వారూ బాగానే వుంటారు. అన్నింటి ధరలూ ఎంత పెరిగిపోయినా మీ సరుకులనూ, నైపుణ్యాన్నీ అంతే ఎక్కువ ధరకు అమ్ముట ద్వారా మీరు లాభాలే పొందగలరు. కానీ మాబోటి యోధుల వద్ద, ఎక్కువ ధరకు కొన్నప్పటి నష్టాన్ని పూడ్చుకొనుటకు, ధరలు పెంచి అమ్ముకో గలిగినదేమియునూ లేదే!

ఇంకొక చోట అదే యోధుడు ఒక పండితుడిని ఇలా అడుగుతాడు.

యోధుడు:దయచేసి మీ అభిప్రాయమేమిటో వివరించండి. మొదటగా, ఈ పెరుగుతున్న ధరలవల్ల నష్టపోనివారెవరో చెప్పండి.

పండితుడు: వ్యాపారము చేయువారికి నష్టము కలుగదు. ఎందుకంటే కొనేవాటిని అధిక ధరకు కొన్నప్పటికీ, వాటిని అంతే అధిక ధరలకు అమ్మివేస్తారు గనుక.

యోధుడు: మరి పెరుగుతున్న ధరల వల్ల లాభాపడేవారు కూడా ఉన్నారని చెప్పితిరిగదా, వారెవరో వివరించండి.

పండితుడు: ఇంకెవరు? పాత కౌలు ఒప్పందాల ప్రకారమే ఇప్పటికీ వ్యవసాయము చేస్తున్న కర్షకులు. ఎందుకనగా వారు పాత లెక్కలో కౌలు చెల్లించి కొత్త ధరలకు పంటను అమ్ముకొందురు. అనగా, భూమిపై చవకైన కౌలు కట్టుచూ, పంటను ప్రియమైన ధరలకు అమ్మెదరు.

యోధుడు: మరి ఇటువంటి వారికి వచ్చే లాభములను మించిన నష్టములను పొందువారున్నారని అన్నారే. వారెవరు?

పండితుడు: అటు వ్యవసాయమూ, ఇటు వ్యాపారమూ చేయక పూర్వమెప్పుడో నిర్ధారించిన కౌలు వసూళ్ళపై ఆధారపడే భూస్వాములూ, పెత్తందారులూ.


3. ఫ్రాన్సులో, మధ్యయుగాల ప్రారంభంలో ఫ్యూడల్ భూస్వాముల తరపున రైతుల నించి కౌలు వసూలు చేయడానికి నియమితులైన రెజిస్యూ (regisseur) అనే వాళ్ళు త్వరలోనే వ్యాపారస్తులుగా మారిపోయి మోసాలూ, బెదిరింపుల ద్వారా దోచుకున్న సంపదతో పెట్టుబడిదారులుగా ఎదిగారు. ఈ రెజిస్యూలలో కొంత మంది ఉన్నత వంశాలకు చెందిన భూస్వాములు కూడా ఉన్నారు.....సామాజిక జీవితంలోని అన్ని రంగాలలో ఎక్కువగా లాభపడేది మధ్యవర్తులూ, దళారీలే అనేది ఇప్పటికే స్పష్టమైంది. ఉదాహరణకి, ఆర్థిక రంగంలో పెట్టుబడికి అప్పులిచ్చేవాళ్ళు, షేర్ మార్కెట్లో పందాలు కాసేవాళ్ళు. వ్యాపారస్తులూ, దుకాణాలు నడిపేవాళ్ళు లాభాలు దండుకుంటారు. సాంఘిక రంగంలో న్యాయవాదులు అర్జీదారుల్ని పీల్చుకుతింటారు. రాజకీయాలలో ప్రజాప్రతినిధి ఓటు వేసే ప్రజలకంటే ముఖ్యుడవుతాడు. రాజుకంటే మంత్రి పెద్ద. (క్రైస్తవ) మతంలో దేవుడు వెనక్కిపోయి మధ్యవర్తి (క్రీస్తు)


ముందుకొచ్చి. అతడిని కూడా వెనక్కునెట్టి – కరుణామయుడైన కాపరికీ, ఆయన కాపాడే గొర్రెలకూ మధ్య తప్పనిసరి మధ్యవర్తిత్వం చేసే పూజారులు ముందుకొచ్చారు. ఫ్రాన్సులో కూడా ఇంగ్లండులో లాగే పెద్దపెద్ద ఫ్యూడల్ భూభాగాలు లెక్కలేనన్ని సేద్యపు కుటుంబాల పొలాలుగా విభజితమై ఉండేవి. అయితే ఈ పొలాల కేటాయింపు ఒప్పందాలు ఇంగ్లండుతో పోల్చడానికి కూడా వీల్లేనంత ఘోరంగా, రైతాంగానికి వ్యతిరేకంగా ఉండేవి. 14వ శతాబ్దంలో భూకమతాలు టెరియర్స్ ఏర్పడి క్రమంగా లక్షకు మించి పెరిగాయి. వాటి మీది అద్దె (కౌలు) పంటలో 12వ వంతు నించి ఐదోవంతు దాకా ఉండేది. ఈ కమతాలను వాటి ఆదాయాన్ని బట్టి, వైశాల్యాన్ని బట్టి ఫీఫ్ లుగానూ సబ్ –ఫీఫ్ లుగానూ గుర్తించేవారు. వాటిలో చాలా వరకూ కొద్ది ఎకరాల చిన్న కమతాలే. అయినా ఈ కమతాల జమీందార్లకు తమ భూమిపై నివసించే ప్రజలపై కొంతమేరకు న్యాయసంబంధమైన అధికారాలు నాలుగు అంచెల్లో ఉండేవి. సేద్యం మీద బ్రతికే ప్రజలపై ఈ చిన్న చిన్న నియంతలు చేసిన అఘాయిత్యాలు ఊహించుకోవచ్చు. ప్రస్తుతం నాలుగు వేల మంది జడ్జీలతో పనినడిచిపోతున్న ఫ్రాన్సులో ఒకప్పుడు లక్షా అరవై వేల మంది న్యాయాధీశులు ఉండేవారని మాంటీల్ రాశాడు.


**మూలం:**



కార్ల్ మార్క్స్, క్యాపిటల్, వాల్యూమ్ 1, ప్రోగ్రెస్ పబ్లిషర్స్, 1965, మాస్కో పే.743–744


**అనువాదం: రాజీవ్ వెలిచేటి**



# ఆదిమ పోగుబడి వెనక దాగిన రహస్యం

■ కార్ల్ మార్క్స్

ఇంతవరకూ మనం డబ్బు ఎలా పెట్టుబడిగా మారుతుందో, పెట్టుబడి ద్వారా అదనపు విలువ ఎలా తయారవుతుందో, ఆ అదనపు విలువ నుంచి మరింత పెట్టుబడి ఎలా వస్తుందో పరిశీలించాం. అయితే పెట్టుబడిని పోగు చేయాలంటే ముందుగా అదనపు విలువ తయారై వుండాలి. అదనపు విలువ కావాలంటే పెట్టుబడిదారీ పద్ధతిలో ఉత్పత్తి జరిగి వుండాలి. పెట్టుబడిదారీ పద్ధతిలో ఉత్పత్తి జరగాలంటే అంతకు ముందే తగినంతగా పోగుబడిన పెట్టుబడీ, ఉత్పత్తికి కావలసిన శ్రమశక్తీ–సరుకుల్నీ ఉత్పత్తి చేసేవాళ్ళ చేతిలో వుండాలి. ఈ క్రమమంతా ఒక విషవలయంలో తిరుగుతున్నట్టు కనిపిస్తుంది. దీన్నించి బయటపడాలంటే పెట్టుబడిదారీ పద్ధతిలో సంపదను పోగుచేయడానికి ముందుగా జరిగిన ఆదిమ పోగుబడిని ఆడమ్ స్మిత్ చెప్పిన ముందటి పోగుబడి ప్రతిపాదించడమే మార్గం. ఈ పోగుబడి, పెట్టుబడిదారీ ఉత్పత్తి వల్ల జరిగినది కాదు పెట్టుబడిదారీ విధానానికి ఆరంభ స్థానం.

రాజకీయ ఆర్థిక శాస్త్రంలో ఈ ఆదిమ పోగుబడి అనే భావన ధార్మిక శాస్త్రాల్లోని ఆదిమ పాపం పోషించిన పాత్రనే నిర్వహిస్తుంది.

ఆదాము నిషిద్ధ ఫలాన్ని తిన్నాడు ఆ కారణమున మానవజాతి అంతటికీ పాపం చుట్టుకొనెను. ఇట్లా పాత కాలాన్ని *గురించిన పిట్టకథలు చెప్పడం ఆదిమ పోగుబడి ప్రారంభాన్ని వివరిస్తుందని ఒక నమ్మకం. అనగనగా ఒక పూర్వకాలమున* రెండు రకాల మనుషులుండెడి వారు. ఒకరు శ్రద్ధయూ, బుద్ధియూ, అంతకుమించి పొదుపరులైన ఉన్నతులు. రెండవ రకము వారు బద్ధకస్తులైన దుష్టులు విచ్చలవిడిగా జీవించుచూ తమదే గాక ఇతరుల సంపదను గూడా వృధా చేసెడివారు. మతంలోని ఆదిమ పాపం కథ. చెమటోడ్చి తిండి సంపాదించుకోవాలనే శాపం మానవజాతికి ఎలా చుట్టుకుందో చెబుతుంది. కానీ కొంత మంది మానవులకి ఈ శాపం ఏమాత్రమూ వర్తించకపోవడానికి కారణమేమిటో ఆర్థిక శాస్త్రపు ఆదిమ పాపపు కథ వివరిస్తుంది. అదలా వుండనివ్వండి! *అంతకు పిదప మొదటిరకపు పొదుపరులు సంపదను పోగుచేసుకోని యుండిరి. రెండవ రకపు భ్రష్టులకు తమ శరీరములు వినా వేరొక సంపద మిగలకపోయెను. మరియు ఈ ఆదిమ పాపము నుండియే అత్యధిక మానవులకు కటిక దారిద్ర్యమూ ఎంతగా ఎన్ని ఏళ్ళుగా శ్రమ చేసినా ఈ నాటికీ అమ్ముకొనుటకు తమ శ్రమ తప్ప మరియేమియూ లేని యోగమూ పట్టెను. అందునుండియే అతి కొద్ది మందికి ఏ శ్రమయూ చేయకుండగనే నిరంతరమూ పెరిగి పెంపొందునట్టి సంపదయూ అబ్బెను.*

స్వంత ఆస్తిని సమర్థించడానికి ఇలాంటి బుద్ధిలేని చెత్తనే మనకి ప్రతిరోజూ బోధించడం జరుగుతోంది. ఉదాహరణకి గారికి దేశనాయకుడి గాంభీర్యంతో ఈ తప్పుడు వాదనని మళ్ళీ ఫ్రాన్సు ప్రజలముందు ప్రవచించే ధైర్యం వచ్చింది. ఒకప్పుడు ఫ్రెంచి ప్రజలు ఆత్మనూ పరలోకాన్నీ గురించి చాలా పట్టించుకునే వాళ్ళే. కాని ఆస్తుల మీద ప్రశ్నలు వస్తే మాత్రం ఈ పిల్లతనపు కట్టుకథని అన్ని కాలాలకీ, అభివృద్ధిలోని అన్ని దశలకీ వర్తించే వివరణగా ప్రకటించడం ఒక పవిత్ర కర్తవ్యం అయిపోతుంది. వాస్తవ చరిత్రలో దీనివెనుక దురాక్రమణలూ, బానిసత్వమూ, దోపిడీలూ, హత్యలూ, కొంతకాలంపాటు బలవంతపు చాకిరీలూ ఉన్నాయనేది అందరికీ తెలిసిందే. సుకుమారమైన రాజకీయ ఆర్థిక శాస్త్రపు రాతల్లో మాత్రం అనంతకాలం నించీ ప్రశాంతమైన ఆదర్శాలే రాజ్యమేలుతుంటాయి. హక్కులవల్లా, కష్టపడడం వల్లా మాత్రమే అనాదిగా సంపద పోగుబడుతూ ఉంటుంది. ప్రస్తుత సంవత్సరం మాత్రం ఎప్పుడూ మినహాయింపే. వాస్తవం ఏమిటంటే, ఆదిమ పోగుబడికి దారితీసిన పద్ధతులు ఏ ప్రశాంత ఆదర్శాలకైనా చాలా దూరమైనవి.

డబ్బుగానీ, సరుకులుగానీ వాటంతట అవి పెట్టుబడులు కాలేవు – అవి ఉత్పత్తికీ, జీవితావసరాలను తీర్చడానికి సాధనాలు మాత్రమే సాధ్యం. ఆ పరిస్థితులకి కేంద్రం చాలా భిన్నమైన రెండు రకాల సరుకులు కలిగిన మనుషులు ఒకే చోట ఎదురుపడి కలుసుకోవాలి. ఒకరకం – డబ్బు మీదా, ఉత్పత్తి సాధనాల మీదా, జీవితావసరమైన వనరుల మీదా యజమానులై వుండి, వేరే మనుషుల శ్రమశక్తిని కొనడం ద్వారా తమ సంపదను పెంచుకోవాలని ఆత్రుతగా వున్నవారు, రెండో రకం మనుషులు తమ శ్రమశక్తిని, అంటే శ్రమను అమ్ముకునే స్వతంత్ర శ్రామికులు. ఈ శ్రామికులు రెండు అర్థాలలో స్వతంత్రులు. వీళ్ళు బానిసలు, కట్టుబానిసల లాగా ఉత్పత్తి సాధనాలలో అభిన్నమైన బాగం కారు – స్వతంత్రులు. అలాగే సేద్యగాళ్ళలాగా(peasants) వీళ్ళ దగ్గర స్వంత ఉత్పత్తి సాధనాలేవీ ఉండవు. అందువల్ల ఈ శ్రామికులు ఉత్పత్తి సాధనాల బాధ్యతల నుంచీ, యాజమాన్యం నించీ కూడా విముక్తులు. ఇలా భిన్న ధృవాలుగా సరుకుల విపణి (మార్కెట్) లో వచ్చే విభజనతో పెట్టుబడిదారీ ఉత్పత్తికి కావలసిన మౌలిక పరిస్థితి తయారవుతుంది. వాళ్ళ శ్రమను (సరుకులుగా) వాస్తవీకరించడానికి అవసరమైన సాధనాలూ, వనరుల యాజమాన్యానికీ, శ్రామికులకూ మధ్య ఏ సంబంధమూ లేదు అనే భావనతోనే పెట్టుబడిదారీ వ్యవస్థ నడుస్తుంది. పెట్టుబడిదారీ ఉత్పత్తి తన కాళ్ళ మీద నిలబడే స్థితికి రాగానే, అది ఈ (శ్రామికులకీ, ఉత్పత్తి సాధనాలకీ మధ్య) దూరాన్ని పెంచి పోషించడమే కాక అంతకంతకూ పెద్ద స్థాయిలో విస్తరింపజేస్తుంది. అంటే, పెట్టుబడిదారీ వ్యవస్థకి దారి తీసే పరిణామక్రమం మరేదీ కాదు – అది శ్రామికుల ఆధీనంలోంచి ఉత్పత్తి సాధనాలను లాగేసుకునే పరిణామక్రమం; ఒకవైపు మనుషులు బ్రతకడానికీ, ఉత్పత్తికీ అవసరమైన సామాజిక వనరులని పెట్టుబడిగా మార్చేస్తూ, మరొకవైపు నిజమైన ఉత్పత్తిదారుల్ని వేతన శ్రామికులుగా మార్చేసే పరిణామక్రమం. అంటే, ఆదిమ పోగుబడి అనేది – ఉత్పత్తిదారుల ఉత్పత్తి సాధనాలనించి వేరుచేసే చారిత్రక పరిణామం తప్ప మరేమీ కాదు. అది ఆదిమం గానే కనిపిస్తుంది – ఎందుకంటే పెట్టుబడి చరిత్రకీ, దానికి అనుగుణమైన ఉత్పత్తి విధానపు చరిత్రకీ అది చరిత్ర పూర్వయుగం.

పెట్టుబడిదారీ సమాజపు ఆర్థిక చట్రం ఫ్యూడల్ సమాజపు ఆర్థిక చట్రం నుంచి ఎదిగింది. ఫ్యూడల్ వ్యవస్థ నశించి పోవడమే పెట్టుబడిదారీ విధానపు అంశాలకు ఎదిగే స్వేచ్ఛ నిచ్చింది.

భూమితో సంబంధం తెగిపోయిన తరవాత; మరొకరికి బానిసగానో, అర్ధ బానిసగానో, వెట్టి బానిసగానో ఉన్న స్థితి నించి బయటపడ్డ తర్వాత మాత్రమే అసలు ఉత్పత్తిదారుడైన శ్రామికుడు తనను తాను అమ్ముకోగలుగుతాడు. స్వతంత్రంగా, ఎక్కడ కొనేవాడు దొరికితే అక్కడికి వెళ్లి తన శ్రమశక్తిని అమ్ముకోగలగడానికి వృత్తిసంఘాల ఆధిపత్యం నించీ; కొత్త పనివాళ్ళ పని పరిస్థితులకు సంబంధించి గిల్డులు పాటించే నియమనిబంధనలు నుంచీ కూడా తప్పించుకొని ఉండాలి. అందువల్లనే – ఉత్పత్తిదారులను వేతన కూలీలుగా మార్చిన చారిత్రక పరిణామం మరోవైపు నుంచి – వాళ్ళను బానిసత్వం నించీ, వృత్తి సంఘాల సంకెళ్ళ నుంచీ విముక్తి చేసిన సంస్కరణగా కనిపిస్తుంది. మన బూర్జువా చరిత్రకారులకి ఈ పార్శ్వం తప్ప మరేమీ పట్టదు. కానీ, మరోవైపు నించి చూస్తే – తమ ఉత్పత్తి సాధనాలనూ, తమ జీవితావసరాలకు ఫ్యూడల్ పద్ధతులిచ్చిన భరోసాలూ అన్నీ కోల్పోయిన తర్వాతే – కొత్తగా విముక్తులైన ఈ స్వేచ్ఛాజీవులు తమను తాము అమ్ముకునే శ్రామికులయ్యారు. ఈ చరిత్ర, వాళ్ళను నిరాశ్రయుల్ని చేసిన చరిత్ర, మానవ ఇతిహాసంలో కార్చిచ్చుల రక్తాక్షరాలతో రాసి వుంది.

కొత్తగా గద్దెనెక్కిన పారిశ్రామిక పెట్టుబడిదారులకు – అటు చేతివృత్తుల సంఘాల అధికారాలనే కాక, ఇటు సంపాదనకు మూలమైన వనరుల్ని తమ గుప్పెట్లో పెట్టుకున్న ఫ్యూడల్ భూస్వాముల అధికారాలను కూడా పడగొట్టడం

అవసరమైంది. ఈ విషయం – వాళ్ళు సామాజిక అధికారాన్ని చేజిక్కుంచుకోవడం – ఒక విజయవంతమైన పోరాటపు ఫలితంగా కనిపిస్తుంది. అది ఒకవైపు ఫ్యూడల్ భూస్వాములకీ, అసహ్యకరమైన వారి అధికారాలకీ వ్యతిరేకమైన పోరాటం. మరొకవైపు అది ఉత్పత్తి స్వతంత్రంగా పెరగడానికీ, ఒక మనిషి వేరొక మనిషిని స్వేచ్ఛగా దోపిడీ చేయడానికీ అడ్డంకులైన వృత్తిసంఘాలకీ, వాటి నియమాలకీ వ్యతిరేకమైన పోరాటం. అయితే తమ ప్రమేయం లేని సంఘటనల్ని తమకు అనుకూలంగా వాడుకోవడం ద్వారా ఈ పారిశ్రామిక యోధులు పాత యుద్ధవీరుల ఆధిపత్య స్థానాన్నే ఆక్రమించుకున్నారు. పురాతన రోమన్ సామ్రాజ్యంలో స్వతంత్రులైన బానిసలు తమకు స్వేచ్ఛ నిచ్చిన యజమానుల్నే తమ బానిసలుగా మార్చడంలో ఎంత నీచానికి పాల్పడ్డారో అంతే నీచమైన దారిలోనే వీళ్ళూ పైకెదిగారు.


అటు కూలీ శ్రామికుడినీ, ఇటు పెట్టుబడిదారుడినీ తయారుచేసిన పరిణామక్రమానికి మూల బిందువు శ్రామికుడి దాస్యమే. దీనిలో వేసిన ముందడుగు ఈ దాస్యపు రూపాన్ని. ఫ్యూడల్ దోపిడీ నించి పెట్టుబడిదారీ దోపిడీకి మార్చడం. దీని విజయ యాత్రని చూడడానికి ఎంతో వెనక్కి వెళ్ళవలసిన అవసరం లేదు. మధ్యధరా సముద్రపు ఒడ్డున ఉన్న కొన్ని పట్టణాలలో 14, 15వ శతాబ్దం నుంచే అప్పుడప్పుడూ పెట్టుబడిదారీ ఉత్పత్తి కనిపించినా, 16వ శతాబ్దం నుంచే పెట్టుబడిదారీ యుగం ప్రారంభమైంది. ఎక్కడైనా అది కనిపించడానికి చాలా ముందే ఫ్యూడల్ అర్థ బానిసత్వమూ రద్దయిపోయింది. మధ్య యుగాలు సాధించిన అత్యున్నత అభివృద్ధి నగర రాజ్యాల ప్రాబల్యమూ ఎప్పుడో అంతమైపోయింది.

ఆదిమ పోగుబడి చరిత్ర ప్రకారం పెట్టుబడిదారీ వర్గపు ఏర్పాటులో తోడ్పడిన విప్లవాలన్నీ నవయుగానికి అంకురార్పణలే. కానీ అందులోనూ, భారీ సంఖ్యలో మనుషులని హఠాత్తుగా, బలవంతంగా తమ జీవనాధార వనరులనించి వేరుచేసి వాళ్ళని స్వతంత్ర అనిబద్ధ కార్మికులుగా శ్రామిక విపణి (మార్కెట్)లోకి విసిరేసిన ఘట్టాలు మరీ ముఖ్యమైనవి. ఈ క్రమం మొత్తానికి పునాది ఉత్పత్తిదారుడైన వ్యవసాయ కూలీని, చిన్న తరహా కౌలు రైతునీ భూమి నించి దూరం చేయడం. ఈ బలవంతపు నెట్టివేత వేరువేరు దేశాల్లో వేరువేరు లక్షణాలతోనూ, వేరువేరు కాలవధులలో దాని వివిధ దశల క్రమంలో కొన్ని కొన్ని మార్పు చేర్పులతోనూ జరిగింది. మనం ఉదాహరణగా తీసుకున్న ఇంగ్లండులో మాత్రమే ఈ క్రమం స్పష్టమైన రూపంలో కనిపిస్తుంది.

**మూలం:**


కార్ల్ మార్క్స్, 'ద సో–కాల్డ్ ప్రిమిటివ్ అక్యూములేషన్; XXV×ఛాప్టర్, కాపిటల్, వాల్యూమ్ 1, పార్ట్, VIII ప్రోగ్రెస్ పబ్లిషర్స్, మాస్కో, పే. 713–716.



**అనువాదం: రాజీవ్ వెలిచేటి**










అవ్వ పోరాటం
కంచ ఐలయ్య
చిత్రాలు
లోకేష్ ఖోడ్కే & షెఫాలీ జైన్
Anveshi


తలకాయ కూరతో బలే తలకాయనెప్పయినా...
మొహమ్మద్ ఖదీర్ బాబు
చిత్రాలు
గులాం మొహమ్మద్ షేక్
Anveshi


దుత్తలో చందమామ
గోపిని కరుణాకర్
చిత్రాలు
నీలిమా షేక్
Anveshi


భలే బడిపిల్లలు
TEXT BOOKS
NOTE BOOKS
ముక్కాలు, ఆఫ్‌రేటు, బజ్జీ, బజ్జీ
మొహమ్మద్ ఖదీర్ బాబు
చిత్రాలు
బి.వి.సురేష్
టెక్ట్స్‌బుక్
కె.ఎ.నూయేమన్
చిత్రాలు
చిత్ర కె.ఎస్
బడిలనే దోస్తు పూరిలగాడు
జూపాక సుభద్ర
చిత్రాలు
సౌమ్య అనంతకృష్ణ
Anveshi


కోతులు-కళ్ళద్దాలు & సిన్ని
కోతులు- కళ్ళద్దాలు
కె. లలిత
చిత్రాలు
అసుతోష్ భరద్వాజ్
సిన్ని మహారాణి అయ్యింది
పచ్చనూరు అనురాధ
Anveshi


వాడపిల్లల కథలు
మాదిగ బడెయ్య
గోగు శ్యామల
చిత్రం
పూజా షైష్
Anveshi